# ఆధునిక రాజనీతిసిద్ధాంతము మరియు విశ్లేషణ

**ఎం.ఏ.,రాజనీతి శాస్త్రము,2వ సంవత్సరము, పేపరు-5**


**రచయితలు**

**డా॥ ఎం.వి.యస్.కోటేశ్వరరావు**
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఆచార్య నాగార్జున యూనివర్సిటి

**డా॥ కె.రామచంద్రమూర్తి**
రాజనీతి శాస్త్ర విభాగము
శ్రీ సి.ఆర్.ఆర్.కాలేజి
ఏలూరు.

**డా॥ వి.దోసగిరి రావు**
రాజనీతిశాస్త్ర విభాగము
ఏ.యు.ఎం.ఎస్.ఎన్.పి.జి.సెంటర్
తిమ్మాపురం.కాకినాడ

సంపాదకులు

**ఆచార్య .ఎం.వి.యస్.కోటేశ్వరరావు**
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

సమన్వయకర్త

**డా॥ యం.రవిశేఖర్.,యం.ఏ.,యల్.యల్.బి.,పి.హెచ్.డి.,**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

డైరెక్టర్

**ఆచార్య .వి.చంద్రశేఖర రావు**

దూరవిద్యా కేంద్రము

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ,నాగార్జున సాగర్...522 510**

**Ph :0863-2293299 , (08645) 211023 ,211024, Cell :9848285518**

E-mail : info@anucde.ac.in
Website: www.anucde.ac.in

# తులనాత్మక రాజకీయాలు

## ఎం.ఏ.రాజనీతి శాస్త్రము,రెండవ సంవత్సరము,పేపర్-1


**రచయితలు**

**ఆచార్య ఎం.వి.యస్.కోటేశ్వరరావు.**M.A.,Ph.D.
అసోసియేట్ ప్రొఫెసర్
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఆచార్య నాగార్జున యూనివర్సిటి
నాగార్జున నగర్

**డా॥ఎం.పాండు రంగారావు.**M.A.,Ph.D.
లెక్చరర్
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర పి.జి.విభాగము
సర్ సి.ఆర్.ఆర్.కాలేజి
ఏలూరు

**డా॥ వి.దోసగిరి రావు.**M.A.,Ph.D.
అసోసియేట్ ప్రొఫెసర్
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఆంధ్ర విశ్వవిద్యాలయ,విశాఖపట్నం.

**డా॥ వి.బాలకృష్ణ** M.A.,Ph.D.
లెక్చరర్
రాజనీతి శాస్త్ర పి.జి.విభాగము
సర్ సి.ఆర్.ఆర్.కాలేజి, ఏలూరు.

**డా॥ కె.రామచంద్రమూర్తి.**M.A.,Ph.D.
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
సర్ సి.ఆర్.ఆర్.కళాశాల,ఏలూరు.

సంపాదకులు

**ఆచార్య వి.భవాని** ,M.A.,Ph.D.
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము.
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

సమన్వయ కర్త

**డా.యం.రవిశేఖర్.,యం.ఏ.,యల్.యల్.బి.,పి.హెచ్.డి.,**
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

డైరెక్టర్

**ఆచార్య .వి.చంద్రశేఖర రావు. ఎం.కాం.,పి.హెచ్‌డి**

దూరవిద్యా కేంద్రము

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ,నాగార్జున నగర్-522 510**

Ph :0863-2293299 , (08645) 211023 ,211024, Cell :9848285518

E-mail : info@anucde.ac.in
Website: www.anucde.ac.in

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించబడి మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2003 వ సంవత్సరంలో NAAC చే B++ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికి తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ, ఎల్ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసికొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా క్షేత్రంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థిని విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి ముందు ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్ట్ క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

**ఆచార్య .కె.వియన్నా రావు**
ఇన్‌చార్జ్
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

నాగార్జున నగర్
13-5-2005

## M.A. (FINAL) POLITICAL SCIENCE

# Paper - V : Modern Political Thoery and Analysis

## Syllabus

1. Approaches to the study of Political Science - Modern and Scientific.
2. Behavioral approach Origin, Development and Relevance; Post Behaviourlism and limitations.
3. Structural - Functional Approach to Politicals analysis
4. Positivist Approach
5. Marxist Approach
6. General Systems Theory and frameworks of Political enquiry
7. Harold Lasswell and Distributive Analysis
8. "Elite" Group and 'Power' as Conceptual Framework
9. Communications Theory
10. Decision making Theory
11. Game Theory

**Suggested Text Books :**

| | | | |
|---|---|---|---|
| 1. | Charlesworth, J.C. | : | Contemporary Political Analysis |
| 2. | Apter, D.E. | : | Introduction to Political Analysis |
| 3. | Mechan. E.J. | : | The Foundations of Political Analysis |
| 4. | Verma, S.P. | : | Modern Political Analysis |
| 5. | Dahl, Robert | : | Modern Political Analysis |
| 6. | Kolakowski, L. | : | From Positivist Philosophy : From Hume to Vienna Circle |
| 7. | Miliband, R. | : | Maxism and Politics |

**Reference Books :**

| | | | |
|---|---|---|---|
| 1. | Young C.K. | : | Systems of Political Science |
| 2. | Van Dyke, Vernon | : | Political Science - A Philosophical Analysis |
| 3. | Spragins. T.A. | : | The Dilemma of Contemporary Political Theory. |

## M.A. Political Science (Final) DEGREE EXAMINATION, DECEMBER 2005.

### Paper V - MODERN POLITICAL THEORY AND ANALYSIS

Time : Three hours | Maximum : 100 marks

Answer any FIVE questions

All questions carry equal marks.

1. Discuss the advantages of Scientific approaches to the study of Political Science.
   రాజనీతి శాస్త్ర అధ్యయనంలో శాస్త్రీయ దృక్పథాల వలన కలిగే లాభాలను గూర్చి చర్చింపుము.

2. Explain the relevance of Behaviouralism to Political Analysis.
   రాజకీయ విశ్లేషణలో ప్రవర్తనావాద ఔచిత్యాన్ని వివరింపుము.

3. Discuss the main features of Structural-Functional analysis.
   నిర్మాణాల-విధుల విశ్లేషణ ముఖ్య లక్షణాలను గూర్చి చర్చింపుము.

4. Analyse the characteristics features of Positivist approach.
   నిదర్శనావాద దృక్పథము యొక్క లక్షణాలను విశ్లేషింపుము.

5. Write an essay on Marxist Approach to Political Science.
   రాజనీతిశాస్త్ర అధ్యయనంలో మార్క్సిస్టు దృక్పథంపై ఒక వ్యాసం వ్రాయుము.

6. Examine the basic tenets of General Systems Approach.
   సాధారణ వ్యవస్థల దృక్పథం యొక్క మౌలిక సిద్ధాంతాలను పరిశీలింపుము.

7. Explain the contribution of Harold Lasswell to Modern Political Theory.
   ఆధునిక రాజనీతి సిద్ధాంతానికి హెరాల్డ్ లాస్‌వెల్ చేసిన కృషిని వివరింపుము.

8. Examine the concept of power from political and social dimensions.
   శక్తి భావనను రాజకీయ, సామాజిక కోణములనుండి పరిశీలింపుము.

9. Explain Communication Theory.
   ప్రసరణ సిద్ధాంతమును గూర్చి వివరింపుము.

10. What is Decision Making Theory? Discuss the views of major contributors to this theme.
    విధాన నిర్ణయం అనగానేమి? ఈ విషయంపై ప్రముఖ శాస్త్రవేత్తల అభిప్రాయాలను వివరింపుము.

**M.A. (Final) DEGREE EXAMINATION, MAY 2006.**

Political Science

Paper V - **MODERNPOLITICAL THEORY AND ANALYSIS**

Time : Three hours

Maximum : 100 marks

Answer any FIVE questions

All questions carry equal marks.

1. What is scientific approach to the study of politics ?
   రాజనీతి అధ్యయనానికి శాస్త్రీయ ఉపగమము / దృక్పథము ఏది ?
2. Analyse post - behaviouralism and its features.
   ఉత్తర ప్రవర్తనావాదమును మరియు దాని లక్షణములను విశ్లేషించుము.
3. What is structural - functionalism ? Why is it developed ?
   నిర్మితులు – విధులు అననేమి ? ఎందువలన అవి అభివృద్ధి చెందబడినది ?
4. Examine the scope of positivist approach to the study of politics.
   రాజనీతి అధ్యయమునకు పాజిటివిస్ట్ ఉపగమము యొక్క పరిధిని పరీక్షింపుము.
5. Is Marxist approach to the study of politics scientific ?
   రాజనీతి అధ్యయనమునకు మార్క్సిస్ట్ ఉపగమము శాస్త్రీయమైనదేనా ?
6. State General systems approach and its relevance to the developing nations.
   సాధారణ వ్యవస్థ ఉపగమమును మరియు దాని ప్రాసంగికత్వమును పేర్కొనుము.
7. Critically examine 'distributive analysis'.
   వితరణము లేక పంపిణీ విశ్లేషణ గూర్చి విమర్శనాత్మకంగా పరీక్షింపుము.
8. Discuss the relevance of 'elite' theory.
   శ్రేష్ఠుల సిద్ధాంతము యొక్క ప్రసంగికతను గూర్చి చర్చించుము.
9. Why is decision - making approach considered as a simulation.
   నిరయీకరణము ఎందువలన నమూనాగా పరిగణింపబడుచున్నది.
10. To what extend game theory is scientific ?
    గేమ్ / క్రీడా సిద్ధాంతము ఏ మేరకు శాస్త్రీయమైనది ?

# విషయ సూచిక

| | | |
|---|---|---|
| 1. | రాజనీతి శాస్త్ర అధ్యయన దృక్పథాలు : ఆధునిక మరియు శాస్త్రీయ దృక్పధాలు | 1.1 - 1.11 |
| 2. | ప్రవర్తనావాద దృక్పథం, పుట్టుక, అభివృద్ధి, లక్షణాలు మరియు సంగత్యము | 2.1 - 2.13 |
| 3. | ఉత్తర ప్రవర్తనాదము | 3.1 - 3.8 |
| 4. | నిర్మితుల విధుల దృక్పథం | 4.1 - 4.12 |
| 5. | పాజిటివిస్ట్ సిద్ధాంతము | 5.1 - 5.12 |
| 6. | మార్క్సిస్టు దృక్పథము | 6.1 - 6.13 |
| 7. | రాజకీయ వ్యవస్థా సిద్ధాంతము | 7.1 - 7.12 |
| 8. | శిష్ట సిద్ధాంతము | 8.1 - 8.11 |
| 9. | పంపిణీ విశ్లేషణ | 9.1 - 9.10 |
| 10. | సమూహం మరియు శక్తి సిద్ధాంతాలు | 10.1 - 10.10 |
| 11. | ప్రసార సిద్ధాంతం | 11.1 - 11.8 |
| 12. | నిర్ణయ కల్పన సిద్ధాంతం | 12.1 - 12.7 |
| 13. | క్రీడా సిద్ధాంతమును | 13.1 - 13.11 |

పాఠం - 1

# రాజనీతిశాస్త్ర అధ్యయన ధృక్పధాలు : ఆధునిక మరియు శాస్త్రీయ ధృక్పధాలు

## (APPROACHES TO STUDY POLITICAL SCIENCE : MODERN AND SCIENTIFIC)

విషయసూచిక :


1.0 లక్ష్యాలు

1.1 పరిచయం

1.2 ఆధునిక ధృక్పధం

1.2.1 ప్రవర్తనావాద ధృక్పధం

1.2.2 వ్యవస్థల ధృక్పధం

1.2.3 నిర్మితుల - విధుల ధృక్పధం

1.2.4 తులనాత్మక ధృక్పధం

1.2.5 ఉత్పాదక - ఉత్పాదిత ధృక్పధం

1.2.6 మార్క్సిస్టు ధృక్పధం

1.3 శాస్త్రీయ ధృక్పధం

1.3.1 శాస్త్రీయ ధృక్పధ లక్షణాలు

1.4 శాస్త్రీయ ధృక్పధంలోని ప్రధాన అంశాలు

1.4.1 పరిశీలన

1.4.2 వర్ణన

1.4.3 కొలమానం, పరిమాణాత్మీకరణ

1.4.4. మూల్యాంకన

1.4.5 యదార్థాల వాస్తవాల అంగీకారం

1.4.6 తార్కికవాదం

1.4.7 కారణ కారకత్వం

1.4.8 పరీక్ష

1.4.9 సవరణ

1.4.10 ఊహకల్పన

1.5 సారాంశం

1.6 నమూనా ప్రశ్నలు

1.7 చదువవలసిన గ్రంథాలు

## 1.0 లక్ష్యాలు :

ఈ పాఠాన్ని చదివిన తరువాత మీకు ఈ క్రింది విషయాలను బాగా వివరించగలుగుతారు.

- రాజనీతిశాస్త్ర అధ్యయనానికి గల వివిధ ఆధునిక ధృక్పధాలు ఎలా ఆవిర్భవించాయి
- ప్రవర్తనావాద ధృక్పధ ప్రాముఖ్యత
- నిర్మితుల విధుల ధృక్పధ అభివృద్ధి వ్యవస్థల మరియు మార్క్సిస్టు ధృక్పధాలు
- శాస్త్రీయ ధృక్పధం మరియు లక్షణాలు

## 1.1. పరిచయం :

ఆధునిక రాజనీతి విశ్లేషణ రాజనీతి అధ్యయనానికి, అవగాహనకు విరివిగా వినియోగించే నవీన నాగరిక సాధనం. ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం అనేక ముఖ్యమైన సాంఘిక, ఆర్థిక, రాజకీయ మార్పులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో త్వరిత గతిని సంభవించాయి. అమెరికా, రష్యాలు అగ్రరాజ్యాలుగా ఆవిర్భవించాయి. అనేక వలస ప్రాంతాలు సామ్రాజ్య శక్తులకు వ్యతిరేకంగా పోరాడి స్వతంత్ర రాజ్యాలుగా రూపొందాయి. కార్ల్‌మార్క్స్ ప్రతిపాదించిన నూతన రాజనీతి సిద్ధాంతం ప్రపంచంలో నలుమూలల అధ్యయనం కావించబడి ప్రచారానికి వచ్చినది. శ్రేయోరాజ్య భావన విశ్వవ్యాప్తమైంది. శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో విశేషమైన మార్పులు అతి త్వరిత గతిని సంభవించాయి. మహా సామ్రాజ్యాలు నేలకూలాయి. వాస్తవానికి ప్రపంచంలో ప్రతిభాగంలోను, ప్రతి రంగంలోను ఈ మార్పు ప్రస్ఫుటమవుతుంది. ఫలితంగా రాజనీతిశాస్త్ర అధ్యయన ధృక్పధం కూడా అధ్యయనం విభాగాలలోను అనివార్యమైనది.

సాంప్రదాయ అధ్యయన ధృక్పధం రాజకీయ వాస్తవాలను వివరించుటంలో విఫలమైంది. రాజనీతిశాస్త్ర స్వభావం పరిధి సంబంధించిన భావాలు కాలానుగుణంగా మారుతుండడం వలన రాజనీతిశాస్త్ర అధ్యయన ధృక్పధాలలో మార్పు వచ్చింది. రాజనీతిశాస్త్ర అధ్యయనానికి ఆధునిక ధృక్పధాలు అవసరమనే వాస్తవాన్ని రాజనీతి శాస్త్రజ్ఞులు గుర్తించారు. రాజకీయాలను వివిధ దృక్కోణాల నుంచి నిగూఢంగా అధ్యయనం చేయడమే ఆధునిక రాజనీతిశాస్త్ర ధృక్పధ లక్ష్యము.

## 1.2 ఆధునిక ధృక్పధాలు (Modern Methods) :

19వ శతాబ్దం వరకు రాజనీతిశాస్త్రం వ్యవస్థల చారిత్రక అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చింది. అయితే క్రమంగా రాజకీయ సంస్థల సరళిని గురించి అధ్యయనం చేయటం ప్రారంభమైనది. రాజనీతి శాస్త్రం సార్థకత అమూర్త సిద్ధాంతాలపై కాక సమాజ అభివృద్ధికి, రాజకీయ ప్రక్రియలకు సంబంధించి అంశాలను నిర్దుష్టంగా ప్రతిపాదించటంలో ఉంటుందన్న భావం క్రమంగా బలపడనారంభించింది. ఫలితంగా 1902లో అమెరికాలో రాజనీతి శాస్త్ర సంఘము ఏర్పాటు అయింది. వివిధ రాజకీయ వ్యవస్థల తీరుతెన్నులను గురించి విశేష సమాచారాన్ని సేకరించారు. ప్రభుత్వ నిర్ణయాలు, రాజకీయ నాయకత్వాల స్వభావం, వర్గీకరణ, సిద్ధాంతాలకు నాయకత్వాలకు మధ్య మారుతున్న సంబంధాలను పరిశీలించటం ప్రారంభించారు. ప్రభుత్వ వ్యవహార సరళిపట్ల అధ్యయనంపై ఆసక్తిచూపటం ప్రారంభమైంది. ఫలితంగా అప్పటివరకు అనుసరిస్తూ వస్తున్న సాంప్రదాయ, చారిత్రక, లాంచనప్రాయ, చట్టబద్ధ సంస్థల ధృక్పధాల పట్ల తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. తత్ ఫలితంగా రాజనీతిశాస్త్ర అధ్యయనానికి, అవగాహనకు ఆధునిక ధృక్పధాలు ఆవిర్భవించాయి.

### 1.2.1 ప్రవర్తనావాద దృక్పథం (Behavioural Approach) :

శాస్త్రీయ పరిశోధనా పద్ధతులు అవలంబించాలన్న కోరిక రాజనీతిశాస్త్రవేత్తలలో బాగా ఏర్పడింది. ప్రధానంగా జీవశాస్త్రాలు, మానవ శాస్త్రాల పరిశోధనా పద్ధతుల రాజనీతి శాస్త్రాన్ని బాగా ప్రభావితం చేశాయి. అన్ని సామాజిక శాస్త్రాల్లోను మానవ జీవన విధానమే ప్రధానాంశమైనప్పుడు సామాజిక శాస్త్రాల అధ్యయన పద్ధతులు అనుసరించటం రాజనీతి శాస్త్రానికి ప్రయోజనకరమని భావించటం జరిగింది. ప్రధానంగా మనోవిజ్ఞాన శాస్త్రం, సామాజికశాస్త్రం, మానవ శాస్త్రాల్లోను పద్ధతులను అనుసరించటం వల్ల రాజనీతిశాస్త్ర అధ్యయనం లబ్ది పొందుతుందని భావించారు.

ముఖ్యంగా రాజనీతిశాస్త్ర అధ్యయనంలో పరిశోధనకు మంచి పద్ధతులు అవసరం అన్నవాదం ప్రవర్తనావాదులను బాగా ప్రభావితం చేసింది. అప్పటిదాకా అనుసరిస్తున్న సంప్రదాయ పద్ధతులు, ప్రవర్తనావాదుల రంగప్రవేశంతో తెరమరుగయ్యాయి. నూతన పద్ధతులు, పరికరాలు ఉపయోగించటంలో ప్రవర్తనావాద రాజకీయ అధ్యయనంలో నవ్యతకు నాంది పలికారు. రాజకీయ సంబంధాల అధ్యయనం, వ్యక్తుల, ప్రవర్తనల ప్రాముఖ్యం సంతరించుకొన్నాయి. పరిశీలన, విషయసేకరణ, మూల్యాంకన, మొదలైన పద్ధతులపట్ల ఆసక్తి పెరిగింది.

రాజనీతిశాస్త్ర అధ్యయనంలో పై పద్ధతులు క్రమంగా చోటుచేసుకున్నాయి. ప్రవర్తనావాదం ఆవిర్భావంతో నూతన దృక్పథాలు ఏర్పడ్డాయి. లాస్‌వెల్, బెంట్లీ తదితర రచయితలు రాజనీతి అధ్యయనంలో వాస్తవ రాజకీయాలకు స్థానం ఉండాలన్న వాదాన్ని బలపరిచారు. ఊహావాదులు, ఊహాత్మక సిద్ధాంతాలు, తీవ్ర విమర్శలకు గురిఅయ్యాయి. పూర్తి వస్త్వాశ్రయత (Objectivity) కోసం గణాంక పద్ధతులను వినియోగించాలన్నారు. లాస్‌వెల్ ప్రభుత్వ వ్యవస్థల అధ్యయనం కంటే నానాటికి విస్తృతమవుతున్న ప్రభుత్వ విధుల అధ్యయనం అవసరమని భావించాడు. వ్యక్తుల రాజకీయ ప్రవర్తనల అవగాహనకు మరో విజ్ఞానశాస్త్రంతో పరిచయం ఎంతగా తోడ్పడుతుందో ఆయన వివరించాడు. రాజకీయ ప్రవర్తనకు మరో శాస్త్ర విజ్ఞాన ప్రాతిపదిక ఆవశ్యకతను నొక్కి చెప్పాడు. రాజనీతిశాస్త్ర విద్యార్థులందరూ వ్యవస్థలను మాత్రమే విశ్లేషించి వాటి మూలపదార్థాలైన వ్యక్తులను, విస్మరిస్తున్నారని ఆయన విమర్శించాడు.

లాస్‌వెల్ అనంతరం బెంట్లీ, చార్లెస్ మెరియమ్‌లు ప్రవర్తనా వాదం విస్తరించడానికి రాజకీయశాస్త్ర అధ్యయనం వికాసానికి విశిష్ట సేవచేశారు. రాజకీయ అవగాహనకు వివరణలు అర్థంకావడానికి సమూహాలను అధ్యయనాంశాలుగా పరిగణలోనికి తీసుకోవాలని, యధార్థాలను అవగాహన చేసుకోవడానికి చర్య భావన ఒక్కటే అర్థవంతమైన దృక్పథమని పై రచయితలు భావించారు. చర్యభావన సాంప్రదాయక అధ్యయనంపై విప్లవం తీసుకొచ్చింది. సామాజిక దృగ్విషయాల్లో పరస్పర సంబంధాలను అవగాహన చేసుకోవడం ప్రధానాంశంగా భావించడం జరిగింది. ఛార్లెస్ మెరియమ్ ప్రవర్తనవాద పితామహుడుగా ప్రసిద్ధి చెందాడు. 1908లో ఆయన ప్రచురించిన "ప్రైమరీ ఎలెక్షన్స్" గ్రంథం ప్రవర్తనావాద ప్రధాన గ్రంథాల్లో మొదటిది. సమాజ, మనోవిజ్ఞాన, భూగోళ, నవవర్గ, వర్ణన, జీవ, గణాంక శాస్త్రాల్లో అనుసరిస్తున్న పరిశోధనా పద్ధతులను యంత్రాంగాన్నీ మెరుగుపరచడానికి పరిశోధన స్వభావాన్ని రాజనీతి శాస్త్రానికి వర్తింపచేయటంలో మెరియమ్ అద్వితీయ పాత్ర నిర్వహించాడు. "న్యూ ఎస్సే ఆఫ్ పొలిటిక్స్" గ్రంథంలో ప్రవర్తన వాదానికి సంబంధించిన పద్ధతులను ఆయన చర్చించాడు.

ప్రవర్తనావాదం వ్యాప్తి చెందడానికి కారణం రెండో ప్రపంచ యుద్ధానంతరం బలపడిన కమ్యూనిస్టు దేశాలు, కమ్యూనిజం అభివృద్ధి, విస్తరణలను రాజనీతి శాస్త్రజ్ఞులు ప్రవర్తన అడ్డుకోవడానికి ప్రయత్నించారు. సాంకేతిక విజ్ఞానం వృద్ధి చెందటంలో మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో రాజనీతిశాస్త్రం వాస్తవాలను అవగాహన చేసుకొని ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సమస్యలను కూలంకషంగా చర్చించి లోపాలను సవరించాలని, ప్రత్యామ్నాయ వ్యవస్థలు - నియంతృత్వం, అధీనవాదం - బలపడకుండా

ఉండాలని ప్రవర్తనావాదులు భావిస్తారు. రాజనీతి శాస్త్రాన్ని అనుభవవాద శాస్త్రంగా మార్చటానికి వారు ప్రయత్నించారు. రాబర్ట్‌థాల్ ప్రవర్తనావాదాన్ని ఒక మనోభావంగా భావించాడు.

## 1.2.2. వ్యవస్థల దృక్పథం (Systems Approach) :

రాజనీతి శాస్త్రంలో ఏ వ్యవస్థను గూర్చియైన విశ్లేషణ చాలా అవసరము. అందువలన ఆధునిక కాలంలో వ్యవస్థా దృక్పదం చాలా ప్రాముఖ్యతను సంతరించుకొన్నది.

ప్రవర్తనావాదం విస్తరణలో భాగంగా, వ్యవస్థల విశ్లేషణ వృద్ధిచెందింది. రాజ్యం, ప్రభుత్వం మొదలైన పారిభాషిక పదాల స్థానంలో 'వ్యవస్థ' అన్న పదాన్ని విరివిగా వాడుతున్నారు. అనేక సమాజాల్లో లాంఛన సంస్థలకు, లాంఛనేతన సమూహాలు, రాజకీయ అభివృత్తులు, వ్యక్తుల పరస్పర సంబంధాలు, మొదలైన వాటిని అవగాహన చేసుకోవడానికి, విశ్లేషించటానికి 'వ్యవస్థ' పరంగా అధ్యయనం చేయటానికి విస్తృతమైంది. వ్యవస్థల సిద్ధాంతానికి ఆద్యులు జీవశాస్త్రజ్ఞులు. 1950 దశకంలోనే వ్యవస్థల సిద్ధాంతం వినియోగంలోకి వచ్చినప్పటికీ, 1960 అది బాగా వ్యాప్తిలోకి వచ్చింది. వివిధ విజ్ఞాన శాస్త్రాల మధ్య సమీకరణ ఆవశ్యకతను వ్యవస్థల సిద్ధాంతం ఒక్కాణించింది. అనేక విజ్ఞాన శాస్త్రాల మధ్య అడ్డుగోడలు పెరగడం వల్ల ఒక విజ్ఞానశాస్త్రంలోని పరిశోధనా ఫలితాలు మరొక విజ్ఞానశాస్త్రానికి లభ్యం కాకపోవటం వల్ల విజ్ఞానశాస్త్రాల అభివృద్ధి కుంటుపడింది. ఈ పరిస్థితుల్లో సాధారణ వ్యవస్థల సిద్ధాంతికులు, అన్ని విజ్ఞానశాస్త్రాల్లోను ఉన్న సాధారణాంశాలను క్రోడీకరించి, అవి అన్ని విజ్ఞాన శాస్త్రాలకు సమానంగా వర్తించే ఒక సాధారణ సిద్ధాంతం రూపొందవచ్చని భావించారు. అలాంటి సాధారణ అంశాలను అన్ని విజ్ఞానశాస్త్ర అధ్యయనాలు విరివిగా ఉపయోగించుకోవచ్చు అని కూడా భావించారు. ఈ భావన పర్యవసానమే సాధారణ వ్యవస్థల సిద్ధాంతం.

సాధారణ వ్యవస్థల సిద్ధాంతం తన ప్రకృతి శాస్త్రాల నుంచి ప్రధానంగా జీవశాస్త్రం నుంచి గ్రహించింది. మొదట దీనిని మానవశాస్త్రంలో అనుసరించారు. తరువాత సమాజశాస్త్రం, మనో వైజ్ఞానికశాస్త్రం, రాజనీతి శాస్త్రం మొదలైన శాస్త్రీయ అధ్యయనాల్లోకి ప్రవేశించింది. రాజనీతిశాస్త్ర అధ్యయనం, విశ్లేషణలో వ్యవస్థల సిద్ధాంతం వినియోగానికి కృషి చేసిన వారిలో రాబర్ట్ మెర్టన్, టాల్కాట్ పార్సన్ ముఖ్యులు. జీవశాస్త్రం నుండి గ్రహించిన వ్యవస్థాభావనకు అనుభవపరమైన పరిశీలన ప్రధాన అంశం. పరస్పర అంతర్ చర్యల కోసం, నిలచిన మూలకముల పొందికయే వ్యవస్థగా లుడ్‌విగ్ బెర్టలన్‌ఫే నిర్వచించారు. వివిధ విషయాల అభివృద్ధులు, సంబంధాలుగల అనేక అంశాల పొందికను వ్యవస్థగా హాల్, ఫాగన్‌లు నిర్వచించారు. పై నిర్వచనాలన్నీ పరిసరాలతోను, పరస్పరం సంబంధం గల అనేక అంశాల పొందికగా వ్యవస్థ అని సూచిస్తున్నాయి. ఈ అనంత విశ్వం ఒక వ్యవస్థ. ఇందులో అనేకములైన వ్యవస్థలున్నాయి. గగన తలంలో వాతావరణ వ్యవస్థ ఉంది. సమాజంలో ఆర్థిక సామాజిక వ్యవస్థలున్నాయి. మానవ శరీరం కూడా ఒక సజీవవ్యవస్థ ఉంది. సమాజంలో ఆర్థిక సామాజిక వ్యవస్థలున్నాయి. మానవ శరీరం కూడా ఒక సజీవ వ్యవస్థ. వీటికితోడు యంత్రాల పొందికతో యాంత్రిక వ్యవస్థ కూడా ఉంది. సామాజిక వ్యవస్థలో వ్యక్తులే మూలాలు. సామాజిక వ్యవస్థ మినహా వ్యవస్థలలో వ్యక్తులు అంతర్భాగం కారు. ఇదే సామాజిక వ్యవస్థలకు ఇతర వ్యవస్థలకు మధ్య గల భేదం, ఇతర వ్యవస్థల్లో మూలకాలు వ్యవస్థ నిర్మాణానికి, నిర్వహణకై పూర్తిగా ఉపయోగపడతాయి. వ్యక్తి సామాజిక వ్యవస్థలో అంతర్భాగం, ఏదో ఒక పాత్రను నిర్వహిస్తుంటాడు. రాజకీయ వ్యవస్థలో వ్యక్తుల రాజకీయ పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది.

## 1.2.3 నిర్మితులు - విధుల దృక్పథం (Structural-Functional Approach) :

ఆధునిక దృక్పథంలో ప్రవర్తనావాద విప్లవం ఫలితంగా ఏర్పడ్డ మరో దృక్పథం నిర్మితులు - విధుల దృక్పదం. సమకాలీన రాజకీయాల అధ్యయనంలో యధార్థ రాజకీయ ప్రక్రియకు విశ్లేషణకు ఎక్కువగా ప్రాముఖ్యముంది. రాజకీయ దృగ్విషయాలన్నీ

మానవ ప్రవర్తన పైనే ఆధారపడి ఉంటాయి. ప్రవర్తనను పరిసరాలు ప్రభావితం చేస్తాయి. అందువల్ల ప్రవర్తన నిశ్చయ రూపాలైన సామాజిక, ఆర్థిక, మనోవైజ్ఞానిక సంబంధిత విషయాలను అధ్యయనం చేయాలి. నిర్మితులు - విధుల విశ్లేషణ ప్రధాన లక్ష్యం ఒక రాజకీయ వ్యవస్థ వాస్తవ నిర్మితులు, ప్రక్రియలు, యంత్రాంగాలు, విధులను వివరించటం. ఇది విధుల నిర్వహణకు ఎక్కువ ప్రాధాన్యమిస్తుంది.

ప్రతి రాజకీయ వ్యవస్థలోను కొన్ని నిర్మితులుండి అవి నిర్దేశించిన విధులను నిర్వహిస్తాయని నిర్మితుల - విధుల దృక్పథం భావిస్తుంది. గేబ్రియల్ ఆల్మండ్ "రాజకీయాభివృద్ధి" అనే గ్రంథంలో ఈ దృక్పథాన్ని వివరించాడు. ఇతడు ప్రతిపాదించిన దృక్పథం ప్రకారం ప్రతి రాజకీయ వ్యవస్థలోను కొన్ని నిర్మితులు అన్ని కాలాలలో కొన్ని సాధారణ కర్తవ్యాలను నిర్వహిస్తాయి. విధుల నిర్వహణ రీతులను, చట్టరాజకీయ వ్యవస్థలను శ్రేణీకరించుట జరుగుతుంది. అయితే రాజకీయ వ్యవస్థ రెండు రకాల విధులను తప్పనిసరిగా నిర్వహిస్తుంది. అవి ఉత్పాదక (Input Functions) విధులు ఉత్పాదిత విధులు. ఉత్పాదక విధులు అయిదు రకాలు. అవి 1) రాజకీయ సామాజికీకరణ 2) రాజకీయ భర్తీ 3) ప్రయోజనాల వక్తీకరణ 4) ప్రయోజనాల సమీకరణ 5) ప్రసారంగా వర్గీకరించాడు. ఉత్పాదిత విధులను 1) నియమాల రూపకల్పన 2) నియమాల అనువర్తనం 3) నియమపరమైన న్యాయనిర్ణయాలుగా గుర్తించాడు.

నిర్మితులు - విధుల మధ్య సంబంధాలను కనుక్కోవటానికి పరిసరాల వ్యవస్థలు ఏవిధంగా పరస్పరం స్పందిస్తాయో అన్వేషించాలని ఆల్మండ్ భావిస్తాడు. నిర్మితుల స్థాయిని బట్టి అవి సాంప్రదాయికమైనవా లేదా అభివృద్ధి చెందిన వ్యవస్థలా నిర్ణయించవచ్చు. నిర్మితులు తక్కువ స్థాయిలో ఉంటే అవి అభివృద్ధి చెందుతున్నవిగా, ఎక్కువగా ఉంటే అవి అభివృద్ధి చెందిన వ్యవస్థలుగా భావించవచ్చు.

"తులనాత్మక రాజకీయాలు - అభివృద్ధికరదృక్పథం" అనే మరో గ్రంథంలో నిర్మితులు - విధులు దృక్పథంలో కొన్ని మార్పులు ఆల్మండ్ చేశాడు. సమతౌల్య పరిరక్షణకు తాను యిచ్చిన ప్రాధాన్యత వల్ల తన దృక్పథం అభివృద్ధి చెందుతున్న రాజకీయ వ్యవస్థల విశ్లేషణకు ఉపయోగపడదన్న విమర్శలోని వాస్తవాన్ని ఆయన గుర్తించాడు. అందువల్ల ఆయన రాజకీయ వ్యవస్థను సమైక్యమైనదిగా భావించాడే కాని సమైక్యమైనదిగా పరిగణించలేదు. ఒక రాజకీయ వ్యవస్థలో కార్మిక సంఘాల వృద్ధి చెందుతున్న దాన్నిబట్టి రాజకీయపక్షాలు, ఎన్నికల ప్రక్రియలు, శాసనసభ, ఉద్యోగిస్వామ్యం ప్రభావితమవుతాయని భావించాడు. పరస్పర చర్యల స్వభావం కలిగిన వ్యవస్థల్లో స్థిరమైన, సమైక్యమైన నైజంతోపాటు పరస్పరాధారితంగా ఉంటాయి.

మార్పులు, చేర్పులు చేసిన నమూనాలో ప్రయోజనాల వ్యక్తీకరణ, ప్రయోజనాల సమీకరణాలు మాత్రమే ఉత్పాదక విధులుగా ఉన్నాయి. ఉత్పాదక, ఉత్పాదక విధుల్లో దేనికీ చెందకుండా ప్రసార విధులకు స్వతంత్ర ప్రతిపత్తి ఉంటుంది. పై రెండు విధులను ప్రసారం చేయాల్సి ఉంటుంది. కాబట్టి అవి ఉత్పాదక, ఉత్పాదిత విధుల మధ్య ప్రక్రియగా,యంత్రాంగంగా ఉంటాయి.

పై విధంగా తులనాత్మక రాజకీయాల్లో ఆల్మండ్ ప్రతిపాదించిన నిర్మితులు - విధుల దృక్పథం ఆధునిక సమకాలీన రాజకీయ వ్యవస్థల అధ్యయనంలో కీలకపాత్ర నిర్వహిస్తుంది. అయితే ఈ దృక్పథం రాజకీయ వ్యవస్థలోని స్థిర సంబంధాలను పరిగణనలోకి తీసుకొందేగాని వాటి గతిశీల స్వభావాన్ని గుర్తించలేదు. అంతే కాకుండా రాజకీయ వ్యవస్థను సామాజిక వ్యవస్థలో ఒక ఉప వ్యవస్థగా పరిగణించింది.

పైగా ఈ దృక్పథం అభివృద్ధి చెందిన రాజకీయ వ్యవస్థల విశ్లేషణకుఉపకరిస్తుందేకానీ అభివృద్ధి చెందుతున్న వెనుకబడిన మూడో ప్రపంచ దేశాల వ్యవస్థల అధ్యయనానికి అంతగా ఉపయోగపడదు. ఇక్కడి సమాజాల్లో జాతి,మత, భాషా, తెగ, ఉపతెగ,

ఉపజాతి సమస్యలు అనేకం ఉన్నాయి. వాటి ఒత్తిడి రాజకీయ వ్యవస్థను స్థిరంగా ఉంచదు. అయితే నిర్మితి - విధుల దృక్పథం ఏమైనప్పటికి రాజకీయ ద్విగ్విషయాల వివరణలో ఒకమైలు రాయి అని చెప్పవచ్చు.

## 1.2.4 తులనాత్మక దృక్పథం (Comparative Approach) :

ఆధునిక దృక్పథాలలో మరొకటి తులనాత్మక దృక్పథం. విభిన్న పరిస్థితులలో వివిధ దేశాలలో వివిధ కాలాలలో ప్రజల మధ్య ఉన్న వ్యత్యాసాలను, సామీప్యాలను వివరించే మూల సిద్ధాంతాలను రూపొందించడాన్నే తులనాత్మక దృక్పథం అని అంటారు. ఈ దృక్పథానికి ప్రాధాన్యత యిచ్చిన వారిలో అరిస్టాటిల్,మాంటెస్క్యూ, బ్రైస్‌లు ప్రముఖులు. విభిన్న రాజ్యాల ప్రభుత్వాలను పోల్చి చూస్తే వాటి మౌళిక లక్షణాలు, స్వరూపాలు, లోపాలను తెలుసుకోవటానికి వీలు కలుగుతుంది. తులనాత్మక దృక్పథం మంచి చెడు రాజ్యాలను గుర్తించడానికి తోడ్పడుతుంది. ఉదా - అరిస్టాటిల్ తన పొలిటిక్స్ అనే గ్రంథ రచనకు 158 దేశాల రాజ్యాంగాలను పరిశీలించాడు. అలాగే వివిధ దేశాలలోని విప్లవాలను అధ్యయనం చేసిన తరువాతనే అరిస్టాటిల్ విప్లవాల సాధారణ కారణాలను విపులీకరించాడు.

## 1.2.5 పరిశీలనాత్మక దృక్పథం (Observational Approach) :

ఆధునిక దృక్పథాలలో మరియొకటి పరిశీలనాత్మక దృక్పథం. రాజనీతి సిద్ధాంతాలు, భావాలను, ప్రభుత్వ విధానాలను, అవిపనిచేసే తీరుతెన్నులను పరిశీలించినపుడే వాటిలోని గుణదోషాలను అర్థం చేసుకోవడానికి వీలు అవుతుంది. ఈ దృక్పథానికి అధిక ప్రధాన్యత నిచ్చినవాడు లార్డ్ బ్రైస్. ఈ దృక్పథాన్ని అనుసరించే ఇతడు అమెరికన్ కామన్ వెల్త్, మోడరన్ డెమోక్రసీస్ అనే గ్రంథాలను వ్రాసాడు. బ్రైస్ స్వయంగా అనేక దేశాలను పర్యటించి వివిధ ప్రజాస్వామ్య విధానాలను పరిశీలించిన పిదపనే ఆ గ్రంధాలను వ్రాసాడు. రాజనీతి శాస్త్ర అధ్యయనంలో పరిశీలన అనేది నిరంతరం జరుగుతూ ఉండాలి. సెయింట్ అభిప్రాయంలో పరిశీలనాత్మక పద్ధతి వల్లనే రాజనీతి శాస్త్రం అభివృద్ధి చెందుతుంది.

## 1.2.6 ఉత్పాదక - ఉత్పాదిక దృక్పథం (Input-Output Approach) :

ప్రవర్తనవాదంలో భాగంగా ఈస్టన్ రాజకీయ ద్విగ్విషయాల సాధారణ అధ్యయనంలో మొదటిసారిగా వ్యవస్థాభావనను ప్రవేశపెట్టాడు. రాజకీయ ప్రక్రియలను, శక్తులను విశ్లేషించడానికి రాజకీయ వ్యవస్థ సరియైన భావన అని ఈస్టన్ భావించాడు.

రాజకీయ వ్యవస్థ ఇతర వ్యవస్థలతో కలిసి మనుగడ కొనసాగిస్తుంది. అందువల్ల వాటితో దానికి సన్నిహిత సంబంధం ఉంటుంది. ఒక వ్యవస్థ నుంచి మరో వ్యవస్థకు ప్రసరించే విషయాలు మొదటి దానికి ఉత్పాదితాలు రెండో దానికి అవి ఉత్పాదికాలు అవుతాయి.

ఉత్పాదకాలు రాజకీయ వ్యవస్థకు అభ్యర్థనలు, మద్దతు రూపంలో ఉంటాయి. సమాజం నుంచి రాజకీయ వ్యవస్థ అభ్యర్థనలు, మద్దతు రూపంలో స్వీకరిస్తుంది. ఒక ప్రత్యేక విషయంలో బాధ్యత గలవారు సాధికారిక కేటాయింపులు చేయాలా లేదా అన్న విషయం అభ్యర్థనల రూపంలో వెలువడుతుంది. విధేయత ప్రకటన మద్దతు రూపంలో ఉంటుంది. ప్రత్యేక కారణాలకు మద్దతు నిర్దిష్ట రూపంలో ఉంటుంది. పన్నులు చెల్లించడం, శాసనాల పట్ల విధేయత చూపించి వాటి నిబంధనలను పాటించడం కుల, మత, తెగ, సామాజిక వర్గాల ప్రభావం కూడా అభ్యర్థనల రూపంలో ఉంటుంది.

ఉత్పాదితాలు రాజకీయ వ్యవస్థలు అందించే ఫలితాలు, ఉత్పాదకాలకు స్పందనే ఉత్పాదితాలు. అధికారుల చర్యలు, నిర్ణయాల రూపంలో అవి వ్యక్తమవుతాయి.

సాధారణ వ్యవస్థల సిద్ధాంతం, ప్రధానంగా ఈస్టన్ ప్రతిపాదించిన రాజకీయ వ్యవస్థల సిద్ధాంతం అనేక విమర్శలకు గురయ్యాయి. విశ్లేషించిన దృగ్విషయాన్ని వ్యవస్థల చట్రంలోకి కుదించాలని వ్యవస్థ సిద్ధాంతం ఉద్దేశం. వర్ణనకు వివరణకు ఎంపికైన ఎటువంటి చలరాశులనైనా వ్యవస్థల ప్రవర్తనలో ఇమడ్చవచ్చు.

అయితే వ్యవస్థల పరిధులను నిర్ణయించటంలో వాస్తవంలో కొన్ని ఇబ్బందులుంటాయి. ఉత్పాదికాలు ఉత్పాదితాలుగా ఎలా పరివర్తనం చెందుతాయన్న దాన్ని గురించి ఈస్టన్ ఎటువంటి వివరణ ఇవ్వలేదు. అయితే రాజకీయ విశ్లేషణలో - ముఖ్యంగా తులనాత్మక విశ్లేషణలో - ఈస్టన్ సిద్ధాంతం చాలా ఉపయోగపడుతుంది. రాజకీయ విశ్లేషణకు ఇది ఒక విస్తృతమైన చట్రాన్ని అందించింది.

### 1.2.7 మార్క్సిస్టు దృక్పథం (Marxist Approach) :

ఇంతవరకు మనం చర్చించిన తులనాత్మక రాజకీయాల అధ్యయనం ఆధునిక, దృక్పథాలు మౌలికంగా పాశ్చాత్య రాజకీయ వ్యవస్థలను దృష్టిలో ఉంచుకొని రూపొందినవి. వాటికి భిన్నంగా మార్క్సిస్టు దృక్పథం ఆర్థిక విశ్లేషణ ప్రాతిపదికపై రూపొందింది. తనదే సరిఅయిన శాస్త్రీయ దృక్పథంగా వివరించటానికి ప్రయత్నిస్తుంది. ఆయా సమాజాల చారిత్రక పరిణామాలను, గతితార్కిక పరిణామ చట్రంలో అధ్యయనం చేయడానికి, మార్క్సిస్టు దృక్పథం ప్రయత్నిస్తుంది. వాస్తవ చారిత్రక పరిస్థితులను విస్మరించే అధ్యయన దృక్పథాలను ఇది ఖండిస్తుంది. పౌరసమాజం, రాజ్య సిద్ధాంతం, శాస్త్రం మొదలైన కారకాలకు, సమాజ నిర్మితి అధ్యయనానికి మార్క్సిజం ప్రత్యేక సైద్ధాంతిక గుర్తింపును ఇవ్వలేదు. సామాజిక నిర్మితిలో ఆర్థికాంశాలకు విశేష ప్రాధాన్యమిచ్చింది. ఆర్థిక సంబంధాలు పునాదిగా సమాజంలోని అన్ని అంశాలు ఉపరితల నిర్మితుల్లో నిక్షిప్తమవుతాయి. ఆర్థిక సంబంధాల్లో మార్పులు వచ్చినప్పుడు ఉపరితలంలోని నిర్మితుల్లో కూడా క్రమంగా మార్పులు వస్తాయని మార్క్సిస్టు దృక్పథం భావిస్తుంది. అయితే, ఉపరితలానికి సంబంధించిన అంశాలు ఏదో ఒక మేరకు ఆర్థిక కారణాలను ప్రభావితం చేస్తాయని కూడా భావించాడు. ఈ విషయాన్ని మార్క్స్, వర్గంగా రూపొందగల శక్తి, వ్యక్తుల ప్రమేయం, పార్టీ నిర్మాణం వంటి అంశాల పేరు మీద చర్చించాడు. అనుభవవాద పరిశీలనలో దత్తాంశాలు వివరణతో కూడిన శాస్త్రీయ పద్ధతినే మార్క్స్ కూడా అవలంబించాడు. వ్యవస్థల విశ్లేషణలో ఆర్థిక సంబంధాలను స్థిరమైన కారకంగా భావించిన మొట్టమొదటి రాజకీయ సామాజిక శాస్త్రజ్ఞుడిగా మార్క్స్‌ను పరిగణించవచ్చు. శాస్త్రానికి నిర్వచనాలు ఇవ్వటంలో ఇతర దృక్పథాల నుంచి విభేదించినప్పటికీ మార్క్సిజం అధ్యయనం పద్ధతులు శాస్త్రీయమైనవే. ఎందుకంటే యధార్థ పరిస్థితులను గురించిన సమాచారం సేకరించగల పద్ధతులే శాస్త్రీయమైనవి. చరిత్రలో మరుగునపడిన యధార్థాలను వెలికి తీయడానికి మార్క్సిజం, గతితార్కిక పద్ధతిని వినియోగించింది. మనకు కనిపించే ప్రతి అంగంలోను కనిపించని యదార్థాలు ఉంటాయని, వాటిని విశ్లేషించటం అవసరమని భావిస్తుంది. గతితార్కిక సమాజశాస్త్రమే మార్క్సిజంగా ముద్రవేసుకొంది. చారిత్రక భౌతికవాదం ద్వారా మార్క్స్ నిశ్చయాత్మక సమాజశాస్త్రానికి విశేషమైన సేవచేశాడు. సామాజిక గమనం గురించి ఆయన క్రొత్త పరిస్థితులను చెప్పలేదు. కాని, నిగూఢంగా ఉన్న అంశాలను, వాస్తవాలను బయటికి తీసి వాటి ప్రాతిపదికపై నూతన సిద్ధాంతాన్ని రూపొందించటానికి మార్క్స్ వినియోగించిన గతితార్కిక అధ్యయన పద్ధతి తులనాత్మక రాజకీయాల అధ్యయనానికి నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. వైరుధ్యాల సంఘర్షణ ద్వారా సమాజం సమున్నత సంక్లిష్ట స్థాయికి చేరుకొంటుందని మార్క్స్ భావిస్తాడు. ఆయన దృష్టిలో వైరుధ్యాలే ప్రపంచ గమనానికి మూలసూత్రాలు. ఘర్షణలు, వైరుధ్యాల ఫలితంగా సామాజిక మార్పులు ఏర్పడతాయి. సమున్నత స్థితికి పరివర్తన చెందటానికి అవి ఉపయోగపడతాయి. ప్రపంచ చరిత్ర ప్రతిదశలో పరస్పర విరుద్ధ శక్తులు ఉంటాయి. వాటి మధ్య సంఘర్షణలే చరిత్రగమనానికి చక్రాలు. ఒక వైరుధ్యం నశించిపోతుండగా దానిలోనుంచి మరొకటి ఉద్భవిస్తుంది. పాతకొత్తల మధ్య మరణిస్తున్నదానికి, జన్మిస్తున్నదానికి, క్షీణిస్తున్నదానికి, అభివృద్ధి చెందుతున్నదానికి, మధ్య జరిగే పోరాటమే అభివృద్ధిక్రమ సారాంశం. మార్క్సిస్టు దృక్పథం ప్రకారం మొత్తం చరిత్ర గమనం

ఉత్పత్తి శక్తులద్వారానే జరుగుతుంది. మానవ జీవనానికి అవసరమైన వస్తువుల ఉత్పత్తి, వస్తువుల మార్పిడి సమాజ నిర్మాణానికి ప్రాతిపదికలు. ప్రతి సమాజంలో ఏఏ వస్తువులు ఎలా ఉత్పత్తి అవుతున్నాయి, ఉత్పత్తుల మార్పిడి ఏ విధంగా జరుగుతున్నది. సంపద ఏ విధంగా పంపిణీ అవుతుంది, సమాజంలో ఎలా వర్గీకృతమైంది, మొదలైనవే ప్రధానాంశాలని మార్క్స్ భావిస్తాడు. అంతర్గతవైరుధ్యాల ప్రాతిపదికగా ఉత్పత్తి సాధనాల యాజమాన్యం పరంగా వర్గపోరాటం ద్వారా ఉద్భవించిన ఆధునిక సమాజం వర్గ వైరుధ్యాలను నిర్మూలించలేక పోయిందని మార్క్స్ భావించాడు. పాత వర్గాల స్థానంలో కొత్త వర్గాలు, పాతదోపిడి పద్ధతులకు బదులు కొత్త దోపిడి మార్గాలు ఏర్పడ్డాయంటాడు. వర్గపోరాటం అంతిమస్థాయిలో పెట్టుబడిదారులు శ్రామిక వర్గాలు పరస్పరం ఎదుర్కొంటాయని, వీటిమధ్య పోరాటం అనివార్యమని చివరిగా జరిగే ఆఖరి పోరాటంలో శ్రామిక వర్గం పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మూలించి వర్గరహిత సమజాన్ని నిర్మిస్తుందని మార్క్సిజం ఉద్బోధిస్తుంది. సామ్యవాదం, తత్వశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రం మొదలైన వాటికే మార్క్సిజం పరిమితం కాలేదు. విజ్ఞాన శాస్త్రాలన్నింటిలోను ఇది విప్లవాత్మకమైన మార్పుకు ప్రధాన కారణమైంది. ఒక విధంగా చెప్పాలంటే మార్క్సిస్టు దృక్పథాన్ని అధ్యయన సాధనంగా గుర్తించిన తరువాతనే విజ్ఞానశాస్త్రాలకు శాస్త్రీయ దృక్పథం ఏర్పడింది.

## 1.3 శాస్త్రీయ దృక్పథం (Scientific Approach) :

శాస్త్రీయ పద్ధతి పురాతన కాలంలోనే ఉద్భవించినప్పటికీ, ఆధునిక కాలంలోనే ఎక్కువ ప్రచారాన్ని పొందింది. ఆధునిక కాలంలో క్రమబద్ధమైన, నిష్పాక్షికమైన, పటిష్టమైన విజ్ఞానాన్ని సముపార్జించేందుకు శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించడం సర్వసాధారణమైంది. సాధారణ అర్థంలో శాస్త్రాలను నిర్మించేందుకు, అభివృద్ధి పరిచేందుకు ఉపయోగించే పరిశోధనా శాస్త్రీయ పద్ధతిని శాస్త్రీయ దృక్పథం అని చెప్పవచ్చు. లండ్‌బర్గ్ అనే శాస్త్రవేత్త అభిప్రాయం ప్రకారం శాస్త్రీయ పద్ధతిలో క్రమబద్ధమైన వీక్షణ, సమాచార వర్గీకరణ, వ్యాఖ్యానాలు కీలకాంశాలు. లాంఛనత్వం, కాఠిన్యత, పరీక్షకు అనువుగా ఉండడం మొదలగునవి శాస్త్రీయ దృక్పథం యొక్క లక్షణాలని పేర్కొన్నాడు.

## 1.3 శాస్త్రీయ దృక్పథ లక్షణాలు (Features of Scientific Approach) :

శాస్త్రీయ పద్ధతిలో యీ క్రింది లక్షణాలు ప్రధానమైనవి. (1) యధార్థాలను పరీక్షించేందుకు వీలవుతుంది. ఈ అంశమే శాస్త్రీయ పద్ధతిని ఇతర పద్ధతులనుంచి వేరుపరుస్తుంది. (2) శాస్త్రీయ పద్ధతిలో వస్తుపరత కీలకమైన అంశం. పరిశోధకుని వ్యక్తిగత భావాలు శాస్త్రీయ పరిశోధనను ప్రభావితం చేయలేవు. (3) శాస్త్రీయ పరిశోధన స్పష్టమైనది, ఖచ్చితమైనది, (4) శాస్త్రీయ పద్ధతి సాధారణతత్వాన్ని కలిగి ఉంటుంది. అంటే పరిశోధనా ఫలితాలు సార్వజనీనకంగా వర్తిస్తాయి. (5) శాస్త్రీయ పద్ధతి భవిష్యత్తును ఊహించగల సామర్ధ్యాన్ని కలిగి ఉంటుంది.

## 1.4 శాస్త్రీయ దృక్పథంలోని ప్రధాన అంశాలు (Important elements of Scientific Approach) :

శాస్త్రీయ పద్ధతి హేతువాద లక్ష్యాన్ని కలిగి ఉండటమేకాక, కారణకారక స్వభావంకల పరికల్పనలకు ప్రాధాన్యతనిస్తుంది. ఈ పద్ధతి వీక్షణకు, కొలమానికి సాధ్యమైన నిష్పాక్షిక వాస్తవాన్ని వివరిస్తుంది. సామాజిక శాస్త్రాలలో శాస్త్రీయ పద్ధతి ఆత్మాశ్రయ వాస్తవాన్ని పరిగణనలోనికి తీసుకోదు. కాగా శాస్త్రీయ దృక్పథం అనేక అంశాలను కలిగి వుంది. వాటిలో ప్రధానమైనవి. క్రింద వివరించబడినవి.

### 1.4.1 పరిశీలన (Observation) :

శాస్త్రీయ పరిశోధనలో పరిశీలన ఒకే పరిస్థితికి పరిమితం కావచ్చు లేదా సామర్థ్యం కల అనేక పరిస్థితులలో చేపట్టబడవచ్చు. పరిశీలన ఒక దృగ్గోచరం. జ్ఞానేంద్రియాల ద్వారా సంఘటనలు, విషయాలు, వాస్తవాలు పరిశీలించబడతాయి. పరిశీలన, బాహ్యా

పరిస్థితులు లేదా అంతర్గత పరిస్థితులపై తన దృష్టిని కేంద్రీకరిస్తుంది. సాధారణంగా ఇది ఒకే వ్యక్తిచేత నిర్వహింపబడుతుంది. ఈ పరిశీలన ధృవీకరింపబడేంతవరకు తాత్కాలికంగా అంగీకరించటమో, అంగీకరించకబడకపోవటమో జరుగుతుంది. ఒక్కొక్కప్పుడు చాలా పరిశీలనలు తప్పు అని తేలుతుంది. అందువలననే విజ్ఞాన శాస్త్రవేత్త తన భావాలను, అనుభవాలను సరిదిద్దుకోవటానికి సిద్ధంగా వుంటాడు.

### 1.4.2 వర్ణన (Discription) :

శాస్త్రీయ పద్ధతి తాను సేకరించిన సమాచారాన్ని వర్ణించి వివరిస్తుంది. ఈ వర్ణన ధృవీకరించబడేంతవరకు లేక నూతన సాక్ష్యాధారాలు లభించేంతవరకు అంగీకరించటమో, అంగీకరించబడలేకపోటమో జరుగుతుంది. ఇతర పరిశోధకులు ఈ ఆధారాలను అంగీకరించలేకపోవడం కూడ జరగవచ్చు.

### 1.4.3 కొలమానం, పరిమాణాత్మీకరణ (Measurement and Standardisation) :

సామాజిక శాస్త్రాలలో కొలమానం పరిమితంగానే సాధ్యం. ఎందుకనగా ఈ శాస్త్రాలలో అధ్యయనం చేయవలసిన కారకాలు అసంఖ్యాకంగా ఉంటాయి. వీటన్నింటిని కొలిచేందుకు వీలుకాదు. కనుక అచిరకాలంలో ప్రధానమైన వాటిని ఎంపికచేసి, వానిని మాత్రమే కొలవటం జరుగుతుంది. కాగా పరిణాత్మీకరణ కూడా కష్టమయిన ప్రక్రియే. దీన్నే సారాంశ విశ్లేషణ అని కూడ అంటారు.

### 1.4.4 మూల్యాంకన (Evaluation) :

పరిశీలనకు, వర్ణనకు మూల్యాంకన ఖచ్చితమైన గుణాన్ని, స్పష్టతను కలుగచేస్తుంది. అంచనా వేయటానికి వీలైన విషయాలను మూల్యాంకన చేయాలి.

### 1.4.5 యదార్థాల వాస్తవాల అంగీకారం (Acceptance of reality) :

వాస్తవానికి అనుగుణంగా ఉన్న వ్యాఖ్యానాలు యదార్థాలైనవి. శాస్త్రీయ పద్ధతి అనుభవైక పరిశోధన ద్వారా సేకరించిన వాస్తవాలపట్ల మాత్రమే ఆసక్తి కనపరుస్తుంది. కాని యదార్థాలకు సంబంధించిన ప్రతిపాదనలు తాత్కాలికంగా మాత్రమే అంగీకరించబడతాయి. అయితే విశ్వాసాలు శాస్త్రీయ పరిశోధనలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. విశ్వాసాలు, అనుభవైక పరిశోధనలు వెల్లడించిన అంశాలను శాస్త్రవేత్తలచేత అంగీకరింప చేస్తాయి.

### 1.4.6 తార్కికవాదం (Logic) :

శాస్త్రీయపద్ధతి ఖచ్చితంగా విశ్లేషణాత్మకమైన వాటిని మాత్రమే ఖచ్చితమైనవిగా అంగీకరిస్తుంది. ఒక ప్రతిపాదనలో ఇమిడి ఉన్న అర్థాన్ని మాత్రమే వివరించడాన్ని విశ్లేషణాత్మక ప్రక్రియ అంటారు. తార్కికవాదం ప్రధానంగా చూస్తే సామాజిక శాస్త్రాలలో అనేక పదాలకు స్పష్టమైన అర్థం వుండదు. అయితే ఈ శాస్త్రాలలో స్పష్టమైన తార్కికమైన సిద్ధాంతాలను రూపొందించేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తారు. దీనికి ఆగమన తార్కికవాదం ఉపయోగపడుతుంది. పరిశోధకుడు ఎలాంటి ముందు ఆలోచన, విశ్వాసాలు లేకుండా, వాస్తవాల ఆధారంగా పరిశోధనను సాగించడం ద్వారా తార్కికతను సాధించవచ్చును.

### 1.4.7 కారణ కారకత్వం (Cause and Effect) :

రెంటి మధ్య సహసంబంధాలను వివరించటం లేక కారణ కారకత్వం. ఇది శాస్త్రీయ పద్ధతిలో కీలక అంశం. దానినే గతంలో కారణం, ఫలితం సంబంధంగా వ్యవహరించారు. అయితే అన్ని విషయాలలో కారణ కారకత్వాలను ఖచ్చితంగా వేరుపర్చటం సాధ్యంకాదు. ప్రతి అంశానికి అనేక ప్రత్యామ్నాయాలు, కారణాలుగా గోచరిస్తూ ఉంటాయి. ఖచ్చితంగా ఏ కారణం వలన ఒక విషయం జరిగిందో, నిర్ణయించటం అన్ని వేళలా సాధ్యంకాదు. ఉదా ॥ 2004 ఏప్రియల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా భారతదేశంలో జరిగిన ఎన్నికలకు సంబంధించిన ప్రజల తీర్పును పరిశీలించి, వర్ణించి, అంచనావేసి వ్యతిరేక ఓటుతో వివిధ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీలు ఓటమిని పొందాయి అన్న ప్రతిపాదనను చేయవచ్చును లేదా సంకీర్ణాలను ఏర్పాటు చేసుకోవటంలో చూపిన చాకచక్యం గెలుపు ఓటములను నిర్ణయించిందని వివరించవచ్చును.

### 1.4.8 పరీక్ష (Verification) :

శాస్త్రీయ పద్ధతిలో పరీక్ష లేక ప్రయోగం కీలక అంశము. ఇది పరిశోధకుని నిర్ణయాలను నిర్ధారిస్తుంది. అంతేగాక శాస్త్రీయంగా సేకరించిన సమాచారాన్ని వ్యక్తుల మధ్య మార్పిడికి ఈ పరీక్షలు తోడ్పడతాయి. ఒకే స్వభావం కలిగిన రెండు సన్నివేశాలు, వాటి ఫలితాలు జాగ్రత్తగా గమనించబడతాయి. సామాజిక శాస్త్రాలలో ప్రయోగం నిర్వహించే సన్నివేశంలో బాహ్య పరిస్థితులు కూడా పరిశీలించబడతాయి. పై రెండు సన్నివేశాలకు తర్కశాస్త్ర నిగమనవాదాన్ని వర్తింపచేసి, అది వాస్తవం అని తేలితే వాటిని నిర్ధారిత సంభావనలుగా భావిస్తాము.

### 1.4.9 సవరణ :

విధానాలకు సంబంధించిన పరిశీలనలు, మనం అంగీకరించిన పరిశీలన సమయంలో విరుద్ధమని తోస్తే వాటిని సరిచేయాలి. ఉదాహరణకు అత్యయిక పరిస్థితికి సంబంధించిన దురాగతాలు జరిగినప్పటికి, అధికారపక్షం ఓడిపోకపోతే, మనం మన పరిశీలనలను మార్చుకోవాలి. ప్రతిపక్షాలన్నీ ఏకంకావటంలో విఫలమవటంవల్ల అత్యయిక పరిస్థితిలో అధికార పక్షానికి చెందినవారు దురాగతాలకు పాల్పడినప్పటికీ ఆ పక్షం ఓడిపోలేదన్న నిర్ణయానికి రావలసి ఉంటుంది.

### 14.10 ఊహాకల్పన (Hypothesis) :

మానవ ప్రవర్తన కీలకపాత్ర వహించే సామాజికశాస్త్రాల పరిశోధనల్లో ఊహించటానికి అవరోధం కల్పించే అంశాలు మానవ ప్రవర్తనకు సంబంధించి ఖచ్చితమైన సూత్రాలు రూపొందకుండా నివారిస్తాయి. అందుచేత సామాజిక శాస్త్రాలలో ఊహాకల్పనకు విలువ లేదని చెప్పబడింది. అంతేకాక ఈ శాస్త్రాల పరిశోధనలో అనేక కారకాలను పరిగణలోనికి తీసుకోవాల్సి ఉన్నందున కూడా ఊహాకల్పన అసాధ్యమనే చెప్పాలి. అయితే కొన్ని సందర్భాలలో సంభావ్యత ఆధారంగా కూడా కల్పన అసాధ్యమనే చెప్పాలి. అయితే కొన్ని సందర్భాలలో సంభావ్యత ఆధారంగా మానవ ప్రవర్తన, ఊహించడం సాధ్యం అవుతుంది. ఉదా ॥ రాజకీయాలలో పాల్గొనే వ్యక్తుల దృక్పధాలను ఊహించే వీలుంది. సాధారణంగా పదవిలో కొనసాగటమే రాజకీయ నాయకుల ఏకైక లక్ష్యమని ఊహించడం అసాధ్యమేమీకాదు.

### 1.4.11 అంగీకరింపకపోవడం (Nullifycation) :

పైన పేర్కొనబడిన విధానాలలో శాస్త్రీయంగా ధృవీకరింపబడిన ప్రతిపాదనలను అంగీకారయోగ్యం కాని ప్రతిపాదనల నుండి వేరు చేయాలి. ఇది బ్రెక్టు సూచించిన శాస్త్రీయ విధానానికి పరాకాష్ట వాస్తవాలకు సంబంధించిన ప్రతిపాదన సిద్ధాంతపరమైన

ప్రతిపాదనగా రూపొందించబడి తర్కసంబంధ వాదంగా తీవ్రతను చేకూర్చుకొంటుంది. సిద్ధాంతపరమైన వాదన మరల పరీక్షింపబడి సరిచేయబడుతుంది. బ్రేక్టులాగే ఇతర శాస్త్రవేత్తలు కూడా అంగీకరించక పోవటాన్ని శాస్త్రీయ దృక్పథంలో అవసరమైన భాగంగా భావిస్తారు.

## 1.5 సారాంశం :

రాజనీతి శాస్త్ర అధ్యయనంలో 19వ శతాబ్దం వరకూ సాంప్రదాయక దృక్పధం ప్రాధాన్యం వహిస్తే 20వ శతాబ్దంలో శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో సాధించిన అభివృద్ధి, ఆర్థికపరమైన అంశాలు పశ్చిమ దేశాలలో, నెలకొన్న ఉదారవాద రాజకీయ ప్రజాస్వామ్య సమాజాలు, రెండో ప్రపంచయుద్ధం తరువాత నూతనంగా ఆవిర్భవించిన మూడో ప్రపంచ రాజ్యాల రాజకీయ వ్యవస్థలు, రాజనీతిశాస్త్ర పరిధిని విస్తృతం చేశాయి. సాంప్రదాయిక పద్ధతులలో కేవలం చట్టాలు, చారిత్రకత రాజ్యాంగపరంగా రాజకీయ సంస్థల విశ్లేషణ, పేలవంగా, అర్థరహితంగా ఉండటమే కాకుండా రాజనీతి విశ్లేషణ అమూర్తంగా మిగిలిపోయింది. రాజనీతి శాస్త్రాన్ని, రాజకీయాల అధ్యయనానికి శాస్త్రీయ దృక్పధాన్ని కల్పించడానికి, రాజనీతి అధ్యయనాన్ని వాస్తవ సమస్యల పరిష్కారాన్ని సూచించే విజ్ఞాన శాస్త్రంగా మలచటానికి 20వ శతాబ్దంలో ఆధునిక దృక్పథాలు, ప్రవర్తనావాద విప్లవం ప్రభావంతో రూపొందాయి.

## 1.6 మాదిరి ప్రశ్నలు :

1. రాజకీతిశాస్త్ర అధ్యయనానికి గల వివిధ అదునిక దృక్పథాలను వివరించండి.
2. శాస్త్రీయ దృక్పధం అనగానేమి ? రాజనీతిశాస్త్ర అధ్యయనములో దానికి గల ప్రాముఖ్యతను పరిశీలించండి.

## లఘు వ్యాసరూప ప్రశ్నలు :

1. ప్రవర్తనావాద దృక్పథం
2. నిర్మితులు - విధుల దృక్పథం
3. వ్యవస్థల దృక్పథం
4. తులనాత్మక దృక్పథం

## 1.7 చదువవదగిన గ్రంథాలు :


1. ఎస్.పి.వర్మ : మోడరన్ పొలిటికల్ థియరి
2. రాబర్ట్ ఎ.డాల్ : మోడరన్ పొలిటికల్ ఎనాలసిస్
3. జె.సి.జోహారీ : మోడరన్ పొలిటికల్ థియరి
4. జె.సి. జోహారి : కాంటెంపరరీ పొలిటికల్ థియరి


- డా॥ కె. రామచంద్రమూర్తి

పాఠం - 2

# ప్రవర్తనావాద దృక్పథం, పుట్టుక, అభివృద్ధి, లక్షణాలు మరియు సంగత్వము

## (BEHAVIOURALISM : ORIGIN, DEVELOPMENT, FEATURES AND RELAVANCE)

విషయసూచిక


2.0 లక్ష్యాలు

2.1 పరిచయం

2.2. ప్రవర్తనావాద ఉద్యమ ఆవిర్భావం, అభివృద్ధి

2.3 నూతన దృక్పథాల అభివృద్ధి

2.3.1 అమెరికన్ పొలిటికల్ సైన్సు అసోసియేషన్ మరియు చికాగో యూనివర్సిటి

2.3.2 రెండవ ప్రపంచ యుద్ధం

2.3.3 చార్లెస్ మెరియమ్

2.3.4 డేవిడ్ ఈస్టన్

2.3.5 అమెరికన్ రాజనీతి శాస్త్రవేత్తల రచనలు మరియు వారి పాత్ర

2.3.6 అమెరికా ప్రభుత్వం

2.3.7 ధార్మిక సంస్థలు

2.4 ప్రవర్తనావాదం - అర్థం, స్వభావం

2.5 ప్రవర్తనావాద సిద్ధాంతము, ప్రవర్తనావాదము

2.6 ప్రవర్తనావాద లక్షణాలు

2.6.1 క్రమబద్ధతలు

2.6.2 నిరూపణలు

2.6.3 పద్ధతులు

2.6.4 పరిమాణాత్మీకరణ

2.6.5 విలువలు

2.6.6 నిర్దిష్టశాస్త్రము

2.6.7 ఏకీకరణము

2.7 ప్రవర్తనావాద సంగతత్వము

2.8 ప్రవర్తనావాదంపై విమర్శలు

2.8.1 ప్రవర్తనకు సంబంధించిన విషయాలకే ప్రాధాన్యత నిస్తుంది

2.8.2 కృత్రిమమైనది

2.8.3 ప్రక్రియలకు అధిక ప్రాధాన్యత నిస్తుంది

2.8.4 ఇతర శాస్త్రాలపై ఆధారపడటం

2.8.5 తప్పించుకొనే స్వభావం

2.8.6 పరిమితమైన విజ్ఞానం

2.8.7 అనుభవైకవాద పరిశోధనకంటే సిద్ధాంత నిర్మాణానికి అధిక ప్రాధాన్యత

2.9 ప్రవర్తనావాద పరిమితులు

2.10 సారాంశము

2.11 నమూనా ప్రశ్నలు

2.12 చదువదగిన గ్రంథాలు

## 2.0 లక్ష్యం :

ఈ పాఠాన్ని చదివిన తరువాత మీరు

- ప్రవర్తనావాద దృక్పధం అంటే ఏమిటి ?
- ప్రవర్తనావాదం పుట్టుక అది అభివృద్ధి చెందిన విధానము
- ప్రవర్తనావాద లక్షణాలు, దానిపై గల విమర్శ మరియు ప్రవర్తనావాద సంగత్వమును గూర్చి సవివరముగా అవగాహన చేసుకోగల్గుతారు.

## 2.1 పరిచయం :

రెండవ ప్రపంచ యుద్ధానంతర పరిస్థితులలో రాజనీతిశాస్త్ర అధ్యయనాల్లో ప్రవర్తనవాద విప్లవం ఆవిర్భవించింది. అంతవరకూ అనుసరిస్తూ వస్తున్న సంప్రదాయ అధ్యయన పద్ధతి రాజకీయ వాస్తవాలను వివరించటంలో విఫలమయింది. జాతుల మధ్య వైరాలు, అగ్రరాజ్యాల ఆవిర్భావం, జాతీయవాదం వ్యాప్తి, ఆర్థికసంక్షోభం, నిరుద్యోగం, వివిధ సమాజాల్లో ఏర్పడిన అనిశ్చిత పరిస్థితులు, జాతుల మధ్య అసమానతలు, ఆర్థిక, సాంఘిక వ్యత్యాసాలు, పెరుగుతున్న ఉద్రిక్తతలు మొదలగునవన్నీ రాజనీతి శాస్త్రవేత్తలకు సవాళ్ళుగా పరిణమించాయి. రాజనీతిశాస్త్ర అధ్యయనంలో వాస్తవ సమస్యల పరిష్కారానికి ఉన్న రుగ్మతలను విశ్లేషించి, అవి ఏర్పడడానికి కారకాలను శోధించి, వాటి నివారణకు ప్రత్యామ్నాయ నమూనాలను విధానాలను, దృక్పధాలను చూపించాల్సిన బాధ్యత రాజనీతి శాస్త్రవేత్తలలో వ్యక్తమయింది. రాజనీతిశాస్త్ర అధ్యయనంలో మారుతున్న ప్రపంచపు అవసరాలు, వాస్తవాలకు అనుగుణంగా మార్పులు తేవలసిన అవసరాన్ని రాజనీతి శాస్త్రవేత్తలు గుర్తించారు. పర్యవసానంగా ప్రవర్తనావాద విప్లవం ఆవిర్భవించింది.

## 2.2 ప్రవర్తనావాద ఉద్యమ ఆవిర్భావం, అభివృద్ధి (Origin and Development of Behaviouralist Movement) :

ప్రవర్తనావాదులకు మొదట ఈ ఉద్యమాన్ని గురించి స్పష్టమైన భావంలేదు. సాంప్రదాయక దృక్పధాన్ని వ్యతిరేకించటమే వారి ప్రధాన ఉద్దేశ్యం. క్రమంగా ప్రవర్తనావాదం నూతన వాస్తవాలను కనుగొనటంలోను, అభివృద్ధి చేయటంలోను, నూతన ప్రక్రియలను క్రమబద్ధమైన విధానంలో రూపొందించటంలోను, ఒక నూతన విధానమని అంగీకరింపబడింది.

"రాజకీయ ప్రవర్తన" అనే పదమును మొదటిసారిగా 1928లో అమెరికా జర్నలిస్టు తాను రచించిన "రాజకీయ ప్రవర్తన" అనే గ్రంథంలో ఉపయోగించాడు. తరువాత, 1937 హెర్‌బర్ట్‌టింగ్‌స్టన్ వ్రాసిన "ఎన్నికల గణాంకము రాజకీయ ప్రవర్తన" గ్రంథములో రాజకీయ ప్రవర్తన అనే భావనను విస్తృతంగా వినియోగించారు. కానీ అంతకుముందు 1908లో గ్రహంవాలస్ మరియు ఎ.యఫ్. బెంట్లీ రాజనీతిశాస్త్ర అధ్యయనంలో రాజకీయ ప్రవర్తన యొక్క ప్రాధాన్యతను విస్మరించకూడదని ఉద్ఘాటించారు. 1921లో అమెరికా రాజనీతి శాస్త్రవేత్త చార్లెస్ మేరియమ్ రాజనీతిశాస్త్ర అధ్యయనము శాస్త్రీయంగాను, నిరూపణకు నిలిచేదిగాను ఉండాలని అభిప్రాయపడ్డారు. చార్లెస్ మేరియమ్ 1923 - 24, 25 సంవత్సరాలలో అమెరికాలో జరిగిన రాజనీతిశాస్త్ర సమావేశాలలో ప్రవర్తనావాదం ఆవశ్యకతను గురించి నొక్కివక్కాణించారు. చాలామంది రాజనీతి శాస్త్రవేత్తలు ముఖ్యంగా అమెరికన్ రాజనీతి శాస్త్రజ్ఞులు సాంప్రదాయ వైఖరిపట్ల తీవ్రఅసంతృప్తి చెంది అనుభవపూర్వక అధ్యయనం ప్రధానంగా ప్రవర్తనావాద ఉద్యమం వైపు ఆకర్షితులైనారు. ఈ ప్రవర్తనావాద అధ్యయనం ప్రపంచ యుద్ధానంతరం వ్యాప్తిచెందిందని చెప్పవచ్చు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో రాజనీతి శాస్త్రజ్ఞులు తమ ప్రవర్తనావాద అధ్యయనాన్ని కొనసాగించలేదు. దానికి కారణం వారు రెండవ ప్రపంచ యుద్ధకాలంలో పరిపాలనా విధానాలలో నియమించబడ్డారు. ఈ సమయంలో వారి అనుభవం సామాజిక సమస్యలపై పడింది. అంతేకాక యుద్ధకాలంలో ప్రముఖ సామాజిక శాస్త్రవేత్తలైన మోస్కా, మాక్స్‌వెబర్, టాల్‌కాట్ పార్సన్, మొదలైన వారితో పరిచయం కలుగుటచే సామాజిక సమస్యలపై రాజనీతి శాస్త్రంలో అధ్యయనాన్ని ప్రారంభించారు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రవర్తనావాదం బాగా అభివృద్ధిచెందింది.

## 2.3 నూతన దృక్పథాల అభివృద్ధి (Development of New Approach) :

రాజనీతిశాస్త్రంలో ప్రవర్తనావాద ఉద్యమాన్ని మూడు ప్రత్యేక దశల్లో గమనించవచ్చు. ప్రవర్తనావాదం అన్న నూతన దృక్పథం ప్రధానంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అభివృద్ధి చెంది క్రమంగా పెరిగి ప్రపంచ రాజనీతి శాస్త్రవేత్తల దృష్టికి ఆకర్షించింది. చార్లెస్ మెరియమ్, హెరాల్డ్ లాస్వెల్, డేవిడ్ ట్రూమన్, సైమన్, ఆల్మండ్ మొదలగువారు ప్రవర్తనావాదాన్ని ప్రచారంలోనికి తీసుకొనివచ్చారు. ప్రవర్తనావాద ఉద్యమ అభివృద్ధికి అనేకమంది రాజనీతి తత్త్వవేత్తలు, పరిశోధకులు, అమెరికన్ ప్రభుత్వము, ధార్మిక సంస్థలు మొదలగువారు ఎంతో కృషి చేసినారు. ఈ ఉద్యమ అభివృద్ధికి దోహదం చేసిన వారిని గూర్చి తెలుసుకుందాం.

### 2.3.1 అమెరికన్ పొలిటికల్ సైన్సు అసోసియేషన్ మరియు చికాగో యూనివర్సిటి :

1903వ సంవత్సరములో అమెరికా రాజనీతిశాస్త్ర సంఘం స్థాపించడంతో రాజనీతిశాస్త్ర అధ్యయన పద్ధతులలో నవ్యత ప్రవేశించనారంభించింది. ఈ శతాబ్దంలో (20వ శతాబ్దంలో) రాజనీతిశాస్త్రం ఎక్కువ సమాచారాన్ని సేకరించగల్గింది. 20వ శతాబ్దం ఆరంభం నాటికి విజ్ఞానరంగంలో సాధించబడిన ప్రగతి రాజనీతి శాస్త్రాన్ని బాగా ప్రభావపరచింది. ప్రధానంగా జీవన మానవ శాస్త్రాల పరిశోధనా పద్ధతులు రాజనీతి శాస్త్రానికి బాగా ఉజ్జీవనాన్ని కలుగజేసాయి. సామాజిక శాస్త్రాలన్నింటిలోను మానవజీవన విధానమే ప్రధాన అధ్యయనమయినందువల్ల సామాజిక శాస్త్రాల అధ్యయన పద్ధతులు అనుసరించటం రాజనీతి శాస్త్రానికి లాభదాయకమైక విషయంగా భావించబడింది. ప్రవర్తనావాదుల ప్రవేశంతో పరిశోధనకు మంచి పరికరాలు అవసరమన్న విషయానికి ఎక్కువ విలువ లభించింది. అప్పటివరకు రాజనీతిశాస్త్ర పరిశోధనలు సాంప్రదాయకమైన పురాతన పరికరాలను వాడుతూ వచ్చారు. బ్రైస్ లాంటి మేధావులు కేవలం అంతర్ దృష్టితోనే సూత్రాలను రూపొందించుకున్నారు. అమెరికన్ పొలిటికల్ సైన్సు రివ్యూ అను సంచిక ప్రచురించడం ప్రవర్తనావాద ఆవిర్భావంలో ప్రధానమైన సంఘటనగా భావించబడుతున్నది. ఈ సంచికలో ప్రచురించబడిన వ్యాసాలు క్రొత్త దృక్పథాన్ని ఏర్పరచినవని చెప్పవచ్చును.

### 2.3.2. రెండవ ప్రపంచ యుద్ధం :

రాజనీతి శాస్త్రంలో ప్రవర్తనావాదం అభివృద్ధి చెందటానికి దోహదం చేసిన మరొక ప్రధాన విషయం రెండవ ప్రపంచయుద్ధం తరువాత కమ్యూనిజం వ్యాప్తి చెందటం. ఈ విషయాన్ని ప్రవర్తనావాదులు బహిరంగంగా అంగీకరించారు. కమ్యూనిజం వృద్ధి, విస్తరణను రాజనీతి శాస్త్రజ్ఞులు ప్రవర్తనావాదంలో అడ్డుకోవడానికి ప్రయత్నం చేశారు. సోవియట్ రష్యా సైద్ధాంతిక ప్రభావం వల్ల తూర్పు యూరప్‌లోని చాలా రాజ్యాలలో భూస్వామ్య శ్రేష్ఠ ప్రభుత్వాల స్థానంలో ప్రజాస్వామ్య సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పరచటం ప్రారంభం అయింది. యూరోపియన్ సామ్రాజ్యవాదంలో అంతర్భాగమయిన ఆసియా, ఆఫ్రికా ఖండాలలో చాలా రాజ్యాలలో కొత్త రాజకీయ వాతావరణం ఏర్పడింది. ఈ మార్పులన్నింటిని ప్రవర్తనావాదులు అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించారు.

### 2.3.3. చార్లెస్ మెరియమ్ :

రాజనీతి శాస్త్రంలో ప్రవర్తనవాద ధోరణికి పునాదులు వేసినవారిలో ఆర్థర్‌బెంట్లీ, మెరియమ్ ప్రముఖులు. ఆర్థర్ బెంట్లీ రచించిన "ప్రభుత్వ ప్రక్రియ" అనే గ్రంథంలో రాజకీయ ప్రక్రియలో ఒత్తిడి తెచ్చే సమూహాల, పార్టీల, ఎన్నికల, ప్రజాభిప్రాయం పాత్రల ప్రాముఖ్యాన్ని అధ్యయనం చేయవలసిన ఆవశ్యకతకు ఎక్కువ ప్రాధాన్యత యిచ్చాడు.

చార్లెస్ మెరియమ్ ప్రవర్తనావాద రాజనీతి శాస్త్రానికి మూలపురుషుడిగా భావింపబడుతున్నాడు. 1908లో ఆయన ప్రచురించిన "ప్రైమరీ ఎలక్షన్స్" అను గ్రంథం అనుభవవాదం ప్రధానమైన గ్రంథాలలో మొదటిది. 1921లో "అమెరికన్ రాజనీతిశాస్త్ర సమితి" పత్రికలో వ్రాసిన వ్యాసంలో సమాజ మనోవిజ్ఞాన, భూగోళ, మానవవర్గ వర్ణన, జీవ, గణాంక శాస్త్రాలలో అనుసరించబడుతున్న పరిశోధనా పద్ధతుల పలితాలపట్ల అధిక శ్రద్ధ వహించవలసిందిగా రాజనీతి శాస్త్రజ్ఞులను మెరియం కోరాడు. రాజనీతిశాస్త్ర అధ్యయనంలో అనుసరించబడుతున్న పద్ధతులపట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తపరిచాడు. పరిశోధనా పద్ధతులు మెరుగుపరచే ఉద్దేశ్యంలో 1925లో అమెరికా రాజనీతి శాస్త్ర సంఘంలో అధ్యక్షోపన్యాసం చేస్తూ మెరియం రాజకీయ ప్రవర్తనను పరిశోధనాత్మక విషయంగా పరిగణించాల్సిందిగా కోరాడు.

### 2.3.4 డేవిడ్ ఈస్టన్ :

సాంప్రదాయ దృక్పధాలతో తీవ్రమైన అసంతృప్తిని వ్యక్తంచేసి, దానికి వ్యతిరేకంగా ప్రవర్తనావాద ఉద్యమానికి సారథ్యం వహించిన డేవిడ్ ఈస్టన్ దీనికి అవిరళమైన కృషి చేసాడు. అతడు రచించిన రాజకీయ వ్యవస్థ అనే వ్యాసం ప్రవర్తనావాద ఉద్యమానికి స్ఫూర్తినిచ్చింది. ఆయన మొత్తం రాజకీయ ప్రక్రియను సిద్ధాంతీకరించవలసిన ఆవశ్యకతను గూర్చి నొక్కి చెప్పాడు. రాజనీతిశాస్త్రంలో సాధారణ వ్యవస్థలకు సంబంధించిన సిద్ధాంతాన్ని ఆయన సమర్థించాడు. అంతశ్చర్యలతో కూడి బాధ్యతాయుతమూ, అధికారికము అయిన కేటాయింపులతో కూడిన ఏ వ్యవస్థ అయినా రాజకీయ వ్యవస్థగా భావింపబడుతుందని ఆయన అభిప్రాయం. ఆయన పెట్టుబడి ఉత్పాదనల సిద్ధాంతాన్ని విశ్వసించాడు. ఆయన దృక్పథం క్రమబద్ధమైనది.

### 2.3.5 అమెరికన్ రాజనీతి శాస్త్రవేత్తల రచనలు మరియు వారి పాత్ర (Works by American Political Scientists and their Role) :

రాజనీతి శాస్త్రంలో ప్రవర్తనావాద ఉద్యమంలో అనేకమంది రాజనీతి శాస్త్రజ్ఞులకు సంబంధం ఉంది. వారిలో చాలామంది అమెరికా దేశస్థులు. వీరంతా సాంప్రదాయక రాజనీతి దృక్పథంపట్ల అసంతృప్తి చెందారు. నూతన పరిశోధనా పద్ధతులను

అనుసరించటం ద్వారా రాజనీతి శాస్త్రాన్ని అనుభవవాద శాస్త్రంగా తీర్చిదిద్దుకోవచ్చని వారి భావన. ఆధునిక మనోవిజ్ఞాన సమాజ శాస్త్రాల సిద్ధాంతాలు, పద్ధతులు, ఫలితాలు, దృక్పథాల సహాయంతో రాజనీతి శాస్త్ర అధ్యయనాన్ని చేర్చడానికి ఈ ఉద్యమం ఉద్దేశించబడింది. రాజనీతి శాస్త్రాన్ని అనుభవవాదం ద్వారా శాస్త్రీయమైన దానిగా చేయడానికి ప్రయత్నించడం జరిగింది. పరిశీలింపబడిన, పరిశీలించదగిన వ్యక్తుల ప్రవర్తనయే ప్రభుత్వ దృగ్విషయాలుగా వివరించడానికి కృషిచేయబడింది. ఈ విధంగా ప్రవర్తనావాద ఉద్యమము అభివృద్ధి చెందింది.

ప్రవర్తనావాద దృక్పధానికి పునాదులు వేసిన వారిలో ఆర్థర్ బెంట్లీ, బ్రైస్, రాబర్ట్ ఎ.డాల్, కార్లడూస్, వి.ఓ.కి మొదలగువారు ముఖ్యులు. ఆర్థర్ బెంట్లీ రచించిన "ప్రభుత్వ ప్రక్రియ" అనే గ్రంథంలో రాజకీయ ప్రక్రియలో ఒత్తిడి తెచ్చే సమూహాల, పార్టీల, ప్రజాభిప్రాయం పాత్రల ప్రాముఖ్యాన్ని అధ్యయనం చేయవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించాడు. గ్రహమ్‌వాలస్ రచించిన రాజకీయాలలో మానవస్వరూపం అనే గ్రంథంలో రాజకీయ ప్రవర్తనకు, మనోవిజ్ఞానశాస్త్ర విజ్ఞానం యొక్క ప్రాతిపదిక, ప్రాముఖ్యతలను వివరించాడు. గ్రహమ్‌వాలస్ మానవుని రాజకీయ కార్యకలాపాలన్నింటికి స్వప్రయోజనం మార్గదర్శికంగా ఉంటుందని భావించాడు. రాజకీయ ప్రక్రియను అర్థం చేసుకోవడానికి రాజకీయ పరిస్థితులలో మానవుడు ఎలా ప్రవర్తిస్తాడు అన్న విషయం అవగాహన చేసుకోవలసిన అవసరానికి అతడు ప్రాధాన్యాన్నిచ్చాడు.

### 2.3.6 అమెరికా ప్రభుత్వం :

ప్రవర్తనావాద ఉద్యమానికి ప్రవర్తనావాద అభివృద్ధికి విశేషమైన సహాయ సహకారాలను, సాధనా సంపత్తిని అమెరికా ప్రభుత్వం రాజనీతిశాస్త్రవేత్తలకు అందించింది. ప్రవర్తనావాద ఉద్యమ అభివృద్ధికి అవసరమైన కోట్లాది రూపాయలను యివ్వడమే కాకుండా ప్రవర్తనావాద పరిశోధనలకు అవసరమైన అన్నివిధాలైన సహాయాన్ని కూడా అందించి ఈ ఉద్యమ పురోభివృద్ధికి కారణమైనది.

### 2.3.7 ధార్మిక సంస్థలు (Philonthrophic Associations) :

అమెరికా దేశానికి చెందిన అనేక ధార్మిక సంస్థలు ప్రవర్తనావాద ఉద్యమ అభివృద్ధికి, అధ్యయనానికి, పరిశోధనకు ఇతోధికమైన ఆర్థిక సహకారాన్ని అందించాయి. వాటిలో ముఖ్యమైనవి ఫోర్డ్ ఫౌండేషన్, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్, కార్నేజ్ ఫౌండేషన్ మొదలగునవి. వీటి విత్త సహకారంతో అమెరికా దేశానికి చెందిన రాజనీతి శాస్త్రవేత్తలకు ప్రవర్తనావాదాన్ని అభివృద్ధి చేయడానికి అవకాశం కలిగింది.

## 2.4 ప్రవర్తనావాదం - అర్థం, స్వభావం (Behaviouralism - Meaning and Nature) :

ప్రవర్తనావాదం వ్యక్తుల ప్రవర్తనను, దానికిగల ప్రోద్బలాలను, సంస్థల యంత్రాంగాన్ని అధ్యయనం చేస్తుంది. వ్యక్తికి సమాజానికీ మధ్య సంబంధం, ప్రధానంగా సామాజిక పరివర్తన మొదలైన అంశాలను వివరిస్తుంది. ప్రవర్తనావాదం నిర్మితుల అధ్యయనం నుంచి కొన్ని రాజకీయ పరిస్థితుల్లో వ్యక్తులు ఏవిధంగా వ్యవహరిస్తారు, వారిచర్య - ప్రతిచర్యలు ఏవిధంగా ఉంటాయన్న అంశాలకే అధిక ప్రాధాన్యత ఇస్తుంది. సంస్థలను కేవలం నిర్మాణపరంగా అధ్యయనం చేయకుండా, వాటిని వ్యక్తులు, వ్యక్తుల సమూహాలు ఏవిధంగా ప్రభావితం చేస్తాయో విశ్లేషించ ప్రయత్నిస్తుంది. సంస్థలు, వ్యక్తుల ప్రమేయం లేకుండా, వారి ఆసక్తులను పరిగణనలోనికి తీసుకొనకుండా పనిచేయలేవని ప్రవర్తనావాదం విశ్వసిస్తుంది. రాజకీయ రంగంలో వ్యక్తులు వారి వారి ఆసక్తులు, దృక్పథాలు, అవగాహనలననుసరించి ఎలా వ్యవహరిస్తారు. వారి చర్య ప్రతి చర్యల ప్రభావం వ్యవస్థపై ఏ విధంగా ఉంటుందో వివరించటానికి, విశ్లేషించటానికి ప్రయత్నిస్తుంది. వ్యక్తుల ప్రవర్తనను అధ్యయనం చేసి వారు విడిగాను, సమిష్టిగాను, సంస్థలను ఏ విధంగా ప్రభావితం చేస్తారో ప్రవర్తనావాదం అధ్యయనం చేస్తుంది.

చర్యలను వ్యక్తుల పరంగా, వారి ప్రవర్తనల పరంగా అధ్యయనం చేసేది ప్రవర్తనావాదం. రాజకీయాలను శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేయడానికి ప్రవర్తనావాదం నూతన పరికరాలను అందజేసింది. దీనిలో విభిన్న శక్తులు, కార్యకలాపాల్లో నిమగ్నుడై ఉన్న వ్యక్తి కేంద్రబిందువు అవటం వల్ల సామాజిక సాంస్కృతిక అంశాలకు ప్రవర్తనావాదం ప్రాధాన్యత యిస్తుంది. మనో వైజ్ఞానిక శాస్త్ర పద్ధతులను ప్రవర్తనావాదం అనుకరించింది. సాంపిల్ సర్వేలు, నిర్మిత షెడ్యూల్స్, ప్రశ్నోత్తరావళి, సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి, శ్రేణీకరించి విశ్లేషించటం మొదలైన పద్ధతులు ప్రవర్తనావాద అధ్యయనంలో ప్రధానమైన అంశాలు. ఈ విధంగా సేకరించిన సమాచార ఆధారంగా అనుభవ పూర్వక సిద్ధాంతాలను రూపొందించ ప్రయత్నిస్తుంది.

రాజకీయాలలో మానవ స్వభావం ఏవిధంగా ప్రభావితం అవుతున్నది అనే విషయాన్ని ఇది అధ్యయనం చేస్తుంది. వ్యక్తిగత నిరాశ నిస్పృహలు ఏవిధంగా రాజకీయాలను ప్రభావితం చేస్తాయి అన్న విషయాన్నికూడా ఇది పరిగణలోకి తీసుకుంటుంది. లూసీయన్ పై అభిప్రాయం ప్రకారం ప్రవర్తనావాదం, వ్యక్తిత్వ విలక్షణాలు, వ్యక్తుల అవసరాలు వ్యవస్థలను ప్రభావితం చేస్తాయి అన్న విషయాన్ని అధ్యయనం చేస్తుంది.

రాజనీతి శాస్త్రవేత్తలు చాలామంది 'ప్రవర్తనావాదం' అన్నపదాన్ని నిర్వచించటానికి ప్రయత్నించారు. కాని వీరందరు యీ భావానికి సమానార్థక భావాన్ని కల్పించటంలో విఫలమయ్యారు. ఈ భావం యొక్క మానసికస్థితి, దృక్పథం, వైఖరి, బహుముఖమైంది. 'ప్రవర్తనావాదం' యొక్క ప్రధానవిషయం 'ప్రవర్తన'. ప్రవర్తనావాదం ప్రవర్తనను తన అధ్యయనానికి సంబంధించిన విషయంగా తీసుకొని, తద్వారా అన్ని నిర్ణయాలను రూపొందిస్తుంది.

రాబర్ట్. ఎ. డాల్ అభిప్రాయం ప్రకారం ఇది అనేకమంది అమెరికా రాజనీతి శాస్త్రజ్ఞుల కలయిక వల్ల ఏర్పడిన రాజనీతి శాస్త్ర పరిధిలోనే ఒక విభిన్న అసమ్మతి ఉద్యమం. చారిత్రక, తాత్విక, సంస్థాగత పద్ధతులను అనుసరించే రాజనీతి శాస్త్రజ్ఞులకు నిరాశ నిస్పృహలను కల్గించటం, విలువైన సిద్ధాంతాల ప్రాతిపదికపై సమగ్ర సిద్ధాంతాలు రూపొందించటానికి ప్రస్తుత సిద్ధాంతాలను మార్చడం ద్వారా కానీ లేదా వృద్ధిచేయడం ద్వారా కానీ రాజనీతి పరిధిని పెంచటమే ప్రవర్తనావాదం. ఇది ప్రభుత్వానికి సంబంధించిన విషయాల్లో గమనింపబడిన, గమనింపదగిన మానవ ప్రవర్తనను, దానికి దారితీసె కారణాలను అధ్యయనం చేస్తుంది.

ఛార్లెస్‌వర్త్ అభిప్రాయం ప్రకారం ప్రవర్తనావాదులు మానవ ప్రవర్తనకు సంబంధించిన 'ఏమిటి', 'ఎక్కడ', 'ఎలా', 'ఎప్పుడు', అన్న విషయాలనునిష్పాక్షికంగాను, నిరూపణాత్మకంగాను కనుగొనవచ్చునని భావిస్తారు. కాని, 'ఎందుకు' అన్న విషయాన్ని అంత తేలికగా, నిష్పక్షపాతంగా, నిరూపణాత్మకంగా వివరించటం సాధ్యం కాదని భావిస్తారు.

డేవిడ్ ట్రుమన్ అభిప్రాయం ప్రకారం పాలనా ప్రక్రియలో భాగస్వాములైన వ్యక్తుల, వర్గాల చర్య ప్రతి చర్యలే రాజకీయ ప్రవర్తన. పాలనా ప్రక్రియలో అంతర్భాగాలైన మానవుల చర్యలన్ని రాజకీయ ప్రవర్తన.

## 2.5 ప్రవర్తనావాద సిద్ధాంతము, ప్రవర్తనావాదము (Behaviourism - Behaviouralism) :

ఆధునిక రాజనీతి సిద్ధాంతాన్ని అధ్యయనం చేసేవారు. తరచు ప్రవర్తనా సిద్ధాంతము, ప్రవర్తనావాదము అన్న రెండు పదాల మధ్య బేధాలను గుర్తించలేకపోతున్నారు. దీనివలన దుష్ఫలితాలకు తప్పుడు నిర్ణయాలకు అవకాశం కలుగుతుంది. అందువలన ఈ రెండింటిమధ్య బేధాన్ని తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రవర్తనావాద సిద్ధాంతం ప్రధానంగా మనస్తత్వ శాస్త్రానికి సంబంధించింది. ఇది ఉద్దేశాలు, భావనలు, భావాలకు సంబంధించిన కోరికలపై ఆధారపడుతుంది. పరిశోధన ఆధారంగా లేకపోతే ఈ వాదం శాస్త్రీయం కాదు. ప్రవర్తనావాదం శాస్త్రీయ సిద్ధాంతం, పరిశోధనలను ప్రాతిపదికలుగా కలిగి ఉంది. రాజనీతి శాస్త్రంలో యిది ఒక నిరసనోద్యమం ఈ వాదం రాజకీయ వాస్తవాలను విశ్లేషించటంలోను, వివరించటంలోను ఒక పద్ధతిగా ఉపయోగపడుతుంది. అనుభవైకవాదం పురాతన దృక్పథంకాగా, ప్రవర్తనావాదం, నూతన దృక్పథం.

ప్రవర్తనావాదావిర్భావం గతంలో గ్రాహమ్‌వెల్స్ రచన "రాజకీయంలో మానవ స్వభావం"లో గమనించవచ్చు. సాంఘిక శాస్త్రాలలో పరిశోధనా పద్ధతులు, ప్రకృతి విజ్ఞానశాస్త్రాల పరిశోధనల ప్రాముఖ్యాన్ని గురించి ప్రవర్తనావాదులు చెప్పారు. అనుభవైక వాద అధ్యయనంలో అవలంబించే అనుభవైకవాదంలో చారిత్రక, సాంస్కృతిక అధ్యయనం, విశ్లేషణ కూడ యిమిడి ఉంటాయి.

## 2.5.1 మానసిక శాస్త్రవేత్తల ప్రవర్తనావాదము - సామాజిక శాస్త్రవేత్తల ప్రవర్తనా వాదము (Behaviourism - Behaviuralism) :

సామాజిక శాస్త్రాలలో అమలులోకి వచ్చిన ప్రవర్తనావాదపద్ధతికి ప్రేరకంగా పనిచేసినది మానసిక శాస్త్రవేత్తలు అనుసరించిన ప్రవర్తనావాద పద్ధతి. అయితే ఈ రెంటికి చాలా తేడా ఉన్నది. తెలుగులో ఈ రెండింటిని ప్రవర్తనావాద ధృక్పథమని పిలుస్తూ ఉన్నప్పటికి ఆంగ్లంలో వీటిని Behaviourism అని, Behavioulism అని పిలుస్తారు. Behaviourism లో పరిశీలనకు గురవుతున్న వారి ప్రవర్తనను, ఆ ప్రవర్తనకు దారితీసిన ప్రేరకం సహాయంతో అర్థం చేసుకొని విశ్లేషిస్తారు. మరో మాటలో చెప్పాలంటే ప్రేరకము, ప్రవర్తనను నిర్ధేశిస్తుంది అని సూత్రీకరిస్తారు. అంటే మానవ ప్రవర్తన సూటిగా ప్రేరకం ద్వారా నిర్దేశించబడుతుందని అర్థం. దీనిని ఆంగ్లంలో Stimulous - Response paradigm CS-R paradigm అని పిలుస్తారు. తెలుగులో దీని సమానార్థం ప్రేరణకు స్పందన. ప్రేరేపింపచేసే ప్రేరకాన్ని అర్థం చేసుకోగలిగితే మానవ ప్రవర్తన అంతా అర్థం అయినట్లు. దీనికి ఉదాహరణలుగా ఈ క్రింది వాక్యాలు ఉపయోగపడతాయి.

1. ఓటర్లు డబ్బులిస్తె ఓటు వేస్తారు.
2. కులం ఓట్లను రాబడుతుంది
3. లంచం ఇస్తే పని చేస్తారు.

ఈ వాక్యాలలో డబ్బు, కాలం, లంచం ప్రేరకాలు. ఓటువేయడం, పనిచేయడం స్పందన (ప్రవర్తన). కాబట్టి ప్రేరకం అర్థం అయితే ప్రవర్తన అర్థం అయినట్లే స్థూలంగా ఇది Behaviourism. మానసిక శాస్త్రవేత్తలు అభిమాన ధృక్పథం.

సామాజిక శాస్త్ర వేత్తలు దీనిని అంగీకరించరు. వారి అభిప్రాయములో మానవ ప్రవర్తన Stimulous - Organism - Response యొక్క ఫలితం. దీనిని S-O-R Paradigm అని అంటారు. దీనికి తెలుగులో సమానార్థకం ప్రేరణ - ఆర్గానిజం - స్పందన సూత్రీకరణ. ఆర్గానిజం అనే మాటకు అర్థం భావనలు, కోరికలు, విలువలు మొదలయినవి. ఈ సూత్రికరణ ప్రకారం ప్రేరణ ఆర్గానిజంతో కలిసి మాత్రమే స్పందనను ప్రవర్తనను ఉద్దేశింపచేస్తుంది. అంటే ప్రేరణ - ప్రవర్తన మధ్య ప్రత్యక్ష సంబంధం ఉండదు. మధ్యంతర దశలో భావాలో, కోరికలో, విలువలో ప్రమేయాన్ని కలుగజేసుకొంటాయి. కాబట్టి, ఒకే ప్రేరణ, రకరకాల ప్రవర్తనలను కలుగ చేస్తుంది. ధనమే ప్రధానమనుకున్న వారి ప్రవర్తనను ధనం నిర్ణయిస్తే, కులము ప్రధానమనుకున్నవారి ప్రవర్తనను కులం నిర్ణయిస్తుంది. ఈ రెండు అప్రధానం విలువలే ప్రధానమనుకున్న వారి ప్రవర్తనను వారు నమ్మిన విలువలు నిర్ణయిస్తాయి. కాబట్టి S-R సూత్రీకరణకన్నా S-O-R సూత్రీకరణ మానవ ప్రవర్తన అధ్యయానానికి ఉపయోగపడుతుందని సామాజిక శాస్త్రవేత్తలు కొందరు విశ్వసించారు. వీరు అభివృద్ధి పరచిన ధృక్పథాన్ని Behaviouralism అని పిలుస్తారు.

## 2.6 ప్రవర్తనావాద లక్షణాలు (Features of Behaviourlism) :

రాజకీయ విషయాలను విశ్లేషించటంలో ప్రవర్తనావాదం ఒక నూతన ధృక్పధాన్ని సూచించింది. ఇంతకు ముందు వివరించినట్లు సామూహిక ప్రవర్తనను అధ్యయనం చేయటంలో ప్రవర్తనావాదం మానసికాంశాలను పరిగణనలోనికి తీసుకొంటుంది. విలువల కలీతమైన విశ్వాస్తిక పరిశోధనకు ప్రవర్తనావాదం పునాదులను వేసింది. వైజ్ఞానిక శాస్త్రాల్లో పరిశోధనలు ఏ విధంగా కొనసాగుతాయో అదే పద్ధతిలో సామాజిక శాస్త్రాల్లో కూడా శాస్త్రీయ పరిశోధనలు కొనసాగించటానికి ప్రవర్తనావాదం దోహదం చేసింది. రాజకీయ అంశాలను విశ్లేషించటంలో సామాజిక, సాంస్కృతిక నేపధ్యానికి ప్రాధాన్యత పెరిగింది.

ప్రవర్తనావాద ఉద్యమ కారులలో ప్రముఖుడైన డేవిడ్ ఈస్టన్ రచించిన 'ఎస్సె ఆన్ ద కరెంట్ మీనింగ్ ఆఫ్ బిహేవర్ లిజమ్' అన్న గ్రంథంలో ప్రవర్తనావాదానికి సంబంధించి ఎనిమిది ముఖ్య సూత్రాలను వివరించారు. ఇతడు ఈ సూత్రాలను ప్రవర్తనావాద ఉద్యమ నిర్మాణానికి కారణభూతమైన మేధో సంబంధమైన ప్రాతిపదికలుగా (Intellectual Foundation Stones) వివరించాడు. అవి. 1. క్రమబద్ధతలు 2. నిరూపణలు 3. పద్ధతులు 4. పరిమాణాత్మీకరణ 5. విలువలు 6. క్రమబద్ధీకరణ 7. నిర్దిష్టశాస్త్రము 8. ఏకీకరణ

### 2.6.1 క్రమబద్ధతలు (Regularities) :

వ్యక్తుల రాజకీయ ప్రవర్తనలలో క్రమబద్ధతగల, గుర్తించవీలైన ఏకాకృతులు వున్నవని ప్రవర్తనావాదులు భావిస్తారు. అలాంటి వాటిని సాధారణీకరించుట ద్వారాగాని, సూత్రబద్ధం చేయటం ద్వారాగాని, లేక రాజకీయ సంఘటనలు సూచించేందుకుగాని, వివరించటానికి అవకాశమున్నదంటారు. రాజకీయ ప్రవర్తన ఎప్పుడు ఒకే రకంగా ఉంటుందని చెప్పలేకపోయినప్పటికి, కొన్ని విషయాలలో అనేక సందర్భాలలో ప్రజలు ఒకేరకంగా ప్రవర్తిస్తారు. దీనికి ఉదాహరణగా ఓటింగ్ ప్రవర్తనను తీసుకొనవచ్చు. ఎన్నికలలో వివిధ సందర్భాలలో ఓటర్లు ఒకే వ్యక్తికిగాని, పార్టీకిగాని ఓటు వేస్తారన్నది మన అందరికీ తెలిసిన విషయమే. ఈ విధమైన ఓటర్ల ప్రవర్తన వారి సామాజిక, ఆర్థిక, కుల, మత, వృత్తిపరమైన విషయాలతో జోడించి పరిశీలించినపుడు మనం వారి ప్రవర్తనలో ఏకాకృతి వున్నదన్న విషయాన్ని గమనించవచ్చు. ఈ నియమబద్ధతలు మానవ ప్రవర్తనను వివరించే సాధరణీకరణలకు లేక సిద్ధాంతాలకు మార్గదర్శకులవుతాయి.

### 2.6.2 నిరూపణలు (Varifications) :

ప్రవర్తనావాదుల దృష్టిలో విజ్ఞానం పరిపూర్ణంగా ఉండాలంటే అనుభవైకవేదంగా, పరీక్షింపబడిన ప్రతిపాదనలు మాత్రమే కలిగి ఉండాలి. దీనికి సంబంధించిన సాక్ష్యం అంతా పరిశీలనాధారంగా ఉండాలి. పరిశీలనలన్నింటిని సక్రమైనవా ? కావా, అని నిగ్గుతేల్చటానికి పరీక్షించటం, పునఃపరీక్షించటం జరగాలి.

### 2.6.3 పద్ధతులు (Techniques) :

విషయాలను సేకరించుటలోను, వివరించుటలోను సరియైన పద్ధతులు అవలంభించవలసిన అవసరాన్ని గూర్చి ప్రవర్తనావాదులు నొక్కి చెప్పారు. ప్రవర్తనావాదులు పరిశోధకుణ్ణి తన పద్ధతులను గూర్చి ఆత్మ విజ్ఞానం కలిగి ఉండేలాగ చేయాలని భావిస్తారు. ఇందుకు వారు విభిన్న విశ్లేషణ, గణితశాస్త్ర నమూనాల వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించాలని సూచనలు చేసారు. పరిశీలనవల్ల లభించే వివరాలు శాస్త్రవేత్తలకు మరింత విశ్వసనీయంగాను, ప్రయోగయోగ్యంగాను ఉండాలంటే, ఈ పద్ధతులు నిరంతరం సంస్కరింపబడుతూ, మెరుగుపరచబడుతూ ఉండాలి.

### 2.6.4 పరిమాణాత్మీకరణ (Quantification) :

ప్రవర్తనా వాదులు రాజకీయ జీవనాన్ని, గుణాత్మకమైన నిర్ణయాల ద్వారా కాక పటిష్టమయిన విషయ సేకరణ ద్వారా అంచనా వేసినట్లయితే ఖచ్చితమైన ఫలితాలు వస్తాయని భావిస్తారు. సంక్లిష్టమైన రాజకీయ ప్రవర్తన అనిశ్చితమైన గుణాత్మక అభిప్రాయాలకు బదులు కఠిన ప్రమాణాలతో కూడిన సమాచార సేకరణబట్టి వ్యాఖ్యానించాలని భావించారు. పరిమాణాత్మీకరణము చేయదగిన, సమాచార బోగట్టా ఆధారంగానే యితర సమాజ శాస్త్రాలవలె రాజనీతి శాస్త్రంలో కూడా అభిప్రాయ వ్యక్తీకరణ జరగాలి.

### 2.6.5 విలువలు (Values) :

ప్రవర్తనావాదుల అభిప్రాయంలో నైతిక విలువలకు, అనుభవవాద వివరణలకు మధ్యబేధం ఉంది. యదార్థాలు, విలువలూ రెండూ ప్రత్యేకమైన విషయాలే. విశ్లేషణలో రెండింటిని విడివిడిగా అధ్యయనం చేయవచ్చునేగాని కలిపివేయటానికి వీలులేదు. ప్రజాస్వామ్యం, సమానత్వం, స్వాతంత్ర్యం, పరమ పవిత్రమైన విలువలు గల భావాలుకాని, వాటిలోని నిజానిజాలుగాని, శాస్త్రీయపద్ధతిలో తప్ప నిరూపణచేయలేము. రాజకీయాల శాస్త్రీయ అధ్యయనమే రాజనీతిశాస్త్రం, అనుభవవాద పద్ధతుల ద్వారా శాస్త్రీయ అధ్యయనం చేయబడాల్సిందే కాని అందులో నైతికత ప్రశ్నలు ఉదయించవు. అభివృద్ధి కాబడిన పరిశోధనా పద్ధతుల ద్వారా విలువలకు అతీతంగా పరిశోధనలు నిర్వహించాల్సి ఉంటుంది.

### 2.6.6 క్రమబద్ధీకరణ (Systematisation) :

రాజనీతి శాస్త్రంలో పరిశోధన ఒక క్రమమైన పద్ధతిలో సాగాలని ప్రవర్తనావాదుల ఆకాంక్షించారు. పరిశోధనలు సైద్ధాంతిక దృక్పథంతోను, సైద్ధాంతిక మార్గదర్శకత్వంలోను జరగాలంటారు. సిద్ధాంతమూ, పరిశోధనా, పొందికగాను క్రమబద్ధమైన విజ్ఞానంతో సన్నిహిత సంబంధాలు కలిగిన భాగాలుగా ఉండాలని దీని భావం. పరిశోధన సిద్ధాంతాన్ని విశదపరిచేలాగ ఉండాలి. సిద్ధాంతం విషయాధారంగా ఉండాలి. సిద్ధాంతానికి ఆచరణకు సన్నిహిత సంబంధం ఉండాలని క్రమబద్ధీకరణ భావన.

### 2.6.7 నిర్దిష్టశాస్త్రము (Pure Science) :

రాజనీతి శాస్త్రం పూర్తిగా విజ్ఞాన శాస్త్రంగా ఉండాలని ప్రవర్తనా వాదులు చెప్పారు. ప్రవర్తనా పరమయిన సిద్ధాంత అవగాహన నుండి సంపాదించిన విషయ పరిజ్ఞానము జీవిత సమస్యలను పరిష్కరించుకోవడానికి సహాయపడుతుంది. కనుక సిద్ధాంతము కేవలము సిద్ధాంతము కోసమేగాక ప్రయోజన కరముగా వినియోగము చేసుకోవటానికి వీలు ఉండాలి. ఈ విధంగా రాజనీతిని నిర్దుష్ట శాస్త్రంగా చేయాలి. ప్రవర్తనా పరమయిన సిద్ధాంత అవగాహన నుండి సంపాదించిన విషయ పరిజ్ఞానము జీవిత సమస్యలను పరిష్కరించుకోవడానికి తప్పక సహాయపడుతుంది. అయితే, ముందుగా రాజనీతికి, రాజకీయ ప్రవర్తనకు సంబంధించిన సూత్రీకరణలు చేయబడాలి. వాటికి విశ్వజనీనత ఉండాలి.

### 2.6.8 ఏకీకరణము (Integration) :

ప్రవర్తనా వాదులు అంతర్ వర్గీయ దృక్పథానికి అధిక ప్రాధాన్యమిచ్చి రాజనీతిశాస్త్రాన్ని ప్రత్యేకమైన శాస్త్రంగా అంగీకరించారు. వారి అభిప్రాయంలో రాజనీతి శాస్త్రం, సమాజశాస్త్రాలలో ఒకటి. అందువల్ల రాజనీతి శాస్త్రం ఇతర సమాజ శాస్త్రాలలో ఏకీకరణము చెందాలంటారు. వివిధ సామాజిక శాస్త్రాల మధ్య హద్దులు ఏర్పడి ఉన్నప్పటికి, సంఘజీవియైన మానవుడు రాజకీయ ప్రవర్తనల అవగాహనకు విస్తృత దృక్పథంలో పరిశీలించాల్సి ఉంటుంది. రాజకీయ ద్విగ్విషయాల పరిశీలనకు సమాజంలో ఆర్థిక, సాంస్కృతిక, స్థితిగతులను అవగాహన చేసుకోవాల్సి ఉంటుంది. రాజకీయ ప్రవర్తనను సామాజిక ప్రవర్తనను అధ్యయనము చేసేటప్పుడు వీటన్నింటిని సంఘటిత పరచుకుంటే సక్రమమైన ఫలితాలు వస్తాయి.

## 2.7 ప్రవర్తనావాద సంగతత్వము (Relevence of Behaviouratism) :

ప్రవర్తనావాదం రాజనీతి శాస్త్రానికి ప్రయోగాత్మక పద్ధతులను, పరికరాలను, అందించి రాజనీతి శాస్త్రం పరిపూర్ణం కావటానికి కారణమైంది. మానవుని ప్రాథమిక ప్రేరణలు, అవసరాలు, కోరికలను మరింత చక్కగా అవగాహన చేసుకోవటానికి

సహాయకారి అయ్యింది. రాజకీయ శాస్త్రవేత్తలు యీ ప్రవర్తనావాదం వల్ల స్వతంత్ర అస్తిత్వం సంపాదించుకున్నారు. దీనివలన రాజనీతి విద్యార్థులు ఆత్మగౌరవం, స్థైర్యం, ధైర్యం పెంపొందించుకోవటం వలన, వారి పరిశోధనలు మరింత ఉపయుక్తంగాను, ఖచ్చితంగాను రూపొందటం వల్ల వారు అభిలషించిన శాస్త్రీయ రాజనీతి సిద్ధాంతమైపుకు పయనించటానికి వీలైంది. ప్రకృతి విజ్ఞాన శాస్త్రాల పద్ధతిలో రాజనీతి శాస్త్రాన్ని గూడా పెంపొందించాలని కొంతమంది ప్రవర్తనా వాదులు ఆశిస్తున్నారు. రాజనీతి శాస్త్రం భౌతిక శాస్త్రంలాగ కాక, భౌతిక శాస్త్రంకంటే పురోగమించి, మానవాళికి ఉపయోగకరంగా రూపొందించాలని ప్రవర్తనావాదులు కోరుకుంటున్నారు. పురాతన కాలంలోని రాజనీతి తత్వశాస్త్ర రూపం నుండి సమకాలీన రాజనీతి శాస్త్రంగా మారి భవిష్యత్తులో రాజనీతి విజ్ఞాన శాస్త్రంగా రూపొందే అవకాశం ఉంది. కనుక హేంజ్‌యులావ్ అభిప్రాయంలో రాజనీతి విజ్ఞాన శాస్త్రము సాధ్యము మరియు లభించదగినది.

ప్రవర్తనావాదం రాజనీతి శాస్త్రంపై విప్లవాత్మకమైన ప్రభావాన్ని ప్రసరింపజేసింది. ఇతర సమాజ శాస్త్రాలలోవలె ప్రవర్తనావాదం భౌతికశాస్త్రాల అధ్యయన పద్ధతులను రాజనీతి శాస్త్రంలో ప్రవేశపెట్టింది. క్రమశిక్షణతో కూడిన సలక్షణమైన పరిశీలనలోను క్రమబద్ధమైన సిద్ధాంతాలను జోడించటానికి చేయబడ్డ ప్రయత్నాలే ప్రవర్తనావాదం. సంఘటనలు, సంస్థలు, వ్యవస్థలు, భావాలకు బదులుగా వ్యక్తుల, సమూహాల ప్రవర్తనా పరిశీలనను ప్రవర్తనావాదులు, విశ్లేషణాంశంగా నిర్దేశించారు. ఇతర సమాజ శాస్త్రాలలో వలె రాజనీతి శాస్త్రము పరిశోధనలకు సముచితస్థానాన్ని కలుగజేసింది. సిద్ధాంతం, పరిశోధన ఒకదానిపై మరొకటి ఆధారపడటానికి ప్రాధాన్యత కల్పించారు. ఈ విధమైన దృక్పథం సమాజ శాస్త్రాల ఏకీకరణకు దారితీసింది. ప్రవర్తనావాదం కఠినమైన పరిశోధనా ప్రాతిపదికలకు, వాటి నిర్వహణకు మార్గాన్ని సుగమం చేసింది. రాజనీతి శాస్త్ర పరిధిని విస్తృతం చేసింది.

సిద్ధాంత పరమైన, విద్యా విషయకమైన విషయాల్లోనే కాక ప్రవర్తనవాదం ఆచరణలో చాలా ఉపయుక్తమైంది. సాంఘిక విషయాల్లో మార్పులు తీసుకొని రావటంలో దీని ప్రభావం చాలా ఎక్కువ. ఆధునిక రాజనీతి సిద్ధాంతాన్ని నేర్పుగా ఉపయోగించేందుకు, విధాన రూపకల్పనలో ఉపయోగపడేలాగ అభివృద్ధి చేయాలని ప్రవర్తనావాదం ఆశిస్తుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే ఏకీకరణకు సంబంధించిన సమస్యలను గురించి, సాంఘిక ప్రభావాన్ని గురించి సహకారానికి సంబంధించిన విషయాల్లో ప్రవర్తనా వాదులు ఎంతో కృషిచేసారని చెప్పవచ్చు.

## 2.8 ప్రవర్తనావాదం పై విమర్శలు :

ప్రవర్తనావాదం రాజనీతి శాస్త్రపు గమ్యాలు, పరిధి, స్వభావం, అధ్యయన పద్ధతులలో మార్పును తీసుకొని వచ్చిన మహోద్యమంగా భావించబడింది. ప్రవర్తనావాద ఆవిర్భావంతో రాజనీతిశాస్త్రం యొక్క దిశ, దశలు కూడా మారిపోయాయి. ఎందరో రాజనీతి శాస్త్రవేత్తలు ఈ దృక్పథం యొక్క ప్రాముఖ్యతను శ్లాఘించారు. కాని ప్రవర్తనావాదం పై అనేకమంది రాజనీతి శాస్త్రవేత్తలు అనేకమైన విమర్శలను చేసారు.

### 2.8.1 ప్రవర్తనకు సంబంధించిన విషయాలకే ప్రాధాన్యతనిస్తుంది (Importance to Behavioural aspect) :

ప్రవర్తనా వాదులు ప్రవర్తనకు సంబంధించిన అంశానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. సంస్థలకు సంబంధించిన అధ్యయనాలకు ప్రాధాన్యం తగ్గించి ప్రవర్తనకు ప్రాధాన్యతనివ్వటం జరుగుతుంది. భావజాలానికి, తాత్వికతకు ప్రాధాన్యత ఉండదు. ఫలితంగా రాజనీతి శాస్త్రజ్ఞుడు కేవలం గణాంకసేకర్తగానే మిగిలిపోతాడు కాని సామాజిక మార్పుకు సహాయపడలేడు.

### 2.8.2 కృత్రిమమైనది (Artificial) :

ప్రవర్తనావాదాన్ని కృత్రిమమైన రాజకీయాలని క్రిస్టియన్ బే నామకరణ చేశాడు. కృత్రిమమైన రాజకీయాలను పోలివున్నా అవి కేవలం వ్యక్తిగత ప్రయోజనాలను లేక వ్యక్తిగత సమూహపు ప్రయోజనాలను పెంపొందిచటంవల్ల ఆసక్తి కలిగి ఉండాలి. కాని ప్రవర్తనావాదం అమెరికా ప్రయోజనాలను మాత్రమే కాపాడటానికి ప్రయత్నిస్తుంది.

### 2.8.3 ప్రక్రియలకు అధిక ప్రాధాన్యతనిస్తుంది (Importance to process) :

ప్రవర్తనవాదం గ్రుడ్డిగా ఇతర శాస్త్రాలనుండి పద్ధతులను, పరికరాలను తెచ్చుకుంటుంది. ఆ విధంగా అరువు తెచ్చుకొనటంవలన రాజనీతి శాస్త్రం యొక్క వ్యక్తిత్వాన్ని, నిజాయితీని, స్వతంత్రతను నాశనం చేసే అవకాశం ఉంది. విభిన్న విద్యా విభాగాల మధ్య సహకార దృక్పథం కలుగజేయక, క్లిష్టమైన మానవ స్వభావాన్ని గూర్చి సరియైన విజ్ఞానాన్ని కలుగజేయకపోవచ్చు.

### 2.8.5 తప్పించుకొనే స్వభావం (Escapist Nature) :

ఉత్తర ప్రవర్తనావాదుల అభిప్రాయం ప్రకారం ప్రవర్తనా వాదం స్థిరమైన (Static) విషయాలకు ప్రాధాన్యతనిస్తుంది. తద్వారా సమకాలీన సమస్యలైన అణ్వాయుధాలు, సంఘర్షణ, హింసాత్మక చర్యలను గురించి చర్చించదు. ఇది సమస్యలనుండి తప్పించుకొనే తత్వాన్ని సూచిస్తుంది.

### 2.8.6 పరిమితమైన విజ్ఞానం (Limited Knowledge) :

ప్రవర్తనావాదం పరిమితమైన విజ్ఞానాన్ని మాత్రమే కలుగజేస్తుంది. యావజ్జీవితానికి సంబంధించిన వాస్తవాలను గురించి ఖచ్చితమైన పరిజ్ఞానాన్ని కలుగజేయదు అని లియోస్ట్రాస్ వంటివారు విమర్శించారు.

### 2.8.7 అనుభవైకవాద పరిశోధనకంటే సిద్ధాంత నిర్మాణానికి అధిక ప్రాధాన్యం (Importance to Theorisation):

సమాజంలోని రాజకీయ సమస్యల పరిష్కారానికి అనువర్తింప జేయనంతవరకు సిద్ధాంతానికి విలువలేదు. ప్రవర్తనావాదం కేవలం సిద్ధాంత రూపకల్పనపట్లే ఎక్కువ ఆసక్తి కనపరుస్తుంది. ప్రజలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించటంలో అనుభవైక పరిశోధన పాత్రను విస్మరిస్తుంది.

## 2.9 ప్రవర్తనావాద పరిమితులు (Limitations of Behaviouralism) :

రెండవ ప్రపంచ యుద్ధానంతరము ప్రవర్తనావాదం అమెరికన్ శాస్త్రవేత్తల మరియు మేధావుల కృషి ఫలితంగా ప్రాచుర్యంలోనికి వచ్చింది. ఇది ప్రాథమికంగా గమనించదగిన, గమనించబడ్డ వ్యక్తి లేదా వ్యక్తుల సముదాయ ప్రవర్తన ప్రాతిపదికపై ఆవిర్భవించబడింది. రాజనీతి శాస్త్ర చరిత్రలో ప్రవర్తనావాదం గొప్ప మలుపు. రాజనీతి శాస్త్రపు గమ్యాలు, పరిధి, స్వభావం క్రమపద్ధతులలో మార్పును తీసుకొచ్చిన మహావిప్లవంగా ప్రవర్తనావాదం కొనియాడబడింది. మానవుని ప్రవర్తనే దీనికి మూలాధారం. వ్యక్తి చర్యలు, ప్రేరణలు, స్పందనలు, అభిలాషలు లక్ష్యాల అధ్యయనమే ప్రవర్తనావాదం. ప్రవర్తనావాదులు వాళ్ళ వ్యక్తిత్వాన్ని, విజ్ఞానానికి గల పరిమితుల్ని, వారికి అందుబాటులో వున్న ఆధారాన్ని విస్మరించి వ్యక్తిగతమైన పక్షపాత ధోరణులు, దురభిప్రాయాలు వారి అధ్యయనాలను ఏ విధంగా ప్రభావితం చేసేది పరిగణించరు. ముల్‌ఫర్డ్ క్యూ సిబ్లీ, ఆర్నాల్డ్ బ్రిచట్, హేంజ్ యులావ్ ఆల్ ఫ్రైడ్ సోమిత్ మరియు జోసెఫ్ టెన్‌హాస్ మొదలగు రాజనీతి శాస్త్రవేత్తలు మరియు ప్రవర్తనావాదులు, ప్రవర్తనావాదము అనుభవ పూర్వకమైన అధ్యయనమని కొన్ని పరిమితులకు లోబడి ఉన్నదని నిజాయితీగా అంగీకరించారు. అవి

### 2.9.1 సిబ్లీ అభిప్రాయం ప్రకారం ప్రవర్తనావాద పరిమితులు :

1. ప్రముఖ రాజనీతి శాస్త్రవేత్త సిబ్లీ అభిప్రాయం ప్రకారం పరిశోధనకు మూలం విలువలు. రాజకీయ రంగంలో సమస్యలున్నప్పుడే పరిశోధన ప్రారంభమౌతుంది. దీనిలో అనేక చిక్కు ముడులున్నప్పటికి ప్రాధాన్యత ఎంపికలు

పరిష్కారాన్ని సూచిస్తాయి. పరిశోధన దృష్టిలో రాజకీయ రంగం అత్యంత ప్రాధాన్యత గల అంశం. ఏ నిర్ణయానికి వచ్చినప్పటికి విలువల ప్రస్తావన ఖచ్చితంగా ఉంటుంది.

2 పరిశోధనలో తేటతెల్లమైన విలువలతో కూడిన ప్రకటనలు లేదా అధ్యయనాల అంశములు సాధారణ ప్రవర్తన మరియు అనుభవము ద్వారా నిరూపించుట సాధ్యముకాదు. మానవ ప్రవర్తన ఖచ్చితముగా మదింపు చేసే ప్రక్రియ ద్వారా అధ్యయనం జరగాలే కాని ప్రవర్తనవాద ప్రక్రియలతో జరుపరాదు.

3. ప్రవర్తనావాది తన ప్రవర్తనకు గల కారణములను వివరింపలేడు. కాని ఊహా పరికల్పన ద్వారా నమ్మింప ప్రయత్నిస్తాడు. వాటిని గణాంకాలు లేదా మరియు ఏ యితర పద్ధతుల ద్వారనైన నిరూపించటం కష్టము.

### 2.9.2 ఆర్నాల్డ్ బ్రిచట్ అభిప్రాయం ప్రకారం ప్రవర్తనావాద పరిమితులు :

ఆర్నాల్డ్ బ్రిచట్ తను రచించిన "పొలిటికల్ థీయరీ" అనే గ్రంథంలో ప్రవర్తనావాద పరిమితులను గురించి రెండు విషయాలను ప్రముఖంగా ప్రస్తావించారు. అవి

1. ప్రాథమికంగా లక్ష్యసాధనలు, అనుపయోగ విషయాల గురించి మరియు వ్యక్తి లేదా వ్యక్తుల సామాజిక భావనలో ఉపయుక్త, అనుపయుక్తతల గురించి యిది చర్చిస్తుంది.
2. శాస్త్రీయంగా లక్ష్యసాధనలు, విలువల ప్రస్తావన, ఉత్తరోత్తర భావనలు, మరియు గమ్య స్థానాలను నిర్ణయించడం అసాధ్యమైన విషయం.

### 2.9.3 ఆల్ఫ్రైడ్ సోమిట్ మరియు జోసఫ్ టెన్హాస్ అభిప్రాయం ప్రకారం ప్రవర్తనావాద పరిమితులు :

1. ఆల్ఫ్రైడ్ సోమిట్ మరియు జోసఫ్ టెన్హాస్ వ్రాసిన ఒక వ్యాసంలో ప్రవర్తనావాదానికి గల కొన్ని పరిమితులను వివరించారు. వారి అభిప్రాయము ప్రకారం రాజనీతి శాస్త్రం క్షేత్ర స్థాయికి ఎదగలేదు. రాజనీతి శాస్త్రం శాస్త్రంకాజాలదు. ఎందువలననగా రాజనీతిశాస్త్రం మిగతా శాస్త్రాల వలె ప్రయోగయోగ్యమైనదికాదు. భౌతిక, జీవ రసాయన ప్రవర్తన స్వేచ్ఛతో కూడినది కాదు. మనో చిత్తము మేరకు చట్టబద్ధంగా కాని, అతిక్రమించిగాని ప్రవర్తించే సందర్భాలలో వ్యక్తి లేదా వ్యక్తుల సాముదాయక రాజకీయ ప్రవర్తనను సిద్ధాంతీకరించుట చాలా కష్టము.
2. వ్యక్తి బాహ్య ప్రవర్తన ఆ వ్యక్తి యొక్క పూర్తి సమాచారాన్ని యివ్వదు. విభిన్న వ్యక్తులు ఒకే రకమైన ప్రవర్తనను విభిన్న కారణాల ద్వారా చేయవచ్చు. వారి ప్రవర్తనను అర్థం చేసుకోవాలంటే వారిలోని గమనించడానికి వీలులేని అంతర్గత ప్రవర్తనకు ప్రాధాన్యత యివ్వాలి. వ్యక్తి లేదా వ్యక్తుల సమూహాలయొక్క ప్రవర్తనను తెలుసుకోవాలంటే వారియొక్క సామాజిక సంస్థాగతపరమైన పరిస్థితులను అధ్యయనం చేయడం అత్యంత ఆవశ్యకము.
3. ప్రవర్తనావాదము పరిమాణాత్మకము కాబట్టి విషయములకు, సమస్యలకు సమాధానం చూపటం కష్టం.
4. రాజనీతి శాస్త్ర చరిత్రను పరిశీలించినట్లైయితే మంచి, చెడు తప్పు ఒప్పులతో కూడిన నీతి ప్రామాణికమైనది. వీటిని శాస్త్ర పూర్వకంగా నిర్ణయించుట సాధ్యంకాదు. విలువ రహిత అధ్యయనం ఆత్మహత్యా సదృశ్యము.
5. రాజనీతి శాస్త్రములో అంతర్ శాస్త్ర అధ్యయనము ఉపయుక్తమయినప్పటికి తన ఉనికిని కోల్పోకుండా ప్రవర్తనావాదులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. విచక్షణా రహితంగా ప్రక్రియలను, భావనలను రాజకీయ విచారణకు అందిపుచ్చుకునే ధోరణి మంచిదికాదు.
6. అతి శాస్త్రీయ ధోరణి సాంకేతిక ప్రగతికి దోహద పడుతుందేగాని విజ్ఞాన సముపార్జకు అది మార్గమును సుగమము చేయదు. పురాతనమైన రాజనీతి శాస్త్రాన్ని అధునాతమైన పద్ధతుల ద్వారా అధ్యయనం చేయడం సందేహాస్పదం. రాజనీతి శాస్త్రాన్ని విలువలు, గణాంక వాస్తవాల వధ్యశిలపై బలికావడాన్ని వారు నిశితంగా విమర్శించారు.

## 2.10 సారాంశము :

రెండవ ప్రపంచ యుద్ధానంతర పరిస్థితులలో రాజనీతి శాస్త్ర అధ్యయనాల్లో ప్రవర్తనవాద విప్లవం ఆవిర్భవించింది. అంతవరకూ అనుసరిస్తూ వస్తున్న సాంప్రదాయ అధ్యయన పద్ధతి రాజకీయ వాస్తవాలను వివరించటంలో విఫలమయింది. జాతుల మధ్య వైరాలు, అగ్రరాజ్యాల ఆవిర్భావం, జాతీయవాదం వ్యాప్తి, ఆర్థికసంక్షోభం, నిరుద్యోగం, వివిధ సమాజాల్లో ఏర్పడిన అనిశ్చిత పరిస్థితులు, జాతుల మధ్య అసమానతలు, ఆర్థిక, సాంఘిక వ్యత్యాసాలు, తెగల మధ్య రగులుకొంటున్న విద్వేషాలు, పెరుగుతున్న ఉద్రిక్తతలు మొదలైనవన్నీ రాజనీతి శాస్త్రవేత్తలకు సవాళ్లుగా పరిణమించాయి. రాజనీతి శాస్త్ర అధ్యయనం వాస్తవ సమస్యల పరిష్కారానికి ఉన్న రుగ్మతలను విశ్లేషించి, అవి ఏర్పడడానికి కారకాలను శోధించి, వాటి నివారణకు ప్రత్యామ్నాయ నమూనాలను విధానాలను, దృక్పథాలను చూపించాల్సిన బాధ్యత రాజనీతి శాస్త్రవేత్తలలో వ్యక్తమయింది. రాజనీతి శాస్త్ర అధ్యయనంలో మారుతున్న ప్రపంచపు అవసరాలు, వాస్తవాలకు అనుగుణంగా మార్పులు తేవలసిన అవసరాన్ని రాజనీతి శాస్త్రవేత్తలు గుర్తించారు. పర్యవసానంగా ప్రవర్తనావాద విప్లవం ఆవిర్భవించింది.

సిద్ధాంత పరమైన విద్యా విషయకమైన ఉద్దేశాల విషయాల్లోనే కాక ప్రవర్తనావాదం ఆచరణలో చాల ఉపయుక్తమైంది. ఆదునిక రాజనీతి సిద్ధాంతాన్ని నేరుగా ఉపయోగించేందుకు, విధాన రూపకల్పనలో ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని ప్రవర్తనావాదం ఆశిస్తుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే సమగ్రతకు సంబంధించిన సమస్యలను గురించి, సాంఘిక ప్రభావాన్ని గురించి సహకారానికి సంబంధించిన విషయాల్లో ప్రవర్తనావాదము ఎంతో కృషి చేసింది. తత్ఫలితంగా సంభవించే మార్పుల్ని విలీన చేయడానికి, వివిధ వ్యవస్థలను వివిధ కోణాలలో అధ్యయనం చేస్తుంది. ప్రణాళికబద్ధమైన మార్పులను తీసుకొనిరావడంలో ప్రవర్తనావాదుల కృషి అమోఘమైనది, మరువలేనిది.

## 2.11 మాదిరి ప్రశ్నలు :

1. ప్రవర్తనావాదమనగా నేమి? దీని ఆవిర్భావానికి గల కారణాలను వివరించి, దాని అభివృద్ధి క్రమాన్ని వివరించండి ?
2. ప్రవర్తనావాద ఉద్యమ లక్షణాలను వివరించండి ?
3. ప్రవర్తనావాదమనగానేమి ? రాజనీతి విశ్లేషణలో దాని పాత్రను గురించి వ్రాయుము ?
4. ప్రవర్తనావాదమనగానేమి ? ప్రవర్తనావాదంపై గల విమర్శలను వివరించండి ?

### లఘు వ్యాస ప్రశ్నలు :

1. ప్రవర్తనావాద లక్షణాలు
2. ప్రవర్తనావాదానికి డేవిడ్ ఈస్టన్ చేసిన కృషిని తెలుపుము ?

## 2.12 చదువదగిన గ్రంథాలు :


1. జె.సి. చార్లెస్ వర్త్ : కంటెంపరరీ పొలిటికల్ ఎనాలసిస్
2. రాబర్ట్ ఎ.డాల్ : మోడరన్ పొలిటికల్ ఎనాలసిస్
3. యస్.పి. వర్మ : మోడరన్ పొలిటికల్ థియరి


- డా॥ కె. రామచంద్రమూర్తి

పాఠం - 3

# ఉత్తర ప్రవర్తనావాదము

## (POST-BEHAVIOURALISM)

విషయసూచిక


3.0 లక్ష్యాలు

3.1 పరిచయం

3.2 ఉత్తర ప్రవర్తనావాదం

3.3 ఉత్తర ప్రవర్తనావాదం అభివృద్ధికి కారణాలు

- 3.3.1 రాజనీతి శాస్త్రాన్ని సమస్యా పరిష్కార శాస్త్రంగా రూపొందించటంలో వైఫల్యం
- 3.3.2 రాజనీతి శాస్త్రం తన ఉనికిని కోల్పోయే స్థితిని చేరుకోవడం
- 3.3.3 పరిశోధనా పద్ధతులకు, పరికరాలకు అధిక ప్రాధాన్యత
- 3.3.4 కృత్రిమ జీవనంపై మానవుని అసంతృప్తి
- 3.3.5 రాజనీతి శాస్త్రాన్ని నిజమైన శాస్త్రంగా తీర్చిదిద్దలేకపోవడం

3.4 ఉత్తర ప్రవర్తనావాద ప్రత్యేక లక్షణాలు

- 3.4.1 ప్రతిఘటనోద్యమం
- 3.4.2 విలువలకు అతీతమైన సాంఘిక శాస్త్రంపట్ల వ్యతిరేకత
- 3.4.3 భవిష్యతుకు సంబంధించిన అవగాహన
- 3.4.4 వివేక పూరితమైన ఉద్యమము

3.5 డేవిడ్ ఈస్టన్ - ఉత్తర ప్రవర్తనావాద లక్షణాలు

- 3.5.1 పద్ధతికన్నా, విషయానికి ప్రాధాన్యత ఉండాలి
- 3.5.2 రాజనీతిశాస్త్రం, విషయానికి ప్రాధాన్యత ఉండాలి
- 3.5.3 రాజనీతి శాస్త్రజ్ఞులు, మేధావులు, మానవ విలువలను పరిరక్షించాలి
- 3.5.5 రాజనీతి శాస్త్రం విలువలతో కూడి ఉండాలి
- 3.5.6 విజ్ఞానం కార్యాచరణ విధిని కల్పిస్తుంది
- 3.5.7 రాజనీతి శాస్త్రానికి రాజకీయ రూపాన్నివ్వాలి

3.6 సారాంశము

3.7 నమూనా ప్రశ్నలు

3.8 చదువదగిన గ్రంథాలు

## 3.0 లక్ష్యాలు :

ఈ పాఠాన్ని చదివితే ఈ క్రింది విషయాలను మీరు సవివరంగా వివరించగలుగుతారు.

- ప్రవర్తనావాదం యొక్క పరిమితులు
- ఉత్తర ప్రవర్తనావాదం ఆవిర్భావం మరియు అది వృద్ధి చెందడానికి గల కారణాలు
- ఉత్తర ప్రవర్తనావాద ప్రత్యేక లక్షణాలు మరియు డేవిడ్ ఈస్టన్ ప్రతిపాదించిన ఉత్తర ప్రవర్తనావాద లక్షణాలు

## 3.1 పరిచయం :

ఏదైనా ఒక విషయాన్ని నిష్పాక్షికంగా పరిశీలించి, సిద్ధాంతీకరించటానికి సామాజిక శాస్త్రజ్ఞులు వారి వారి వ్యక్తిగత విలువలను దూరంగా ఉంచి పరిశోధనకు ఉపక్రమించాల్సి ఉంటుంది. అంతేగాక రాజకీయ ప్రవర్తన అధ్యయనానికి అంతర్వర్గీయ దృక్పథం విరివిగా ఉపయోగించాల్సిన అగత్యం ఉంది. రాజకీయ ప్రవర్తన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి వాటిని కూడా పరిగణనలోనికి తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల రాజనీతి శాస్త్రం తన హద్దులనుదాటి సామాజిక శాస్త్రం, ఆర్థికశాస్త్రం, మనో వైజ్ఞానిక శాస్త్రాల పరిధుల్లో పయనిస్తుంది. వాటికి సంబంధించిన కొంత సాధారణ పరిజ్ఞానం లేనిదే రాజకీయాలను విశ్లేషించటం అంత సులభసాధ్యమైన విషయం కాదు. అందువల్ల ప్రవర్తనావాదం వివిధ సామాజిక శాస్త్రాల సమన్వయాన్ని కోరుతుంది. కాని ప్రవర్తనావాదం 1960 దశకంలో తీవ్ర విమర్శలకు గురైంది. సాంప్రదాయవాదులు, ప్రవర్తనా వాదుల్లో కొందరు బాహాటంగా ప్రవర్తనావాదాన్ని విమర్శించారు. అధ్యయనానికి అవసరం లేని అత్యాధునిక పద్ధతులను ప్రవర్తనా దృక్పథం ప్రవేశపెడుతున్నదని విమర్శకులు భావించారు. పరికరాల కోసం విషయాన్ని నిర్లక్ష్యం చేయడం జరుగుతున్నదన్నారు. సామాజికవసరాలకు అనుగుణంగా పరిశోధనలు సాగటం లేదని వ్యాఖ్యానించారు. అతి సామాన్యమైన అర్థ రహిత అంశాలకు ప్రవర్తనా వాద దృక్పథం ప్రాధాన్యతనిస్తున్నదన్న విమర్శ తలెత్తింది. విలువలకతీతమైన, నిష్పాక్షిక పరిశోధన కావాలన్న ఆదుర్దాలో ప్రవర్తనావాదులు, యధా తధా స్థితిని సమర్థించుకొనే పరిస్థితులను సృష్టించారు. అందువల్ల ఉత్తర ప్రవర్తనావాద ఉద్యమం అన్న పేరుతో మరొక దృక్పథం అవతరించింది.

ఇది సామాజిక శాస్త్రాల పరిశోధనల్లో విషయ ప్రాముఖ్యానికి, వివరణకు, సార్థకతకు ప్రాముఖ్యం ఇచ్చింది. ఉత్తర ప్రవర్తనా వాదులు ప్రస్తుత సమస్యలైన నిరుద్యోగం, పేదరికం, ఘర్షణలు, ఉద్రిక్తతలు, అసమానతలు మొదలైన సమస్యలకు రాజనీతి శాస్త్రజ్ఞులు సమాధానం, పరిష్కార మార్గాలు చెప్పాలంటారు. అప్పుడే రాజనీతి శాస్త్ర అధ్యయనాలకు ప్రాముఖ్యత, సార్థకత ఉంటాయి. కేవలం ఒక సమస్యను వివరించటంలోనే రాజనీతి శాస్త్రవేత్త కర్తవ్యం పూర్తికాదని, దానికి తగిన పరిష్కార మార్గం కూడా సూచించాల్సిన బాధ్యత ఉందని భావించారు. ఈ ఆలోచనే పాశ్చాత్యదేశాల్లో ఉత్తర ప్రవర్తనావాద ఉద్యమానికి నాంది పలికింది. అంతేకాకుండా విలువలకతీతమైన దృక్పథం విషయంలో గూడా చెప్పుకోదగిన మార్పు వచ్చింది. సామాజిక జీవనం నుండి విలువలు విడదీయరానివన్న భావం కూడా ఇందులో ఉంది. ఎటువంటి విశ్లేషణలలోనైనా అవి అంతర్భాగాలే. అందువల్ల సామాజిక శాస్త్రజ్ఞులు తాము విలువలుగా భావించే వాటిని ముందుగానే నిర్మొహమాటంగా తెలియజేసినట్లయితే వారి సాధారణీకరణాలను సరైన దృక్పథంలో అర్థం చేసుకోవటం సాధ్యమవుతుంది.

## 3.2 ఉత్తర ప్రవర్తనావాదం :

ప్రవర్తనావాదం రాజనీతి శాస్త్రం యొక్క దిశను, దశను మార్చివేసింది. ఇది రాజనీతి శాస్త్రపు గమ్యాలు, పరిధి, స్వభావం, క్రమపద్ధతుల్లో మార్పును తీసుకొనివచ్చిన మహోద్యమంగా కొనియాడబడింది. దశాబ్ద కాలంలోనే ప్రవర్తనావాదులు తాము

ఎంచుకొన్న మార్గము నుండి లక్ష్యాలనుండి దూరమైపోయారు. వారు అనుకున్న లక్ష్యాలను వారు మరచిపోయారు. రాజనీతి అధ్యయనంలో కేవలం నూతన అధ్యయనాలను, విధానాలను, పద్ధతులను, ప్రక్రియలను కనుగొనడంలో వారు పూర్తిగా నిమగ్నమవడంవలన వాస్తవ విషయాలను విస్మరించారు.

రాజనీతి శాస్త్రాన్ని నిజమైన శాస్త్రంగాను, సమస్యలను తీర్చే శాస్త్రంగాను తీర్చిదిద్దడంలో ప్రవర్తనావాదులు ఘోరంగా విఫలమయ్యారు. ప్రవర్తనావాదులు విషయ పరిశీలనలోను, అధ్యయనంలోను రాజనీతి శాస్త్రం కన్న యితర శాస్త్రాలకే అధిక ప్రాధాన్యత యిచ్చారు. తత్ఫలితంగా రాజనీతి శాస్త్రం తన ఉనికిని కూడా కోల్పోయే స్థాయికి చేరుకుంది.

సాంప్రదాయక, ప్రవర్తనావాద ధోరణుల మధ్య తలెత్తిన వివాదాలు సమసిపోతుండగా, ప్రవర్తనావాదులలోనే బేధాభిప్రాయాలు వచ్చాయి. ప్రవర్తనావాదులు రెండు విభిన్న అధ్యయన వాదులుగా విడిపోయారు. ఇందులో ఒకరైన సైద్ధాంతిక ప్రవర్తనావాదులు సిద్ధాంత నిర్మాణానికి లేక రూపకల్పనకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చారు. ఆధార రహితమైన సూత్రాలను వల్లె వేయసాగారు. దీనికి భిన్నంగా రెండవవారు నిశ్చయాత్మక ప్రవర్తనవాదులు లేక అభ్యుదయ ప్రవర్తనావాదులు, వీరు రాజకీయ సంఘటనలను అధ్యయనం చేయుటంలో నూతన పద్ధతులను కనుగొనటానికి ప్రాధాన్యత నిచ్చారు. మరియు వారు పరిశోధనా పద్ధతులలో గాఢంగా లీనమైపోయి, సూత్రాలనే గాక రాజనీతి శాస్త్రాన్ని సహితం విస్మరించసాగారు. అరవైయవదశకం అంతమయ్యే నాటికి వీరిద్దరి మధ్య వివాదాలు బాగా పెరిగి గతంలోని సాంప్రదాయవాదులు ప్రవర్తనావాదులకన్న మిన్నగా పోట్లాడుకోసాగారు.

తత్ఫలితంగా అరవై ఐదవ దశాబ్దం చివరిలో కొంతమంది ప్రవర్తనావాదులు ప్రవర్తనావాదం అంటే నిస్పృహచెందారు. ప్రవర్తనావాదాన్ని గురించిన ప్రధాన విమర్శ ప్రవర్తనావాద ప్రముఖుల్లో డేవిడ్ ఈస్టేన్ నుండి వెలువడింది. 1969 లో జరిగిన అమెరికా రాజనీతిశాస్త్ర సంఘం వార్షిక సమావేశము యొక్క అధ్యక్షోపన్యాసంలో ప్రవర్తనావాదంలో నూతన దృక్పధానికి నాంది ప్రస్తావన చేశాడు. ప్రవర్తనావాద ప్రభావం వల్ల జరిగిన రాజకీయ బోధన, పరిశోధన పట్ల తాను అసంతృప్తి చెందానని డేవిడ్ ఈస్టన్ వెల్లడించాడు. ప్రవర్తనావాద దృక్పథం రాజనీతి శాస్త్రాధ్యయనాన్ని ప్రకృతి విజ్ఞాన శాస్త్రాల పద్ధతులమీద ఆధారపడిన విద్యా విభాగంగా రూపొందించటానికి ప్రయత్నిస్తోంది. రాజనీతిశాస్త్రం సమాజిక వాస్తవాలకు సంబంధించిన శాస్త్రంగాకాక చాలా వరకు గణిత శాస్త్రంలాగే కనిపిస్తోంది. శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించటంలోను, పరిశోధనకు సంబంధించిన కృషితోను ప్రవర్తనావాదులు సామాజిక ప్రవర్తనకు సంబంధించిన వాస్తవాలకు దూరమైపోయారు. ఈ విధంగా రాజనీతిశాస్త్రము ప్రస్తుత సమకాలీన ప్రపంచంలో సాన్నిహిత్యాన్ని కోల్పోయింది. అని అనేకమంది రాజనీతి శాస్త్రజ్ఞులు భావించటం మొదలుపెట్టారు. ప్రవర్తనావాదంపై ఈ విమర్శలు చేసిన వారిని ఉత్తర ప్రవర్తనావాదులుగా పిలుస్తున్నారు.

### 3.3 ఉత్తర ప్రవర్తనావాదం అభివృద్ధికి కారణాలు (Reasons for the Growth of Post-Behaviouralism) :

ప్రవర్తనావాదాన్ని గురించి అనేక విమర్శలు వచ్చిన ఫలితంగా, ప్రవర్తనావాదానికి నిరసనగా మరో ఉద్యమం మొదలైంది. ప్రవర్తనావాదం సాంప్రదాయక రాజనీతి శాస్త్రానికి నిరసన కాగా, ఉత్తర ప్రవర్తనావాదం,ప్రవర్తనావాదం పట్ల నిరసనోద్యమం. సాంప్రదాయక రాజనీతి శాస్త్రము ప్రస్తుత, సమకాలీన సమస్యలను గురించి పట్టించుకోకపోవటం వల్ల ప్రవర్తనావాదం, సమస్య పరిష్కార శాస్త్రంగా రూపొందింప బడలేకపోయినది. ఉత్తర ప్రవర్తనావాదం అభివృద్ధికి గల కారణాలు ఈ క్రింద వివరించటం జరిగింది.

#### 3.3.1 రాజనీతి శాస్త్రాన్ని సమస్యా పరిష్కార శాస్త్రంగా రూపొందించటంలో వైఫల్యం (Failure to make Political Science into problem solving science) :

ప్రవర్తనావాదులు నూతన ప్రక్రియలను, పద్ధతులను కనుగొనే ప్రయత్నంలో వాస్తవ ప్రపంచంతో పాటు. రాజకీయ శాస్త్రంతో కూడా సంబంధాన్ని కోల్పోయారు. ప్రవర్తనావాదులు విభిన్నమైన భావనాపరమైన రూప నిర్మాణాలను, నమూనాలను,

సిద్ధాంతాలను రూపొందించటంలో నిమగ్నమై వుండగా, బాహ్య ప్రపంచం తీవ్రమైన సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సంక్షోభాలను ఎదుర్కొంటుంది. సమాజం విచ్ఛిన్నమయ్యే ప్రమాదంలో పడ్డప్పుడు వీరంతా విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలలో మునిగి ఉన్నారు. అణుయుద్ధ భయం, పౌరయుద్ధ భయం, అధికారాత్మక ప్రభుత్వాల భయం, వియత్నాంలో అప్రకటిత యుద్ధంలాంటి సమస్యలను సమాజం ఎదుర్కొంటున్నప్పుడు ఈ సమస్యలను పసిగట్టలేని పరిశోధనలు ఎందుకన్న ఆలోచన ప్రారంభమయింది. ఈ ప్రవర్తనావాదులు, ముఖ్యంగా డేవిడ్ ఈస్టన్ లాంటి సక్రమ చింతనా ప్రవర్తనావాదులు. ప్రాముఖ్యముకాని, అసంగతము అయిన పరిశోధనల్లో చాలా సమయం వృధా చేసినట్లుగా అంగీకరించారు.

### 3.3.2 రాజనీతి శాస్త్రం తన ఉనికిని కోల్పోయే స్థితిని చేరుకోవడం (Political Science on the verse of loosing identity) :

ప్రవర్తనావాద శాస్త్రవేత్తలు రాజనీతి శాస్త్రానికి సంబంధించిన ప్రాధమిక భావాలకు ముఖ్యమైన సిద్ధాంతాలకు ప్రాముఖ్యతనివ్వక వాటిని ప్రక్కకు తోచివేచి వాటి స్థానంలో విచక్షణా రహితంగా అనేకమైన కొత్త పద్ధతులతో ధృక్పథాలతో నింపివేసారు. తత్ఫలితంగా రాజనీతిశాస్త్రం పూర్తిగా ఇతర శాస్త్రాలతో కలిసిపోయి తన ఉనికిని కోల్పోయే స్థితికి చేరుకుంది.

### 3.3.3 పరిశోధనా పద్ధతులకు, పరికరాలకు, అధిక ప్రాధాన్యత (Under importance to Techniques and Tools) :

ప్రవర్తనావాదం రాజనీతిశాస్త్రాన్ని సమస్యల పరిష్కారానికి వీలైన సిద్ధాంతాలను రూపొందించడానికి అనువైన ప్రకృతిశాస్త్రం లాగా రూపొందించాలని అభిలషించింది. ఈ ప్రయత్నంలో ప్రవర్తనావాదులు రాజనీతి శాస్త్రాధ్యయనాన్ని తత్వశాస్త్రం, చరిత్ర, న్యాయశాస్త్రం మార్గాలనుండి ప్రక్కదారికి మళ్ళించారు. రాజనీతి సంఘటనలు అధ్యయనం చేయుటలో నూతన పద్ధతులను, ప్రక్రియలను కనుగొనటంలో ఎక్కువగా నిమగ్నమైపోయారు. క్రమంగా ప్రవర్తనావాదులు వారి విలువైన సమయాన్ని పద్ధతులకు సంబంధించిన ప్రక్రియల్ని అభివృద్ధి చేయటంలోను, పరిశోధనకు పరికరాలను మెరుగుపరచటంలో వృధాచేస్తున్నట్లు గ్రహించారు.

### 3.3.4 కృత్రిమ జీవనంపై మానవుని అసంతృప్తి Dissatisfaction of ordinary people on Mechanical Life):

పారిశ్రామికీకరణ, ఆధునికీకరణ వల్ల పాశ్చాత్య ప్రపంచ ప్రజల జీవనం కృత్రిమంగా, వ్యధాపూరితముగా మారిపోయింది. తత్ఫలితంగా వారు మనశ్శాంతిని కోల్పోయి అసంతృప్తి చెందారు. మనఃశాంతిని పొందే ప్రయత్నంలో మత్తు పదార్థాలను సేవించటం, తిరిగి ప్రకృతిని చేరటం లాంటి విధానాలను ప్రారంభించారు. వీటివలన హిప్పీ ఉద్యమము, సాంస్కృతిక విలువల పట్ల నిరసన, 'నూతన వామపక్ష' లాంటి నిరసన ఉద్యమాలు ఆవిర్భవించాయి. ప్రవర్తనావాదం కూడా సాంప్రదాయక వాదానికి వ్యతిరేకమయిన నిరసనోద్యమం కావటం వల్ల చాలామంది ప్రవర్తనావాదులు ఈ ఉద్యమాలతో ఏకీభవించారు. ఇంకొక విధంగా చెప్పాలంటే ప్రవర్తనావాదం పట్ల అసంతృప్తిచెందిన రాజనీతిశాస్త్రజ్ఞులు నిరసనోద్యమాన్ని ప్రారంభించి ఉత్తర ప్రవర్తనావాద విధాన ఆవిర్భావానికి కారకులయ్యాయి.

### 3.3.5 రాజనీతి శాస్త్రాన్ని నిజమైన శాస్త్రంగా తీర్చిదిద్దలేకపోవడం (Failure to develop Politics into Science):

సాంప్రదాయక పద్ధతులపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేసి, దానిని తీవ్రంగా వ్యతిరేకించి రాజనీతి శాస్త్రాన్ని నిజమైన శాస్త్రంగా తీర్చిదిద్దుతామని నొక్కి వక్కాణించిన ప్రవర్తనావాదులు రాజనీతి శాస్త్రాన్ని నిజమైన శాస్త్రంగా తయారుచేయడంలో

విఫలమయ్యారు. అంతేకాకుండా వారు అప్రధానమైన విషయాలకు అధిక ప్రాధాన్యమిస్తూ ప్రాధాన్యత అంశాలను విస్మరించి, వాటికి తక్కువ ప్రాధాన్యతను ఇచ్చారు.

### 3.4 ఉత్తర ప్రవర్తనావాద ప్రత్యేక లక్షణాలు (Features of Post-Behaviouralism) :

ప్రవర్తనావాద దృక్పథంతో విరక్తిచెందిన ప్రవర్తనావాదులు ఉత్తర ప్రవర్తనావాదం అన్న పేరుతో మరొక దృక్పథాన్ని ఆవిర్భవింపచేశారు. ఉత్తర ప్రవర్తనావాదులు, ఉత్తర ప్రవర్తనావాదానికి కొన్ని ప్రత్యేక లక్షణాలను వివరించారు. అవి :

#### 3.4.1 ప్రతిఘటనోద్యమం (Resistance movement) :

నాగరికతకు సంబంధించిన మానవతా విలువలను కాపాడటం మేధావుల ప్రధాన విధి అని డేవిడ్ ఈస్టన్ ప్రకటించాడు. ఈ దృక్పథం లేకపోతే రాజనీతిశాస్త్రజ్ఞులు యాంత్రికమైన వ్యక్తులుగా మారిపోతారు. ప్రవర్తనా వాదులు సిద్ధాంపరమైన నిర్లిప్త స్వభావాన్ని పెంచుకోవటం వల్ల చారిత్రాత్మకమైన విధులను నిర్వహించటంలో విఫలమయినారు. రాజనీతిశాస్త్రజ్ఞులు విలువలపట్ల, స్వేచ్ఛ, సమానత్వము, రాజకీయ కార్యకలాపాల పట్ల ఆసక్తి కలిగి ఉండాలి. అలాకాక మానసికమైన ఒత్తిడులు, సంక్షోభం, తీవ్ర అసమానతలు వున్న ఈ కాలంలో సిద్ధాంతపరమైన నిర్లిప్తస్వభావాన్ని కలిగి వుండటం బాధ్యతారాహితం. రాజనీతి శాస్త్రజ్ఞుడు కనీసం ప్రజా సంబంధమైన విధానాలు, రాజకీయ సంస్కరణల పట్ల ఆసక్తి కలిగి ఉండాలి. ఈ విధంగా ప్రవర్తనావాదంలాగానే ఈ ఉత్తర ప్రవర్తనావాదం కూడా ఒక నిరసనోద్యమం. ప్రవర్తనావాదులు రాజనీతిశాస్త్రానికి నిర్దేశించిన పొరపాటు విధానానికి ఈ విధానం ఒక నిరసన.

#### 3.4.2 విలువలకు అతీతమైన సాంఘిక శాస్త్రంపట్ల వ్యతిరేకత (Opposition to value neutrol social science) :

ప్రవర్తనావాదుల నినాదమైన "విలువలకు అతీతమైనది సాంఘిక శాస్త్రము" అన్న భావనకు ఉత్తర ప్రవర్తనావాదాన్ని అనుసరిచేవారు వ్యతిరేకులు. "విలువలకు సంబంధించిన పరిశోధన నిర్మాణాత్మక అభివృద్ధి, రాజనీతి శాస్త్ర అధ్యయనంలో తొలగించటానికి వీలు లేని భాగంకాదు అని ప్రకటిస్తున్నప్పటికీ, విజ్ఞానశాస్త్రం విలువలను అంచనా వేయటంలో తటస్థంగా ఎప్పుడూ వుండలేదు" అని డేవిడ్ ఈస్టన్ అభిప్రాయపడ్డాడు. కాబట్టి మన విజ్ఞానానికి ఆధారమైన విలువలకు సంబంధించిన ఊహలను వాటి ప్రత్యామ్నాయాలను తెలుసుకోవాలి.

#### 3.4.3 భవిష్యత్తుకు సంబంధించిన అవగాహన (Understanding of Future) :

ఉత్తర ప్రవర్తనావాదాన్ని అనుసరించేవారు సాంప్రదాయ దృక్పథాలనుకాక, ప్రవర్తనావాదుల కృషిని మెచ్చుకొంటారు. అనుభవైక దృక్పథాన్ని, అనుభవైక పరిశోధనను వారు పొగడుతారు. ప్రవర్తనావాదులు వారి అనుభవైక పరిశోధనా పద్ధతులు, దృక్పథాల ద్వారా, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటానికి ఉపయోగపడే సిద్ధాంతాలను రూపొందించాలని ఉత్తర ప్రవర్తనావాదులు కోరుకొన్నారు. అయితే ప్రవర్తనా వాదులు ఈ బాధ్యతను నిర్వర్తించటంలో పూర్తిగా విఫలమయ్యారని భావించారు. వర్తమానములో ఏది ఎలా జరుగుతున్నదన్న ప్రశ్నకు ఇచ్చిన ప్రాధాన్యతలో, లేశమంత ప్రాధాన్యత కూడా, భవిష్యత్ పరిమాణాలు ఎలా గుంటాయి? వాటిని పరిష్కరించుకొనటానికి తగిన పద్ధతులు ఏమిటి? భవిష్యత్ పరిణామాలను కూడా ఊహించగల, పరిష్కరించగల సైద్ధాంతిక, తాత్విక ప్రాతిపదిక ఏమిటి? వంటి ప్రశ్నలను వారు విస్మరించారు.

### 3.4.4 వివేక పూరితమైన ఉద్యమము (Rational movement) :

ఉత్తర ప్రవర్తనా విధానం రాజనీతి శాస్త్రజ్ఞుల విభాగానికికాని, మరే విభాగానికి చెందినదికాదు. ఈ ఉద్యమానికి యువకులైన పట్టభద్రుల నుండి వివిధ వృత్తులకు సంబంధించిన వృద్ధుల వరకు అన్ని తరాలలోను, అన్ని విభాగాలకు చెందిన రాజనీతి శాస్త్రజ్ఞులు అనుచరులుగా ఉన్నారు. గత అర్ధశతాబ్దంలో రాజనీతిశాస్త్ర పురోగమనంపట్ల ఆసక్తి కనపరచిన వారందరిని ఉత్తర ప్రవర్తనా వాదులుగా పేర్కొనటం జరుగుతుంది. ఈ విధంగా ఇది ఒక వివేక పూరితమైన ఉద్యమముగా చెప్పవచ్చు.

## 3.5 డేవిడ్ ఈస్టన్ ఉత్తర ప్రవర్తనావాద లక్షణాలు :

పైన మనం చర్చించిన విషయాలనన్నింటిని 1969లో జరిగిన "అమెరికన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్" వార్షిక మహాసభకు అధ్యక్షుడిగా ఎన్నికయిన డేవిడ్ ఈస్టన్, తన అధ్యక్షోపన్యాసంలో వివరించాడు. తద్వారా ఉత్తర ప్రవర్తనావాదానికి కూడా ఆద్యుడు అయ్యాడు. ఉత్తర ప్రవర్తనావాద వ్యాప్తికి విశేషమైన కృషి సల్పిన డేవిడ్ ఈస్టన్ ఉత్తర ప్రవర్తనావాదానికి ఏడు లక్షణాలను వివరించారు. వాటిని "సంగతమైన సూక్తులు"గా ("Crudo of Relavance" or "A Distillation of the Maximal Image") అభివర్ణించాడు. అవి :

### 3.5.1 పద్ధతికన్నా, విషయానికి ప్రాధాన్యత ఉండాలి (Substance must come before Technique) :

రాజనీతిశాస్త్ర పరిశోధనలో పద్ధతికన్నా పరిశోధనా విషయానికి ప్రాధాన్యత ఎక్కువగా ఉండాలి. ఒకదాని కొరకు మరొక దానిని అలక్ష్యం చేయకూడదు. పరిశోధనకొరకు అభివృద్ధి చెందిన పరికరాలు ఉండటం మంచిదేకాని ఈ పరికరాలు దేని కొరకు వాడుతున్నాము అన్నది ముఖ్యాంశం. పరిశోధన పద్ధతులు సమకాలీన సామాజిక సమస్యలకు సంబంధమైనవిగాను, అర్థవంతమైనవిగాను ఉండవలెనేగాని, వాటి నైపుణ్యానికి ప్రాధాన్యత యివ్వరాదు. అర్థవంతము కాకపోతే పరిశోధన చేయుటంలో విలువలేదు. అస్పష్టతకన్న తప్పుమేలన్న ప్రవర్తనాదుల నినాదానికి ప్రతిగా అసంబద్ధపు నిర్దిష్టతకన్నా అస్పష్టతయే మేలు అన్న నినాదాన్ని ఉత్తర ప్రవర్తనావాదులు ఇచ్చారు.

### 3.5.2 రాజనీతిశాస్త్రం సామాజిక పరిరక్షణ కంటే సామాజిక మార్పును వివరించాలి (Emphasis on Social change, not on Social preservation) :

సమకాలీన రాజనీతిశాస్త్రం సామాజిక మార్పులకు ప్రాధాన్యతయివ్వాలి. ప్రవర్తనావాదం సైద్ధాంతిక సూత్రాలకు ప్రాధాన్యత యివ్వలేదు. యధార్థాలను విశాలమైన సామాజిక పరిధిలో అవగాహన చేసుకోవటంలో జాగ్రత్త వహించకుండా ప్రవర్తనావాదులు ప్రత్యేకంగా ఆ యధార్థాలను వర్ణించటానికి, విశ్లేషణకు మాత్రమే పరిమితమైపోయారు. దీనివల్ల ప్రవర్తనావాద రాజనీతిశాస్త్రం పరిమితమైన మార్పులతో కూడిన సంప్రదాయవాద సామాజిక సిద్ధాంతంగా మారిపోయింది.

### 3.5.3 రాజనీతిశాస్త్రం యధార్థంతో సంబంధాలు కోల్పోకూడదు (Should not close the Eyes to the Realities of the situation or "Brute Realities of Politics) :

ప్రవర్తనావాద పరిశోధనలు యధార్థ పరిస్థితుల అవగాహనకు తోడ్పడలేదు. ప్రవర్తనావాద పరిశోధనలన్నీ మొత్తం విశ్లేషణలకే ప్రాధాన్యం యివ్వటం వల్ల రాజకీయ నగ్నసత్యాలు కనుమరుగైపోయాయి. ప్రవర్తనావాదులు రాజనీతిశాస్త్రానికి ఏర్పరచిన నిశ్చలపు సరిహద్దులను ఉత్తర ప్రవర్తనావాదులు కాలరాచి, సంక్లిష్ట పరిస్థితులలో మానవాళి అవసరాలకు అందుబాటులో వుండేటట్లుగా తీర్చిదిద్దాలని ప్రయత్నాలు చేశారు.

### 3.5.4 రాజనీతి శాస్త్రజ్ఞులు, మేధావులు, మానవ విలువలను పరిరక్షించాలి (Political Scientists and Intellectuals had a major role to play in protecting Social and Human values) :

గతంలో మేధావులు నాగరికతకు సంబంధించిన మానవతా విలువలను పరిరక్షించుటలో చారిత్రాత్మకపాత్రను నిర్వహించారు. భవిష్యత్తులో కూడా వారు ఆ పాత్రను నిర్వహించాలి. ఈ విధి వారిలో లోపించిన నాడు వారు కేవలం యాంత్రిక, సాంకేతిక నిపుణులుగా తయారౌతారు. ఫలితంగా మేధావులు విజ్ఞాన ప్రపంచంలో వారికి గల ప్రత్యేక గౌరవ మర్యాదలను, పరిశోధనా స్వాతంత్ర్యాన్ని కోల్పోతారు. కాబట్టి రాజనీతిశాస్త్రంగాని, రాజనీతి శాస్త్రజ్ఞులు కాని మానవ విలువలను పరిరక్షించటంలోను, వాటిని పెంపొందించటంలోనూ క్రియాశీలకమైన పాత్రను పోషించాలి.

### 3.5.5 రాజనీతి శాస్త్రం విలువలతో కూడి ఉండాలి (Value oriented Political Science) :

ప్రవర్తనావాదులు శాస్త్రీయ దృక్పథానికి, విలువలకు అతీతమైన దృక్పథాలకు ప్రాధాన్యతను యివ్వటంతో, ఆచరణలో విలువలకు ప్రాధాన్యత తగ్గిపోతుంది. దీనివలన అసౌకర్య పరిస్థితి ఏర్పడుతుంది. విజ్ఞానానికి విలువ ఆధారంగా వుంటుంది. విలువలు విజ్ఞాన సముపార్జనలో ముందుకు నడిపే శక్తిగా భావింపబడకపోతే విజ్ఞానం దాని లక్ష్యాలను కోల్పోయే ప్రమాదం ఉంది. రాజకీయ పరిశోధనలో విలువలు ప్రముఖపాత్ర వహిస్తాయి. విజ్ఞానశాస్త్రం పేరుతో విలువలు రాజకీయాధ్యాయాల నుండి త్రోసివేయడాన్ని అనుమతించకూడదు. విజ్ఞానాన్ని సరియైన లక్ష్యసాధనకు ఉపయోగించాలంటే విలువలకు ప్రధానస్థానాన్ని యివ్వాలి.

### 3.5.6 విజ్ఞానం కార్యాచరణ విధిని కల్పిస్తుంది (Knowledge must be put to work) :

మేధావులకు గల విషయ పరిజ్ఞానం వల్ల సమాజ రూపురేఖలను దిద్దే బాధ్యత, కార్యక్రమ నిర్వహణా బాధ్యతలు సంక్రమిస్తాయి. తమకు తెలిసిన విజ్ఞానాన్ని ఆచరణలో పెట్టాల్సిన ప్రత్యేక బాధ్యత మేధావులుగా రాజనీతి శాస్త్రజ్ఞులకు ఉంది. "తెలుసుకోవటం అంటే కార్యాచరణ బాధ్యత వహించటం, కార్యక్రమాలు నిర్వహించటం అంటే సమాజాన్ని పునర్వవస్థీకరించటంలో నిమగ్నమవడం" అని డేవిడ్ ఈస్టన్ సూచించాడు. 19 వ శతాబ్దంలో తాత్విక విజ్ఞాన విషయంలో మేధావుల మధ్య విస్తృతమైన అంగీకారం ఉండేది. కాని ప్రస్తుత సమాజంలో ఆదర్శాలు, సిద్ధాంతాల విషయంలో తీవ్ర విబేధాలు ఉన్నప్పుడు ఆ విజ్ఞానశాస్త్రం నిష్ప్రయోజనంగా తోస్తుంది. కనుక రాజనీతిశాస్త్రం సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న సంక్లిష్టతలకు పరిష్కారమార్గం ఆలోచించాల్సిన ఆవశ్యకతను గుర్తించి అందుకు అనుగుణముగా పరిశోధనను తీర్చిదిద్దవలసివుంది.

### 3.5.7 రాజనీతిశాస్త్రానికి రాజకీయ రూపాన్నివ్వాలి (Politicisation of Profession is not only inescapable but Highly Desirable) :

ఒకప్పుడు సమాజంలో మేధావులు సునిశ్చితమైన పాత్రను నిర్వహించాలని, మేధావులు సరియైన లక్ష్యాలను నిర్ణయించే పాత్రను నిర్వహించాలని భావింపబడేది. ఆ భావనే సరయిన భావన. రాజనీతి శాస్త్రం రాజకీయ రూపాన్ని సంతరించుకొనవలసిన అవసరం ఉంది. అలా చేస్తే అన్ని వృత్తిపరమైన సంఘాలు, విశ్వవిద్యాలయాలు వాంఛనీయమైనవిగా రూపొందుతాయి. వృత్తులను రాజకీయీకరణము చేయటము తప్పనిసరి కాకుండా అవసరము కూడా.

పైన పేర్కొన్న లక్షణాల ద్వారా సమకాలీన సంక్లిష్ట పరిస్థితులలో డేవిడ్ ఈస్టన్ రాజనీతి శాస్త్రానికి కొత్త రూపాన్ని రూపొందించాడు. మానవాళి అవసరాల దృష్ట్యా రాజకీయ జీవనంలో అవసరమైన అభివృద్ధి కొరకు రాజనీతి శాస్త్రజ్ఞులకు ఒక ధ్యేయాన్ని కూడా నిర్దేశించాడు.

## 3.6 సారాంశము :

ప్రవర్తనావాదం రాజనీతి శాస్త్రం యొక్క దిశను, దశను మార్చివేసింది. ఇది రాజనీతి శాస్త్రపు గమ్యాలు పరిధి, స్వభావం క్రమపద్ధతుల్లో మార్పును తీసుకొనవచ్చిన మహోద్యమంగా కొనియాడబడింది. దశాబ్ద కాలంలోనే ప్రవర్తనావాదులు తాము ఎంచుకొన్న మార్గము నుండి లక్ష్యాలనుండి దూరమైపోయారు. వారు అనుకున్న లక్ష్యాలను వారు మరచిపోయారు. రాజనీతి

అధ్యయనంలో కేవలం వారు నూతన అధ్యయనాలను, విధానాలను, పద్ధతులను, ప్రక్రియలను కనుగొనడంలో వారు పూర్తిగా నిమగ్నమవడంవలన వాస్తవ విషయాలను విస్మరించారు.

రాజనీతి శాస్త్రాన్ని నిజమైన శాస్త్రంగాను, సమస్యలను తీర్చే శాస్త్రంగాను తీర్చిదిద్దడంలో ప్రవర్తనావాదులు ఘోరంగా విఫలమయ్యారు. ప్రవర్తనావాదులు విషయ పరిశీలనలోను, అధ్యయనంలోను రాజనీతి శాస్త్రం కన్న యితర శాస్త్రాలకే అధిక ప్రాధాన్యత యిచ్చారు. తత్ఫలితంగా రాజనీతి శాస్త్రం తన ఉనికిని కూడా కోల్పోయే స్థాయికి చేరుకుంది.

సాంప్రదాయక, ప్రవర్తనావాద ధోరణులు మధ్య తలెత్తిన వివాదాలు సమసిపోతుండగా, ప్రవర్తనావాదులలోనే బేధాభిప్రాయాలు వచ్చాయి. ప్రవర్తనావాదులు రెండు విభిన్న అధ్యయన వాదులుగా విడిపోయారు. ఇందులో ఒకరైన సైద్ధాంతిక ప్రవర్తనావాదులు సిద్ధాంత నిర్మాణానికి లేక రూపకల్పనకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చారు. ఆధార రహితమైన సూత్రాలను వల్లె వేయసాగారు. దీనికి భిన్నంగా రెండవవారు నిశ్చయాత్మక ప్రవర్తనావాదులు లేక అభ్యుదయ ప్రవర్తనావాదులు రాజకీయ సంఘటనలను అధ్యయనం చేయటంలో నూతన పద్ధతులను కనుగొనటానికి ప్రాధాన్యత నిచ్చారు. మరియు వారు పరిశోధనా పద్ధతులలో గాఢంగా లీనమైపోయి, సూత్రాలనేగాక రాజనీతి శాస్త్రాన్ని సహితం విస్మరించసాగారు అరవైయవదశకం అంతమయ్యే నాటికి వీరిద్దరి మధ్య వివాదాలు బాగా పెరిగి గతంలోని సాంప్రదాయవాదుల ప్రవర్తనావాదులకన్నా మిన్నగా పోట్లాడుకోసాగారు.

తత్ఫలితంగా ఆరవ దశాబ్దం చివరిలో కొంతమంది ప్రవర్తనావాదులు ప్రవర్తనావాదం అంటే నిస్పృహ చెందారు. ప్రవర్తనావాదాన్ని గురించిన ప్రధాన విమర్శ ప్రవర్తనావాద ప్రముఖుల్లో డేవిడ్ ఈస్టేన్ నుండి వెలువడింది. 1969 లో జరిగిన అమెరికా రాజనీతిశాస్త్ర సంఘం వార్షిక సమావేశము యొక్క అధ్యక్షోపన్యాసంలో ప్రవర్తనావాదంలో నూతన ధృక్పథానికి నాంది ప్రస్తావన చేశాడు. ప్రవర్తనావాద ప్రభావం వల్ల జరిగిన రాజకీయ బోధన, పరిశోధన పట్ల తాను అసంతృప్తి చెందానని డేవిడ్ ఈస్టన్ వెల్లడించారు. ప్రవర్తనావాద ప్రభావం వల్ల జరిగిన రాజకీయ బోధన, పరిశోధన పట్ల తాను అసంతృప్తి చెందానని డేవిడ్ ఈస్టన్ వెల్లడించాడు. ప్రవర్తనావాద ధృక్పధం రాజనీతి శాస్త్రాధ్యాయనాన్ని ప్రకృతి విజ్ఞాన శాస్త్రాల పద్ధతుల మీద ఆధారపడిన విద్యా విభాగంగా రూపొందించటానికి ప్రయత్నిస్తోంది. గణితశాస్త్రం, రాజనీతిశాస్త్రం, సామాజిక వాస్తవాలకు సంబంధించిన కృషితోను ప్రవర్తనావాదులు సామాజిక ప్రవర్తనకు సంబంధించిన వాస్తవాలకు దూరమైపోయారు. ఈ విధంగా రాజనీతిశాస్త్రము ప్రస్తుత సమకాలీన ప్రపంచలో సాన్నిహిత్యాన్ని కోల్పోయింది. ప్రవర్తనావాదంపై విమర్శలు తలపెట్టినవారిని ఉత్తర ప్రవర్తనావాదులుగా పిలుస్తున్నారు. ఉత్తర ప్రవర్తనావాదులు రాజనీతి శాస్త్రాన్ని నిజమైన శాస్త్రంగాను, సమస్యలను తీర్చే శాస్త్రంగాను తీర్చిదిద్దడానికి కృషిచేసారు.

## 3.7 మాదిరి ప్రశ్నలు :

1. ఉత్తర ప్రవర్తనావాద మనగానేమి ? అది ఆవిర్భవించడానికి గల కారణాలను వివరించండి ?
2. డేవిడ్ ఈస్టన్ యొక్క ఉత్తర ప్రవర్తనావాద లక్షణాలను పరిశీలించండి ?
3. రాజనీతి శాస్త్రంలో ప్రవర్తనావాద పునాదుల్నే కదిలించిన విమర్శనావాదంగా ఉత్తర ప్రవర్తనావాదాన్ని పరిశీలించండి ?

## లఘు వ్యాస ప్రశ్నలు :

1. ఉత్తర ప్రవర్తనావాద ప్రత్యేక లక్షణాలు
2. ప్రవర్తనావాద పరిమితులు

## 3.8 చదువదగిన గ్రంథాలు :


1. జె.సి.చార్ల్స్‌వర్త్ : కాంటెంపరరీ పొలిటికల్ ఎనాలసిస్
2. రాబర్ట్ ఎ.డాల్ : మోడరన్ పొలిటికల్ ఎనాలసిస్
3. యస్.పి. వర్మ : మోడరన్ పొలిటికల్ థియరి
4. జె.సి.జోహరి : కాంటెంపరరీ పొలిటికల్ థియరి


- డా॥ కె. రామచంద్రమూర్తి

పాఠం - 4

# నిర్మితుల విధుల దృక్పథం

## (STRUCTURAL - FUNCTIONAL APPROACH)

విషయసూచిక


4.1 లక్ష్యాలు

4.2 పరిచయం

4.3 నిర్మితులు - విధుల దృక్పథం - అర్థ వివరణ

4.3.1 టాల్కాట్ పార్సన్స్ నమూనా

4.3.2 సానుకూలం

4.3.3 లక్ష్యసాధన

4.3.4 సమగ్రత

4.4 ఆల్మండ్ నిర్మితులు - విధుల దృక్పథం

4.4.1 మొదటి దశ

4.4.2 రెండవదశ

4.4.3 ఉత్పాదక విధులు

4.4.4 ఉత్పాదిత విధులు

4.4.5 రాజకీయ సామాజీకీకరణ

4.4.6 రాజకీయ భర్తీ

4.4.7 ప్రయోజనాల వ్యక్తీకరణ

4.4.8 ప్రయోజనాల సమీకరణ

4.4.9 రాజకీయ ప్రసారం

4.5.1 నియమావళి రూపకల్పన

4.5.2 నియమావళి నిర్వహణ

4.5.3 నియమావళి - న్యాయ నిర్ణయం

4.6 మూడవదశ

4.7 సామర్థ్య విధులు

4.7.1 వెలికి తీయగల సామర్థ్యం

4.7.2 అదుపుచేసే సామర్థ్యం

4.7.3 పంపిణీ సామర్థ్యం

4.7.4 లాంచనాల సామర్థ్యం

4.7.5 స్పందనా సామర్థ్యం

4.7.6 స్వసమాజ అంతర్జాతీయ సామర్థ్యం

4.7.7 సామర్థ్యం - నిర్ణాయకాలు
4.8 రాజకీయ సామర్థ్యం - రాజకీయాభివృద్ధి
4.9 పద్ధతి నిర్వహణ - అనుసరణీయత - విధులు
4.10 విమర్శ
4.11 సారాంశము
4.12 నమూనా ప్రశ్నలు
4.13 చదువదగిన గ్రంథాలు

## 4.1 లక్ష్యాలు :

ఈ భాగాన్ని చదివాక మీరు నిర్మితులు, విధుల దృక్పథం అంటే ఏమిటి ? రాజకీయ విశ్లేషణకు నిర్మితులు విధుల దృక్పథం యొక్క అవసరం, దాని సామర్థ్య విధులను గురించి తెలుసుకుంటారు.

## 4.2 పరిచయం :

రాజనీతి శాస్త్ర ఆధునిక అధ్యయన దృక్పథాలలో నిర్మితులు - విధుల దృక్పథం ఒకటి. ఆధునిక కాలంలో విశ్లేషణ ఒక కొత్త రూపాన్ని సంతరించుకొన్నప్పటికీ, ప్రాచీన కాలంలోనే ఇది అమలులో ఉన్నట్లుగా చెప్పవచ్చు. ప్రాచీన గ్రీకు రాజనీతి తత్వవేత్తలు, ప్లేటో, అరిస్టాటిల్ రాజకీయ వ్యవస్థలు కొనసాగించటానికి, వాటి మనుగడకు, అవి నిర్వహించాల్సిన విధులను వివరించారు. విధుల ప్రాతిపదికగానే అరిస్టాటిల్ ప్రభుత్వాల వర్గీకరణ చేసాడు.

సామాజిక శాస్త్రాల అధ్యయనంలో సాంప్రదాయిక పద్ధతులు వాస్తవాలను వెలికి తీయడానికి అంతగా సహకరించక పోవడంతో ఆధునాతన పద్ధతుల ద్వారా విషయపరిశీలన మొదలైంది. సంస్థలు, వాటి కర్తవ్యాల అధ్యయనంతో బాటుగా అందులోని వ్యక్తుల, వర్గాల ప్రవర్తనను కూడా పరిశీలించడం అవసరమని గుర్తించారు. ఆధునిక కాలంలో ఒకే సంస్థ వివిధ కర్తవ్యాలను నిర్వహించడం, అంతేకాకుండా రాజకీయ, ఆర్థిక సామాజిక జీవనంలో, వ్యక్తుల వర్గాల పాత్ర అభివృద్ధి చెందడం, కొత్త సంస్థలు ఆవిర్భవించడం మొ॥న కారణాలవల్ల ప్రవర్తనల పరిశీలన ఆవశ్యకతను మరింత గుర్తించారు. దీని ఫలితమే ప్రవర్తనావాద ఉద్యమం, నూతన పద్ధతుల, దృక్పథాల అనుసరణ.

## 4.3 నిర్మితులు - విధుల దృక్పథం - అర్థ వివరణ (Structural - Functional Analysis - Meaning) :

నిర్మితులు, విధుల విశ్లేషణలో వ్యవస్థ నిర్వహించాల్సిన విధులకు ప్రథమస్థానముంటుంది. ఒక వ్యవస్థ నిలిచి ఉండటానికి, కొనసాగటానికి అది నిర్వహించాల్సిన కర్తవ్యాలేమిటో కనుగొనే ప్రయత్నం విశ్లేషకులు చేస్తారు. ఆ తర్వాత కర్తవ్య నిర్వహణకు జరిపే నిర్మితులను తెలుసుకొంటారు. ఉదా॥ మానవుని మెదడు ఏవిధంగా పనిచేస్తుంది ? అనే ప్రశ్నకంటే మానవ శరీరానికి పోషణ ఏ విధంగా జరుగుతోంది ? చూడటం, వినటం వంటి విధులు ఏ విధంగా నిర్వహించబడుతున్నాయి ? ఏ ఏ శరీర భాగం ఏ విధిని నిర్వర్తిస్తుంది? అన్న ప్రశ్నలతో పరిశీలన మొదలవుతుంది. వివరంగా చెప్పాలంటే విధుల సంబంధమైన ప్రశ్నల ద్వారా నిర్మితులకు సంబంధించిన సమాధానాలు సాధించటానికి నిర్మితులు - విధుల విశ్లేషకులు ప్రయత్నిస్తారు. అందువల్లే కొందరు ఈ విశ్లేషణను విధులు - నిర్మితుల విశ్లేషణ అనడం సముచితమంటారు.

### 4.3.1 టాల్కాట్ పార్సన్స్ నమూనా :

1. తరహా నిర్వహణ లేదా ఉద్రిక్త నిర్వహణ (Crisis Management or System Management) : సామాజిక వ్యవస్థ తరహాను లేదా రూపాన్ని నిర్వహించడం వ్యవస్థ కొనసాగడానికి ఎంతో అవసరం. అంతేకాకుండా విధుల నిర్వహణలో సమాజంలో ఏర్పడే ఉద్రిక్తతల తాకిడికి తట్టుకొనే విధంగా వ్యవస్థను రూపొందించడం ఒక భాగం. సమాజంలోని సభ్యుల, వర్గాల ప్రవర్తనారీతులు వంశానుగతంగా కొనసాగుతూ వుంటాయి. ఈ విధమైన ప్రక్రియలో సామాజీకీకరణ ప్రతినిధులు అయిన (Agents), కుటుంబం విద్యాసంస్థలు, మతసంస్థలు, వివిధ సాంఘిక సంస్థల పాత్ర ఉంటుంది. సమాజంలో అనుసరించబడుతూ వున్న విలువలు, కొనసాగే కృషి ఇతర మార్గాల ద్వారా ఉద్రిక్తతలు నుంచి సభ్యులను కాపాడటానికి సాంఘిక వ్యవస్థ కృషి చేస్తుంది.

### 4.3.2 సానుకూలం (Adaptability) :

సాంఘిక వ్యవస్థలో భాగాలైన ఉపవ్యవస్థలు, వ్యక్తులు, వ్యక్తుల సముదాయాల నుంచి వచ్చే అనేక కోర్కెల వల్ల వ్యవస్థపై ఒత్తిడి ఏర్పడుతుంది. కోర్కెల సాధనకు వివిధ వర్గాలు, వ్యక్తులు, ఉపవ్యవస్థలు కృషి చేస్తాయి. కోరికలను సమకూర్చడంలో వ్యవస్థకు తగిన సామర్థ్యం ఉండాలి. సముచిత రీతిలో ఉత్పత్తి, పంపిణీ, నియంత్రణ వంటి కర్తవ్యాల నిర్వహణను సాంఘిక వ్యవస్థ చేపట్టవలసి ఉంటుంది.

### 4.3.3 లక్ష్యసాధన Goal Attainment :

నిర్ణీత లక్ష్యాలసాధన సాంఘిక వ్యవస్థ మరో విధి. ప్రజాశ్రేయస్సు, పరిరక్షణ, ఆర్థికాభివృద్ధి, రాజకీయ సాంఘిక భద్రత మొ॥న లక్ష్యాల సాధనకు సాంఘిక వ్యవస్థ ఉపవ్యవస్థ అయిన రాజకీయ వ్యవస్థ కృషి చేస్తుంది. ఈ లక్ష్యాల సాధనలో యితర ఉపవ్యవస్థల (ఉదా॥కు మత, విద్యాపరమైన ఆర్థిక వ్యవస్థల) సహకారం, సమిష్టికృషి అవసరమౌతాయి. భౌతిక, ఆర్థిక మానవ వనరుల సమీకరణ, వివిధ వ్యక్తులు సంస్థలు, వర్గాలు నిర్వహించాల్సిన పాత్రలు నిర్ణయించడం మొ॥న కర్తవ్యాల నిర్వహణద్వారా లక్ష్యసాధనకు సాంఘిక వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ ద్వారా కృషి చేస్తుంది.

### 4.3.4 సమగ్రత (Integrity) :

సమాజంలో వివిధ వర్గాలు, వ్యక్తుల ప్రయోజనాల పరస్పర సంబంధాల మధ్య సంఘర్షణలు తీవ్రమౌతాయి. దీని ఫలితంగా ఉద్రిక్తతలుఏర్పడి సమగ్రతకు భంగం కలిగే ప్రమాదముంది. ఇట్లాంటి ప్రమాదం నుండి వ్యవస్థను కాపాడటానికి సామరస్య పూర్వక, అనునయ పూర్వక, అధికార పూర్వక విధులను సముచిత నిర్మితుల ద్వారా వ్యవస్థ నిర్వహిస్తుంది. ఈ సందర్భంలో రాజకీయ వ్యవస్థ పాత్ర చెప్పుకోదగినదిగా ఉంటుంది. వివక్షవిధానం, ఆర్థిక యిబ్బందులు, వర్ణవైషమ్యాలు, ప్రాంతీయ తత్వాలు, భాషోన్మాదాలు మొ॥న పరిస్థితులు ఉద్రిక్తతలను పెంపొందించి సమగ్రతకు భంగకరంగా పరిణమిస్తాయి.

## 4.4 ఆల్మండ్ నిర్మితులు - విధుల దృక్పథం (Structural - Functional Analysis) :

రాజనీతి శాస్త్రంలో నిర్మితులు, విధుల దృక్పథాన్ని మొదటిసారిగా వినియోగించింది ఆల్మండ్. ఇతడు కోల్మన్‌తో కలిసి రచించిన "పొలిటిక్స్ ఆఫ్ ది డెవలపింగ్ ఏరియాస్" లోనూ పావెల్‌తో కలిసి రచించిన "తులనాత్మక రాజకీయాలు" అనే గ్రంథంలోనూ ఆల్మండ్ తన ధృక్పథాన్ని వివరించాడు. రాజకీయ వ్యవస్థ అనే భావన ఆధారంగా కోల్ భావనలకు రూపకల్పన చేసి ఆల్మండ్ నిర్మితులు - విధుల ధృక్పధాన్ని సూత్రీకరించాడు. ఆల్మండ్ దృక్పథంలో 3 దశలున్నాయి అవి :

**మొదటిదశ :** 1956 లో "జనరల్ ఆఫ్ పాలిటిక్స్" ప్రచురించిన "తులనాత్మక రాజకీయ వ్యవస్థ" అనే వ్యాసంలో ఆల్మండ్ రాజకీయ వ్యవస్థ గురించి వ్రాసాడు. రాజకీయ వ్యవస్థ అనే భావాన్ని ఆల్మండ్ "ఈస్టన్" నుంచి గ్రహించాడు. రాజకీయ

నిర్ణయాలు తీసుకోవడానికి సంబంధించి రూపుదిద్దుకొన్న చర్యలన్నింటినీ ఇముడ్చుకొనే భావనే వ్యవస్థ. ఆల్మండ్ అభిప్రాయంలో వ్యవస్థలో పరస్పర సంబంధాలుంటాయి. సమాలోచనలు వ్యవస్థలోని వివిధ భాగాల మధ్య ఉంటాయి. ఈ సంబంధాలను ఒక పరిపూర్ణత ఉన్న వ్యవస్థలోని విభాగాలకు మధ్య ఉన్న సంబంధాలుగా గుర్తించాలి. ఈ సంబంధాలలో ఒక విధమైన స్థిరత్వాన్ని లేదా నిశ్చలత్వాన్ని గమనించవచ్చు. ఈ స్థిరత్వాన్నే ఆల్మండ్ "మారుతుండే సమతుల్యం" (Changing Equilibrium) అంటాడు. అంటే వ్యవస్థ ఒడిదుడుకులను ఎదుర్కొనవలసివచ్చినా ఈ విధమైన సమతుల్య సూత్రంపై ఆధారపడి ఉంటుందని ఇతడి భావం. ఇదేవిధంగా ఈస్టన్ వ్యవస్థలకు దివ్యమైన అనుకూలనాశక్తి ఉందంటాడు. ఆల్మండ్ అభిప్రాయంలో వ్యవస్థలో జరుగుతుండే ప్రక్రియ కంటే వ్యవస్థ ఎక్కువ ప్రయోజనకరమైంది. ఒక క్రియాత్మక వ్యవస్థగా రాజకీయ వ్యవస్థను పరిగణించడంలో ఆల్మండ్‌పై మాక్స్‌వెబర్, టాల్కాట్ పార్సన్స్‌ల ప్రభావం ఎక్కువగా కన్పిస్తుంది. క్రియకు లేదా చర్యకు ప్రాధాన్యతనివ్వడం వల్ల వ్యవస్థను కేవలం చట్టబద్ధమైన నిర్మాణంగా కాకుండా వాస్తవికతతో దాన్ని పరిశీలించడానికి వీలౌతుందని ఇతడు భావిస్తాడు.

**4.4.2 రెండో దశ** : 1960 లో ప్రచురితమైన "పాలిటిక్స్ ఆఫ్‌ది డెవలపింగ్ ఏరియాస్" అనే గ్రంథంలో ఆల్మండ్ రాజకీయ వ్యవస్థకు సంబంధించి కొన్ని అభిప్రాయాలతో నిర్మితులు - విధుల సిద్ధాంత వివరణకు ఉపక్రమించాడు. రాజకీయ వ్యవస్థలన్నిటికీ నాలుగు ప్రధాన లక్షణాలుంటాయని ఇతని అభిప్రాయం అవి

1. అన్ని రాజకీయ వ్యవస్థలలోనూ రాజకీయ నిర్మితులుంటాయి. ఇవి మానవ సంబంధాలు క్రమపద్ధతిలో కొనసాగేటందుకు తోడ్పడతాయి.
2. అన్ని రాజకీయ వ్యవస్థలకు కొన్ని సాధారణ విధులుంటాయి.
3. రాజకీయ నిర్మితులు బహుళార్ధక విధులు నిర్వహిస్తాయి.
4. సంస్కృతి పరంగా రాజకీయ వ్యవస్థలు మిశ్రమ వ్యవస్థలు - అంటే అవి ఆధునిక, సాంప్రదాయిక సంస్కృతుల మిశ్రమం. అంతేకాకుండా వీటికి, ఉపసంస్కృతులకు మధ్య మిశ్రమం కన్పిస్తుంది. పై లక్షణాల ఆధారంగా ఆల్మండ్ రాజకీయ వ్యవస్థల విధులను నిర్ణయించాడు. అవి 1. ఉత్పాదన లేక రాజకీయ విధులు (Input or Political Functions) 2. ఉత్పాదిత లేదా ప్రభుత్వ విధులు (Output or Governmental Functions) ఈ రెండు రకాల విధుల నిర్వహణా రీతులను బట్టి రాజకీయ వ్యవస్థ శ్రేణిని నిర్ణయించవచ్చని ఆల్మండ్ అభిప్రాయం.

### 4.4.3 ఉత్పాదక విధులు :

రాజకీయ ఉత్పాదక విధులు అయిదు : అవి

1. రాజకీయ సామాజీకరణ (Political Socialisation)
2. రాజకీయ భర్తీ (Political Recruitment)
3. ప్రయోజనాల వ్యక్తీకరణ (Interest Articulation)
4. ప్రయోజనాల సమీకరణ (Interest Aggugation)
5. రాజకీయ ప్రసారం (Political Communication)

### 4.4.4 ఉత్పాదిత విధులు మూడు అవి :

1. నియమావళి రూపకల్పన (Rule making)
2. నియమావళి నిర్వహణ (Rule application)
3. నియమావళి న్యాయ నిర్ణయాలు (Rule adjuolication)

### 4.4.5 రాజకీయ సామాజీకరణ (Political Socialisation) :

ఉత్పాదక విధులు ప్రభుత్వేతర ఉపవ్యవస్థలచేత, సమాజం చేత, సాధారణ పరిసరాల చేత నిర్వహించబడతాయి. ఉత్పాదక విధులు ప్రభుత్వానికి సంబందించినవి. ఇవి సాంప్రదాయికమైనవి. పౌరసత్వపు శిక్షణ ప్రక్రియనే రాజకీయ సమాజీకరణం అని చెప్పవచ్చు. అనగా రాజకీయ సంస్కృతిలో ప్రవేశించే ప్రక్రియే రాజకీయ సామాజీకరణం ఇందులో రాజకీయ వ్యవస్థకు సంబందించిన అభివృత్తులు కూడా వుంటాయి.

### 4.4.6 రాజకీయ భర్తీ (Political Recruitment) :

రాజకీయ సమాజీకరణ సమాప్తితో రాజకీయ భర్తీ ప్రారంభం అవుతుంది. రాజకీయ వ్యవస్థకు చెందిన వివిధ ప్రత్యేక పాత్రలకు పౌరులను భర్తీ చేయడం జరుగుతుంది. ఈ విధి ప్రత్యేక రాజకీయ పాత్రల సమాజీకరణకు చెందినదై ఉంటుంది. రాజకీయ సమాజీకరణం తర్వాత రాజకీయ పాత్రల సామాజీకరణ మొదలవుతుంది.

### 4.4.7 ప్రయోజాల వ్యక్తీకరణ (Interest Articulation) :

రాజకీయ సామాజీకరణ విధులకు ప్రయోజనాల వర్గీకరణ విధులు దగ్గర సంబంధాలు కలిగి ఉంటాయి. రాజకీయ సామాజీకరణ చెందిన వ్యక్తులు తమ అవసరాలలో ఏవి రాజకీయ సంబంధాన్ని కల్గి ఉంటాయో, వాటిని నిర్దిష్టంగా వ్యక్తీకరించగలిగి ఉంటారు.

### 4.4.8 ప్రయోజనాల సమీకరణ (Interest Aggugation) :

సమాజంలోని వ్యక్తుల, సమూహాల ప్రయోజనాలను సమన్వయ పరచి, ఒకదానితో ఒకటి మిళితం చేసి, సాధారణ విధానాలను రూపొందించే మార్గమే ప్రయోజనాల సమీకరణ అని ఆల్మండ్ భావించాడు. ప్రత్యేక సామాజిక పద్ధతికి బద్ధులైన వ్యక్తులను రాజకీయ స్థానాలకు భర్తీచేయటం ద్వారా కూడా ప్రయోజనాల సమీకరణం సాధించవచ్చును. కొన్ని వ్యవస్థలలో ఈ సమీకరణ విధులను శాసన, కార్య నిర్వాహక వర్గాలు, ఉద్యోగిస్వామ్య బృందం, ప్రసార మాధ్యమ ప్రయోజనవర్గం రాజకీయ పార్టీలు నిర్వర్తిస్తుంటాయి. ప్రయోజనాల సమీకరణానికి ప్రత్యేకమైన ఆధునిక వ్యవస్థగా రాజకీయ పార్టీలను పేర్కొనవచ్చు.

### 4.4.9 రాజకీయ ప్రసారము (Political Communication) :

ఆల్మండ్ దృష్టిలో రాజకీయ వ్యవస్థ నిరంతరం ప్రసారాలచే ప్రభావితం అవుతున్న ఒక బహిరంగ వ్యవస్థ. రాజకీయ ప్రసారం ప్రధానంగా హద్దుల నిర్ణయీకరణ విధిని నిర్వర్తిస్తుంది. ప్రసార మాధ్యమానికి స్వేచ్ఛ కలిగించటం వల్ల సమాజంనుండి ప్రభుత్వానికి, ఒక రాజకీయ నిర్మితినుండి మరొక రాజకీయ నిర్మితికి స్పందిత సమాచారం లభ్యమవుతుంది. రాజకీయ పార్టీలు, శాసనవర్గాలు, ఉద్యోగిస్వామ్యం నుండి వచ్చే ప్రయోజనాల వ్యక్తీకరణ, ఈ రాజకీయ ప్రసార వ్యవస్థ అందజేస్తుంది. నియంతృత్వ వ్యవస్థలో ఈ రాజకీయ ప్రసారంపై ప్రభుత్వానికే గుత్తాధిపత్యం ఉంటుంది.

## 4.5 ఉత్పాదితాల విధులు (Out put Functions) :

ఆల్మండ్ వర్తమాన వ్యవస్థలో ఉత్పాదక విధులకు ఉత్పాదిత విధులకంటే ప్రాముఖ్యం ఎక్కువ. అయినప్పటికీ ఉత్పాదిత విధులు కూడా వ్యవస్థ విధులలో అంతర్భాగాలు. వీటినే ప్రభుత్వ విధులని కూడా అంటారు. ప్రభుత్వ విధులను వర్గీకరించటం ప్రాచీన కాలం నుంచి రాజనీతి శాస్త్రజ్ఞులు చర్చించిన సమస్యలలో ఒకటి. అరిస్టాటిల్, పోలీబియస్, సిసిరో, హాబ్స్, లాక్,

మాంటెస్క్యూ మొదలైన వారు దీనిని గురించి చర్చించారు. సాధారణంగా ప్రభుత్వ విధులు మూడురకాలని అందరూ అంగీకరించారు. అవి శాసన నిర్మాణ (legislative), కార్యనిర్వహణ (Executive), న్యాయపరిపాలన (Judicial). సమాజంలో సభ్యులు సంఘర్షణలు లేకుండా నివసించాలంటే వారి ప్రవర్తనను క్రమబద్ధం చేసే నియమ నిబంధనలు అవసరం. వాటిని రూపొందించటానికి, అమలు పరచటానికి, సంఘర్షణలు ఏర్పడినప్పుడు న్యాయనిర్ణయం చేయడానికి కొన్ని నిర్మితులూ అవసరం. వీటిని నియమావళి రూపకల్పన, నియమావళి నిర్వహణ, నియమావళి న్యాయనిర్ణయం అని మూడు విధాలుగా విభజించాడు.

### 4.5.1 నియమావళి రూపకల్పన (Rule Making) :

శాసనాలను చేయడం ప్రత్యేక నిర్మితుల లక్ష్యం. అది ఒక ప్రత్యేకమైన ప్రక్రియ. అన్ని రాజకీయ వ్యవస్థలలో నియమావళి రూపకల్పన ఏదో ఒక రూపంలో తప్పక ఉంటుంది. సాధారణ రాజకీయ వ్యవస్థలలో నియమావళి కల్పన, ప్రయోజన సమూహాలపై ఆధారపడి ఉంటుంది. సాంప్రదాయ సమూహాలలో లేదా సాంప్రదాయ రాజకీయ వ్యవస్థలలో రాజా, మంత్రులు కలసి నియమావళి కల్పన నిర్మితిగా ఏర్పడతారు. కాలక్రమేణా రాజరికాలు అధికారాలు కోల్పోయి నియమావళి కల్పన ప్రక్రియలో రాజుబదులు పార్లమెంటు శాసన కల్పన విధులను నిర్వర్తిస్తుంది.

### 4.5.2 నియమావళి నిర్వహణ (Rule Application) :

సమాజంలో నియమాలను అమలు చేయడమే నియమావళి నిర్వహణ లక్ష్యం. నియమావళిని అమలు చేయగల, సమాచారాన్ని చేరవేయగల ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించుటకు కావలసిన మూలకములు సంపాదించుటలో సమస్యలు ఎదురౌతాయి. సమాజంలో నియమావళిని అమలు పరచటానికి పాలనా సామర్థ్యత అత్యున్నత స్థాయిలో ఉండాలి. ఫలితంగా ఉద్యోగిస్వామ్యం అధికప్రాధాన్యతలు సంతరించుకొంటుంది. నియమావళి నిర్వహణ, లక్ష్యాలు, విధులు, పరస్పర అంత చర్యలకు వాటి ఎంపికకు సాధనమౌతాయి. అభివృద్ధిచెందిన, ప్రత్యేకతలు గల నిర్మితులు (Speciolised Structure) రాజకీయ వ్యవస్థ నిర్వహణా సామర్థ్యానికి తోడ్పడతాయి. నూతన లక్ష్యాలను చేరుకోవడానికి సమర్థవంతమైన నియమావళి నిర్వహణ నిర్మితులుండటం చాలా అవసరం.

### 4.5.3 నియమావళి న్యాయ నిర్ణయం (Rule Adjudication) :

నియమాలను అతిక్రమించకుండా చూడటమే నియమాల వ్యాఖ్యానం. నియమాలను అతిక్రమించినప్పుడు అందుకు విధించవలసిన శిక్షలను ముందుగానే నిర్ణయించాలి. న్యాయ సంస్థల నిర్మితులకు, న్యాయ నిర్ణయాలతో దగ్గర సంబంధం ఉంటుంది. వివాద పరిస్థితులు పరిష్కరించటానికి న్యాయ నిర్ణేతలు న్యాయనిర్ణయాన్ని చేస్తారు. వివాద పరిస్థితుల రాజకీయ వ్యవస్థలో ఏ దశలో ఎదురయినా న్యాయ నిర్ణయం పరిష్కరిస్తుంది. ఈ విధులన్ని వ్యవస్థ, వ్యవస్థ నిర్మితులకు సంబంధించి ఉంటాయి. వ్యవస్థలోని సమతౌల్యం కాపాడటానికి సంబంధాలను క్రమపరచే సాధనాలకు న్యాయ నిర్ణయం ప్రాతినిధ్యం వహిస్తుంది. నిర్మితులు విధులకు మధ్యగల సంబంధాలకు నిర్మితుల - విధుల విశ్లేషణకు క్రమబద్ధమైన స్వభావాన్ని కలుగజేస్తుంది. వ్యవస్థ యొక్క హద్దులు గుర్తించబడతాయి. ఆ హద్దులలోనే చర్య ప్రతిచర్యలు స్వభావాలు నిర్వచింపబడతాయి. ఆ హద్దులలోనే రాజకీయ వ్యవస్థ పరిసరాలనుండి ఉత్పాదకములను స్వీకరిస్తుంది. అలాంటి ఉత్పాదకములు వ్యవస్థలో మార్పబడి ఉత్పాదితములుగా అవతరిస్తాయి.

## 4.6 మూడోదశ :

1965 లో ప్రచురించిన పరిశోధన వ్యాసంలోను, 1966 లో ప్రచురించిన గ్రంథంలోను ఆల్మండ్ నిర్మితులు - విధుల సిద్ధాంతాలలో మార్పులు, చేర్పులు చేశాడు. వీటి ప్రకారం రాజకీయ వ్యవస్థలకు ఆరు కర్తవ్యాలుంటాయి. అవి

1. ప్రయోజనాలు వ్యక్తీకరణ
2. ప్రయోజనాల సమీకరణ
3. రాజకీయ ప్రసారం
4. నియమావళి రూప కల్పన
5. నియమావళి నిర్వహణ
6. నియమావళి న్యాయ నిర్ణయం

ఈ విధంగా ఆల్మండ్ నిర్ణయించటానికి కొన్ని కారణాలున్నాయి.

సమతౌల్య పరిరక్షణకు తాను ఇచ్చిన ప్రాధాన్యతవల్ల తన సిద్ధాంతం అభివృద్ధి చెందుతున్న రాజకీయ వ్యవస్థల విశ్లేషణకు తోడ్పడవన్న విమర్శలోని సహేతుకతను ఇతను గుర్తించాడు. విధుల వర్గీకరణ రాజకీయ వ్యవస్థ అభివృద్ధి స్థాయినిగాని, దిశనుగాను తెలియచేయడం లేదన్న విమర్శనుకూడా అంగీకరించాడు. వీటిని దృష్టిలో పెట్టుకుని రాజకీయ వ్యవస్థలు ఎందుకు, ఎలా మారుతున్నాయన్న విషయాలను విపులంగా చర్చించాడు. వీటిలో ఒకటి రాజకీయ వ్యవస్థ విధులు మార్పులకు గురి అయ్యే విధానం, రెండోది పరిసరాలలోని ఒక సభ్యునిగా రాజకీయ వ్యవస్థ ఎలా వ్యవహరిస్తుందన్న విషయం. రాజకీయ వ్యవస్థ నిర్వహణ, అనుసరణీయత, అంటే దీర్ఘకాలంగా మార్పులు చేయాలన్న ఒత్తిడులను వ్యవస్థ ఏ విధంగా తట్టుకొని వ్యవహరిస్తుందన్నది మూడోది. ఈ కర్తవ్యం రాజకీయ సామాజీకీకరణ, రాజకీయ భర్తీలకు సంబంధించింది. తన నిర్మితులు విధుల సిద్ధాంతంలో మార్పులు సూచిస్తూ తాను రాజకీయ వ్యవస్థ స్వరూప నిర్ణయంలో పరస్పరాధీనతకు ప్రాధాన్యమిస్తానని సామర్థ్యానికి కాదని అంటాడు. రాజకీయ వ్యవస్థలు సామర్థ్య విధులను కూడా నిర్వహిస్తాయని అంటాడు.

## 4.7 సామర్థ్య విధులు (Capabilities of System) :

రాజకీయ వ్యవస్థల సామర్థ్య విధులు విశ్లేషణ సశాస్త్రీయమైన వివరణకు భవిష్యత్తులో జరిగేది తెలుపటానికి తోడ్పడుతుందని ఆల్మండ్ భావం. వ్యవస్థలో అమలు జరిగే విధానాలను గురించి చర్చించడానికి అభిప్రాయ వ్యక్తీకరణకు, రాబోయే కాలంలో సంభవించే రాజకీయ మార్పును గమనించడానికి కూడా ఈ విశ్లేషణ సహాయపడుతుందని ఇతనంటాడు. అంతేకాకుండా లక్ష్యసాధనకు అవసరమైన నిర్మితులను, దృక్పథాలను నిర్ణయించటానికి కూడా తోడ్పడుతుంది. సాధించదలచిన అభివృద్ధి స్థాయిని నిర్ణయించి వీటిని రూపకల్పన చేసుకోవచ్చు. ఆశించిన స్థాయిని చేరుకోవటానికి లనువైన సామాజీకీకరణ భర్తీ వివరాలను నిర్ణయించుకోవచ్చు. రాజకీయ వ్యవస్థల సమర్థతా విధులు కింది విధంగా ఉంటాయి.

### 4.7.1 వెలికి తీయగల సామర్థ్యం (Extractive Capacity) :

దేశ, అంతర్జాతీయ వాతావరణం నుంచి అంటే లోపలి, వెలుపలి పరిసరాలనుంచి భౌతిక, మానవ వనరులను వెలికి తీయడానికి రాజకీయ వ్యవస్థకున్న సామర్థ్యాన్ని వెలికి తీసే సామర్థ్యం అంటారు. వ్యవస్థలోని సభ్యులనుంచి, సంస్థలనుంచి పన్నులు వసూలు చేసే సామర్థ్యం సభ్యుల సేవలను వెలికి తీసి వినియోగించే సమర్థతను వెలికి తీసే సామర్థ్యం అనవచ్చు. ఈ సామర్థ్యాన్ని విశ్లేషించడంలో ఎంత వరకు వ్యవస్థ వెలికి తీయగలుగుతున్నది ? ఎవరినుంచి ? వనరులు సమకూర్చడంలో

సమకూర్చేవారి ఒప్పుదల ఎంతవరకు ఉంది? వెలికి తీసే పద్ధతులేమిటి ? (భయపెట్టటం, సామర్థ్యం, బలప్రయోగం మొదలైనవి). మొదలైన ప్రశ్నలకు సమాధానాలుగా కనుక్కోవాలి. వనరులు వెలికి తీయడంలో వాటిని సమకూర్చిన వారికి తిరిగి ఏమైనా చెల్లించాల్సి ఉంటుందా ? అని కూడా పరిశీలించాలి. వెలికి తీసే సామర్థ్యాన్ని నిర్ణయించడంలో వినియోగించిన నిర్మితులు పద్ధతులు కూడా తెలుసుకోవాలి. ఈ ప్రక్రియలో సమర్థవంతమైన ఉద్యోగులున్నారా ? వారు సక్రమంగా విధినిర్వహణ జరుపుతున్నారా ? అనే విషయాలు గ్రహించాలి. వెలికి తీయదగిన వనరులు ఎటువంటివో పరిశీలించటం కూడా ప్రయోజనకరమే. ఉదాహరణకు కొన్ని వ్యవస్థలలో 'నూనె' ద్వారా ఆదాయం ఎక్కువ, మరొకొన్ని వ్యవసాయ ప్రధానమైనవి. ఇతర పరిస్థితులెంతగా సహకరించినా పంటలు సక్రమంగా లేనప్పుడు వెలికి తీయగల సామర్థ్యం బాగా తగ్గుతుంది.

### 4.7.2 అదుపు చేసే సామర్థ్యం (Regulative capability) :

వ్యక్తులు, సమూహాల ప్రవర్తనపై రాజకీయ వ్యవస్థకున్న నియంత్రణా సామర్థ్యమే అదుపుచేయగల సామర్థ్యం. వ్యక్తుల సమూహాల ప్రవర్తనను నియంత్రించడానికి బలప్రయోగం చేయడానికి రాజకీయ వ్యవస్థకు అధికారముంటుంది. ఈ అధికారమే రాజకీయ వ్యవస్థకు ఉన్న, ఇతర వ్యవస్థలకు లేని ప్రత్యేక లక్షణం. ఈ రకమైన సామర్థ్యాన్ని పరిశీలించేటప్పుడు ఏ వ్యక్తులు, సంఘాలు నియంత్రణకు లోనవుతున్నాయో తెలుసుకోవాలి. వ్యక్తిగత, సమిష్టి జీవనానికి చెందిన ఏ అంశాలు నియంత్రింపబడుతున్నాయో గ్రహించాలి. అంతేకాకుండా నియంత్రణ ఎంత తరచుగా జరుగుచున్నది పరిశీలించాలి. అమెరికాలో ఆర్థిక జీవనంపై వ్యవస్థ నియంత్రణ చెప్పుకోదగినదిగా ఉంటుంది. వ్యాపారస్థులు అక్రమ పద్ధతులు అనుసరించకుండా నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు లభించేటట్లుగా, వివిధ సంఘాలు అణిచివేత విధానాన్ని అనుసరించకుండా, మరి ఇతర విషయాలలోను వివాహం ఆరోగ్యం, తల్లితండ్రుల బాధ్యతలు మొదలైన విషయాలపై కూడా వ్యవస్థ అదుపు ఆజ్ఞలు అమలు చేయవచ్చు. అయితే ఇలా చేసేటప్పుడు వ్యవస్థ అధికారానికి, వ్యక్తిగత సామూహిక హక్కులకు మధ్య సమన్వయం సమకూర్చే విధంగా అదుపును వినియోగించాల్సి ఉంటుంది.

వెలికితీయడం, నియంత్రణ ఈ రెండు పరస్పరాశ్రయాలు. ఎందుకంటే అదుపు చేయడానికి వ్యవస్థకు వనరులు అవసరం. అలాగే వనరుల సాధనకు సముచిత నియంత్రణ, బలప్రయోగం కూడా అవసరం.

### 4.7.3 పంపిణీ సామర్థ్యం (Distributive Capabilities) :

రాజకీయ వ్యవస్థనుంచి సమాజంలోని వ్యక్తులకు, సంఘాలకు వస్తువుల సేవలు, గౌరవ పురస్కారాలు, హోదాలు వివిధ తరహా అవకాశాలు సమకూర్చడాన్ని పంపిణీ సామర్థ్యం అంటారు. సమాజంలోని వ్యక్తులకు, సంఘాలకు మేలు లేదా ఫలం సమకూర్చడానికి సంబంధిత చర్య పంపిణీ సామర్థ్యం. ఎంత పరిమాణంలో ఏమి పంపిణీ జరిగిందన్న విషయాలు ఈరకమైన సామర్థ్యాన్ని నిర్ణయించడానికి ప్రమాణంగా తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకాకుండా పంపిణీ మానవ జీవితంలో ఏ విషయాలకు సంబంధించినది ? మేలు పొందిన వర్గాలేవి ? వ్యక్తుల అవసరాలకు, పంపిణీ విధానానికి సంబంధం ఏవిధంగా ఉంది ? అన్న ప్రశ్నలకు సమాధానాలు సాధించడం ద్వారా పంపిణీ సామర్థ్యం పరిమాణం, స్థాయిని గ్రహించవచ్చు. ఉదాహరణకు సాంఘిక సంక్షేమానికి చేసే ఖర్చు, ఆర్థికావసరాలు తీర్చేటందుకు ఉద్దేశించిన మొత్తం. ఆరోగ్య అవసరాలకు కేటాయించి తలపెట్టిన విషయాలను తెలియజేస్తాయి. ఇక ప్రత్యేకంగా వ్యాపారస్థులకు, వ్యవసాయదారులకు, గనులలో పనిచేసే కార్మికులకు ఉద్దేశించిన పంపిణీ సమాజంలో ఏవర్గాలు పంపిణీ వల్ల ప్రయోజనం పొందుతున్నాయో తెలుసుకోవడానికి దోహదం చేస్తాయి. ప్రాంతీయ సమూహాలకు మత సంఘాలు, జాతిపరంగా ఏర్పడిన సమూహాల వంటి వాటికి జరిగే పంపిణీ ఏ సమూహాలు లాభం పొందుతున్నాయో తెలుసుకోవడానికి తోడ్పడతాయి. అందువల్ల పంపిణీ, పరిమాణం పెరిగినంత మాత్రాన పంపిణీ సామర్థ్యం పెరిగిందనుకోవడం

పొరబాటు. ప్రభుత్వ యంత్రాంగ నిర్వహణకు ఎక్కువ పంపిణీ ప్రజావసరాలకు తక్కువ పంపిణీ జరిగితే అది సమర్ధతతో కూడిన పంపిణీ అనిపించుకోదు. ఏ రకమైన వారికి ఎంత పరిమాణంలో ఎంతటి ప్రాధాన్యమైన కేటాయింపులు జరిగాయన్న విషయంపై వ్యవస్థ సామర్ధ్య గుణాన్ని నిర్ధారించవచ్చు.

## 4.7.4 లాంఛనాల సామర్ధ్యం (Symbolic Capability) :

రాజకీయ వ్యవస్థ నుంచి సమాజంలోకి, అంతర్జాతీయ వాతావరణంలోకి సార్థకంగా ప్రవేశించే ప్రతీకలు లేదా చిహ్నాల స్థాయినే లాంఛనాల సామర్ధ్యమంటారు. రాజకీయ విలువలకు మేధావుల మద్దతు, జెండా ప్రదర్శనలు, సైనికులు, సైనిక కవాతులు, ఉన్నతోద్యోగుల సందర్శనలు, రాజకీయ విధానాల ప్రకటనలు, మొదలైన వాటిని చిహ్నాలుగా పేర్కొనవచ్చు. లాంఛనాల సామర్ధ్యం అంచనావేయడం కొంచెం కష్టమే అయినా రాజకీయ రంగంలో మేధావులు, పాత్రికేయులు, పండితులు, రాజకీయ సమావేశాలకు హాజరైన ప్రజల సంఖ్యాబలం ఆధారంగా సామర్ధ్యాన్ని అంచనా వేయడానికి, అభిప్రాయాలు తెలుసుకోవడానికి సర్వేలు జరపడం ద్వారా ప్రయత్నిస్తున్నారు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది. ఉత్పాదితాల లాంఛనాలకు లాంఛనాల సామర్ధ్యానికి సంబంధం ఉన్నప్పటికి ఈ రెండూ ఒకటికాదు.

## 4.7.5 స్పందనా సామర్ధ్యం (Responsive Capability) :

పైన వివరించిన సామర్ధ్యాలు ఉత్పాదిత విధుల స్వభాములున్నటువంటివి. ఉత్పాదకాల మధ్య ఉత్పాదితాల మధ్య సంబంధాలను పెంపొందించటానికి స్పందనా సామర్ధ్యం తోడ్పడుతుంది. స్పందనా సామర్ధ్యం ఆధారంగానే రాజకీయ వ్యవస్థల సామర్ధ్యాన్ని తెలిపే ప్రకటనలు, నిర్ణయాలు జరగటం మనం చూస్తున్నాం.

ప్రతి రాజకీయ వ్యవస్థకు కూడా ఏదో విధంగా ఎంతోకొంత మేరకు స్పందనా స్వభావం ఉంటుంది. లోపలనుంచి, వెలుపలినుంచి వచ్చే ఒత్తిడులకు, అభ్యర్థనలకు, కోర్కెలకు వ్యవస్థ స్పందిస్తుంది. ఒక్కటి గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే ఎవరిపట్ల వ్యవస్థ స్పందిస్తున్నది ? ఎటువంటి విధానాల విషయంలో స్పందిస్తున్నది ? స్పందనా ప్రవర్తనకు సంబంధించిన వైఖరిని కొనసాగించటానికి ఏవిధంగా ప్రయత్నిస్తుంది ? వంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవడం. ఉద్యోగి బృందం ప్రాధాన్యత వహించే సామ్రాజ్యాలలో ఉత్పాదకాలు కొద్దిమంది రాజకీయ నాయకుల నుంచి వస్తాయి. వేరే వ్యవస్థపై ఒత్తిడిలు తెస్తారు. ఈ పరిస్థితులలో వ్యవస్థ కొద్దిమంది ప్రయోజనాల పరిరక్షణకు స్పందిస్తుందని చెప్పవచ్చు. ఇటువంటి వ్యవస్థ యొక్క స్పందనా సామర్ధ్యం పరిమితంగా ఉంటుంది. బాగా అభివృద్ధి సాధించిన ప్రభావవర్గాలు, రాజకీయపార్టీలు ఉన్న రాజకీయ వ్యవస్థలలో వివిధ వర్గాల, వ్యక్తుల నుంచి వచ్చే ఒత్తిడులకు వ్యవస్థ స్పందించాల్సి ఉంటుంది. స్పందనా సామర్ధ్యం కూడా ఎక్కువగా ఉండటం తప్పని సరిఅవుతుంది. వ్యవస్థపై ఒత్తిడి తెస్తున్న వర్గాలను గురించి, అవి వినియోగిస్తున్న సాధనా మార్గాలను గురించి, నిర్మితులను గురించి, అంతేకాకుండా రాజకీయ సంస్కృతిని గురించిన పరిశీలన ఈ సందర్భంలో అవసరం.

## 4.7.6 స్వసమాజ, అంతర్జాతీయ సామర్ధ్యం (Capability in Domestic and International capabilities) :

సాంఘిక వ్యవస్థలో ఒక భాగం రాజకీయ వ్యవస్థలోను, ఇతర వ్యవస్థలలోను, అంతర్జాతీయ రంగంలోని ఇతర వ్యవస్థలతోను సంబంధాలుంటాయని తెలుసుకొన్నాం. అందువల్ల రాజకీయ వ్యవస్థ తాను ఏ సామాజిక వ్యవస్థలో ఉపవ్యవస్థో ఆసామాజిక వ్యవస్థలోను, అంతర్జాతీయ రంగంలోను కలిగిఉన్న సామర్ధ్యాన్ని పరిశీలించడం అవసరం. ఇటువంటి పరిశీలన ప్రయోజనాత్మక, నిష్పక్షపాత విశ్లేషణకు తోడ్పడుతుంది. అంతర్జాతీయ వ్యాపారం ద్వారాను, లేదా విదేశీ సందర్శకుల వల్లను విదేశాలలో పెట్టుబడుల వల్లను, విదేశాల నుంచి లభించిన నష్టపరిహారం, విరాళాల ద్వారాను పొందిన లాభం వ్యవస్థ యొక్క అంతర్జాతీయమైన

వెలికితీసే సామర్థ్యాన్ని నిర్ణయిస్తుంది. ఇతర రాజకీయ వ్యవస్థల ప్రభుత్వ విధానాలపై ఉన్న ప్రభావం ఇతర రాజకీయ వ్యవస్థల వ్యవహారంలోకి చొచ్చుకొనిపోగల శక్తి, ఒక రాజకీయ వ్యవస్థ యొక్క అదుపుచేయగల సామర్థ్యాన్ని నిర్ణయిస్తాయి. రాజకీయ వ్యవస్థలు ఇతర రాజకీయ వ్యవస్థల వ్యవహారంలో జోక్యం చేసుకుంటాయి అని నిరూపించడానికి కీలుబొమ్మలుగా వ్యవహరించే వ్యవస్థలు, ఉపగ్రహాలుగా పనిచేసే వ్యవస్థలు నిదర్శనాలు అవుతాయి. ఇటువంటి వ్యవస్థలను "Penetrated Policy" అని వ్యవహరిస్తారు. సబ్సిడీలు, గ్రాంటులు, రుణాలు, సాంకేతిక సహాయం అందించడం ద్వారా రాజకీయ వ్యవస్థలు పంపిణీ సామర్థ్యాన్ని పెంపొందించుకొంటాయి. ఇటువంటి సామర్థ్యమే అంతర్జాతీయ పంపిణీ సామర్థ్యం. ఒకదేశం నుంచి మరొకదేశానికి ప్రసరించే విధాన ప్రకటనలు, ప్రతీకలు లేదా చిహ్నాల వంటివి అంతర్జాతీయ లాంఛనాల సామర్థ్యంపై ప్రభావం చూపగలుగుతాయి. వివిధ వ్యవస్థలు ఇతర వ్యవస్థలలో తమ గౌరవం, హోదా ఇనుమడింపజేయడానికి అంతర్జాతీయ లాంఛనాల సామర్థ్యాన్ని పెంచుకొనే ప్రయత్నం చేస్తాయి. ఈ కృషిలో భాగంగా ఇతర వ్యవస్థలలో జరుగుతుండే వార్తా ప్రసారాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటాయి. ప్రజాభిప్రాయ సేకరణ సర్వేలు జరుపుతుంటాయి. అంతర్జాతీయ సంస్థ అయిన ఐక్యరాజ్యసమితిలో తమ ప్రతిపాదనకు రాజకీయ మద్దతు, అంతేకాక సైనికపరమైన మద్దతు కూడా అంతర్జాతీయ లాంఛన సామర్థ్యానికి కొలమానాలని అమెరికన్‌లు భావిస్తారు. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యవిషయం ఒకటి ఉంది. ఒక రాజకీయ వ్యవస్థ యొక్క స్వసమాజ సామర్థ్య వైఖరులకు అదే వ్యవస్థ యొక్క అంతర్జాతీయ సామర్థ్య వైఖరులకు కొంత సంబంధం ఉంటుంది. స్వసమాజంలో హెచ్చుస్థాయిలో వెలికితీయగల సామర్థ్యమున్న వ్యవస్థకు అంతర్జాతీయంగా కూడా ఇటువంటి శక్తి ఉండవచ్చు.

### 4.7.7. సామర్థ్య - నిర్ణాయకాలు (Determinants of Capabilities) :

ఒక రాజకీయవ్యవస్థ యొక్క సామర్థ్యవైఖరులు అందరి రాజకీయ మేధావుల లక్ష్యాలు, చర్యలపై ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. వ్యవస్థలో ఉత్పన్నమయ్యే కోరికలు ఒత్తిడులకు వ్యవస్థలోని నిర్మితులు గుడ్డిగా మార్పు చెందవు. రాజకీయ మేధావులకు కొన్ని లక్ష్యాలు వాటితోబాటు కొన్ని నమ్మకాలు, అభిప్రాయాలు, లక్ష్యసాధన ఎంతవరకు చేయగలమన్న భయాందోళనలు ఉంటాయి. అందువల్ల వ్యవస్థలో నుంచి, అంతర్జాతీయ వాతావరణం నుంచి వచ్చే వత్తిడులకు ఏవిధంగా మేధావులు స్పందిస్తారన్న దాన్నిబట్టి వ్యవస్థ సామర్థ్యస్థాయి, విధానం, నిర్ణయమవుతాయి. కొంత వివరంగా చెప్పాలంటే ఒత్తిడులు, కోరికలు పట్ల మేధావులు అణచివేత ధోరణి, నిర్లక్ష్యం, సర్దుబాటు ధోరణి లేదా ప్రత్యామ్నాయాలను సమకూర్చుకొనే ధోరణిని అనుసరించవచ్చు. నిర్లక్ష్యం వల్లగానీ, తగిన పరిజ్ఞానం లోపించడం వల్లగాని, వ్యవస్థపై ఒత్తిడి అధికమవుతుంది. ఇటువంటప్పుడు వ్యవస్థ యొక్క స్పందనా సామర్థ్యం బలహీనమవుతుంది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే రాజకీయ వ్యవస్థలోని వివిధ విధానాలను నిర్వహణను రూపొందించడంలో రాజకీయవేత్తల, రాజనీతి శాస్త్రజ్ఞుల పాత్ర తగినంతగా ఉంటుంది. ఇక సామర్థ్య నిర్ణాయక విషయంలో రెండోది నిర్వహణకు అవసరమైన మానవుని భౌతికశక్తి ఉండటం. వ్యవస్థలోని సభ్యుల సేవలను వెలికితీయడంపై సభ్యుల సంఖ్య, వారి నైపుణ్యం, ప్రేరణ (Motivation) ల ప్రభావం ఉంటుంది. అంతేకాకుండా భౌతిక వనరులు కూడా ఉండాలి. ఉదాహరణకు విమానాలు, ఓడలు నిర్మించడం, ఇనుము, బొగ్గు లేకుండా సాధ్యపడదు. ఇట్లాంటి భౌతిక వనరుల సంపాదన కోసం రాజ్యాలు యుద్ధాలకు తలపడిన సందర్భాలు చరిత్రలో లెక్కకు మించి వున్నాయి. వ్యవస్థ సామర్థ్యాన్ని నిర్ణయించే మరొక విషయం సంస్థాగత ఉపకరణాలు (Organisational apparatus). ఉదాహరణకు - అభివృద్ధి చెందిన, సమర్థవంతమైన ఉద్యోగి బృందాలున్న వ్యవస్థలలో సామర్థ్యం, సమర్థవంతమైన ఉద్యోగి బృందాలు లేని వ్యవస్థలలో కంటే ఎన్నోరెట్లు ఎక్కువగా ఉంటుంది. ప్రత్యేకీకరణ కలిగిన నిర్దిష్టమైన రాజకీయ నిర్మితులు లౌకిక సాంస్కృతిక వైఖరులు వ్యవస్థ సామర్థ్యాన్ని పెంపొందిస్తాయి. వనరుల వినియోగంలోను, వ్యవస్థ నిర్వహణలోను, సామాజీకరణ భర్తీ వైఖరులు కూడా ప్రభావం చూపుతాయి. చివరగా వ్యవస్థకు లభించే మద్దతు స్థాయిలు కూడా వ్యవస్థ సామర్థ్యాన్ని నిర్ణయిస్తాయి. మద్దతు విషయంలో తక్కువస్థాయి పన్నుల ఎగవేత, శాసనోల్లంఘన మొదలైనవి వ్యవస్థ సామర్థ్యం పెరుగుదలకు అవరోధం కల్పిస్తాయి.

**4.7.8 రాజకీయ వ్యవస్థ సామర్థ్యం : రాజకీయాభివృద్ధి (Capabilities of Political System and Political Development) :**

రాజకీయ వ్యవస్థ సామర్థ్యం, దీనికి లభించే మద్దతులను గురించిన విశ్లేషణ రాజకీయాభివృద్ధి అధ్యయనం చేయడానికి తోడ్పడుతుంది. వృద్ధి అనేది వివిధ దశలలో జరుగుతుందని, ప్రతిదశపై అంతకు ముందటిదశ ప్రభావం ఉండటమే కాకుండా తరువాతి దశపై ప్రభావం చూపుతుంది అన్న సర్వసమాన్య విషయం. ఇక రాజకీయ వ్యవస్థ సామర్థ్యం రాజకీయాభివృద్ధి విషయాలకు వస్తే వ్యవస్థకు పంపిణీ సామర్థ్యం ఉండటానికి ముందుగా వెలికితీసే సామర్థ్యం, అదుపు సామర్థ్యం ఉండాలి. వెలికి తీసే సామర్థ్యం అదుపు సామర్థ్యానికి నిర్దిష్ట నిర్మితులు, లౌకికతత్వం అవసరం. ఇవికాక కోర్కెల వ్యక్తీకరణ, సమీకరణ జరిపే ప్రయోజక వర్గాలు, పార్టీలు, నియమాల నిర్వహణ జరిపే ఉద్యోగి బృందం కూడా రాజకీయ వ్యవస్థ అభివృద్ధి పథంలో సముచిత పాత్ర వహిస్తాయి. రాజకీయ మార్పు స్వరూప స్వభావాల నిర్ణయంతో కూడా రాజకీయ వ్యవస్థ యొక్క సామర్థ్య విశ్లేషణ, తోడ్పడుతుంది. వ్యవస్థలో ఉత్పన్నమైన సమస్యలను ఎదుర్కొనే మార్గాలను సూచించడానికి కూడా ఈ విశ్లేషణ దోహదం చేస్తుంది.

**4.7.9 వ్యవస్థ నిర్వహణ - అనుసరణీయత - విధులు (System maintenence - Adoption - Functions):**

రాజకీయ వ్యవస్థ పద్ధతిలో మార్పులు లేకుండా మారుతున్న పరిసరాలకు అనుసరణీయత ఉండాల్సిన అవసరాన్ని ఆల్మండ్ వివరించాడు. దీనికి రాజకీయ సామాజీకీకరణ, భర్తీలతో సంబంధం ఉంటుంది. రాజకీయ సామాజీకీకరణ, భర్తీలను గురించి ఇంతకు ముందే తెలుసుకున్నాం. రాజకీయ సంస్కృతుల నిర్వహణ, మార్పుల ద్వారా రాజకీయ వ్యవస్థ వ్యక్తులను రాజకీయ సంస్కృతికి లోబడి ఉండేటట్లు చేస్తుంది. రాజకీయ భర్తీ విషయంలో కూడా నిర్వహణ, అనుసరణీయతల ప్రాధాన్యముంటుంది.

**4.10 విమర్శ :**

రాజకీయాల అధ్యయనంలో ఆల్మండ్ నిర్మితులు - విధుల దృక్పథం ఒక ప్రత్యేకతను సంతరించుకొంటుంది. దీని ప్రాధాన్యాన్ని కింది విధంగా వివరించవచ్చు.

ఒక వ్యవస్థలోని భాగాలను అధ్యయనం చేయడానికి సంపూర్ణ వ్యవస్థ స్వరూపం కూడా తెలుసుకోవాల్సి వుంటుంది. నిర్మితుల కర్తవ్య నిర్వహణను అర్థం చేసుకోవడానికి రాజకీయ వ్యవస్థ స్వరూపాన్ని గ్రహించాల్సి ఉంటుంది. ఈ విశ్లేషణ విధానాన్ని సమర్థించేవారు రాజకీయాల పరిశీలనకు ఇది ఒక ముఖ్య సాధనంగా పనిచేస్తుందని దీనికి కారణం ఇందులోని స్పష్టమైన సూత్రీకరణ అని అంటారు.

వివిధ వ్యవస్థలలోని రాజకీయ సంస్కృతులను అధ్యయనం చేయడానికి కూడా నిర్మితులు విధుల దృక్పథం తోడ్పడుతుంది. అయితే పశ్చిమ రాజ్యాలలోని ప్రజాస్వామ్యాల లక్షణాలను ఆధునిక రాజకీయ వ్యవస్థల లక్షణాలుగా ఆల్మండ్ పరిగణిస్తాడు. ఇతడి అభిప్రాయంలో అభివృద్ధి చెందుతున్న వ్యవస్థల లక్షణాలకు పశ్చిమ ప్రజాస్వామ్య లక్షణాలకు బేధం ఉంటుంది. కొంతసామ్యం కూడా ఉంది. ఉదాహరణకు అభివృద్ధి చెందుతున్న వ్యవస్థలలో రాజకీయ పార్టీలు అమెరికా, బ్రిటన్‌లలోని పార్టీల కర్తవ్యాలను పోలిన కర్తవ్యాలను నిర్వహిస్తాయి.

నిర్మితులు - విధుల విశ్లేషణ, రాజకీయ వ్యవస్థల నిర్వహణ కొనసాగటం వంటి విషయాలలో వ్యవస్థ శక్తియుక్తులకు ప్రాధాన్యమిస్తుంది. వ్యవస్థ అనుసరించాల్సిన విలువలు, సాధించాల్సిన గమ్యాల నిబద్ధతలు విషయాలలో బహుజన సమ్మతి

ఉంటుందని ఈ విశ్లేషణన సమర్థించే వారు భావిస్తారు. అందువల్ల జన సమ్మతిపై ఆధారపడిన రాజకీయాలున్న వ్యవస్థలను గురించి అధ్యయనం చేయడానికి ఈ దృక్పథం వినియోగిస్తుందని వీరంటారు. నిర్మితులు - విధుల విశ్లేషకులు రాజనీతి శాస్త్రంలో నూతన పదజాలాన్ని ప్రవేశపెట్టారు. దీని ద్వారా రాజనీతి శాస్త్రాన్ని సుసంపన్నం చేసారని చెప్పవచ్చు.

## 4.11 సారాంశం :

రాజనీతి శాస్త్ర ఆధునికత అధ్యయన దృక్పథాలలో నిర్మితుల - దృక్పథం ఒకటి. ఆధునిక కాలంలో ఈ విశ్లేషణ ఒక కొత్త రూపాన్ని సంతరించుకొన్నప్పటికీ, ప్రాచీన కాలంలోనే ఇది వినియోగంలో ఉన్నట్లుగా చెప్పవచ్చు. ప్రాచీన గ్రీకు రాజనీతి తత్వవేత్తలు ప్లాటో, అరిస్టాటిల్ రాజకీయ వ్యవస్థలు కొనసాగటానికి, మనుగడకు అవి నిర్వహించాల్సిన విధులను వివరించారు. విధుల ప్రాతిపదికగానే అరిస్టాటిల్ ప్రభుత్వాల వర్గీకరణ చేసాడు.

సామాజిక శాస్త్రాల అధ్యయనంలో సాంప్రదాయక పద్ధతులు వాస్తవాలను వెలికితీయడానికి అంతగా సహకరించకపోవడంతో అధునాతన పద్ధతుల ద్వారా విషయ పరిశీలన మొదలైంది. సంస్థలు వాటి కర్తవ్యాల అధ్యయనంతో బాటుగా అందులోని వ్యక్తుల వర్గాల ప్రవర్తనను కూడా పరిశీలించడం అవసరమని గుర్తించారు. ఆధునిక కాలంలో ఒకే సంస్థ వివిధ కర్తవ్యాలను నిర్వహించటం, అంతే కాకుండా రాజకీయ, ఆర్థిక, సామాజిక జీవనంలో వ్యక్తుల, వర్గాలపాత్ర అభివృద్ధి చెందటం, కొత్త సంస్థలు ఆవిర్భవించటం, మొదలైన కారణాలవల్ల ప్రవర్తనల పరిశీలనావశ్యకతను మరింత గుర్తించారు. దీని ఫలితమే ప్రవర్తనావాద ఉద్యమం నూతన పద్ధతులు, దృక్పథాల అనుసరణ

## 4.12 నమూనా పరీక్షా ప్రశ్నలు :

ఈ క్రింది వానిని వ్యాసరూపంలో జవాబులు వ్రాయండి :

1. నిర్మితులు - విధుల దృక్పథం అనగానేమి ? రాజనీతి శాస్త్ర అధ్యయనంలో దాని పాత్రను విశ్లేషింపుము ?
2. నిర్మితులు - విధుల విశ్లేషణను విమర్శకంగా పరిశీలింపుము ?
3. నిర్మితులు - విధుల విశ్లేషణలో సామర్థ్యతా పాత్రను వివరింపుము ?

### లఘు ప్రశ్నలు :

1. రాజకీయ సామాజీకరణ
2. ప్రయోజనాల వ్యక్తీకరణ
3. ఉత్పాదిత విధులు

## 4.13 చదువదగిన గ్రంథాలు :


1. ఆల్మండ్ మరియు పావెల్ : కంపారిటివ్ పాలిటిక్స్ : ఎ డెవలపమ్‌మెంట్ అప్రోచ్
2. వర్మ ఎస్.పి. : మోడరన్ పొలిటికల్ థియరీ
3. డేవీస్ అండ్ లేవీస్ : మోడల్స్ ఆఫ్ పొలిటికల్ సిస్టమ్స్
4. ఆప్టర్, డేవిడ్ : ఇన్‌ట్రడక్షన్ టు పొలిటికల్ ఎనాలసిస్
5. చార్లెస్ వర్త్, జేమ్స్ : కాంటెంపరరీ పొలిటికల్ ఎనాలసిస్


- డా॥ కె. రామచంద్రమూర్తి

పాఠం - 5

# పాజిటివిస్ట్ సిద్ధాంతము (Positivist Theory)

## 5.0 లక్ష్యం :

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

- పాజిటివిజమ్ అంటే ఏమిటి ?
- కామ్టె కృషి
- కొలకవస్కి అభిప్రాయాలు
- గిడెన్స్ అభిప్రాయాలు
- పాజిటివిజమ్ యొక్క ప్రధాన లక్షణాలు

విషయసూచిక


5.1 పరిచయం

5.2 అగస్ట్ కామ్టె

5.3 పాజిటివిజమ్ - అర్థం

5.4 కొలకవస్కి అభిప్రాయాలు

5.4.1 దృగ్విషయ నియమము

5.4.2 నామమాత్రపు సంబంధాల నియమము

5.4.3 విలువలతో కూడిన నిర్ణయాలను విజ్ఞానంగా పరిగణించకూడదు

5.4.4 అన్ని శాస్త్రాలకు సాధారణ సూత్రాలు ఒక్కటే కాబట్టి అధ్యయన పద్ధతులలో ఏకత్వం ఉండాలి

5.5 గిడెన్స్ అభిప్రాయాలు

5.5.1 ప్రకృతి శాస్త్రాల అధ్యయనానికి ఉపయోగించే పద్ధతులను సామాజిక శాస్త్రాలకు కూడా వర్తింప చేయవచ్చు

5.5.2 ప్రకృతి శాస్త్రంలో వలెనే, సామాజిక అంశాల పరిశోధనలో కూడా సాధారణీకరణ చేయవచ్చు ; శాశ్వత సూత్రాలను కనుగొనవచ్చు.

5.6 పాజిటివిజమ్ యొక్క ప్రధాన లక్ష్యాలు

5.6.1 మనకున్న ప్రపంచం ఒక్కటే. అది వస్తుపరమైనది

5.6.2 శాస్త్రీయతే నిజమైన విజ్ఞానము

5.6.3 శాస్త్రీయత విచక్షణ, పరిశీలనల మేలు కలయికలపై ఆధారపడి ఉంటుంది

5.6.4 శాస్త్రీయ పరిజ్ఞానం మానవుని మేధో సంపత్తి యొక్క అభివృద్ధితో ముడిపడి ఉంటుంది. కాబట్టి శాస్త్రీయత సహాయంతో ప్రపంచాన్ని నడిపే అన్ని సూత్రాలను తెలుసుకోవటం సాధ్యం కాదు.

5.6.5 మానవుడు ఏ విషయాలయితే తెలుసుకొంటాడో, అవి అతని అవసరాలకు, అతనున్న భౌతిక స్థితికి సంబంధించినవి మాత్రమే

5.6.6 గతాన్ని వివరించే, వర్తమానాన్ని అర్థం చేసుకునే, భవిష్యత్ పరిణామాలను గుర్తించగల చారిత్రక నియమాలు ఉన్నవి

5.6.7 వ్యవస్థలోని పలు సంస్థల మధ్య, సాంస్కృతిక అంశాల మధ్య అంతర్ సంబంధాన్ని నిర్దేశించే సామాజిక సూత్రాలు ఉన్నాయి.

5.6.8 సమాజం అంగాంగి సంబంధాలు గల ఏక మొత్తం

5.6.9 క్రమబద్ధ సమాజం యొక్క సహజ స్థితి

5.6.10 నైతిక, రాజకీయ ప్రత్యామ్నాయాలు తప్పనిసరిగా శాస్త్రీయత మీద ఆధారపడి మాత్రమే రూపుదిద్దుకోవాలి

5.6.11 నిర్మాణాత్మకమైన పాజిటివ్ దృక్పథం, నకారాత్మకమయిన విమర్శనా దృక్పథాన్ని అధిగమిస్తుంది. అనునిత్యం మార్పును ఆమోదించే పాజిటివ్ దృక్పథం, దృఢమయిన ఆధ్యాత్మిక, ఆది భౌతిక దృక్పథాలను అధిగమిస్తుంది

5.7 విమర్శ

5.7.1 శాస్త్రీయతపై ఏకాభిప్రాయం లేకపోవటం

5.7.2 విలువలను విస్మరించటం :

5.7.3 భౌతిక శాస్త్రాల పద్ధతులను యథావిధిగా అరువు తెచ్చుకోవటం :

5.7.4 గతాన్ని, భవిష్యత్‌ను అర్థం చేసుకునే అవకాశం లేదు :

5.7.5 నిరంతర చైతన్యశీలమయిన దానిని సిద్ధాంత చట్రంలో అమర్చటం సాధ్యం కాదు :

5.7.6 యదార్థాలే సిద్ధాంతమయితే, చిట్టాకు (List) కు సిద్ధాంతానికి తేడా ఏమిటి ?

5.7.7 పరిశీలన, విచక్షణ (reason) మేరకు కలవాలో వివరణ లేదు

5.8 సారాంశము

5.9 నమూనా ప్రశ్నలు

5.10 చదువదగిన గ్రంథాలు

## 5.1 పరిచయం :

సామాజిక శాస్త్రాల అధ్యయన విశ్లేషణా వరవడిపై చాలా ఎక్కువ ప్రభావాన్ని చూపించిన సిద్ధాంతాలలో పాజిటివిజమ్ ఒకటి. అంతేకాదు, వేల సంవత్సరాల పాటు గౌరవం పొందుతూ వచ్చిన పద్ధతులను ఒక కుదుపు కుదిపి, తీవ్రమైన ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రతిపాదించిన ఘనత కూడా ఈ సిద్ధాంతానికే దక్కుతుంది. పంచేంద్రియాల పరిశీలనకు అతీతమైన విజ్ఞానమంటూ ఏదీ లేదని, శాస్త్రీయ పరిశీలన మాత్రమే నిజమైన పరిశీలన అని, ఆ పరిశీలన నుండి వచ్చిన విజ్ఞానమే నిజమైన విజ్ఞానమని ప్రతిపాదించింది ఈ సిద్ధాంతమే. అంతేకాకుండా సమాజం అంతా అంగాంగి సంబంధమున్న ఒకే 'మొత్త'మన్న విప్లవాత్మక సూత్రీకరణ కూడా ఈ సిద్ధాంత కర్తలదే.

## 5.2 అగస్ట్ కామ్టె (1798 - 1857) :

ఈ సిద్ధాంతానికి లేదా పరిశీలనా పద్ధతికి పితామహుడు ఆగస్ట్‌కామ్టె. ఈయనను ప్రపంచం సమాజశాస్త్ర పితామహునిగా కూడా గౌరవిస్తున్నది. వృత్తిరీత్యా మేథమేటిషియన్ అయిన కామ్టె 1798వ సంవత్సరములో ఫ్రాన్స్‌లోని మాంటెపిల్లర్ నగరంలో

జన్మించాడు. 'ఎకోల్ పాలిటెక్నిక్' అనే ప్రఖ్యాత విద్యాసంస్థలో పై చదువులు చదివినాడు. మాథమేటిక్స్‌లోను, ఫిజిక్స్‌లోనూ ప్రత్యేక కృషి సల్పే ఈ సంస్థ ఉపాధ్యాయులు సహజంగానే సమాజస్థితి పట్ల, సామాజిక అంశాలపట్ల పెద్దగా శ్రద్ధ చూపించేవారు కాదు. అందుకు భిన్నంగా కామ్టె మాత్రం మాథమేటిక్స్‌లో ఎంత శ్రద్ధ చూపేవాడో, సామాజిక అంశాల పట్ల కూడా అంతే శ్రద్ధ చూపేవాడు. పారిశ్రామిక విప్లవం, ఫ్రెంచి విప్లవం రెండూ సమాజం సమగ్రతపై తీవ్రమైన వ్యతిరేక ప్రభావాన్ని చూపించాయని, స్థిరపడినట్లుగా కనిపిస్తున్న సామాజిక వ్యవస్థలు చిన్నాభిన్నమై పోయాయని కామ్టె భావించారు. అయితే, సామాజిక సంస్థల గురించి చర్చించే శాస్త్రమేమీ అప్పటికి లేకపోవటం వలన అటువంటి శాస్త్రం యొక్క ఆవశ్యకత ఎంతైనా ఉందని కామ్టె భావించాడు. ఫలితము ఆయన మేధస్సు నుండి సమాజశాస్త్రం ఆవిష్కరించబడటం, తద్వారా కామ్టె సామాజికశాస్త్ర పితామహునిగా గుర్తించి గౌరవించబడటం (సోషియాలజీ అనే శాస్త్రానికి మొదట కామ్టె పెట్టిన పేరు సోషల్ ఫిజిక్స్.

ఎకోల్ పాలిటెక్నిక్‌లో విద్యార్థిగా ఉన్నపుడే కామ్టె ప్రఖ్యాత బ్రిటిష్ యుటోపియన్ సామ్యవాది అయిన సెయింట్ సైమన్‌తో పరిచయం పెంచుకున్నాడు. ఆ పరిచయం పెరిగి కామ్టె సైమన్‌కు కార్యదర్శిగా, సహాయకుడిగా పనిచేశాడు. కొద్ది కాలం తర్వాత సైద్ధాంతిక విభేదాల వలన వీరిరువురూ విడిపోయినా, సైమన్ దగ్గర పనిచేసిన ఆ కొద్దికాలంలోనే కాంమ్టె తన ఆలోచనలను తీర్చిదిద్దుకున్నాడు.

కామ్టె వ్రాసిన మొదటి పుస్తకం పేరు ప్లాన్ ఆఫ్ ది సైంటిఫిక్ ఆపరేషన్స్ నెసిసరి ఫర్ ది రీ ఆర్గనైజేషన్ ఆఫ్ సొసైటి. దీనిని కామ్టె 1822 లో ప్రచురించాడు. ముందు ముందు అతను ప్రతిపాదించబోయే విప్లవాత్మక భావాలన్నింటికి బీజాలు ఈ పుస్తకంలోనే ఉన్నాయి. కామ్టె పుస్తకాలలో ప్రపంచ ప్రఖ్యాతి చెందినవి "పాజిటివ్ ఫిలాసఫి", "పాజిటివ్ పాలిటి" 1830-1842 సం॥ల మధ్యలో ప్రచురించబడిన పాజిటివ్ ఫిలాసఫి ఆరు సంపుటాల ఉద్గ్రంధం. పాజిటివ్ పాలిటి అనేది నాల్గు సంపుటాల ఉద్గ్రంధం. ఇది 1851-1854 సం॥ల మధ్యలో ప్రచురించబడింది. కాంమ్టె జీవితకాలంలో పాసిటివ్ ఫిలాసఫి పేరు మీద, కాంమ్టె తర్వాత పాజిటివిసమ్‌గా ప్రసిద్ధి చెంది, మేధో పద్ధతులపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిన సిద్ధాంతాన్ని కాంమ్టె పై రెండు పుస్తకాలలోనే ప్రతిపాదించాడు. శాశ్వత కీర్తిని ఆర్జించాడు.

## 5.3 పాజిటివిజమ్ - అర్థం :

ఒక వ్యక్తి అనుభవమే విజ్ఞానానికి ఆధారం. ఒక వ్యక్తి తన పంచేంద్రియాల సహాయంతో ఏ విషయాన్ని అయితే తెలుసుకోగల్గుతాడో అదే సత్యం. అంశాలు రెండు రకాలు. ఒకటి - పరిశీలింపగలిగేవి, రెండు - పరిశీలనకు సాధ్యపడనివి. మొదటి రకానికి చెందిన అంశాలు మాత్రమే విజ్ఞానానికి ఆధారం కావాలి. మరో మాటలో చెప్పాలంటే సామాజిక పరిశీలనను శాస్త్రీయంగా మార్చే ప్రయత్నమే పాజిటివిజమ్. పాజిటివిజమ్ యొక్క లక్షణాలను చాలా సంగ్రహంగా చెప్పటానికి కొలకవస్కి, గిడెన్స్‌లు ప్రయత్నించారు. వాటిని క్రింద వివరించటం జరిగింది.

## 5.4 కొలకవస్కి అభిప్రాయాలు (Four rules of Kolakawski on Positivism) :

పైన వివరించినట్లు పాసిటివిజమ్ యొక్క సాధారణ లక్షణాలను చాలా సంగ్రహంగా వివరించటానికి కొలకవస్కి ప్రయత్నించాడు. అవి :

### 5.4.1 దృగ్విషయ నియమము (The Rule of Phenomenalism) :

"అనుభవానికి ఏదైతే అందుబాటులో ఉంటుందో దాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి అనేది ఈ నియమ సారాంశము ("We are entitled to record only that which is actually manifested in Experience"). దృగ్విషయాన్ని

కాకుండా, దృగ్విషయ సారాంశాన్ని (Noumena) పరిగణనలోనికి తీసుకోకూడదు. కారణం ఏమిటంటే, దృగ్విషయం అందరికి ఒకటే. కాని దాని సారాంశం దాన్ని చూసే వ్యక్తి ఆలోచనా ధోరణి, మనస్తత్వం వంటి విషయాలపై ఆధారపడి మనిషి, మనిషికి మారిపోతూ ఉంటుంది. కాబట్టి దృగ్విషయం శాస్త్రీయం, దాని సారాంశం వ్యక్తిగతం. వ్యక్తిగతమైనదేదీ పరిశీలనకు నిల్వ లేదు కాబట్టి అది అశాస్త్రీయం. కొలకవస్కి అభిప్రాయంలో దృగ్విషయానికి సంబంధించిన తక్షణ కారణాలను (ఏవైతే కంటికి కనిపించవో) గురించి పరిశోధించటంలో ఆక్షేపణ లేదు. కాని కంటికి కనిపించని విషయాలను ప్రాతిపదికగా తీసుకుని, దృగ్విషయాలను విశ్లేషించటానికి ప్రయత్నించటం మాత్రం ఆక్షేపణీయం. "మానవ విజ్ఞానానికి అనుభవమే పునాది. అనుభవాతీతమైన అంశాలకు, వాటి విశ్లేషణకు పాజిటివిజమ్‌లో స్థానం లేదు" ("Claims of experience as the ultimate foundation of human knowledge and denies the possibility of meaningful discourse concerning supersensible objects).

### 5.4.2 నామమాత్రపు సంబంధాల నియమం (The Rule of Nominalism) :

సాధారణ విజ్ఞానం పేరు మీద చెలామణి అయ్యే ప్రతిది కేవలం రెండు అంశాల మధ్య సంబంధాన్ని నామమాత్రంగానే తెలియచెప్తుంది అనే వాదనను ఇంగ్లీషులో Nominalism అని పిలుస్తారు (Nominalism = A Doctrine which argues that the objects to which general terms refer are related to one another only by the terms). ఉదాహరణకు మేధావి అనే మాటను తీసుకుంటే "ఇద్దరు మనుష్యులు మేధావులు" అన్న దానిలో మేధావి అనే పదం మాత్రమే సాధారణ పదం అవుతుంది. ఆ ఇద్దరి వ్యక్తిగత లక్షణాలు కాని, ఇతర విషయాలు కాని ఒకేరకంగా ఉండవు. మనం నిత్యం వాడే విశ్లేషణాలన్నీ (ఉదా॥ మంచి, చెడు, అవగాహన, తెలివి, కోపం, దయ మొ॥నవి) కేవలం పేరులోనే సామ్యాన్ని కల్గి ఉంటాయి కాని, ఏ ఇతర సాధారణ గుణాన్ని లేదా సత్యాన్ని తెలియ చెప్పలేవు.

పాజిటివిజమ్ ప్రకారం, మనం "అవగాహన" గా భావించేవన్నీ వాస్తవానికి కేవలం ఒక వ్యక్తికి లేదా ఒక అంశానికి సంబంధించిన వాస్తవాలు మాత్రమే. సాధారణ సత్యాలు కావు ("We shall not assume that any insight formulated in general terms can have any real referents other than individual facts"). అవ్యక్తమైన (నిర్దిష్టం కాని. Abstract) శాస్త్రాలన్నీ కేవలం విడి అనుభవాలను సాధారణీకరించేవి. వాటివలన మనం అదనంగా పొందే విజ్ఞానం ఏమీ ఉండదు.

### 5.4.3 విలువలతో కూడిన నిర్ణయాలను విజ్ఞానంగా పరిగణించకూడదు (The Rule that refuses to call value Judgements and Normative Statements knowledge) :

పాజిటివిజమ్ యదార్థాలనే (పంచేంద్రియాల సహాయంతో పరిశీలించబడిన వాటినే) విజ్ఞానంగా పరిగణిస్తుంది. విలువలు (values), ప్రమాణాలు (Norms) యదార్థాలను ప్రతిబింబించవు. అవి వ్యక్తులు ఏర్పరచుకొన్న అభిప్రాయాలు మాత్రమే. వాటికి ఏ యదార్థం ప్రాతిపదికగా ఉండదు. కాబట్టి అవి విజ్ఞానంగా పరిగణించబడవు.

### 5.4.4 అన్ని శాస్త్రాలకు సాధారణ సూత్రాలు ఒక్కటే కాబట్టి అధ్యయన పద్ధతులలో ఏకత్వం ఉండాలి (The Essential Unity of Scientific method) :

జీవ, భౌతిక, రసాయన, సామాజిక శాస్త్రాలన్నింటిలోనూ సాధారణ లక్షణాలు ఒక్కటే. ఈ సాధారణ లక్షణాలకు లోబడి మాత్రమే వాటి ప్రత్యేక లక్షణాలు ఉంటాయి. కాబట్టి వీటన్నింటిని అధ్యయనం చేయటానికి ఉపయోగపడేది శాస్త్రీయ

పద్ధతి. ఆ శాస్త్రీయ పద్ధతి సహాయంతో విశ్వజనీనమైన సామాజిక సూత్రాలను, వాటి ఆధారంగా సామాజిక శాస్త్రాన్ని ఆవిష్కరించవచ్చు.

## 5.5 గిడెన్స్ అభిప్రాయాలు :

కొలకవస్కి లాగానే గిడెన్స్ కూడా మూడు సూత్రాల సహాయంతో పాజిటివిజమ్ యొక్క స్వభావాన్ని సంగ్రహంగా చెప్పటానికి ప్రయత్నించాడు.

### 5.5.1 ప్రకృతి శాస్త్రాల అధ్యయనానికి ఉపయోగించే పద్ధతులను సామాజిక శాస్త్రాలకు కూడా వర్తింప చేయవచ్చు (The procedures of Natural Science may be directly adapted to Sociology) :

మానవ ప్రవర్తన చూడటానికి భిన్నంగా ఉన్నట్లు కనిపిస్తూ ఉంటుంది. మానవ మనస్తత్వం కూడా పరస్పర భిన్నత్వం కలదిగా కనిపిస్తూ ఉంటుంది. అయితే మౌలికం (basic) గా మానవ ప్రవర్తనలో కూడా సామ్యం ఉంటుంది. ఈ సామ్యాన్ని కనుగొని సాధారణ లక్షణంగా గుర్తించగలిగినపుడు, శాస్త్రీయ పద్ధతుల సహాయంతో దాన్ని అధ్యయనం చేయవచ్చు. దీనికొరకు ప్రకృతి శాస్త్రాల అధ్యయనానికి ఉపయోగించే పద్ధతులను ఉపయోగించుకోవచ్చు. ఆవిధంగా చేయటం వలన సామాజిక పరిశోధన శాస్త్రీయంగా సాగటమే కాకుండా, విశ్వజనీనమైన (Universal) సూత్రాలను కనుగొనటానికి అవకాశం ఏర్పడుతుంది.

### 5.5.2 ప్రకృతి శాస్త్రంలో వలెనే, సామాజిక అంశాల పరిశోధనలో కూడా సాధారణీకరణ చేయవచ్చు; శాశ్వత సూత్రాలను కనుగొనవచ్చు (The End Result of Sociological Investigations can be Formulated as 'laws' or 'law-like Generalisations of the same kind as those established by Natural Scientists) :

శాస్త్రీయ పరిశోధనా పద్ధతిని కనుగొని, దాని సహాయంతో పరిశోధన జరుపగలిగితే సామాజిక శాస్త్రాలలో కూడా శాశ్వత సూత్రాలను కనుగొనవచ్చు. ప్రకృతి శాస్త్రాలలో శాస్త్రజ్ఞులు ఎంత నిర్దిష్టతను సాధించారో, అదే స్థాయి నిర్దిష్టతను సాధించవచ్చు.

### 5.5.3 సామాజిక శాస్త్రం సాంకేతికపరమైన లక్షణాలను కల్గి ఉంటుంది (Sociology has a Technical Character):

మరో మాటలో చెప్పాలంటే ఇది శుద్ధ శాస్త్రం (Pure Science) వంటిది. సహజ గతిశీలతకు సంబంధించిన సూత్రాలను కనుగొనటానికి ప్రయత్నించే శాస్త్రం. ఏ ఒక్క సమస్యను దృష్టిలో ఉంచుకొనో, లేదా ఏదో ఒక సమస్యను పరిష్కరించటానికో ఉద్దేశించబడిన శాస్త్రం కాదు. అయితే శుద్ధ శాస్త్రం ఆధారంగానే "అనువర్తిత శాస్త్రం" (Applied Science) పుట్టుకొని వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. శుద్ధ ఆర్థికశాస్త్రం, శుద్ధ భౌతిక శాస్త్రం లేకుండా అనువర్తిత ఆర్థికశాస్త్రం, అనువర్తిత భౌతిక శాస్త్రం ఉద్భవించగలిగేవి కాదు. శాశ్వత సత్యాలను, శాశ్వత సూత్రాలను కనుగొనటానికి ప్రయత్నించేది శుద్ధశాస్త్రం. అటువంటి శుద్ధ సామాజిక శాస్త్ర ఆవిష్కరణ పాజిటివిజమ్ యొక్క లక్ష్యం.

## 5.6 పాజిటివిజమ్ యొక్క ప్రధాన లక్ష్యాలు (Major Characteristics of Positivism) :

కాంమ్టె నుండి నేటి దాకా పాజిటివిజమ్‌లో అనేక మార్పులు జరిగాయి. పాజిటివిజమ్‌లోని ప్రధాన భావనలను అంగీకరిస్తూనే వాటి అన్వయం విషయంలో పాజిటివిష్టులు తలా ఒకదారి అయ్యారు. ఈ క్రమంలో ఫ్రెంచ్ పాజిటివిస్టు ధోరణి అని, జర్మనీ పాజిటివిస్ట్ ధోరణి అని, అమెరికా పాజిటివిస్ట్ ధోరణి అని శాఖోపశాఖలుగా విడిపోయింది. అన్ని శాఖలు సమర్థించే సాధారణ లక్షణాలు క్రింద వివరించబడ్డాయి.

**5.6.1 మనకున్న ప్రపంచం ఒక్కటే. అది వస్తుపరమైనది** (There is but one World, and it has an Objective Existence) :

కామ్టె మాటలలో చెప్పాలంటే, "ప్రపంచం ఒకటేనన్నది వాస్తవం". ఈ ప్రపంచానికి అతీతంగా వేరొక ప్రపంచం కాని, వేరొక వస్తువులు కాని లేవు. "వాస్తవాల మధ్య ఉన్న సంబంధాన్ని గ్రహించగల్గటం వలననే మనకు సత్యం తెలుస్తుంది". పాజిటివిజమ్ అది భౌతిక భావాలను, ఆధ్యాత్మిక భావాలను పూర్తిగా తిరస్కరిస్తుంది. మన ముందున్న ప్రపంచమే ఏకైక వాస్తవ ప్రపంచమని, అది అనేక వస్తువులతో (objects) నిండి ఉన్నదని, ఈ వస్తువుల మధ్య ఉన్న సంబంధమే నిజమైన సంబంధమని, ఈ ప్రపంచాన్నంతటిని నడిపే నియమాలు కూడా ఒకటేనని ఈ లక్షణం వివరిస్తుంది. వాస్తవమే ప్రకృతి, ప్రకృతే వాస్తవమని పాజిటివిస్టులందరూ విశ్వసిస్తారు (Real is natural and natural is real).

**5.6.2 శాస్త్రీయతే నిజమైన విజ్ఞానము** (Science is the only form of knowledge) :

శాస్త్రీయత ఒక్కటే నిజమైన విజ్ఞానం. శాస్త్రీయత సహాయంతో ఏ ఏ విషయాలనైతే తెలుసుకోలేమో వాటిని ఎప్పటికి తెలుసుకోలేము. ఈ విషయం ఈ ప్రపంచానికి కూడా వర్తిస్తుంది. ఎందుచేతనంటే, ఈ ప్రపంచం, దానిలోని అంతర్భాగాలు, వాటి కదలిక, (అంతర్ సంబంధాలు) మొదలయినవన్నీ కూడా కొన్ని నియమాల (laws) చేత నిర్దేశించబడుతూ ఉంటాయి. ఆ నియమాలు ఏమిటి, అవి ఏవిధంగా ఈ ప్రపంచాన్ని నిర్దేశిస్తూ ఉంటాయి అన్న విషయాలను కేవలం శాస్త్రీయత లేదా శాస్త్రీయ పద్ధతులతో మాత్రమే అర్థం చేసుకోగలం. అశాస్త్రీయమైన ఏ ఇతర పద్ధతి కూడా ఇందుకు మనకు ఉపకరించదు. "ఈ ప్రపంచం ఎలా మనగల్గుతుంది?" "ఎందుకు మనుగడ సాగిస్తుంది?" "ఈ బాధ లేమిటి? ఎందుకు?" "మానవజాతి లక్ష్యం ఏమిటి?" వంటి ప్రశ్నలు ప్రతివ్యక్తిని అనునిత్యం వెంటాడుతూనే ఉంటాయి. ఈ ప్రశ్నలన్నింటికి సమాధానం చెప్పటం శాస్త్రీయత ఆధారంగా సాగే పరిశోధన ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. ఈ మొత్తం భావం ఈ క్రింది ఇంగ్లీషు వాక్యం ద్వారా చాలా క్లుప్తంగా వ్యక్తీకరించబడింది. ("The Constituents of the world, and the laws which govern their movements, are discoverable through science alone, science being the only form of knowledge. Therefore that which cannot be known scientifically, cannot be known).

**5.6.3 శాస్త్రీయత విచక్షణ, పరిశీలనల మేలు కలయికలపై ఆధారపడి ఉంటుంది** (Science depends upon Reason and Observation duly combined) :

విచక్షణ (reason) అనే మాటను "సిద్ధాంతం" అనే మాటకు ప్రత్యామ్నాయంగా కాంమ్టె వాడాడు. వాస్తవాలు అర్థం కావాలంటే వాస్తవాలను పరిశీలన చేయటం, సిద్ధాంతం సహాయంతో పరిశీలన చేయటం రెండూ అవసరమే. కేవలం వాస్తవాలను పరిశీలించుకుంటూ పోయినా అవి సత్యాన్ని ఆవిష్కరించలేవు. అదే సమయంలో, సిద్ధాంతాలను ఊహిస్తూ పోయినా అవి కూడా సత్యాన్ని ఆవిష్కరించలేవు. మరోమాటలో చెప్పాలంటే కేవలం ఊహించటం (imagination) అలానే వాస్తవాలను వల్లెవేయటం (empericism) రెండూ పరిశోధనకు పనికి రావు. ఈ రెండింటిని కలపగలిగినపుడు మాత్రమే సత్యం ఆవిష్కరించబడుతుంది. కాంమ్టె మాటలలో చెప్పాలంటే, "పరిశీలనతో సంబంధం లేని సిద్ధాంతము మర్మగర్భమైనది (Mysticism). అదేవిధంగా సిద్ధాంత సహాయం లేని పరిశీలన కేవలం అనుభవానికి మాత్రమే సంబంధించింది (Empericism). ఈ రెండూ నిష్ప్రయోజనమే.

ఎటువంటి పరిశీలన అయినా, పరిశీలన ఫలితమైనా చివరకు సిద్ధాంతీకరణకు (సాధారణీకరణకు) దారితీయవలసిందే. లేదా ఏదో ఒక సిద్ధాంతాన్ని మార్గదర్శకంగా ఉంచుకొని పరిశీలన జరగాల్సిందే. "సాధారణీకరణ సహాయంతో వాస్తవాల పరిశీలన

- వాస్తవాల పరిశీలన సహాయంతో సాధారణీకరణను మెరుగుపరచుకోవటం" లక్ష్యంగా పరిశోధన జరగాలి. వాస్తవాలు (facts) సిద్ధాంతంతో సంబంధంలేని సంఘటనలుగా కనిపించినప్పటికి, వాస్తవాల పరిశీలన, పునః పరిశీలన మొదట ఏదో ఒక భావ ప్రతిపాదనకు (Proposition) దారి తీయాలి. ఆ భావాన్ని పరికల్పనగా మార్చుకుని మరి కొన్ని వాస్తవాల పరిశీలన జరగాలి. వాస్తవాల పరిశీలన తిరిగి, తిరిగి అదే పరికల్పనను సమర్థిస్తే, ఆ పరికల్పన సిద్ధాంతంగా మారి ఇతరులు పరిశోధనకు ఉపక్రమించినప్పుడు, మార్గదర్శిగా నిలుస్తుంది.

**5.6.4 శాస్త్రీయ పరిజ్ఞానం మానవుని మేధో సంపత్తి యొక్క అభివృద్ధితో ముడిపడి ఉంటుంది. కాబట్టి శాస్త్రీయత సహాయంతో ప్రపంచాన్ని నడిపే అన్ని సూత్రాలను తెలుసుకోవటం సాధ్యం కాదు.** (Science cannot discover all the constituents of the world, and all the laws which govern them, because human powers of reason and observation are limited. Scientific knowledge will remain forever relative to the level of intellectual development attained and to the progress in the Social Organisation of Science) :

మానవుడు అవసరం మేరకే విజ్ఞానాన్ని సమకూర్చుకుంటాడు (Knowledge is anthropocentric), అనేది పాజిటివిజమ్ యొక్క వాదన. కాబట్టి మానవ జాతికి ఏ దశలోనూ అపరిమితమైన విజ్ఞానం అందుబాటులో ఉండదు. అతని అవసరాలు పెరిగేకొద్ది, వాటిని తీర్చుకోవటం కోసం మానవుడు తన పరిశీలనా శక్తిని, విచక్షణా శక్తిని పెంచుకొంటూ పోతాడు. దానితో పాటు అతని విజ్ఞానం కూడా విస్తరిస్తూ పోతుంది. కాబట్టి "విజ్ఞానం మానవ జాతి అవసరాల ఫలితం". అంతేకాకుండా, మానవజాతి అవసరాలు భౌతిక ప్రపంచానికి మాత్రమే సంబంధించినవి. ఫలితంగా అతని విజ్ఞానం కూడా భౌతిక ప్రపంచానికే పరిమితమయింది. అభౌతిక విషయాల పరిశీలన సాధ్యం కాదు, వాటికి సంబంధించిన విజ్ఞానం అంతకంటే సాధ్యం కాదు.

**5.6.5 మానవుడు ఏ విషయాలయితే తెలుసుకొంటాడో, అవి అతని అవసరాలకు, అతనున్న భౌతిక స్థితికి సంబంధించినవి మాత్రమే** (What man seeks to discover about the world is normally suggested by his practical interests and his situation) :


పై లక్షణానికి సంబంధించిందే ఈ లక్షణం కూడా. మానవుడు ఏ ఏ విషయాలు తెలుసుకోవాలని కోరుకుంటున్నాడు, ఏ ఏ విషయాలు తెలుసుకుంటున్నాడు అనేది అతని అవసరాలు ఏమిటి అనే విషయం మీద ఆధారపడి ఉంటుంది. ఆవిష్కరణలు అన్ని అవసరాలు తీరడానికే (All discoveries are the results of necessities). సిద్ధాంతాల విషయంలో కూడా ఇదే విషయం వర్తిస్తుంది. సిద్ధాంతాలు మానవ జాతి తన అవసరాలను తీర్చుకోవటానికి చేసే ప్రయత్నంలోంచి ఆవిర్భవిస్తాయి. తెలుసుకోవటం కోసం తెలుసుకోవటమనేది (The desire to know for the sake of desire) అనే దానిలో ఎంతో కొంత వాస్తవమున్నా, తెలుసుకొనటం కోసం జరిగే ప్రయత్నాలలో చాలా ప్రయత్నాలు అవసరాన్ని తీర్చుకోవటానికే జరుగుతాయి.

**5.6.6 గతాన్ని వివరించే, వర్తమానాన్ని అర్థం చేసుకునే, భవిష్యత్ పరిణామాలను గుర్తించగల చారిత్రక నియమాలు ఉన్నవి** (There are laws of historical development whose discovery will enable the past to be explained, the present understood and the future predicted) :

సామాజిక గతిశీలతను నియంత్రించే నియమాలను గురించి తెలియచేసే సామాజిక విభాగానికి కామ్టె "Social Dynamics" అని పేరుపెట్టాడు. అతని అభిప్రాయంలో మానవజాతి చరిత్రలో మూడు విభిన్న దశలు ఉన్నాయి. అవి :

మొదటిది, మతపరమైన దశ (Theological), రెండవది ఆది భౌతిక దశ (Metaphysical), మూడవది, శాస్త్రీయ లేదా పాజిటివ్ దశ (Scientific or Positive). మొదటి దశలో ఆలోచన మిలటరీ పద్ధతిలో సాగింది. మానవుడికి తన గురించి తాను ఆలోచించే అవకాశం ఉండేది కాదు. మానవాతీత శక్తుల పేరు మీద అతని అవసరాలు, కోరికలు నిర్దేశించబడేవి. అతనికి ఏది మంచో, ఏది చెడో ఆ మానవాతీత శక్తులు, వాటి ఏజంట్లు నిర్ణయించేవి. మూడవదశ అయిన శాస్త్రీయ దశ పారిశ్రామిక సామాజిక జీవనశైలికి సంబంధించింది. ఈ దశలో మానవుడు శాస్త్రీయ జ్ఞానం, తృష్ణ పరిశీలన, పరిశోధనల మీద ఆధారపడ్డాడు. తన అవసరాలు తీరే విజ్ఞానాన్ని సముపార్జించుకోవటం మొదలుపెట్టాడు. ఈ రెండు దశలకు మధ్య ఉన్న ఆది భౌతిక దశ మధ్యంతర మార్పు చెందే దశ. ఈ దశలో మిలటరీ తరహా జీవనం విధానం అంతరించటం, శాస్త్రీయ జీవన విధాన లక్షణాలు అంకురించటం జరిగింది.

అయితే, కేవలం దృగ్గోచరమయిన యదార్థాలనే పరిశీలించే పాజిటివిజమ్ సహాయంతో భూత, భవిష్యత్ దశలను గురించి ఎలా తెలుసుకోగలం ? దానికి ఉపకరించే శాస్త్రీయ పద్ధతి ఏమిటి ? అనేది కీలకమయిన ప్రశ్న. దీనికి కామ్టె ఈ క్రింది విధంగా సమాధానం చెప్తాడు. 'వర్తమాన కాలాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోగలగాలి. అది మనకు పూర్తిగా అవగతం అయినపుడు, దాని తొలిదశ జరిగిపోయిన కాలపు మలిదశ. అదేవిధంగా దాని మలిదశ భవిష్యత్ కాలపు తొలి దశ. అంటే, వర్తమాన కాల ఆరంభ లక్షణాల సహాయంతో గడచిపోయిన కాలపు లక్షణాలను; వర్తమానకాలంలో జరిగే మార్పులు సహాయంతో రాబోయే కాలపు లక్షణాలను అవగతం చేసుకోవచ్చు". ఈ క్రింది పటం చూడండి.




ఇదంతా వర్తమాన కాలం.
దీనిని శాస్త్రీయంగా అధ్యయనం చేయవచ్చు.

**5.6.7 వ్యవస్థలోని పలు సంస్థల మధ్య, సాంస్కృతిక అంశాల మధ్య అంతర్ సంబంధాన్ని నిర్దేశించే సామాజిక సూత్రాలు ఉన్నాయి.** (There are Social Laws which govern the Interconnections between different Institutional and Cultural forms) :

సమాజంలో అనేక సంస్థలు, సాంస్కృతిక అంశాలు ఉంటాయి. సమాజం సజావుగా మనుగడ సాగించాలంటే, వీటన్నింటి మధ్య సయోధ్య, అనుకూల సంబంధాలు అవసరం. ఏ సమాజం అయినా మనుగడ సాగిస్తూ ఉంటుంది అంటే దాని అర్థం, అన్ని సంస్థల మధ్య అనుకూల సంబంధాలు ఉన్నాయని. ఈ సంబంధాలన్నీ కొన్ని సూత్రాల (Laws) లేదా నియమాల చేత

నిర్దేశించబడుతూ ఉంటాయి. పరిశోధించి అవి ఏమిటో తెలుసుకోగలగాలి (ఈవిధంగా సంస్థల మధ్య అంతర్ సంబంధాన్ని అధ్యయనం చేయటం సామాజిక శాస్త్రంలో ఒక విభాగమని భావించిన కామ్టె దానిని "Social Statics" అని పేరుపెట్టాడు.

### 5.6.8 సమాజం అంగాంగి సంబంధాలు గల ఏక మొత్తం (Society is a reality Sui Generis) :

సామాజిక శాస్త్రాల అధ్యయనానికి కామ్టె చేసిన సేవలో అతి విలువయినదీ విషయం. అతని అభిప్రాయంలో సమాజంలో అనేక భాగాలతో నిండి ఉంటుంది. ఈ భాగాలన్నీ కలసినపుడే సహజమనే ఒక మొత్తం (whole) తయారవుతుంది. అయితే ఈ భాగాలన్నీ వేరు వేరు భాగాలు కాదు. ఈ భాగాలన్నీ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. ఈ పరస్పర ఆధార లక్షణమే వాటికి మనుగడను ఇవ్వగలుగుతాయి. అలానే వీటన్నింటి మీద ఆధారపడి సమాజం ఉంటుంది. వీటన్నింటి మధ్య ఉన్న సంబంధం సజీవ సంబంధము లేదా అంగాంగి సంబంధము. ఈ భాగాలను అఖండాలుగా (ఇతర భాగాలతో సంబంధం లేనివిగా భావించి) అధ్యయనం చేయటం వలన వాటి లక్షణాలను అర్థం చేసుకోలేము.

కామ్టె అభిప్రాయములో నిర్జీవ అంశాలను అధ్యయనం చేసే శాస్త్రాలలో (ఉదా ॥ రసాయన శాస్త్రము, భౌతిక శాస్త్రము మొ॥నవి) అధ్యయనం భాగం నుండి మొత్తానికి (from part to whole) విస్తరిస్తుంది. అయితే సజీవ అంశాలను అధ్యయనం చేసే శాస్త్రాలలో (ఉదా॥ జీవశాస్త్రాలు, సామాజిక శాస్త్రం) అధ్యయనం మొత్తం నుండి భాగానికి (from whole to part) విస్తరించాలి.

### 5.6.9 క్రమత సమాజం యొక్క సహజ స్థితి (Social Order is the Natural Condition of Society) :

ప్రకృతికి ఎలాగయితే ఒక క్రమబద్ధమైన స్థితి ఉంటుందో సమాజానికి కూడా అటువంటి క్రమబద్ధ స్థితే ఉంటుంది. చాలా కొద్ది కాలం మాత్రమే ఉండే మార్పు చెందే దశలలో (Period of transition) తప్పితే, మిగిలిన కాలం అంతా సమాజం క్రమబద్ధ స్థితిలోనే ఉంటుంది. సామాజిక మార్పు, గతిశీలత సహజమే అయినప్పటికి, సమగ్రమయిన సామాజిక వ్యవస్థ ఎప్పటికప్పుడు రూపుదిద్దుకుంటూ ఉంటుంది. పాజిటివిజం యొక్క సూత్రాల ఆధారంగా సామాజిక జీవితాన్ని ఇంకా క్రమబద్ధంగా తీర్చిదిద్దుకోవచ్చు.

### 5.6.10 నైతిక, రాజకీయ ప్రత్యామ్నాయాలు తప్పనిసరిగా శాస్త్రీయత మీద ఆధారపడి మాత్రమే రూపుదిద్దుకోవాలి (Moral and Political Choice should be established exclusively on a Scientific basis) :

కాంమ్టె అభిప్రాయం ప్రకారం "భావాలు ప్రపంచాన్ని పరిపాలిస్తాయి. ప్రపంచాన్ని అరాచక దశలోకి నెట్టే శక్తి కూడా వాటికే ఉంది" ('Ideas Govern the World, or throw it into Chaos'). సెయింట్ సైమన్ మాటలలో చెప్పాలంటే, "రాజకీయాలు నీతి నియమాలకు సంబంధించిన భావాల మీద ఆధారపడి ఉంటాయి. ప్రజలు నిర్మించుకునే సంస్థలన్నీ ఆ భావాలను ఆచరణలో పెట్టటమే" (Politics are based on ethics and the institutions of the people are nothing but the application of its ideas). అయితే ఈ భావాలన్నీ ఊహాజనితమైనవి మాత్రం కాకూడదు. శాస్త్రీయమైన సూత్రాలు, శాస్త్రీయమైన పరిశోధన ఆధారంగా మాత్రమే ఈ భావాలన్నీ రూపుదిద్దుకోవాలి. అప్పుడు మాత్రమే వాటికి ఆచరణీయత, సంగతత్వం (relavence) ఉంటాయి.

**5.6.11 నిర్మాణాత్మకమైన పాజిటివ్ దృక్పథం, నకారాత్మకమయిన విమర్శనా దృక్పథాన్ని అధిగమిస్తుంది. అనునిత్యం మార్పును ఆమోదించే పాజిటివ్ దృక్పథం, జఢమయిన ఆధ్యాత్మిక, ఆది భౌతిక దృక్పథాలను అధిగమిస్తుంది (The Positive, the Constructive, Super seeds the negative, the Critical. The Positive, the realtive, also superseeds the theological and the metaphysical, the absolute) :**

పాజిటివ్ దృక్పథం ఒక్కటే శాశ్వతమైనది. మిగిలినదంతా నిత్యం మార్పుకు గురవుతూ ఉంటుంది. మార్పును గుర్తించినంత కాలం, అది నిర్మాణాత్మక ధోరణికి ఉపయోగపడుతూ ఉంటుంది.

**5.7 విమర్శ :**

ఆధునిక సిద్ధాంతాలో తీవ్రమయిన విమర్శకు, అపారమయిన ఆదరణకు నోచుకున్న సిద్ధాంతాలలో ఇది కూడా ఒకటి. వాస్తవాలతో ఏమీ సంబంధం లేకుండా కేవలం మేధావుల ఆలోచనా శక్తి ప్రాతిపదికగా కొన్ని వందలపాటు సాగిన భావజాల ఉత్పత్తికి వ్యతిరేకంగా, శాస్త్రీయ ఆలోచనా ధోరణిని రేకెత్తించిన సిద్ధాంతమిది. మొత్తం సామాజిక శాస్త్రాలలో ఒక నూతన విప్లవానికి ఇది నాంది పలికింది.

అయితే ఇది తీవ్రమైన విమర్శలకు కూడా లోనయింది. వాటిలో ముఖ్యమైన వాటిని క్రింద వివరించటం జరిగింది.

**5.7.1 శాస్త్రీయతపై ఏకాభిప్రాయం లేకపోవటం :**

శాస్త్రీయత అంటే ఏమిటి, దాని పద్ధతులు ఏమిటి ? శాశ్వత సత్యాన్ని ఆవిష్కరించటంలో ఆ పద్ధతులు ఎంతవరకు ఉపయోగపడతాయి మొదలైన విషయాలలో కామ్టె తరువాత తరాలకు చెందిన వారిలో ఏకాభిప్రాయం కొరవడింది. ఒక భావజాల ఉద్యమంలాగా ఉవ్వెత్తున మొదలయిన పాజిటివిస్ట్ ధోరణి ముక్కలైపోయింది. చివరకు ఏది పాజిటివిజమ్? ఏది కాదు? అన్న విషయము కనుగొనటమే కష్టమై పోయింది.

**5.7.2 విలువలను విస్మరించటం :**

శాస్త్రీయత పేరున పాజిటివిస్టులు, సామాజిక విలువలను పూర్తిగా విస్మరించారు. ఆదర్శవంతమైన సమాజ జీవితం ఏర్పడాలంటే కొన్ని విలువలకు, కట్టుబాట్లకు స్థానం తప్పదన్న వాస్తవాన్ని ఈ సిద్ధాంతం పూర్తిగా విస్మరించింది. దానితో సమాజశాస్త్ర అధ్యయనంలో దీనికి విలువ తగ్గి పోయింది.

**5.7.3 భౌతిక శాస్త్రాల పద్ధతులను యధావిధిగా అరువు తెచ్చుకోవటం :**

భౌతిక, రసాయన శాస్త్రాలలో అమలులో ఉన్న పరిశోధనా పద్ధతులను యధావిధిగా అరువు తెచ్చుకోవచ్చునని భావించటం ఈ సిద్ధాంతం యొక్క మరొక బలహీనత. సామాజిక శాస్త్రాలలో అధ్యయనానికి కేంద్రబిందువు అయిన మానవుడు అస్థిరమైన ప్రవర్తన కలవాడు. అతనిపై అనేక ప్రభావాలు ప్రసరిస్తూ ఉంటాయి. వాటి ప్రభావంతో తన ఆలోచనను, ప్రవర్తనను మార్చుకుంటూ ఉంటాడు. భౌతిక, రసాయనిక శాస్త్రాలలో అధ్యయన అంశాలు స్థిరమైనవి. వాటిపై బహిర్గత ప్రభావం ఏమీ ఉండదు. వాటి లక్షణాలు శాశ్వతమైనవి. కాబట్టి ఆ శాస్త్రాలలో ఉపయోగించే పరిశోధనా పద్ధతులు సామాజిక శాస్త్రాలకు వర్తింపచేయటం సాధ్యం కాదు. ఈ విషయాన్ని విస్మరించడం ఈ సిద్ధాంతంలోని ప్రధాన బలహీనత.

### 5.7.4 గతాన్ని, భవిష్యత్‌ను అర్థం చేసుకునే అవకాశం లేదు :

దృగ్విషయాలే వాస్తవాలని, వాటి అధ్యయనానికి మించిన విజ్ఞానం లేదనేది ఈ సిద్ధాంతం యొక్క ప్రధాన వాదన. కంటికి కనిపించేవే; పంచేంద్రియాల సహాయంతో పరిశీలించగలిగేవే యదార్థాలయితే? మనకు కనిపించే అవకాశంలేని భూత, భవిష్యత్ కాలాల సంగతి ఏమిటి? ఏమి జరిగినదో, ఏమి జరగాలో తెలుసుకునేదెలా ? కేవలం వర్తమానంలో ఏమి జరుగుతుందో తెలుసుకున్నంత మాత్రాన మానవజాతికి జరిగే ఉపకారమేపాటిది ? మొదలైన ప్రశ్నలు చాలా ముఖ్యమైనవి. వీటికి సమాధానంగా కామ్టె చెప్పిన సమాధానం (వర్తమానంలో మొదటి దశ, భూతకాలాన్ని, చివరిదశ, భవిష్యత్‌ను తెలియచెప్తాయన్న సమాధానం) సంతృప్తికరమైన సమాధానం కాదు.

### 5.7.5 నిరంతర చైతన్యశీలమయిన దానిని సిద్ధాంత చట్రంలో అమర్చటం సాధ్యం కాదు :

సమాజం నిరంతర చైతన్యశీలమని, ఎల్లప్పుడూ మార్పుకు గురవుతూనే ఉంటుందనేది పాజిటివిష్టుల వాదన. అటువంటి లక్షణం గల సమాజాన్ని అర్థం చేసుకోగల సూత్రాలనో, సిద్ధాంతాలను తయారుచేయగలమా ? ఒకే చట్రంలో అమరగల భావాలను ఆవిష్కరించగలమా ? సాధ్యమేనని పాజిటివిష్టులు వాదించినా గాని, వారి వాదన ఎక్కువ మందిని ఒప్పించలేకపోయింది.

### 5.7.6 యదార్థాలే సిద్ధాంతమయితే, చిట్టాకు (List) కు సిద్ధాంతానికి తేడా ఏమిటి ?

కామ్టె తర్వాతి తరపు పాజిటివిష్టులలో కొందరు, మరొక అడుగు ముందుకు వేసి కేవలం దృగ్విషయాలను (యదార్థాలను) గమనించి, నమోదు చేయటమే పాజిటివిజమని, అంతకు మించి ఏమి జరిగినా అది భ్రమలతో కూడిన భావజాలమేనని వాదించారు. (వీరిని పాజిటివిస్ట్ బిహేవియరిష్టులు అని అంటారు). కేవలం యదార్థాల సేకరణే సిద్ధాంతమయితే, ఓటర్ల లిష్టు, ఉద్యోగుల లిష్టు, వనరుల లిష్టు కూడా సిద్ధాంతమే కదా అని విమర్శించేవారికి చెప్పగల సమాధానం వీరి వద్ద లేదు.

### 5.7.7 పరిశీలన, విచక్షణ (reason) ఏ మేరకు కలవాలో వివరణ లేదు :

కేవలం పరిశీలన గాని, కేవలం రీసన్ గాని పనికిరావని ఆ రెంటటి మేలు కలయిక అవసరమని కామ్టె భావించాడు. అయితే ఈ మేలు కలయికలో పరిశీలన పాత్ర ఎంత విచక్షణ పాత్ర ఎంత అనే దానికి కామ్టె సమాధానం చెప్పలేదు.

### 5.8 సారాంశము :

ఎన్ని లోపాలున్నప్పటికి పాజిటివిజమే ఆధునిక సామాజిక సిద్ధాంతాలలో పేరెన్నిక గన్న సిద్ధాంతము. "పడకకుర్చీ సిద్ధాంతాలకు" గౌరవం దక్కకుండా చేసిన ఘనత దీనికే దక్కుతుంది. పరిశీలన శాస్త్రీయంగా ఉండాలనటం, పరిశీలన ఒక సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా చేసుకుని జరగాలనటం, అన్నిటికి మంచి మొత్తం సమాజం పరస్పరం ఆధారపడిన అనేక భాగాల మొత్తమని ప్రతిపాదించటం ఈ సిద్ధాంత విశిష్టతలు. పాజిటివిజమ్, దాని రూపశిల్పి అయిన అగస్ట్ కామ్టె తరువాత తరాల ఆలోచనా ధోరణులపై, పరిశీలనా పద్ధతులపై నిర్ణయాత్మకమైన ప్రభావాన్ని చూపించారు.

## 5.8 నమూనా ప్రశ్నలు :

1. పాజిటివిజమ్ యొక్క ప్రధాన లక్షణాలను వివరించండి.
2. పాజిటివిస్ట్ దృక్పథానికి కామ్టె సేవను విమర్శనాత్మకంగా చర్చించండి.
3. పాజిటివిజమ్ అంటే ఏమిటో వ్రాసి, పై కొలకవస్కి, గిడెన్స్‌ల అభిప్రాయాలను సవివరంగా వివరించండి.
4. పాజిటివిస్ట్ సిద్ధాంత మౌలిక భావాలతో మీరు ఏకీభవిస్తున్నారా? సోదాహరణముగా విపులీకరించండి.
5. "శాస్త్రీయత"ను సామాజిక శాస్త్రాల అధ్యయనంలో ఏ మేరకు అంగీకరించవచ్చును ?
6. పాజిటివిష్టుల అభిప్రాయం ప్రకారం యదార్థాలు సిద్ధాంతాలుగా ఏవిధంగా మారుతాయో వివరించండి?

## 5.9 చదువదగిన గ్రంథాలు :


1. Christopher G.A. Bryant (1985) : "Positivism in Social Theory and Research" Macmillan, London.
2. Ayer, Arfred J. (1959) : Logical Positivism, Allen & Unwin London
3. Evans - Pritchard, Edward E. (1970) : The Sociology of Comte : An Appreciation Manchester University Press.
4. Verma, S.P. (1994) : Modern Political Theory, Vikas, New Delhi


డా॥ ఎమ్.వి.ఎస్. కోటేశ్వరరావు

పాఠం 6

# మార్క్సిస్టు దృక్పథం

## 6.0 లక్ష్యం :

ఈ పాఠాన్ని చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలను బాగా వివరించగలుగుతారు.

మార్క్సిస్టు దృక్పథం అంటే ఏమిటి ?

మార్క్సిస్టు దృక్పథం ప్రపంచాన్నే ఎంతగానో ప్రభావితం చేయడానికి గల కారణాలు ఏమిటి?

మార్క్సిస్టు దృక్పథానికి ఆరంభ బిందువు అయిన గతితార్కిక భౌతికవాదం గురించి

కారల్‌మార్క్స్ వివరించిన చారిత్రక భౌతికవాదం, వర్గ సమాజాలను, వర్గపోరాటలను

గతితార్కిక భౌతికవాదపు అంతిమ దశయిన కమ్యూనిజం గురించి

మార్క్సిస్టు దృక్పథం యొక్క విశిష్టతను సవివరంగా అవగాహన చేసుకోగలుగుతారు

## విషయసూచిక :


6.1 పరిచయం

6.2 మార్క్సిస్టు దృక్పథం

6.2.1 గతితార్కిక భౌతికవాదం

6.2.2 చారిత్రక భౌతికవాదం

6.3 సామాజిక భావన - పరివర్తన

6.4 వర్గసమాజం - వర్గ పోరాటాలు

6.5 సమసమాజం - సామ్యవాదం

6.6 కమ్యూనిజం

6.7 రాజ్యం - మార్క్సిస్టు దృక్పథం

6.8 సారాంశం

6.9 మాదిరి ప్రశ్నలు

6.10 చదువవలసిన గ్రంథాలు

## 6.1 పరిచయం :

ఆధునిక రాజనీతి శాస్త్ర అధ్యయన దృక్పథాలు మౌలికంగా పాశ్చాత్య రాజకీయ వ్యవస్థలను దృష్టిలో వుంచుకొని రూపొందించబడినవి. వాటికి భిన్నంగా మార్క్సిస్టు దృక్పథం ఆర్థిక విశ్లేషణ ప్రాతిపదికపై రూపొందించబడినవి. మార్క్సిస్టు దృక్పథం ఆయా సమాజాల చారిత్రక పరిణామాలను, గతితార్కిక పరిణామచక్రంలో అధ్యయనం చేస్తుంది.

కారల్‌మార్క్స్ ప్రతిపాదించిన సిద్ధాంతాన్నే మార్క్సిజం అంటున్నాం. ఆధునిక ప్రపంచంలో రాజకీయ సామాజిక వ్యవస్థను అంత స్పష్టంగా, శాస్త్రబద్ధంగా వివరించిన సిద్ధాంతం మరొకటి లేదు. అలాగే ప్రజానీకంలో అంతటి ప్రాచుర్యం పొందిన దృక్పథం కూడా ఇంకొకటి లేదు. నేడు విశ్వవ్యాప్తంగా ఆకలి, దోపిడి, అన్యాయాలతో అలమటిస్తున్న అశేష ప్రజల జీవితాల్లో ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతం ఒక ఆశాకిరణమైంది. దోపిడీ, దౌర్జన్యాలకు, అసమానతలకు వ్యతిరేకంగా తలెత్తుతున్న విముక్తి ఉద్యమాలకు మార్క్సిజం సిద్ధాంతికపునాది అయింది. మానవుడే సృష్టికర్తని చాటి, పోరాడితే పోయేదేమి లేదు బానిస సంకెళ్ళు తప్పని, విప్లవ శక్తుల వెన్నుతట్టి నిలబెట్టిన మార్క్సిస్టు దృక్పథం ప్రపంచ గమనానికి మార్గం నిర్దేశించింది.

ఒక సిద్ధాంతం ప్రపంచాన్ని యింతగా ప్రభావితం చేయడానికి గల కారణం ఏమిటి? విశ్వవ్యాప్తంగా ఇంత ప్రాచుర్యం పొందిన మార్క్స్ సామాజిక నిర్మాణం మార్పులను ఎలా విశ్లేషించాడు ? మార్క్సిస్టు దృక్పథం విజ్ఞాన శాస్త్రాలన్నింటిలోను విప్లవాత్మకమైన మార్పుకు కారణభూతమైనది. ఒక విధంగా చెప్పాలంటే మార్క్సిస్టు దృక్పథాన్ని ఒక అధ్యయన సాధనంగా గుర్తించిన తరువాతనే విజ్ఞాన శాస్త్రాలకు, సామాజిక శాస్త్రాలకు శాస్త్రీయ దృక్పథం ఏర్పడింది.

## 6.2 మార్క్సిస్టు దృక్పథం :

సామాజిక వికాస క్రమాన్ని చారిత్రకంగా విశ్లేషించిన కార్ల్‌మార్క్స్ సామాజిక శాస్త్రాల అధ్యయనానికి ఒక నూతన శాస్త్రీయ దృక్పథాన్ని ఆవిష్కరించాడు. జర్మన్ తత్వవేత్త జార్జి ఎఫ్. డబ్ల్యు. హెగెల్ ఆలోచనలతో ప్రభావితుడైన మార్క్స్ ఆయన గతితార్కిక తత్వాన్ని అవిష్కరించాడు. తన ఆలోచనా పద్ధతికి హెగెల్ గతితార్కికతే మూలమని కూడా మార్క్స్ స్పష్టంగా చెప్పాడు.

హెగెల్ భావవాది. ఆయనది అది భౌతిక ఆలోచన. ఈ ఆలోచన ప్రకారం మనకు కనిపిస్తున్న భౌతిక ప్రపంచానికి మూలమైన అది భౌతిక శక్తి ఒకటి వుంది. ఆ అదిభౌతికశక్తి సర్వస్వతంత్రమైనది. దాని వ్యక్తీకరణ, పర్యవసానమే భౌతిక ప్రపంచం. కాబట్టి ఈ భౌతిక ప్రపంచం హేతుబద్ధమైనది కాదు. అది నిరంతరం మారుతూ వుంటుంది. భౌతిక ప్రపంచపు పరిణమాలకు మూలమైన చిదాత్మ ఒక్కటే హేతుబద్ధమైనది, యదార్థమైనది, ఆదర్శవంతమైనది. హెగెల్ ప్రకారం అది భౌతిక (Meta physical) అయిన చిదాత్మ (spirit) ప్రభావం మూలంగానే పరిణామం సంభవిస్తుంది. అంటే సామాజిక పరిణామం ఈ అంత శక్తి మూలంగా జరుగుతున్న ప్రక్రియ. ఈ ప్రక్రియ గతితార్కిక పద్ధతిలో జరుగుతుంది. అంటే వాదం, ప్రతివాదం, సమన్వయం ద్వారా జరుగుతుంది.

ప్రతి సత్యం వెనుక ఒక వాదం వుంటుంది. తర్కానికి వాదమే మూలం. ప్రతివాదానికి వ్యతిరేకంగా ప్రతివాదం పుడుతుంది. వాదప్రతివాదాల (పరస్పరం విరుద్ధమైన ఈ రెండు అంశాల) మధ్య అంతరించి సమన్వయం ఏర్పడుతుంది.

మార్క్స్ హెగెల్ ఆలోచనను అంగీకరిస్తూనే హెగెల్ భావ ఆధిపత్యాన్ని తిరస్కరించాడు. భావం లేదా చిదాత్మనే పరమ సత్యం కాదని, చిదాత్మ కేవలం భౌతిక ప్రపంచపు అభివ్యక్తి మాత్రమేనని పేర్కొన్నాడు. హెగెల్ గతి తర్కాన్ని

తలకిందులుగా నిల్చోబెట్టాడని మార్క్స్ పేర్కొన్నాడు. గతి తార్కికతకు భౌతిక వాదాన్ని జోడించి కొత్త దృక్కోణాన్ని ప్రతిపాదించాడు. భౌతిక ప్రపంచాన్ని గతితార్కిక పద్ధతిలో విశ్లేషించి గతితార్కిక భౌతికవాదం తన తాత్విక పునాది అని మార్క్స్ ప్రకటించుకున్నాడు. ఇప్పటికే గతితార్కి భౌతికవాదమే మార్క్సిస్టు దృక్పథానికి మూలం అయ్యింది.

**6.2.1 గతి తార్కిక భౌతికవాదం** Dialectical Materialism) :

భౌతిక ప్రపంచాన్ని అధ్యయనం చేయడానికి మార్క్స్ ఎన్నుకొన్న మార్గం 'గతితార్కిక భౌతిక వాదం' మార్క్సిస్టు దృక్పథానికి యిది ఆరంభ బిందువు.

మార్క్స్ వాస్తవానికి భౌతికవాది. భౌతికవాదం సృష్టికి మూలం పదార్థం అని చెబుతుంది. మార్క్స్ తన 'థీసిస్ ఆన్ ప్యూర్ బా' గ్రంథంలో తాను విశ్వసిస్తున్న భౌతికవాదం యాంత్రికమైంది (Mechanical) కాదని అది గతితార్కికమైందని (Dialectical) పేర్కొన్నాడు. మార్క్స్ తన సిద్ధాంతాలు ప్రతిపాదించే నాటికే భౌతికవాదం అనే దృక్పథం వుండడం మూలంగా ఈ వివరణ అవసరమైంది. భౌతిక, రసాయన శాస్త్రాల్లో, ప్రకృతికి సంబంధించిన విషయ వివరణలో అప్పటి శాస్త్రవేత్తలు భౌతిక శాస్త్ర దృక్పథాన్ని అనుసరించేవారు. ఈ పద్ధతి శాస్త్ర బద్ధమే అయినప్పటికి దీనిని మానవ సమాజ వికాస అధ్యయనానికీ, సామాజిక శాస్త్రాల పరిశోధనకూ ఉపయోగించడం సాధ్యం కాదు. ఎందుకంటే సమాజం స్తబ్ద పదార్థం కాదు. నిశ్చలంగా వుండదు. ఇది గతిశీలమైనది, వాస్తవికమైనది. కాబట్టి సామాజికాంశాల అధ్యయనానికి భౌతిక శాస్త్ర పద్ధతికి తోడుగా గతితార్కిక దృక్పథాన్ని జోడించవచ్చని మార్క్స్ భావించాడు. గతితార్కిక పద్ధతి అనేది నిరంతరం మార్పులకు లోనవుతూ అభివృద్ధి క్రమాలలో పురోగమిస్తున్న అంశాలను అధ్యయనం చేసే శాస్త్రం ఈ పద్ధతిని హెగెల్ నుంచి గ్రహించి దానిని భౌతిక పరిస్థితులకు అన్వయించాడు. మార్క్స్, మార్క్స్ ప్రకారం గతి తార్కిక భౌతికవాదం అంటే భౌతిక వాస్తవాలు లేదా యదార్థతతో జరిగే మార్పులు లేదా పరిణామం తార్కికంగా జరుగుతుందనే సత్యాన్ని అంగీకరించడమే. మార్పు పరిణామం మార్పు, పరిణామం లేదా అభివృద్ధి అనేది పదార్థం లేదా వ్యవస్థలోని అంతశ్శక్తి ఫలితంగానే జరుగుతుంది. దానికి పరిసరాలు సహకరించడమో, వ్యతిరేకించడమో జరుగుతుంది. మార్పును కోరే శక్తులు పరిసరాలను కూడా తమకు అనుకూలంగా మలచుకుంటూ ముందుకు వెళతాయి. పదార్థం లేదా వ్యవస్థలోని చలనశీలతే నిర్దేశిత గమ్యాన్ని చేరడానికి దోహదపడుతుంది.

మార్క్స్ దృష్టిలో పదార్థం దానంతట అదే మారదు. అలాగని హెగెల్ చెప్పినట్టు చిదాత్మ చైతన్యం వల్ల కూడా మారదు. సామాజిక పరిణామానికి సామాజికాంశాలైన ప్రజలు, ప్రజల చైతన్యం చోదకశక్తిగా పనిచేస్తుంది. వాద, ప్రతివాదాల ఫలితంగా తలెత్తే భావసంఘర్షణ భౌతిక శక్తులను ప్రభావితం చేసి పరిణామానికి దోహదపడుతుంది.

మార్క్స్ గతితార్కిక భౌతికవాదానికి హెగెల్ గతితార్కిక తత్వం మూలమని చెప్పుకున్నాం. హెగెల్ సిద్ధాంతంలో నిర్మాణానికి సంబంధించినంతవరకూ ఏ లోపం లేదని మార్క్స్ స్పష్టం చేశాడు. చరిత్రకాంశాల అధ్యయనం భావన దృక్పథంతోనే, భౌతికశాస్త్ర అధ్యయనంతోనో వీలుపడదని అంగీకరించిన మార్క్స్ గతితార్కిక భౌతికవాదాన్ని రాజకీయ, సామాజిక అధ్యయన పద్ధతిగా రూపొందించారు. జ్ఞాన చింతనలో అంతిమ బిందువు చేరుకొనేంత వరకు వాదం (Thesis) ప్రతివాదం (Antithesis) సమన్వయం (Synthesis) కొనసాగుతూ నిరంతరం సంఘర్షించుకుంటూ వుంటాయి. ఘర్షణలోంచే జ్ఞానం విరాజిల్లుతుంది. సృష్టి వికసితమవుతుంది. మానవ సమాజ వికాసానికి మనిషే మూలధాతువు. సామాజిక రాజకీయ చరిత్ర నిర్మాతలు మనుషులే. అలాగని మనుషులు తమకు తోచిన విధంగా, భావ బంధితమైన ఊహాలోకం నిర్మించుకోవడం కాదు. మనిషి ఏ భౌతిక పరిస్థితుల్లో, ఏ సామాజిక పరిసరాల్లో జీవిస్తున్నారో ఆ పరిస్థితులు, పరిసరాలకు వారి అవసరాలకు అనుగుణంగా వారు ఆ పనిచేయగలుగుతారు. అంతే తప్ప చరిత్ర చిదాత్మ చిద్విలాసం కాదు.

హెగెల్ తన గతితర్కాన్ని 'తలమీద నిల్చోబెట్టాడు. దాని కాళ్ళమీద నిల్చోబెట్టడమే నా వుద్దేశం' అని మార్క్స్ పేర్కొన్నాడు.

మార్క్స్ కేవలం సిద్ధాంతం బోధ చేయలేదు. గతితర్కాన్ని భౌతిక యదార్థతకు అన్వయించి ఆ సూత్రాన్ని సామాజిక పరివర్తనను శాస్త్రబద్ధంగా సిద్ధాంతీకరించడానికి వుపయోగించాడు. ఇది తాత్విక భావన. ఈ భావనను భూమికంగా చేసుకొని, చారిత్రక మూలాల్లోని సామాజికాభివృద్ధి క్రమానే వివరించాడు. అదే చారిత్రక భౌతికవాదం.

**6.2.2 చారిత్రక భౌతికవాదం (Materialistic Interpretation of History) :**

మార్క్స్ ప్రతిపాదించిన దృక్పథం గతితార్కిక భౌతికవాదమని ముందే పేర్కొన్నాడు. ఈ దృక్పథంతోనే ఆయన సామాజిక అధ్యయనాన్ని సాగించాడు. మానవ సమాజాల చారిత్రక వికాసగతిని అధ్యయనం చేసే క్రమంలో ఆయన మానవజాతి చరిత్ర సమస్తం వర్గపోరాటాల చరిత్రేనని గుర్తించాడు.

1848వ సంవత్సరములో ఫ్రెడరిక్ ఎంగెల్స్‌తో కలిసి "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక"ను ప్రచురించి మార్క్స్ అందులో సామాజిక వికాస క్రమ చరిత్రను చిత్రించాడు. చరిత్రను భౌతికవాద దృష్టిలో పరిశీలించడం ఉత్పత్తి సంబంధాల ద్వారా వివరించడమే చారిత్రక భౌతికవాదం అవుతుంది. మార్క్స్ సమాజ ఆవిర్భావం మొదలు గడిచిపోయిన మానవజాతి చరిత్రంతా గతితార్కిక భౌతిక పద్ధతిలో అధ్యయనం చేశాడు. ఆయన ప్రకారం చరిత్ర అంతా పరస్పర వైరుధ్యాలు గల శక్తుల సంఘర్షణ, నిరంతరమూ కొనసాగుతూ వస్తోన్న ఈ ఘర్షణ కొన్నిసార్లు అంతర్గతంగా మరికొన్ని సార్లు, బహిరంగంగా వుంటుంది. ఆధిపత్య వర్గాలకు, అణగారిన జనానికి మధ్య సాగే ఈ ఘర్షణే సామాజిక వికాసానికి మూలం అని మార్క్స్ పేర్కొన్నాడు.

చరిత్రను పరిశీలించడం అంటే రాజులు, రాజ్యాలు, పాలనా కాలపు తారీఖులు తాలూకు దస్తావేజులు కాదు. చరిత్ర అనేది గతకాలపు ప్రజల్లో పాట్లు, కష్టనష్టాలు వారి మనుగడ. ఆ మనుగడ కోసం సాగిన మహత్తర పోరాటం. చరిత్రను చదవడం అంటే అప్పటి సమాజాలను చదవడం, అంటే అప్పటి సమాజాలకు పునాది అయిన భౌతిక వస్తువుల అధ్యయనం. ఈ భౌతిక వస్తువులు పనిముట్లు, ఉత్పత్తి సంబంధాలు ఆర్థిక వ్యవస్థతో కూడిన మొత్తం అప్పటి సమాజం, ఆ సమాజంలోని మానవ సంబంధాలు, భౌతిక పరిస్థితులలో చరిత్రకు అద్దం పడతాయని మార్క్స్ భావించాడు. చారిత్రక ఘటనలకు భౌతిక పునాదిని వెతికి కార్ల్‌మార్క్స్ చరిత్రకు ఒక శాస్త్రీయమైన రూపాన్నిచ్చాయి. హెగెల్ ఆదర్శవాదాన్ని శాస్త్ర రూపానికి సమన్వయ పరిచాడు. సమాజానికి చరిత్రకూ మధ్య సంబంధం కలిపే ప్రయత్నమే చారిత్రక భౌతికవాదం అయ్యింది.

మార్క్స్ కంటే ముందు కాలంలో చారిత్రక విశ్లేషణ ఆధ్యాత్మిక, భౌగోళిక అంశాలను బట్టి మాత్రమే జరుగుతుండేది. భగవంతుడే సృష్టికి మూలమని కొందరు భావిస్తే, ప్రకృతి, పరిసరాలు, ఇతర భౌగోళిక అంశాలే సమాజాన్ని నడిపించాయని, నడిపిస్తున్నాయని మరికొందరు అంటుండేవారు. అదంతా అబద్ధమంటాడు మార్క్స్. చరిత్రలోని ప్రతి ఘట్టమూ మనిషి ఆర్థిక కార్యకలాపాల ఫలితమేనని పేర్కొన్నాడాయన. పాలకుల గొప్పతనాలు, తప్పిదాలు, గొప్పవారి గోత్రాలే చరిత్ర కాదని, మనిషి తన అవసరాల కోసం సాగించిన ప్రతి కార్యమూ చరిత్రేనని మార్క్స్ భావించాడు.

చారిత్రక అధ్యయనం ఆసమాజపు ఆర్థిక కారణాలు, ఉత్పత్తి శక్తులు పాల్గొన్న శక్తుల మధ్య సంబంధాలను పరిశీలించవలసి వుంటుంది. చరిత్రను సామాజిక భౌతికావసరాల నేపథ్యంలో పరిశీలించిన మార్క్స్ మొట్టమొదటిసారిగా ఒక సమగ్రమైన సామాజిక ఆవిర్భావ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

## 6.3 సామాజిక భావన - పరివర్తన :

మార్క్స్ చారిత్రక భౌతికవాద దృక్పథం మానవ సమాజాల అధ్యయనానికి తోడ్పడింది. ఈ పద్ధతిలోనే మార్క్స్ సమాజ ఆవిర్భావ సిద్ధాంతాన్ని శాస్త్ర బద్ధం చేశాడు. ఒకానొక చారిత్రక సందర్భంలోని అవసరాలు పరిస్థితులే మనిషిని స్వేచ్ఛగా స్వతంత్రంగా తిరుగుతున్న మనిషి ఎందుకు సంఘటితమైనట్టు, ఏ శక్తులు మనిషిని సంఘటితపరిచాయని మార్క్స్ పేర్కొన్నాడు. ఆయన దృష్టిలో సమాజం మనిషి సృష్టించుకొన్న మహత్తర వ్యవస్థ. మనిషిని కలిపి సమాజాన్ని సృష్టించాయి అనే ప్రశ్నలకు మార్క్సిజం ఆకలి, అవసరాలు అనే సమాధానాన్నిస్తుంది. చారిత్రక .భౌతికవాదం వివరణలో మార్క్స్ యిలా పేర్కొన్నాడు. "Simple truth, which is clue to the meaning of history, that men must eat to live" పుట్టిన ప్రతి మనిషీ బ్రతకాలనుకుంటాడు. బతకాలంటే తినాలి, తిండి లేకపోతే అస్థిత్వమే లేదు. అందుకే మనిషి ఆలోచనలు విస్తరింపజేసాడు. అన్వేషణ సాగించాడు. ప్రకృతినీ, పరిసరాలను తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. తన ఆకలికే, అస్థిత్వానికే భౌతికసంపదను తన పరిసరాల నుంచి ప్రకృతి నుంచి పొందే ప్రయత్నంలో మనిషి ఉత్పత్తి అనే ప్రక్రియను కనిపెట్టాడు. ఉత్పత్తి భౌతికమైంది. ఉత్పత్తి అయిన అదొక కొత్త సృష్టి. తన అవసరాలను తీర్చుకునేందుకు, తనకు కావల్సిన భౌతిక వనరులను ఉత్పత్తి చేసుకునేందుకు మనిషికి మరోమనిషి సహకారం అవసరమైంది. ఒంటరిగా శ్రమించడం కంటే సామూహికంగా పనిచేస్తే వస్తూత్పత్తి పెరుగుతందని గ్రహించాడు. సమూహంలో తన భౌతికావసరాలు ఎక్కువగా సమర్థవంతంగా తీర్చుకోగలనన్న అవగాహనే మనిషిని సంఘటిత పరిచింది. అదే స్థిరమై 'సమాజం' ఏర్పడేందుకు దోహదపడింది. అంటే సమాజం ఏర్పడడం ఒక భౌతికావసరం. ఒక ఆర్థిక ప్రక్రియలో భాగం.

సమాజం ఏర్పడిన నాటి నుంచే నిరంతరం మారుతూ వస్తోందని మార్క్స్ పేర్కొన్నాడు. సమాజం విస్తృతమై అవసరాలు పెరిగిన క్రమంలో ఉత్పత్తి సంబంధాల్లోనూ, ఉత్పత్తి సాధనాల్లోను మార్పు వచ్చింది. ఉత్పత్తి ప్రక్రియ విస్తరించి ఉత్పత్తి సంబంధాలు మార్చుకున్నా సామాజిక భౌతికావసరాలు తీరి నిస్సహాయ స్థితిలో మనిషి మతం మాయలో పడ్డాడని మార్క్సిజం చెబుతుంది. మతం, దైవం, మానవాతీతశక్తి, మాయవన్నీ భౌతిక శక్తులకు భిన్నమైన అశాస్త్రీయ ఆలోచనలు. మార్క్సిజం దీనికి బద్ధవిరోధి మతం మనిషి ఆలోచనలపై ముసుగువేస్తుందే తప్ప వెలుగు చూడనీయదు. అందుకే మార్క్స్ మతాన్ని మత్తు మందు అన్నాడు. మతం, నైతిక జీవనం, రాజకీయాలు, సామాజిక విలువలు ఇవన్నీ భౌతిక అవసరాలు, ఉత్పత్తి, ఉత్పత్తి సంబంధాల పునాదిపై ఏర్పడతాయి. అంటే ఉత్పత్తి సంబంధాలు, భౌతిక అవసరాలే చైతన్యాన్ని నిర్ధారిస్తాయి. కాని చైతన్యం భౌతిక అవసరాలు, పరిస్థితులను ప్రభావితం చేయదు. మార్క్సిజం ప్రకారం, 'మనిషి చైతన్యం అతని భౌతిక పరిస్థితులను ఉనికిని నిర్ధారించదు. అందుకు విరుద్ధంగా సామాజిక భౌతిక పరిస్థితులే మనిషి చైతన్యాన్ని నిర్దేశిస్తాయి'. మనిషి చైతన్యానికి, చరిత్ర గమనానికి, భౌతిక పరిస్థితులూ, అవసరాలే మూలం తప్ప ఆత్మలు, చిదాత్మలు, మతాలు, దేవుళ్ళు కాదన్నమాట.

సంఘర్షణ, సమాలోచన, సమన్వయం మళ్ళీ సంఘర్షణ ఇలా నిరంతరం మార్పులకు లోనవుతూ మానవ సమాజం ఇప్పటికే వివిధ దశలను దాటి వచ్చిందని మార్క్స్ సిద్ధాంతీకరించాడు. మనిషి తన ఉనికిని, అస్థిత్వాన్ని కాపాడుకుంటూనే భౌతిక అవసరాలను, పరిస్థితులను జయిస్తూ ఈ దశలన్నీ దాటివచ్చాడు. ఈ మహాప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు, విప్లవాలు, వినాశాలు ఎదురైనాయి. ఈ చారిత్రక క్రమాన్ని కార్ల్‌మార్క్స్ గతితార్కిక పద్ధతిలో ఈ క్రింది విధంగా విభజించాడు. సామాజిక వికాసం ఈ ఐదు దశలగుండా సాగుతుందని ఆయన నిర్ధారించాడు.

**(ఎ) ఆదిమదశ** (Asiatic or Primitive age) : మానవజాతి చరిత్రలో ఇది తొలిదశ. ఈ దశలో ఉత్పత్తి శక్తులన్నీ సమూహం చేతిలోనే వుండేవి. సమూహం లేదా సమాజమే ఉత్పత్తి సంబంధాలను నిర్దేశిస్తుండేది. ఆ దశలో ఆహార సేకరణ, వేట

ప్రజల ప్రధానవృత్తిగా వుండేది. ప్రయివేటు ఆస్తి వుండేది కాదు. వీనినే మార్క్స్ ఆదిమ కమ్యూనిస్టు దశగా అభివర్ణించాడు. ఆహారోత్పత్తి పెరగడం, ఉత్పత్తి శక్తులు, భౌతిక పరిస్థితుల్లో మార్పు, ఇతర గతితార్కిక పరిణామాల ఫలితంగా హెచ్చుతగ్గులు లేని సమసమాజం అంతరించి కొత్తగా వర్గ సమాజం అవతరించింది.

**(బి) బానిసత్వ దశ (Age of Slavery) :** భౌతికావసరాలు పెరిగిపోయి జీవితం సంక్షోభంలో పడిపోయిన పరిస్థితుల్లో వేట, ఆహార సేకరణ స్థానంలో పశుపోషణ వ్యవసాయం కొత్త వృత్తులుగా అవతరించాయి. వ్యవసాయం ఒక కొత్త ఉత్పత్తి ప్రక్రియగా ఎదిగింది. లోహాలు, మట్టితో పాత్ర తయారీ కొత్త వృత్తులుగా అవకాశం కల్పించింది. పని క్లిష్టమైపోయింది. మానవ శ్రమ ఎక్కువగా అవసరమైంది. ఈ పరిస్థితుల్లోనే బానిస వ్యవస్థ ఆవిర్భవించింది. పనుల కోసం మనుషులను పశువుల్లా కొనుక్కోవడం, అమ్ముకోవడం మొదలైంది. బలవంతులు బలహీనుల్ని బంధించి బానిసలుగా చేసుకోవడం, ఉత్పత్తి పెంచుకోవడం జరిగింది. ప్రయివేటు ఆస్తి పెంపొందింది. ఉత్పత్తి సాధనాలపై బలవంతుల పట్టు పెరిగింది. సమాజం రెండు వర్గాలుగా (బానిసలు, యజమానులు)విడిపోయింది. ఆర్థిక శక్తులపై యజమానులు అదుపు సాధించుకున్నారు. పురాతన గ్రీకు, రోమన్ సమాజాల్లో బానిస వ్యవస్థ ఉనికి గమనించవచ్చు.

**(సి) భూస్వామ్య దశ (Feudalism) :** ఇది వ్యవసాయ ఆర్థిక దశ, వ్యవసాయం' ఉత్పత్తిలో ప్రధాన ప్రక్రియగా, భూమి ప్రధాన వనరుగా ఎదిగిన దశ. అయితే భూమి కొంతమంది చేతులలోనే కేంద్రీకృతమై వుండడం వల్ల సమాజం వర్గ విభజన మరింత ప్రస్ఫుటమైంది. సమాజం భూస్వాములు - అర్ధబానిసలుగా విభజన చెందింది. బానిస అధికారం సంపాదిస్తే, భూస్వాములు భూమిమీద హక్కులు సృష్టించుకొని అధిపతులైనారు. భూమిలేని పేద ప్రజలు వారికి దాసులైపోయారు. దాసులు దొరల కోసం భూములు దున్ని నాగుచేసి గరిసెలు నింపి, తమ పొట్టలు మాడ్చుకునేవారు. మధ్యయుగపు ఐరోపా పరిస్థితులు దీనికి మంచి ఉదాహరణ. ఇవే పరిస్థితులు ఇతర ఆసియా సమాజాల్లో కూడా కనిపిస్తాయి. అనేకానేక కారణాల వల్ల, పరిణామాల ఫలితంగా ఈ దశ అంతరించి (కొన్ని ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతుంది). నాలుగో దశ అయిన పెట్టుబడిదారీ దశకు సమాజం పరివర్తన చెందుతుందని మార్క్స్ పేర్కొన్నాడు.

**(డి) పెట్టుబడిదారీ దశ (Capitalism) :** శాస్త్రీయాభివృద్ధి సాంకేతిక ప్రగతి మూలంగా పరిశ్రమలు అభివృద్ధి చెంది ఒక కొత్త దశకు సమాజం చేరుకుంటుంది. పరిశ్రమలు ఉత్పత్తులు పెరిగిపోయి 'పెట్టుబడి' సమాజానికి ప్రాణవాయువులా ప్రధానాంశం అవుతుంది. సమాజంలో డబ్బు, ఆస్తులు, ఫ్యాక్టరీలు, పరిశ్రమలు ఇతర ఉత్పత్తి శక్తుల మీద పట్టు కలిగిన పెట్టుబడిదార్లది ఒక వర్గం కాగా, కేవలం శరీర శ్రమపై ఆధారపడి బతికే కార్మికులు ఒక వర్గంగా ఏర్పడతారు. పెట్టుబడిదారుల చేతుల్లో ఉత్పత్తి శక్తులుంటాయి. కార్మికులు తమ నెత్తురు కరిగించి, చెమటోడ్చి కష్టపడి జీవితాలు గడుపుతారు. ఆర్థికవ్యవస్థ, ఉత్పత్తి వనరులన్నీ పెట్టుబడిదారీ వర్గం చేతుల్లోనే వుంటాయి. రెక్కలే ముక్కలు చేసుకున్న కార్మికులకు శ్రమ ఫలితం కూడా దక్కదు. ఉత్పత్తి మొత్తం తమ శ్రమ ఫలితమే అయినా దాని మీద ఏ మాత్రం అధికారం లేని నిస్సహాయ పరిస్థితి వైమనస్యతకు దారి తీస్తుంది. ఈ దశలో సామాజిక వర్గాల మధ్య దూరం మరింత పెరిగి వర్గ పోరాటానికి దారితీస్తుంది. ఈ రెండు వర్గాల్లో ఉత్పత్తి శక్తులను నియంత్రించే పెట్టుబడిదారులను బూర్జువాలు అనీ కార్మిక వర్గాన్ని ప్రొలెటేరియేట్ అని మార్క్స్ పేర్కొన్నాడు.

పెట్టుబడిదారి దశ వర్గ సమాజానికి అంతిమ దశ అని ఇది అంతరించి సామ్యవాద దశ వస్తుందని మార్క్స్ సూత్రీకరించాడు.

మార్క్స్ చెప్పిన ఈ పరిణామం అంతా ఒక సుదీర్ఘ సంఘర్షణ ఫలితం. ఒక్క ఆదిమ సమాజంలో తప్ప దశలోనూ

ఈ ఘర్షణ వుంది. దోపిడీ వుంది. పీడన వుంది. బానిసలను యజమానులు, అర్థబానిసలైన దాసులు, రైతులను భూస్వాములు, కార్మికులను పెట్టుబడిదారులు దోచుకున్నారు. వారి చెమటనీ, శ్రమనీ దోచి సంపన్నులైనారని మార్క్స్ పేర్కొన్నాడు. అందుకే ఆయన మొత్తం సమాజాలను రెండు వర్గాలుగా విభజించాడు. ఒకటి దోపిడీదార్లు, రెండోది దోపిడీకి గురయిన పీడితులు.

ప్రతి సమాజానికి ఆర్థిక వ్యవస్థే పునాది అంటాడు మార్క్స్. ఆర్థికవ్యవస్థ మీద పట్టుకలిగి వుంటే పునాది మీద పట్టు సాధించినట్టే. పునాది మీద ఏ వర్గాలకైతే పట్టు వుంటుందో ఆ వర్గాలే సామాజిక జీవితపు ఇతరపు ఇతర ఉపరితల అంశాల మీద పట్టు కలిగి వుంటారు. అంటే ఆర్థికాంశాల మీద ఉత్పత్తి శక్తుల మీద ఆధిపత్యం కలిగి ఉన్న వర్గం ఉపరితల అంశాలైన రాజకీయాలు, చట్టం, న్యాయం, విద్య, కళలు, సాహిత్యం విలువలు, సంస్కృతి తదితర అంశాలన్నిటినీ అదుపులో పెట్టుకుంటుంది. ఉత్పత్తి శక్తులు, ఆర్థిక వ్యవస్థ సంబంధాలు సామాజిక నిర్మాణపు రూపం అయితే కళలు సాహిత్యం, సంస్కృతి విలువలు రాజకీయాలు, చట్టం ఇవన్నీ దాని సారం.

మార్క్సిస్టుల ప్రకారం భౌతికావసరాలు, ఆర్థికవ్యవస్థలో (అంటే పునాదిలో) అంతర్గతంగా అవసరాలరీత్యా ఏర్పడే వైరుధ్యాలు మరో కొత్తదనాన్ని కోరతాయి. ఘర్షణలు తలెత్తి ఉత్పత్తి సంబంధాల్లో పునాదిలోనే మార్పు అనివార్యమవుతుంది. పునాది మారితే దానంతట అదే ఉపరితలం కూడా మారుతుంది. కొత్త వ్యవస్థలో పాత సామాజిక వర్గాల స్థానంలో కొత్త వర్గాలు కొత్త కళలు, కొత్త సాహిత్యం కొత్త విలువలు ఇట్లా కొత్త సృష్టి సాధ్యపడుతుంది.

అంతర్గత శక్తుల మధ్య ఘర్షణ తీవ్రమైనప్పుడు హింస అనివార్యమవుతుంది. ఈ దశలో హింస అంతిమ పరిష్కారమని కూడా మార్క్సిస్టులు విశ్వసిస్తారు. కొత్త బీజాలు నాటే ముందు పాత ముళ్ళకంప తాలూకూ అవశేషాలను కూడా తెగనరకాల్సి వుంటుంది, లేకపోతే అవే తిరిగి అంకురించి ఆటంకపరుస్తాయి.

ఈ విధంగా పాత సమాజాలు కుప్పకూలిపోయి కొత్త సమాజాలు పుట్టుక, పరిణామ క్రమాన్ని గతితార్కిక పద్ధతిలో అధ్యయనం చేసి, అంతర్గతంగా భౌతికశక్తులు పరిమాణానికి ఎలా కృషి చేస్తాయో సవివరంగా పేర్కొన్నాడు. మార్క్స్ ఎంగెల్స్ పేర్కొన్నట్టు డార్విన్ మహాశయుడు జీవ పరిణామ సూత్రం కనిపెట్టినట్టే మార్క్స్ మానవ జాతి చారిత్రక పరిణామ క్రమాన్ని కనుగొన్నాడు. సామాజిక పరిణామ క్రమంలో కొత్త సమాజ సృష్టి కోసం మనిషి ఎనలేని ఘర్షణ పడ్డట్టు మార్క్స్ రచనలను బట్టి తెలుస్తోంది. ఈ ఘర్షణ రానురాను పెరిగి, పెట్టుబడిదారి దశలో పతాక స్థాయిని చేరుతుందని కూడా మార్క్స్ పేర్కొన్నాడు. ఈ ఘర్షణ అంతిమంగా వర్గ పోరాటంగా రూపుదిద్దుకుంటుందని ఈ వర్గ పోరాటంలో పెట్టుబడి అంతమై సమసమాజం ఆవిష్కరించబడుతుందని ఆయన విశ్లేషించాడు. ఇంతకీ వర్గ పోరాట స్వభావం ఏమిటీ? సమాజం పై వర్గ పోరాట ప్రభావం ఎలా వుంటుంది? మార్క్స్ ఈ విషయాలు ఎలా వివరించాడు. అనేది తెలుసుకోవలసిన అవసరం వుంది.

## 6.4. వర్గ సమాజం, వర్గ పోరాటాలు (Class Society, Class Struggle) :

మార్క్స్ చరిత్రను భౌతికవాది గతి తర్కంలో పరిశీలించాడని తెలుసుకున్నాం. ఈ దృక్పథంలో ఆయన ఆదిమ కాలం నుంచీ మనుగడ సాగిస్తూ వస్తోన్న సమాజాల నిర్మాణాన్ని, స్వభావాన్ని అధ్యయనం చేసి మానవ సంబంధాలన్నీ ఉత్పత్తి సంబంధాలూ, ఆర్థిక సంబంధాలేనని నిర్ధారించాడు. ప్రతి దశలోనూ మానవ జాతి రెండు వర్గాలుగా (ఉత్పత్తి సంబంధాల రీత్యా) విడిపోయిందని ఒకటి ఉత్పత్తి శక్తుల మీద పట్టు కలిగిన యాజమాన్య వర్గం అయితే మరోటి కార్మిక లేదా శ్రామిక వర్గం అని పేర్కొన్నాడు.

ఈ వర్గాలు ఏర్పడడానికి ఆర్థిక, భౌతికావసరాలే కారణమని మార్క్సిస్టులు చెపుతారు. మార్క్స్ కూడా ఒక మనిషి

మరో మనిషి మీద ఆదిపత్యం చెలాయిస్తున్నాడంటే ఆ మనిషి ఉత్పత్తి శక్తులు, ఆర్థిక వనరుల మీద పట్టు ఉండడమేనని పేర్కొన్నాడు. ఒక్క ఆదిమ సమాజంలో మాత్రం ఈ తేడా వుండేదికాదని మార్క్స్ వివరించాడు. ఆదిమ దశ దాటిన తరువాతే దోపిడీ, అసమానతలు పెరిగిపోయి సమాజం వర్గాల వారీగా చీలిపోయింది. మార్క్స్ తన 'క్యాపిటల్' గ్రంథంలో ఈ పరిణామక్రమాన్ని ప్రస్తావిస్తూ "Society divides itself into classes the privileged and the dispossessed, the explloiters and exploitant, the rules and ruled" అని పేర్కొన్నాడు.

మార్క్స్ దృష్టిలో సామాజిక వర్గం అంటే ఉత్పత్తి వ్యవస్థలో ఒకే విధిని నిర్వర్తించే జన బాహుళ్యం. ఉత్పత్తి సంబంధాల్లో ఆ వ్యక్తి నిర్వహించే పని, హోదా, ఆర్థిక రాబడిని బట్టి వర్గం ఏర్పడుతుంది. బెండిక్స్ (Bendix) లిప్‌సెట్ (Lipset) ల ప్రకారం మార్క్సిస్టులు చెప్పే సామాజిక వర్గాలు ఈ క్రింది వైరుధ్యాలు కలిగి వుంటాయి.

(ఎ) వర్గానికి వర్గానికీ మధ్య ఆర్థిక వ్యత్యాసం వుంటుంది.

(బి) ఒక వర్గంలోని వ్యక్తుల మధ్య మహద్భావం, సాన్నిహిత్యం వుండి పరస్పర చర్యలు, సహకారం వుంటాయి.

(సి) వర్గంలోని సభ్యుల మధ్య వారి యొక్క చారిత్రక ప్రాధాన్యత, పాత్రకు సంబంధించిన అవగాహనతోపాటు సంఘీభావం వుంటుంది. దీనినే మార్క్స్ వర్గ చైతన్యం (Class Conciousness) అని పేర్కొన్నాడు. వర్గ చైతన్యం వ్యక్తుల మధ్య సంఘీభావాన్ని పెంచుతుంది.

(డి) ఆర్థిక వ్యవస్థను అదుపుచేయలేని నిస్సహాయత, అసంతృప్తి పీడితుల్లో ప్రబలుతుంది. దోపిడీకి గురవుతున్నామన్న భావన. ఈ వర్గంలో నెలకొంటుంది.

మార్క్స్ ప్రకారం వర్గాలు ఏర్పడడానికి కేవలం ఉత్పత్తి సంబంధాల్లోని వ్యత్యాసాలే కాకుండా, ప్రజా సముదాయాల మధ్య పరస్పర సంబంధాలు, భావ ప్రసార వ్యవస్థ, నిరంతర సంఘర్షణలు - ఇవన్నీ తరచూ తలెత్తినపుడే వర్గ చైతన్యం వెల్లివిరుస్తుంది. వర్గ పోరాటం అన్ని సమాజాల్లోను వుందని ఇది కొన్నిసార్లు బహిరంగంగాను మరికొన్నిసార్లు అంతర్గతంగాను కొనసాగుతుంటుందని మార్క్స్ పేర్కొన్నాడు.

వర్గ పోరాటం తాను వివరించిన సామాజిక వికాస దశల్లో ఒక్కొక్క దశలో ఒక్కొక్క స్థాయిలో వుందని ఆయన వివరించాడు. గతంలో దోపిడీకి గురయిన పీడిత వర్గం కంటే ఈనాటి కార్మిక వర్గానికి కనీసం తమ శ్రమశక్తిని 'అమ్ముకునే' అవకాశం స్వేచ్ఛాయినా దొరికిందని అంటూ మార్క్స్ వర్గ సమాజపు భవిష్యత్ పరిణామాన్ని కూడా ఊహించాడు. ఆశ్చర్యకరంగా మార్క్స్ ఊహ సిద్ధాంతంగా నిలబడి, ఆచరణగా రుజువై శాస్త్రీయ సామాజిక విశ్లేషణగా చరిత్రలో చిరస్థానం పొందింది.

మార్క్స్ చారిత్రక భౌతిక వారి దృక్పథంలో గత కాలపు సామాజిక పరివర్తనను విశ్లేషించిన తరువాత భవిష్యత్ దిశను, గమనాన్ని కూడా సూచించాడు. ఆదిమ, బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ దశలు ఆవిర్భవిస్తాయో వివరించాడు. మిగతా చారిత్రక దశల్లో కన్నా పెట్టుబడిదారీ దశలో వైరుధ్యాలు స్పష్టంగా బయటపడి సంఘర్షణ పెరుగుతుందని భావించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రతిదీ సరుకు రూపంలోనే వుంటుంది. మనిషికి, మానవత్వానికి విలువలు లేకుండా పోతుంది. శ్రమ, చెమట కూడా సరుకులు యంత్రాలను అరగదీసి లాభాలు పొందినట్లే, చెమటను, శ్రమను దోచి మిగులను సంపదగా మార్చుకుంటారు. కాని మనిషి ప్రాణం వున్న చైతన్యశీలి. తాను యంత్రంలో యంత్రమై నిరంతరం తన చెమటను కందెనచేసి కరిగించి పెంచుతున్న ఉత్పత్తిని యజమాని కొల్లగొట్టుకుపోతుంటే ఎంతో కాలం ఓర్చుకోలేడు. ఓపిక పట్టలేడు. పెట్టుబడిదారుడి దగ్గర పెరుగుతున్న సంపదంతా తమ శ్రమ ఫలితమేనన్న సత్యం తెలుసుకున్న కార్మికులు సమరానికి సమాయత్తమవుతారు.

సంఘటితమవుతారు. ఈ క్రమాన్ని మార్క్స్ పెట్టుబడిదారీ సమాజాన్ని విమర్శిస్తూ చేసిన సిద్ధాంత చర్చలో సవివరంగా పొందుపరచాడు.

కార్మికులు వివిధ డిమాండ్లతో తొలుత ఒక వేదిక పైకి వచ్చినప్పటికీ అనంతరం సమిష్టి ప్రయోజనాల కోసం పోరాడే సంఘాలుగా ఏర్పడుతారు. వివిధ హోదాలు, వివిధ పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, వివిధ అంతస్తులు అంతరాల నుంచి వచ్చిన ఈ జనం సంఘటితమై తమ పోటీ, విరోధం యజమానితోనేనన్న సత్యం గుర్తిస్తారు. అంటే ఈ దశలోనే తామంతా ఒక వర్గం అనుకుంటారు.

సామాజిక వర్గాలు ఉత్పత్తి సంబంధాల నేపథ్యంలోనే ఏర్పడినప్పటికీ, వాటి వైరుధ్యాలు రాజకీయ రంగంలో ప్రతిఫలిస్తాయి.

ఎందుకంటే పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి శక్తులు, ఫ్యాక్టరీలు కర్మాగారాలు యితర సంపద కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమై వుంటుంది. ఏ వర్గమైతే ఉత్పత్తి శక్తుల మీద ఆదిపత్యం కలిగి వుంటుందో ఆ వర్గమే రాజకీయాల మీద భావజలం మీద పట్టు కలిగి వుంటుంది. నిజానికి రాజకీయ అధికారం అనేది ఒక వర్గం మరో వర్గాన్ని అణచివేసేందుకు సమీకృతమైన అధికార వ్యవస్థ. బూర్జువా వ్యవస్థలో పెట్టుబడిదారీ వ్యవస్థ [illegible] ఆర్థిక దోపిడీకి, వ్యక్తి[illegible] ప్రయోజనాల (వర్గ ప్రయోజనాల)ను కాపాడడానికి ఒక సాధనంగా తోడ్పడుతుంది. అలాగే కోర్టులు, పోలీసు వ్యవస్థ, సైన్యం యిలా అన్ని రంగాలు పెట్టుబడిదారుల ప్రయోజనాలకు ఊడిగం చేస్తాయి. ఈ దశలో వర్గాలు బలాబలాల సమీకరణలో నిమగ్నమవుతాయి. మార్క్స్ ఈ దశలో మొత్తం సమాజం రెండు శత్రు శిబిరాలుగా విడిపోతుందనీ, రెండు వ్యతిరేక కూటములు - బూర్జువాలు, ప్రొలిటేరియేట్‌లుగా ఎదుగుతుందని వూహించాడు.

ఈ రెండు వర్గాలే కాక, పెటీ బూర్జువాల వంటి మధ్యస్త వర్గాలు కూడా పెట్టుబడీదారి వ్యవస్థలో వున్నప్పటికీ వర్గపోరాట క్రమంలో పెట్టుబడిదార్లు ఈ వర్గాలకు కూడా ఉత్పత్తి శక్తుల మీద అధికారం నిరాకరించడంతో వారు కూడా కార్మిక వర్గ స్థాయికి దిగిపోక తప్పదు.

దానికి తోడు పెట్టుబడిదారీ వర్గాలు లాభాల వేటలో పడి దోపిడీని తీవ్రం చేస్తాయి. కార్మికులకు శ్రమకు తగిన ఫలితం లభించదు. ఒకవైపు పెట్టుబడిదార్ల లాభాలు పెరుగుతాయి. మరోవైపు కార్మికుల్లో పేదరికం ప్రబలుతుంది. ఈ పేదరికం వనరుల కొరత వల్ల కాకుండా దోపిడీ వల్ల పెరుగుతుంది. ఈ అమానుష పరిస్థితులు కార్మిక వర్గంలో వైమనశ్యతకు కారణమౌతాయని మార్క్స్ పేర్కొన్నాడు. వైమనశ్యత, వర్గ కలిసి తీవ్ర రూపం దాల్చి అంతిమంగా విప్లవం వస్తుందని మార్క్స్ విశ్వసించాడు. ఆర్థిక సంక్షోభం తీవ్రమైన పరిస్థితుల్లో విప్లవం ఎలా సిద్ధిస్తుందో మార్క్స్ ఎంగెల్స్ కళ్ళకు కట్టినట్లు వివరించారు.

విప్లవం పెట్టుబడిదారుల పేకమేడల్ని కుప్పకూల్చుతుంది. దాని స్థానంలో కార్మిక వర్గ నియంతృత్వం ముందుకు వస్తుంది. విప్లవం అంటే రక్తపుటేరులు పారాలనే లేదు. కొన్నిసార్లు పెట్టుబడిదారులను లొంగదీసుకుని ఆస్తులు అధికారాలన్ని లాక్కుని వారిని కార్మికుల స్థాయికి తేవడం కూడా విప్లవంలో భాగమే. అయితే అనివార్యమైన పరిస్థితుల్లో ఉత్పత్తి శక్తులను, యంత్రాలను, ఫ్యాక్టరీలను మొత్తంగా ధ్వంసం చేయడం అభౌతికం చేయడం కూడా జరుగుతుంది. పోరాటంలో హింస అనివార్యమని పురిటి నొప్పుల బాధను అనుభవించకుండా ఏ తల్లి ప్రసవించదని అలాగే హింస లేకుండా ఏ విప్లవం పరిపూర్ణం కాదని మార్క్సిస్టులు నమ్ముతారు. పాత వ్యవస్థను సమూలంగా నాశనం చేసిన తరువాత దాని స్థానంలో నూతన వ్యవస్థ అనివార్యంగా ఏర్పడుతుంది.

ఈ విప్లవానికి కార్మికవర్గం, ఆ వర్గంలో అంతర్లీనంగా వున్న వర్గ చైతన్యం ప్రగతిశీల గుణమే కారణమని మార్క్స్ స్పష్టం చేశాడు. చివరకు ఈ వర్గ నాయకత్వంలోనే ప్రగతి శీలమైన నూతన వ్యవస్థ ఏర్పడుతుందని మార్క్స్ జోస్యం చెప్పాడు. దానినే కార్మిక వర్గ నియంతృత్వం అని పేర్కొంటూ ఇది వర్గరహిత సమాజానికి మార్గం వేస్తుందన్నాడు.

## 6.5 సమసమాజం - సామ్యవాదం :

విప్లవం తరువాత శ్రామిక వర్గ నియంతృత్వం కింద (Dictatorship of Proletariate) నూతన సమాజ ఆవిష్కరణ జరుగుతుంది. అప్పటిదాకా ఉన్న వర్గ సమాజం అంతరించి దాని స్థానంలో దోపిడీ, స్వార్థం లేని సమాజం ఆవిర్భవిస్తుంది. ఈ క్రమంలో తొలుత ఉత్పత్తి సంబంధాలు సమూలంగా మారుతాయి. ఉత్పత్తి శక్తులను సమాజపరం చేయడం జరుగుతుంది. పెట్టుబడిదారీ సమాజపు ఆర్థిక భావన, ప్రైవేటు ఆస్తులు రద్దయిపోతాయి. ఈ సంధి కాలంలో అంటే కాపిటలిస్టు సమాజానికీ, కమ్యూనిస్టు సమాజానికి మధ్యకాలంలో కార్మికవర్గం తాత్కాలికంగా ఆధిపత్యం వహించి సామ్యవాదానికి రంగం సిద్ధం చేస్తుంది.

సామ్యవాదం మార్క్స్ ప్రకారం వర్గరహిత సమాజం. ఇది కమ్యూనిస్టు వ్యవస్థకు భిన్నమైనది. ఈ దశలో పెట్టుబడిదారీ వర్గపు వాసనలను సమూలంగా రూపుమాపి కొత్త సమాజాన్ని ఏర్పరచే ప్రక్రియ జరుగుతుంది. పెట్టుబడిదారీ వర్గం ప్రమాదమైంది. మనుషుల ప్రాణాలు పిండి ఆస్తుల్ని పెంచుకున్న ఆ వర్గాలు తమ ప్రాణాలు ధారపోసైనా పంతం నెగ్గించుకోవాలని ప్రయత్నిస్తారు. కాబట్టి ఆ వర్గాన్ని సమూలంగా నాశనం చేసి, కొత్త వర్గ రహిత వ్యవస్థ ఏర్పడేంత వరకు కార్మిక నాయకత్వంలో ఏర్పడే సామాజిక వ్యవస్థ ఇది. పెట్టుబడిదారీ వ్యవస్థ అవశేషాల నుంచి తలెత్తాలని చూసే విప్లవ ప్రతిఘాత శక్తులను అణచివేసి నూతన సమాజానికి మార్గం వేసే దశ. ఈ దశలో కార్మిక వర్గం భూములు, పరిశ్రమలు, సమాచార భావ ప్రసార వ్యవస్థ వంటి ఉత్పత్తిలో కీలకపాత్ర వహించే అన్ని రంగాలపై పట్టు సాధిస్తుంది. ఆస్తిని, వారసత్వ హక్కులను రద్దు చేస్తుంది. కార్మికులే యజమానులుగా పరిశ్రమలను ప్రయోగాత్మకంగా నడుపుతుంది. విద్య, కళలు, సాహిత్యం, శాస్త్ర విధానం వంటి ఉపరితల అంశాలను కూడా యాంత్రీకరిస్తుంది.

సోషలిస్టు దశ పెట్టుబడిదారీ వ్యవస్థ అవశేషాలను పూర్తిగా తొలగించి, కమ్యూనిస్టు వ్యవస్థకు రంగం సిద్ధం చేసే దశ. ఇది మూడు దశల్లో జరుగుతుంది. మొదట కార్మిక వర్గ నియంతృత్వంలో సమాజం పై పట్టు సాధించడం, ఆ తరువాత రెండో దశలో ప్రజలను రాజ్యాధికారానికి సంసిద్ధం చేయడం మూడోది ప్రజారాజ్యం ఏర్పరచడం.

## 6.6 కమ్యూనిజం :

కార్ల్‌మార్క్స్ గతి తార్కిక భౌతిక వాదపు అంతిమ దశ కమ్యూనిజం. కమ్యూనిజం అనేది దప్పికలు లేని ఆదర్శ సమాజం. సంపూర్ణ స్వాతంత్ర్య, సమానత్వంతో కూడిన సహజీవనం ఈ వ్యవస్థ ప్రత్యేకత. ఆస్తిపాస్తులు, భేదాభావాలు లేని, కలతలూ కల్లోలాలూ లేని ఈ వ్యవస్థలో ప్రతి మనిషీ కార్మికుడే. రాజ్యం, రాజకీయ వ్యవస్థ అంతరించిపోతుంది. ఈ వ్యవస్థలో పరిపాలన ఉండదు. కేవలం వనరులను సమకూర్చుకోవడం, సమీకరించుకోవడం మాత్రమే ఉంటుంది. కమ్యూనిస్టు వ్యవస్థలో ఫలానా వ్యక్తి ఫాలానా పని మాత్రమే చేయాలని లేదు. ఎవరికి ఇష్టం వచ్చినపని, ఇష్టం వచ్చిన వేళ, ఇష్టం వచ్చిన చోట చెయ్యొచ్చునని మార్క్స్ తన ది జర్మన్ ఐడియాలజీలో పేర్కొన్నాడు. కమ్యూనిజం ప్రైవేటు ఆస్తిని సమూలంగా రద్దు చేస్తుంది. మనిషికి స్వతంత్ర సమగ్ర పరిసరాన్ని నెలకొల్పుతుంది. మనిషికీ ప్రకృతికీ మధ్య, మనిషికీ మనిషికీ మధ్య సుహృద్భావం నెలకొల్పుతుంది. మొత్తంగా కమ్యూనిజం అనేది మనిషికీ సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛనీ ఇచ్చి విముక్తుణ్ణి చేస్తుందని మార్క్స్ విశ్వసించాడు.

## 6.7 రాజ్యం - మార్క్సిస్టు దృక్పథం (State - Marxist Approach):

మార్క్స్ పరిశోధనలు, విశ్లేషణల ప్రకారం చారిత్రక వికాస తొలిదశ ఆదిమ దశలో రాజ్యం లేదు. అందుకే ఆయన దాన్ని ఆదిమ కమ్యూనిస్టు దశ అన్నాడు. ఈ దశలో మనిషి స్వేచ్ఛాజీవి. కుటుంబం, ప్రయివేటు ఆస్తికి ప్రాధాన్యత లేని దశ. ఉత్పత్తి శక్తులన్నీ సముదాయపు ఆధీనంలోనే ఉండి సమసమాజ వెలసిల్లిన దశ. మార్క్స్ దీనినే పునః వ్యవస్థాపింపజేయాలని కలలుగన్నాడు.

రాజ్యం పుట్టుక వర్గం సమాజ ఆవిర్భావ కాలంలో జరిగింది. మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతం ప్రకారం వర్గ సమాజాల్లో నాలుగు దశల్లో రాజకీయ వ్యవస్థ ఎదిగింది.

తొలివర్గ సమాజమైన బానిసత్వ వ్యవస్థలో రాజ్యభావన యజమానుల హక్కులను కాపాడడం కోసం ఆవిర్భవించింది. బానిసలకు రాజకీయ వ్యవస్థతో రాజ్య వ్యవహారాలతో సంబంధం లేదు. రాజ్య వ్యవహారాలకు సంబంధించిన వాటిలో చివరకు రక్షణ, పరిపాలనా వ్యవస్థలతో సహా అన్ని కార్యకలాపాలు సర్వ హక్కులు కలిగి ఉన్న సంపన్న వర్గమే చూసుకునేది. 'బానిసకు సంబంధించిన ప్రతిదీ ఆ బానిస యొక్క యజమానిదే అవుతుంది' అన్నది ఆనాటి రోమన్ చట్టంగా ఉండేది.

భూస్వామ్య వ్యవస్థలో రాజ్య స్వభావం, రాజకీయ వ్యవస్థ రూపురేఖలు మారిపోయినాయి. మొత్తం రాజకీయ వ్యవస్థకు రాజ్యం మూలాంశం అయ్యింది. రాజ్యం భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను కాపాడే యంత్రాంగంగా పరిణామం చెందింది. భూముల పంపిణీ విషయంలో భూ సంస్కరణల విషయంలో, కూలీ రేట్ల విషయంలో రాజ్యం, భూస్వాముల ప్రయోజనాల పరిరక్షణకే మొగ్గు చూపుతుంది తప్ప, పీడితుల పక్షాన నిలువదు. ఈ వ్యవస్థలో మతం కూడా ప్రధాన పాత్ర (రాజకీయంగా) పోషిస్తుందని మార్క్స్ పేర్కొన్నాడు. పాశ్చాత్య దేశాల్లో చర్చి నిర్వహించిన పాత్రను దృష్టిలో ఉంచుకుని మార్క్స్ ఈ నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఫ్యూడల్ సమాజాల్లో మతం రాజకీయాలను ప్రభావితం చేస్తూ వచ్చిన వాస్తవం కూడా పాలక వర్గాలు వ్యాపార వర్గాలతో లింకులు కలిగి ఉంటాయి. ఆర్థిక, సాంఘిక దోపిడీని ప్రతిఘటించేందుకు కింది స్థాయి వర్గాలు చిన్నచిన్న సంఘాలను ఏర్పాటు చేసుకుంటాయి. ఫ్యూడల్ సమాజంలో రాజకీయాలు ఆర్థిక సామాజిక జీవనంలో కలగలిసి ఉంటాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో రాజకీయాలు పరిణతి చెంది ఉంటాయి. నిర్మితి ప్రకార్యాల పరంగా సమాజం మూడు రకాలుగా విభజన చెంది ఉంటుంది. ఆధిపత్య వర్గాలు బూర్జువాలు ఒక వర్గంగా, పీడిత వర్గాలు, కార్మిక శక్తులు మరో వర్గంగా ఉంటే మూడో స్థానంలో మధ్యతరగతి ఉంటుంది.

మొదటి తరహాలో బూర్జువా రాజ్యం. దాని అనుబంధ జాతీయ కార్మిక సంఘాలు, వాటికి అనుకూలమైన జాతీయ రాజకీయ పార్టీలు, మత, ధార్మిక సంస్థలూ ఉంటాయి. ఇవన్నీ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పని చేస్తాయి.

పెట్టుబడిదారుల, ఆర్థిక, సాంఘిక, రాజకీయ దోపిడీకి భావ ఆధిపత్యానికి వ్యతిరేకంగా సంఘటితమైన కార్మికులు శ్రామికవర్గ పార్టీలు, వర్గ పోరాటానికి నాయకత్వం వహించే కమ్యూనిస్టు పార్టీలు ట్రేడ్ యూనియన్లు, ప్రజా సంఘాలు రెండో వర్గంగా ఉంటాయి.

పెట్టుబడిదారీ సమాజంలో మూడో రాజకీయ పంథాగా సంస్కరణ వాదం ఎదుగుతుంది. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థతో మధ్యవర్తిత్వం నడిపే వ్యవస్థ. ఇందులో సోషల్ డెమొక్రాటిక్ పార్టీలు ట్రేడ్ యూనియన్లు ఉంటాయి. ప్రధాన మౌలిక విషయాల్లో పెట్టుబడిదారీ స్వభావం కలిగి ఉంటే ఈ సంస్థలు ప్రజల వైపు ఉన్నట్టు ప్రవర్తిస్తుంటాయి. మరోవైపు పెట్టుబడిదారీ సమాజంలో అన్ని ఉపరితలాంశాలు, చట్టం, న్యాయం, విద్యా, కళలు, సంస్కృతి పాలక వర్గ ప్రయోజనాల కోసమే ఉద్దేశింపబడి

ఉంటాయి. పీడితులు, కార్మిక వర్గాలకు రాజకీయాల్లో, నిర్ణయాల్లో, రాజ్య వ్యవహారాల్లో ఎలాంటి సంబంధం ఉండదు. కార్మిక వర్గం ఉత్పత్తికే పరిమితమై ఉండాలన్నది బూర్జువా రాజ్యపు ప్రధానకాంక్ష.

విప్లవం, బూర్జువా రాజ్యాన్ని సర్వనాశనం చేసి సమసమాజాన్ని నిర్మిస్తుందని మార్క్సిస్టు దృక్పథం చెపుతుంది. ఉత్పత్తి శక్తులను బద్ధలు కొట్టడంతో పాటు వాటికి ఊడిగం చేసే రాజకీయ వ్యవస్థ, పార్లమెంటు, న్యాయ వ్యవస్థ చట్టాలు, తదితర రంగాలన్నిటినీ విప్లవం మట్టికరిపిస్తుంది. వాటి స్థానంలో సోషలిజం ఏర్పడుతుంది.

సోషలిస్టు రాజ్యం అన్నిటికంటే ఉన్నతమైన రాజ్య వ్యవస్థను నెలకొల్పుతుందని మార్క్సిస్టులు చెపుతారు. మార్క్సిస్టుల దృష్టిలో చారిత్రక పరిణామానికి ఇది అంతిమ దశ. ఇది వర్గరహిత, కమ్యూనిస్టు ప్రజారాజ్యాన్ని ఏర్పాటు చేసేందుకు దోహదపడుతుంది. రాజ్యాధికారాన్ని పూర్తిగా ప్రజలకు అప్పగించే ముందు సోషలిస్టు వ్యవస్థ ఈ క్రింది అంశాలకు ప్రాధాన్యత ఇస్తుంది.

సమాజానికి అవసరమైన భౌతిక సాంకేతిక వనరులను సమకూర్చడం సామాజిక సంబంధాల్లో గుణాత్మకమైన మార్పులు తేవడం ద్వారా నూతన మానవుడిని ఆవిష్కరించడం, శ్రామిక వర్గాల భౌతిక, సాంస్కృతిక ప్రమాణాలు పెంచడం, దేశ రక్షణతో పాటు అంతర్జాతీయ సంబంధాలు పెంచుకోవడం వంటివి. సోషలిస్టు దశ పూర్తయిన తరువాత రాజ్యరహిత కమ్యూనిస్టు వ్యవస్థ ఏర్పడుతుంది.

## 6.8 సారాంశము :

మనవ జాతి చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించిన మార్క్స్ సామాజిక వికాస క్రమాన్ని గతి తార్కిక భౌతిక వాద దృక్పథం నుంచి సోదాహరించాడు. చరిత్ర మనిషిని సృష్టించలేదు. మనిషే చరిత్రను సృష్టించాడన్న వాదంతో నవజాతి చరిత్ర పరిణామాన్ని శాస్త్రబద్ధం చేశాడు మార్క్స్.

చరిత్ర పరిణామంలోని ప్రతి దశలోనూ మానవజాతి చేసిన రక్తతర్పణ, త్యాగాలు మరిచిపోలేనివి అంటుంది మార్క్సిజం. ఆ త్యాగాలే చరిత్ర గమనానికి చోదక శక్తిగా ఉపకరించాయి. ప్రతి దశలోను ఉత్పత్తి క్రమంలోని వైరుధ్యాలు, ఉత్పత్తి శక్తుల మీద ఆధిపత్యం ఘర్షణలే కొత్త మార్పుకు దోహదపడ్డాయని మార్క్స్ పేర్కొన్నాడు. ఆదిమ, బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ దశలు దాటి వర్గ వ్యవస్థ కుప్పకూలి పోతుందని కారల్ మార్క్స్ ఊహించాడు. ప్రజలే వర్గ సమాజాన్ని కూల్చివేసి సమ సమాజానికి మార్గదర్శకులవుతారని మార్క్స్ నమ్మకం.

మార్క్సిజం గెలిచిందా, ఓడిపోయిందా, విప్లవం విజయం సాధించిందా, విఫలమైందా అన్న చర్చ ఇవాళ విశ్వవ్యాప్తంగా కొనసాగుతుంది. చర్చలు, వాదోపవాదాల ఫలితాలెట్లావున్నా, మార్క్సిస్టు దృక్పథం తెచ్చిన మార్పును, ప్రగతిని ఎవరూ కాదనలేరు. అది శాస్త్రీయమైంది, సత్యమైంది.

## 6.9 నమూనా ప్రశ్నలు :

### వ్యాసరూప ప్రశ్నలు

1. కారల్ మార్క్స్ ప్రతిపాదించిన చారిత్రక పరిణామ దశలను గురించి వివరించండి.
2. మార్క్స్ వివరించిన వర్గ పోరాటాన్ని గురించి పరిశీలించండి.

•

3. మార్క్స్ యొక్క గతితార్కిక భౌతిక వాదాన్ని గురించి వివరణాత్మకంగా వివరించండి.

4. మార్క్సిజమ్ శాస్త్రీయమైనదా? చర్చించండి.

**లఘు ప్రశ్నలు**

1. కారల్ మార్క్స్

2. చారిత్రక భౌతికవాదం

3. కమ్యూనిస్టు వ్యవస్థ

4. మార్క్సిస్టు దృక్పధం

## 6.10 చదువదగిన గ్రంథాలు :


| | | |
|---|---|---|
| 1. Charlesworth J.C. | : | Contemporary Political Analysis |
| 2. Apter, D.E. | : | Introduction to Political Analysis |
| 3. Meehan, E.J. | : | The Foundations of Political Analysis |
| 4. Verma, S.P. | : | Modern Political Analysis |
| 5. Dahl, Robert | : | Modern Political Analysis |
| 6. Kolakowski, L | : | From Positivist Philosophy : From Hume to Vienna Circle |
| 7. Millband, R. | : | Maxism and Politics |


- డాక్టర్ కె. రామచంద్రమూర్తి

పాఠం - 7

# రాజకీయ వ్యవస్థా సిద్ధాంతము

## 7.0 లక్ష్యం :

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలను తెలుసుకుంటారు.

- వ్యవస్థ - ఉపవ్యవస్థ భావనలు
- వ్యవస్థకు సామాజిక వాతావరణానికి మధ్య ఉన్న సంబంధాలు
- రాజకీయ వ్యవస్థ నిర్వచనం - దాని ప్రత్యేకత
- రాజకీయ వ్యవస్థ సిద్ధాంత పదజాలం
- సమతౌల్య భావన

## విషయసూచిక


7.1 పరిచయం

7.2 వ్యవస్థ - ఉప వ్యవస్థ

7.3 వ్యవస్థ - నిర్వచనాలు

7.4 రాజకీయ ఉపవ్యవస్థ - నిర్వచనం

7.5 రాజకీయ ఉపవ్యవస్థ - ప్రత్యేకత

7.6 అధికార విలువల పంపిణీ

7.7 వ్యవస్థా సిద్ధాంత పదజాలం

7.7.1 వాతావరణం

7.7.2 ఉత్పాదకాలు

7.7.3 ఉత్పాదితాలు

7.7.4 విధాన ఫలితాలు

7.7.5 స్పందిత సమాచారం

7.8 వాతావరణ ప్రభావానికి తలవొగ్గకుండా రాజకీయ ఉపవ్యవస్థ ఉండగలదు

7.8.1 గేట్ కీపింగ్

7.8.2 సాంఘిక - సాంస్కృతిక పరిమితులు

7.8.3 అనేక ప్రసార మార్గాలను ఎంపిక చేసుకోవటం

7.8.4 అసంతృప్తిని లెదా ఆశలను నిర్దిష్టమైన కోర్కెలుగా మార్చటం

7.9 ఉపవ్యవస్థల మధ్య సంబంధం - సమతౌల్యం
7.10 క్రిటికల్ రేంజ్ భావన
7.11 వ్యవస్థకు శక్తిని సమకూర్చే మద్దతు
7.12 విమర్శ
7.13 సారాంశము
7.14 నమూనా ప్రశ్నలు
7.15 చదువదగిన గ్రంథాలు

## 7.1 పరిచయం :

రాజనీతి శాస్త్రంలో ఈ భావనను ప్రవేశపెట్టిన ఘనత డేవిడ్ ఈస్టన్ అనే అమెరికా జాతీయుడికి దక్కుతుంది. రాజకీయ కార్యకలాపం ఒక ఉపవ్యవస్థఅని, అది ఒక విస్తృత సామాజిక వ్యవస్థలో అంతర్భాగమని, కాబట్టి సామాజిక వాతావరణంలోని మిగిలిన ఉపవ్యవస్థలు రాజకీయ ఉపవ్యవస్థ మీద ప్రభావం చూపుతూ ఉంటాయని ఈ సిద్ధాంతం చెపుతుంది. రాజకీయకార్యకలాపం ఒక ఉపవ్యవస్థ కాబట్టి, దాని గురించిన అవగాహన ఏర్పడాలంటే, మొత్తం సామాజిక వ్యవస్థ కూడా అర్థం కావాలని ఈ సిద్ధాంత సారాంశం. దీనిని ఒక్క మాటలో క్లుప్తంగా చెప్పాలంటే - రాజకీయ ప్రవర్తన అనేది మొత్తం సామాజిక వ్యవస్థ యొక్క ప్రభావం, ఒత్తిడి యొక్క ఫలితం. ఈ ప్రభావం ఏకపక్షంగా వుండదు. సామాజిక వ్యవస్థలోని అనేక ఉపవ్యవస్థలు రాజకీయ వ్యవస్థపై ప్రభావాన్ని చూపే ప్రయత్నం చేస్తూ వుంటే, రాజకీయ వ్యవస్థ మిగిలిన ఉపవ్యవస్థలన్నింటిని ప్రభావితం చేయటానికి ప్రయత్నం చేస్తూ వుంటుంది. ఈ ఉపవ్యవస్థలన్నీ తమ మనుగడ కోసం పరస్పరం ఒకదానిపై ఒకటి ఆధారపడి వుంటాయి.

ఈ సిద్ధాంతసారం సులభంగా అర్థంకావాలంటే మానవ శరీరాన్ని ఉదాహరణగా తీసుకోవాలి. మానవశరీరం ఒక జీవ వ్యవస్థ. దానిలోని గుండె, ఊపిరితిత్తులు, చిన్నప్రేవులు, పెద్దప్రేవులు, మూత్రపిండాలు, మెదడు, చెవి, ముక్కు, గొంతు మొదలగునవన్నీ ఉపవ్యవస్థలు. ప్రతి ఉపవ్యవస్థ మిగిలిన ఉపవ్యవస్థలన్నింటిపై ఆధారపడివుంటుంది. అంటే ఏ ఉపవ్యవస్థ అనారోగ్యానికి గురయినా మిగిలిన ఉపవ్యవస్థలపై దాని ప్రభావం పడుతుంది. ఏ ఒక్క ఉపవ్యవస్థ సక్రమంగా పనిచేసినా అది మిగిలిన ఉపవ్యవస్థలకు చాలా శక్తిని ఇస్తుంది. అంతే కాకుండా ఒక ఉపవ్యవస్థ ఏవిధంగా పనిచేస్తున్నది అన్న విషయం, మిగిలిన ఉపవ్యవస్థలన్నింటిపైనా ఆధారపడుతుంది. కాబట్టి "శరీరం అనే వ్యవస్థ, పరస్పరాధారితము, పరస్పర ప్రభావానికి లోనయ్యే అనేక ఉపవ్యవస్థల సమూహము".

## 7.2 వ్యవస్థ - ఉపవ్యవస్థ :

వ్యవస్థా సిద్ధాంతం పదజాలంలో వ్యవస్థ, ఉపవ్యవస్థ అన్న మాటలు సందర్భాన్ని బట్టి మారుతూ వుంటాయి. ఉదాహరణకు మనం మొత్తం సమాజాన్ని గురించి చర్చిస్తూ ఉన్నట్లయితే, సమాజాన్ని వ్యవస్థఅని, మిగిలిన వాటిని, రాజకీయ వ్యవస్థతో సహా ఉపవ్యవస్థలని పిలుస్తాము. అదే సమయంలో, చర్చించుకునే విషయం కేవలం రాజకీయ ప్రక్రియ అయితే, రాజకీయ కార్యకలాపాలను వ్యవస్థ అని, దానిలోని అంతర్భాగాలను ఉపవ్యవస్థలని పిలుస్తాము. ఉదాహరణకు - చర్చనీయాంశము, సమాజము. అప్పుడు రాజకీయ సంస్థలు, ఆర్థిక సంస్థలు, సాంస్కృతిక సంస్థలు, చారిత్రక నేపథ్యం మొదలైనవన్నీ ఉపవ్యవస్థలు. అలాకాకుండా చర్చనీయాంశము కేవలం రాజకీయ పరిస్థితి అయితే, అపుడు రాజకీయపరిస్థితి

వ్యవస్థ అవుతుంది. శాసనసభ, కార్యనిర్వాహకవర్గం, ప్రభావవర్గాలు, రాజకీయ పార్టీలు మొదలయినవన్నీ ఉపవ్యవస్థలుగా గుర్తించబడతాయి. ఈ ఉపవ్యవస్థలన్నిటి పరస్పర ప్రతిచర్యలు, పరస్పర పోషకమైన సంబంధాలు, వాటిమధ్య వైరుధ్యాలు మొదలగువాటి ఆధారంగా రాజకీయ వ్యవస్థ ప్రవర్తన అర్థం చేసుకోబడుతుంది.

## 7.3 వ్యవస్థ - నిర్వచనాలు :

హాల్, ఫాగన్ (Hall and Fagen) : వస్తువుల మధ్య, వస్తువుల భాగాల మధ్య, సంబంధము కల్గిన ఏకమొత్తము. (Hall & Fagen : A Set of objects together with relationships between the objects and between their attributes).

కాలిన్ చెర్రి (Colin Cherry) : "అనేక భాగాలతో కూడిన మొత్తము, లక్షణాల సమాహారము". (Colin Cherry : "A whole which is compounded of many parts - an ensemble of attributes").

**లుడ్విగ్ ఫాన్ బెర్టలెన్ఫి :** "పరస్పరం అంతర్ చర్యలు కలిగిన అంశాల పొందిక"

**రాయ్ ఆర్.గ్రింకర్ :** పరస్పరం సంబంధం కలిగి వున్న అనేక అంశాల మొత్తము" (Roy R. Grinker : "A Set o elements standing in interaction").

**7.4 రాజకీయ ఉపవ్యవస్థ నిర్వచనం :** "ఒక వాతావరణంలో అంతర్భాగంగా వుండి, ఆ వాతావరణ ప్రభావానికి గురవుతూ, తాను కూడా తిరిగి ఆ ప్రభావాలకు ప్రతిస్పందించే ఉపవ్యవస్థ" - డేవిడ్ ఈస్టన్.

(Political (sub) system is : "A System of behaviour embeded in an environment to the influences of which the political system itself is exposed and inturn reacts." - David Easton".

## 7.5 రాజకీయ ఉపవ్యవస్థ ప్రత్యేకత :

రాజకీయ ఉపవ్యవస్థ, సామాజిక వాతావరణంలో, మిగిలిన ఉపవ్యవస్థలవలె ఒక భాగమేనా ? దానికేమీ ప్రత్యేకత లేదా ?, అనేక ఉపవ్యవస్థలలాగే రాజకీయ ఉపవ్యవస్థ కూడా ఒక మామూలు ఉపవ్యవస్థకాదని, దానికి ప్రత్యేకత ఉందని అంటాడు ఈస్టన్.

ఈస్టన్ అభిప్రాయంలో రాజకీయ ఉపవ్యవస్థ ఒక ప్రధానమైన ఉపవ్యవస్థ. దానికి ఒక ప్రత్యేక అధికారం వుంది. ఆ అధికారం వాతావరణంలోని మరి ఏ ఉప వ్యవస్థకూ లేదు. ఆ ప్రత్యేక అధికారమే "విలువలను అధికారయుతంగా పంపిణీచేసే అధికారం" (It is through political system the binding and authoritative allocations are made and implemented" - David Easton).

## 7.6 అధికార విలువల పంపిణీ :

ప్రతి సమాజంలోనూ అనేక విలువలు అందుబాటులో వుంటాయి. ఇవి మూడు రూపాలలో వుంటాయి. అవి :

1) భౌతిక వనరులు - భూమి, ఆస్థి, ఆదాయము మొదలైనవి.

2) అవకాశాలు

3) సింబాలిక్ వనరులు : గౌరవం, హోదా, గుర్తింపు వంటివి. రాజకీయ ఉపవ్యవస్థ ఈ విలువలన్నింటినీ అధికారికంగా సమాజ సభ్యుల మధ్య లేదా సమూహాల మధ్య అధికారికంగా పంపిణీ చేయగలుగుతుంది. రాజకీయ ఉపవ్యవస్థకు సామాజిక

వాతావరణంలోని మిగిలిన ఉపవ్యవస్థలకు ఇది పెద్ద తేడా. రాజకీయతేర ఉపవ్యవస్థలు విలువలను అధికారికంగా పంపిణీ చేయలేవు. అయితే మిగిలిన ఉపవ్యవస్థలు విలువలను పంపిణీ చేయవని మాత్రం అర్థంకాదు.

రాజకీయేతర ఉపవ్యవస్థలు కూడా విలువలను పంపిణీ చేస్తుంటాయి. ముఖ్యంగా సాంస్కృతిక వ్యవస్థలో భాగమయిన, మతసంస్థలు విలువలను పంపిణీ చేస్తుంటాయి. హోదా, గౌరవం వంటి విలువలు ఎక్కువగా ఈ సంస్థలచేతనే పంపిణీ చేయబడుతూ వుంటాయి. అయితే ఈ పంపిణీ వెనుక ఏ విధమైన అధికారము వుండదు. ఈ విలువలను ఉల్లంఘించిన వారిపై ఆయా ఉపవ్యవస్థలు ఏవిధమైన చర్యలు తీసికొనవు.

పైన తెలుసుకున్న విషయాలను బట్టి రాజకీయ ఉపవ్యవస్థకు ఈ క్రింది లక్షణాలుంటాయని చెప్పుకోవచ్చు.

1. రాజకీయ వ్యవస్థ మరొక విస్తృతమయిన సామాజిక వ్యవస్థలో ఒక అంతర్భాగం.
2. రాజకీయ ఉపవ్యవస్థ, మిగిలిన ఉపవ్యవస్థలు పరస్పరం ఒకదానిపై ఒకటి ఆధారపడి మనుగడ సాగిస్తూవుంటాయి.
3. రాజకీయ ఉపవ్యవస్థకు ఒక నిర్దిష్టమైన సరిహద్దు (**Boundary**) వుంటుంది.
4. రాజకీయ ఉపవ్యవస్థను మిగిలిన ఉపవ్యవస్థలు ప్రభావితం చేయటానికి ప్రయత్నం చేస్తుంటాయి. అదే విధంగా రాజకీయ ఉపవ్యవస్థ కూడా మిగిలిన ఉపవ్యవస్థలను ప్రభావితం చేయటానికి ప్రయత్నం చేస్తూ వుంటుంది.
5. సమాజంలో విలువలను సభ్యుల మధ్య పంపిణీ చేసే అధికారం కేవలం రాజకీయ ఉపవ్యవస్థకే వుంటుంది.

## 7.7 వ్యవస్థా సిద్ధాంతం పదజాలం :

వ్యవస్థా సిద్ధాంతం ఇతర శాస్త్రాల నుండి కొత్త పదాలను రాజనీతి శాస్త్రంలోకి తీసుకువచ్చింది. వాటి అర్థం తెలుసుకోకుండా విధానరూపకల్పనను అర్థం చేసుకోవటం సాధ్యం కాదు. వాటిని గురించి వివరంగా తెలుసుకుందాం.

### 7.7.1 వాతావరణం :

జీవశాస్త్రం నుండి అరువు తెచ్చుకోబడిన పదం ఇది. జీవశాస్త్రం ప్రకారం జీవి నివశించే వాతావరణానికి, జీవికి అవినాభావ సంబంధం వుంటుంది. ఏ జీవి అయితే వాతావరణంలో జరిగే మార్పులకు అనుగుణంగా మారగలుగుతుందో ఆ జీవి మాత్రమే బ్రతకగల్గుతుంది. మారలేని జీవి నశిస్తుంది. రాజకీయ వ్యవస్థ సిద్ధాంతం ప్రకారం రాజకీయ వ్యవస్థ అనేది సామాజిక వాతావరణంలో విడదీయరాని భాగం. ఈ వాతావరణంలో రాజకీయ వ్యవస్థతోపాటు ఇంకా ఎన్నో వ్యవస్థలు భాగంగా వుంటాయి. పైవన్నీ భాగంగా వున్న సామాజిక వాతావరణం రాజకీయ వ్యవస్థ మీద తన ప్రభావాన్ని చూపటానికి ప్రయత్నం చేస్తూవుంటుంది. రాజకీయ వ్యవస్థ కొన్నిసార్లు ఈ ప్రభావాలకు అనుకూలంగా వుండే విధంగా ప్రవర్తిస్తుంది, మరికొన్నిసార్లు సామాజిక వాతావరణాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవటానికి ప్రయత్నం చేస్తుంది, మరికొన్నిసార్లు, అనేక ఎత్తుగడల సహాయంతో, వాతావరణ ప్రభావానికి గురికాకుండా తప్పించుకోవటానికి ప్రయత్నిస్తుంది.

### 7.7.2 ఉత్పాదకాలు :

సామాజిక వాతావరణం నుండి ప్రసరించే ప్రభావాన్ని 'ఉత్పాదకాలు' అని అంటారు. ఇవి రెండు రకాలు. 1) కోరికలు (**Demands**), 2) మద్దతులు (**Supports**).

### 7.7.3 ఉత్పాదితాలు :

ఉత్పాదకాలు విధాన రూపంలోకో, విధాన నిర్ణయం రూపంలోకో మారటాన్ని 'ఉత్పాదితాలు' అని అంటాము. విధానం వలన వచ్చే లాంచనప్రాయమైన మార్పులన్నీ దీనిలోని భాగాలు. భూసంస్కరణలను ఉదాహరణగా తీసుకుంటే యాజమాన్యంలో వచ్చే మార్పు, గరిష్ట భూపరిమితి, దాని అమలు కొరకు ఏర్పరిచే యంత్రాంగము మొదలైనవన్నీ ఉత్పాదితాలు.

### 7.7.4 విధాన ఫలితాలు (Policy Consequencies) :

ఉత్పాదితాల వలన జరిగే పరిణామాలన్నింటిని విధానఫలితాలు అని అంటాము. 1960వ దశకపు చివరి భాగంలో అమలుపరచిన హరితవిప్లవాన్ని ఉదాహరణగా తీసుకుంటే సేంద్రియ ఎరువుల వాడకం, సేద్యపు పద్ధతులలో యంత్రాల వాడకం మొదలయినవి ఉత్పాదితాలు. ధనిక, బీద తారతమ్యం పెరగటం, కేవలం కొద్ది వేల కుటుంబాలకు విపరీతమయిన ప్రయోజనం చేకూరి, మిగిలిన వారికి ఏమి లాభం చేకూరకపోవటం హరిత విప్లవ నికర ఫలితం.


### 7.7.5 స్పందిత సమాచారం (Feed Back) :

విధాన ఉత్పాదితం, విధాన ఫలితం దానిమీద సమాజ సభ్యుల మనోగతం మొదలయిన విషయాలు రాజకీయ వ్యవస్థను చేరే ప్రక్రియను స్పందిత సమాచారం అని అంటాము. దీని ఆధారంగానే రాజకీయ వ్యవస్థ విధాన రూపకల్పన, విధానమార్పు, నిర్ణయాల పునఃపరిశీలన మొదలయిన వాటిని చేస్తూ వుంటుంది.

రాజకీయ వ్యవస్థ, ఒక సామాజిక వ్యవస్థలో ఉపవ్యవస్థ. ఆ వాతావరణంలో రాజకీయ ఉపవ్యవస్థతోపాటు, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక ఉపవ్యవస్థలు కలసి మనుగడ సాగిస్తుంటాయి. రాజకీయ ఉపవ్యవస్థ ఇతర సామాజిక వ్యవస్థల లాగానే ఆవృత (open) వ్యవస్థలు. ఆవృత వ్యవస్థగా ఇది సామాజిక వ్యవస్థలోని మిగిలిన ఉపవ్యవస్థల ప్రభావానికి లోనవుతూ వుండక తప్పదు. సామాజిక వాతావరణం నుండి లేదా సమాజంలోని ప్రజల వద్ద నుండి కోరికలు, మద్దతు ఉత్పాదకాల రూపంలో దాని వద్దకు చేరుతూ వుంటాయి.

మద్దతు సహాయంతో సుస్థిరతను సాధిస్తూ, కోరికలను విధానాలుగా, విధాన నిర్ణయాలుగా రూపొందిస్తూ వుంటుంది. అయితే ఉత్పాదకము, ఉత్పాదితంగా మారే ప్రక్రియలో ఖచ్చితంగా ఏమి జరుగుతుంది, ఏ ఏ శక్తులు లేదా సమూహాలు లేదా వ్యక్తులు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తారు ? అనే విషయం ఎవరికి తెలియదు. అందుకే ఆ మధ్య దశను Block Box అని అంటారు. అయితే ఉత్పాదకం ప్రజల ఆమోదాన్ని పొందవచ్చు, కొంతమేరకే పొందవచ్చు, లేదా పొందలేకపోనచ్చు. ఈ మూడింటిలో ఏది జరిగినా, ఆ విషయాన్ని అనేక ప్రసార మార్గాల సహాయంతో (అభిప్రాయ సేకరణ, పత్రికలు మొదలగునవి) రాజకీయ వ్యవస్థ ఎప్పటికప్పుడు "స్పందిత సమాచారం" రూపంలో తెలుసుకుంటూ వుంటుంది. ఆ స్పందిత సమాచారంపై ఆధారపడి రాజకీయ వ్యవస్థ విధానాలలో మార్పులు, చేర్పులు చేసుకుంటూ వుంటుంది.


కాబట్టి ప్రభుత్వవిధానము అనేది సమాజంలోని ప్రజల కోరికకు అధికారరూపం. విధానం, విధాన నిర్ణయం, ప్రజాభిప్రాయాన్ని ఏదో ఒక మేరకు ప్రతిబింబిస్తూ వుంటాయి.




Easton's "Dynamic Response" Model of a Political System. From A Framework for Political Analysis (Englewood Cliffs, N.J.: Prentice-Hall, 1965), p. 110.


పై బొమ్మను నిశితంగా పరిశీలించినట్లయితే మనకు వ్యవస్థా సిద్ధాంత సారాంశం కళ్ళకి కట్టినట్లుగా తెలిసిపోతుంది. మొత్తం రాజకీయ వ్యవస్థ ఒక సామాజిక వాతావరణంలో భాగంగా అనేక ఇతర వ్యవస్థలతో కూడినట్లుంది. దానిలో రెండు భాగాలుంటాయి. అవి : 1) సామాజిక వాతావరణంలో అంతర్భాగమయిన వ్యవస్థలు (The Intra - Societal Environment) ఉదా : వాతావరణ వ్యవస్థ, జీవవ్యవస్థ, వ్యక్తిత్వ వ్యవస్థ, సాంఘిక వ్యవస్థ మొదలగునవి. 2) సామాజిక వాతావరణం బయట ఉండే వ్యవస్థలు (The Extra - Societal Environment) ఉదా : అంతర్జాతీయ రాజకీయ వ్యవస్థలు, అంతర్జాతీయ సాంఘిక వ్యవస్థలు మొదలగునవి. ఈ వ్యవస్థల నుండి అనేక ప్రభావాలు రాజకీయ వ్యవస్థ మీదకు ప్రసరిస్తూ వుంటాయి. వాటిని ఉత్పాదకాలు (Inputs) అని అంటాము. ఇవి రెండు రకాలు. 1. డిమాండ్లు, 2) కోరికలు (Supports). ఈ ఉత్పాదకాలు రాజకీయ వ్యవస్థలోకి ప్రవేశించిన తర్వాత, అనుగుణ్యత (Possibility) మీద ఆధారపడి కొన్ని డిమాండ్లు ఉత్పాదితాలు (Out - puts) గా మారుతాయి. వీటినే విధానాలని, విధాన నిర్ణయాలని పిలుస్తాము. వీటికి ప్రజలు ఏవిధంగా ప్రతిస్పందిస్తారు ? ఏ మేరకు ఆమోదించారు ? ఏ మేరకు ఆమోదించలేదు, వాటిలో ఎటువంటి మార్పులను కోరుకుంటున్నారు? మొదలయిన విషయాలన్నీ స్పందిత సమాచారం (Feed Back) రూపంలో రాజకీయ వ్యవస్థకు చేరుకుంటాయి. అంతేకాకుండా, ఉత్పాదకాలపై ప్రభావాన్ని చూపటము, కొన్నిసార్లు స్వయంగా స్పందిత సమాచారము ఉత్పాదకంగా మారటము జరుగుతూ ఉంటుంది.

ఇదే విషయాన్ని ఈ క్రింది పటం తేలికగా వివరిస్తుంది.




సామాజిక వాతావరణంలో నుండి పుట్టుకొచ్చిన కోరికలు, మద్దతు ఉత్పాదకంగా మారి, రాజకీయ వ్యవస్థ ద్వారా విధానాలుగా (ఉత్పాదితము)గా మారటం, అదే ఉత్పాదితం, తిరిగి స్పందిత సమాచారంగా మారి, చివరకు ఉత్పాదకంగా మారటాన్ని మనం పై పటం ద్వారా అర్థం చేసుకోవచ్చు).

ఇప్పటికి జరిగిన విధాన విశ్లేషణలో ప్రముఖమయిన విశ్లేషణలు అనేకం ఉన్నాయి. వాటిలో ఒకటి "విద్యా అవకాశాలలో సమానత్వం" (Equality of Educational Opportunities). అమెరికా దేశంలో జరిగిన విశ్లేషణ ఇది. అమెరికా దేశంలో చదువుకొనటానికి ప్రతివారికి అవకాశాన్ని ఎలా కల్పించాలని అనే విషయం మీద ఈ విశ్లేషణ జరిగింది. కోల్‌మాన్ రిపోర్ట్‌గా ప్రఖ్యాతి చెందిన ఈ విశ్లేషణ యొక్క రచయిత ఎస్. కోల్‌మెన్. ఈ విశ్లేషణలో భాగంగా కోల్‌మాన్ చేసిన విశ్లేషణ, వ్యవస్థా సిద్ధాంత ప్రతిపాదనలకు చాలా దగ్గరగా వుంది. కోల్‌మాన్ అభిప్రాయం ప్రకారం సామాజిక వాతావరణం, రాజకీయ వ్యవస్థ, ప్రభుత్వ విధానము తమని తాము పరస్పరం ప్రభావం చేసుకుంటూ ఉంటాయి. అంటే సామాజిక వాతావరణం, రాజకీయ వ్యవస్థను, ప్రక్రియను, ప్రభావితం చేస్తే, రాజకీయవ్యవస్థ ప్రభుత్వ విధానాలను రూపొందిస్తుంది. ప్రభుత్వ విధానాలు తిరిగి సామాజిక వాతావరణాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ విషయాన్ని కోల్‌మాన్ ఈ క్రింది పటం ద్వారా నిరూపించాడు




వాతావరణం, రాజకీయ వ్యవస్థ, ప్రభుత్వ విధానాల మధ్యవున్న పరస్పర సంబంధాన్ని కోల్‌మాన్ A, B, C, D, E,F సంబంధాల ద్వారా వివరించాడు.

సంబంధం A : రాజకీయ, ప్రభుత్వ సంస్థల మీద, ప్రక్రియల మీద, రాజకీయ ప్రవర్తనమీద, సామాజిక వాతావరణం, సామాజిక పరిస్థితుల ప్రభావం.

సంబంధం B : ప్రభుత్వ విధానాల మీద, రాజకీయ, సంస్థల ప్రక్రియ, ప్రవర్తనల ప్రభావం.

సంబంధం C : ప్రభుత్వ విధానాల మీద వాతావరణ శక్తుల, పరిస్థితుల ప్రభావం.

సంబంధం D : వాతావరణ శక్తులమీద, పరిస్థితుల మీద స్పందిత సమాచారం యొక్క ప్రభావం

సంబంధం E : వాతావరణ శక్తులమీద, పరిస్థితుల మీద, రాజకీయ వ్యవస్థల, ప్రక్రియ, ప్రవర్తనల ప్రభావం.

సంబంధం F : రాజకీయ సంస్థల మీద, ప్రక్రియ మీద, ప్రవర్తన మీద ప్రభుత్వ విధానాల ప్రభావం.

ఈ ఆరు సంబంధాలను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే, ఈ మూడింటి మధ్య అంటే వాతావరణం, రాజకీయ సంస్థలు, ప్రభుత్వ విధానాల మధ్య ఉన్న సంబంధం కేవలం ఏకరూపత కల్గినది కాదని, పరస్పరపూరకము, పరస్పర ప్రభావితము అని (Mutually influenced) అని అర్థం అవుతుంది.

### 7.8 వాతావరణ ప్రభావానికి తలఒగ్గకుండా రాజకీయ ఉపవ్యవస్థ ఉండగలదు :

సామాజిక వాతావరణంలోని ప్రభావాలకు తలఒగ్గి విధానాలు రూపొందించక తప్పదా ? రాజకీయ వ్యవస్థ తలవంచి, ఇతర వ్యవస్థల ఆదేశాలు అమలుపరిచే నిస్సహాయ ఉపవ్యవస్థేనా ? కాదు అని ఈస్టన్ సమాధానం. అంతేకాదు, అది యాంత్రిక ఉపవ్యవస్థ కూడా కాదు. అది గతిశీలమైంది (Dynamic). దానికి తనదైన లక్ష్యం, లక్ష్యసాధనా యంత్రాంగం ఉన్నాయి. ఏ మేరకయితే సామాజిక వాతావరణం నుండి ఒత్తిడిని అది ఆమోదిస్తుందో, ఆ మేరకే వాటిని స్వీకరిస్తుంది. విధానంగా మారుస్తుంది. ఒత్తిడిని అడ్డుకొనలేని పరిస్థితి ఎదురైనా, ప్రభావాలు తన ఉనికికి, లక్ష్యానికి వ్యతిరేక స్వభావం కలవైనా వెంటనే వాటిని రాజకీయ వ్యవస్థ తిరస్కరిస్తుంది, లేదా అవి ఉత్పాదకాల స్థాయికి ఎదగకుండా జాగ్రత్తపడుతుంది. దానికొరకు అది నాల్గు ఎత్తుగడలతో కూడిన ఒక క్రమబద్ధీకరణ యంత్రాంగాన్ని (Regulary Mechanism) ఉపయోగిస్తుంది.

### 7.8.1 గేట్ కీపింగ్ (Gate Keeping Mechanism) :

తమకు ఇష్టంలేని లేదా తనకు ప్రమాదమని తోచిన డిమాండ్లను రాజకీయవ్యవస్థ గేట్ కీపింగ్ సహాయంతో అడ్డుకుంటుంది. అంటే సమాజంలో అటువంటి డిమాండ్లు తలఎత్తినప్పటికి వాటిని తన దాకా రానివ్వదు. ఏదో ఒక నెపంతో వాటిని మధ్యలోనే ఆపివేస్తుంది. అవి దేశానికి మేలుచేయవనో, సమాజానికి మేలు చేయవనో, మరో వంకతోనో కొన్ని డిమాండ్లను మధ్యలోనే ఆపివేస్తుంది. వాటిని బలపడనివ్వదు.

### 7.8.2 సాంఘిక, సాంస్కృతిక పరిమితులు (Socio - Cultural Mechanisms) :

రాజకీయ వ్యవస్థ ప్రయత్నపూర్వకంగా ఒక ప్రత్యేకమయిన సాంఘిక, సాంస్కృతిక ఆలోచనా ధోరణిని వృద్ధిచేసి, అది బలపడేటట్లుగా చేస్తుంది. ఆ సాంఘిక, సాంస్కృతిక వాతావరణం సహాయంతో చాలా డిమాండ్లను బలహీనపరుస్తుంది. భారతదేశాన్ని ఉదాహరణగా తీసుకుంటే లౌకికవాదం బాగా బలపడడం వలన, మనదేశ రాజకీయాలలో మతపరమయిన డిమాండ్లకు కాని, మతోన్మాదాన్ని రెచ్చగొట్టే డిమాండ్లకుగాని స్థానం లేకుండా పోయింది.

### 7.8.3 అనేక ప్రసార మార్గాలను ఏర్పాటు చేసుకోవటం (Communication Channels) :

ప్రతి రాజకీయ వ్యవస్థ అమితంగా ఇష్టపడే క్రమబద్ధీకరణ పద్ధతి ఇది. రాజకీయ వ్యవస్థ తనకు నచ్చని లేదా తాను ఆమోదించలేని డిమాండ్లను మధ్యలోనే ఆపి వేయటానికి, తీవ్రతను తగ్గించటానికి అనేక ప్రసార మార్గాలను సృష్టిస్తుంది. డిమాండ్లు ఈ ప్రసారమార్గాల ద్వారానే రాజకీయ వ్యవస్థను చేరాలి కాబట్టి, ఆ డిమాండ్ల రాజకీయ వ్యవస్థను చేరటానికి చాలా సమయం పట్టటమేకాక, చాలా సందర్భాలలో వాటి తీవ్రత కూడా తగ్గుతుంది. కమిటీలను, సబ్‌కమిటీలను, రివ్యూ కమిటీలను, ఎంక్వయిరీ కమీషన్లను నియమించటం దీనికి మంచి ఉదాహరణ. ఈ విధంగా చేయటం వలన రెండు ప్రయోజనాలు రాజకీయ వ్యవస్థకు లభిస్తాయి. అవి 1) కేవలం క్షణికోద్రేకంతో లేదా చాలామంది తీవ్రమైన పద్ధతుల సహాయంతో ముందుకు వచ్చే డిమాండ్లయితే అవి ఈ పద్ధతి వలన క్షీణించిపోతాయి. 2) సమస్యలకు వివేచనతో కూడిన అందరికి ఆమోద యోగ్యమైన పరిష్కారం లభిస్తుంది.

### 7.8.4 అసంతృప్తిని లేదా ఆశలను నిర్దిష్టమైన కోర్కెలుగా మార్చటం (Reduction Process) :

రాజకీయ వ్యవస్థ పట్ల సమాజంలో కొందరికి అసంతృప్తి, మరికొందరికి సంతృప్తి ఉండటం సహజం. అదే విధంగా మరికొందరు రాజకీయ వ్యవస్థపై చాలా ఆశలను కల్గిఉంటారు. ఇవి అనిర్దిష్టంగా (ముఖ్యంగా అసంతృప్తి) ఉండటం వలన రాజకీయ వ్యవస్థకు శక్తిచేకూరకపోగా, నష్టం వాటిల్లుతుంది. ఉదా ॥ మీకు ఎందుకు వ్యవస్థ పట్ల ద్వేషం అన్న ప్రశ్నకు ఖచ్చితంగా ఫలానా కారణాల వలన ద్వేషం అన్న సమాధానం రాకపోతే, అది వ్యవస్థకు హాని చేస్తుంది. అకారణమైతే ద్వేషం ఎప్పటికప్పుడు పెరిగిపోయి చివరకు వ్యవస్థ ఉనికికి ప్రమాదాన్ని కలుగజేస్తుంది. అలాకాకుండా అసంతృప్తిని నిర్దిష్ట డిమాండ్‌గా మార్చగలిగితే (ఈ కోరిక తీరలేదు కాబట్టి మాకు అసంతృప్తి అనే స్థాయికి తీసుకురాగలిగితే) దాన్ని ఎంతో కొంతమేరకు తీర్చటం ద్వారా రాజకీయ వ్యవస్థ బలపడగలుగుతుంది.

## 7.9 ఉపవ్యవస్థల మధ్య సంబంధం - సమతౌల్యం (Equilibrium) :

సామాజిక వ్యవస్థలోని ఉపవ్యవస్థల మధ్య సంబంధం ఎలా ఉండాలి అన్నది ప్రధాన ప్రశ్న. సామాజిక శాస్త్రవేత్తలు అన్ని ఉపవ్యవస్థల మధ్య సమానమయిన, సౌహార్ధమయిన సంబంధం ఉండాలని, ఏ రెండు ఉపవ్యవస్థల మధ్య సంబంధం దెబ్బతిన్నా అది మొత్తం వ్యవస్థకు ప్రమాదకారిగా మారుతుందని వాదిస్తారు. అన్ని ఉపవ్యవస్థలు వాటి ప్రయోజనాల కొరకు రాజకీయ వ్యవస్థపైననే ఆధారపడి ఉంటాయి కాబట్టి, అన్ని ఉపవ్యవస్థల మధ్య సమతౌల్యాన్ని కాపాడవలసిన బాధ్యత రాజకీయ ఉపవ్యవస్థదేనని కూడా వీరు వాదిస్తారు. వీరి అభిప్రాయంలో సమతౌల్యాన్ని కాపాడుకోవటమే రాజకీయ ఉపవ్యవస్థ బాధ్యత.

అయితే డేవిడ్-ఈస్టన్ ఇందుకు అంగీకరించడు. అతని అభిప్రాయంలో మిగిలిన ఉపవ్యవస్థల డిమాండ్లు ఎటువంటి పరిస్థితులలోనూ అంగీకారయోగ్యం కానపుడు, రాజకీయ ఉపవ్యవస్థ ఆ డిమాండ్లను నిర్ద్వంద్వంగా త్రోసిపుచ్చుతుంది. ఈ క్రమంలో మిగిలిన ఉపవ్యవస్థలతో ఉన్న సత్సంబంధాలు చెడిపోయినా ఖాతరు చేయదు. సమతౌల్యం పేరుతో మిగిలిన ఉపవ్యవస్థలు కోరిన ప్రతి డిమాండ్‌ను ఆమోదించవలసిన అవసరం రాజకీయ ఉపవ్యవస్థకు ఉండదు. అవసరమయినపుడు రాజకీయ ఉపవ్యవస్థ అప్పటిదాకా అమలులోఉన్న సమతౌల్య స్థితిని భగ్నంచేసి, తనకు అనుకూలమయిన సమతౌల్యస్థితిని సృష్టించుకొనటానికి కూడా సిద్ధపడుతుంది.

## 7.10 క్రిటికల్ రేంజ్ భావన (The Concept of Critical Range) :

సమతౌల్యాన్ని భగ్నం చేయటానికి కూడా సిద్ధపడుతుందని, మిగిలిన ఉపవ్యవస్థలతో ఘర్షణకయినా సిద్ధపడుతుందని వాదించిన ఈస్టన్, తన వాదనకు తానే పరిమితులు విధించుకుంటున్నాడా ? అన్న అనుమానం కలిగే విధంగా ఈ క్రిటికల్ రేంజ్ భావనను తన సిద్ధాంతంలోకి ప్రవేశపెట్టాడు.

తెలుగులో వాడుకలో ఉన్న "తెగిందాకా లాగకూడదు" అన్న సామెత ఏ అర్థం అయితే ఉందో అదే ఇంగ్లీషులో క్రిటికల్ రేంజ్‌గా పిలువబడుతుంది. తెగిందాకా లాగకూడదు అంటే, అభిప్రాయ భేదాలుండవచ్చు కాని ఆ గర్భశత్రుత్వం లాగా అని మారకూడదని అర్థం. అదేవిధంగా "రాజకీయ ఉపవ్యవస్థ మిగిలిన ఉపవ్యవస్థలతో ఘర్షణ పడటానికి సిద్ధపడినాగాని, వాటితో పూర్తిగా సంబంధాలు తెంచుకొనేదాకా ఆ ఘర్షణను కొనసాగించదు". ఘర్షణకు సిద్ధపడి కూడా, సంబంధాలను తెంచుకోకుండా ఎలా కొనసాగించగలుగుతుంది ? అనేది చాలా ప్రధానమయిన ప్రశ్న. దీనికి డేవిడ్ ఈ క్రింది విధంగా సమాధానం చెప్తాడు.

1) రాజకీయ వ్యవస్థ వాతావరణంలో నుండి వచ్చే కోర్కెలను (ఉత్పాదకాలను) ఉత్పాదితాలుగా మార్చే ప్రక్రియలో ఎంతోకొంతమేరకు మిగిలిన ఉపవ్యవస్థలను తృప్తిపరచటానికి ప్రయత్నం చేస్తూ ఉంటుంది.

2) అప్పటికి అవి సంతృప్తి చెందకపోతే స్పందిత భారం ఆధారంగా, ఉత్పాదితాలలో తగిన మార్పు చేస్తుంది.

3) చివరిగా, పైన మనం చెప్పుకున్న నాల్గు ఎత్తుగడలతో కూడిన క్రమబద్ధీకరణ యంత్రాంగం సహాయంతో సామాజిక వాతావరణంలోని ఇతర ఉపవ్యవస్థలతో సానుకూల సంబంధాలను పరోక్షంగా ఏర్పరచుకొనే ప్రయత్నం చేస్తుంది.

## 7.11 వ్యవస్థకు శక్తిని సమకూర్చే మద్దతు (Support) :

ఉత్పాదకాలలో కోరికలు (Demands) తోపాటు మద్దతు కూడా భాగమే. రాజకీయ వ్యవస్థలోని సభ్యుల వద్దనుండి రాజకీయ వ్యవస్థకు లభించే మద్దతు (Support) రాజకీయ వ్యవస్థ మనుగడ సాగించటంలో చాలా కీలకమయిన పాత్రను

పోషిస్తుంది. వ్యవస్థలోని సభ్యులు రాజకీయ ఉపవ్యవస్థను, అది తీసుకునే నిర్ణయాలను సపోర్ట్ చేస్తూ ఉన్నంతకాలం, రాజకీయ ఉపవ్యవస్థ ఎంతటి సంక్షోభాన్ని అయినా తట్టుకొని నిలబడగలుగుతుంది. అవసరమైతే వాతావరణంలోని మిగిలిన ఉపవ్యవస్థలతో ఘర్షణ పడి కూడా మనుగడ సాగించగలదు. ఏదైనా కారణం వలన ఈ మద్దతు లోపిస్తే మాత్రం, రాజకీయ వ్యవస్థ మనుగడ సాగించటం కష్టం.

## 7.12 విమర్శ :

ఈస్టన్ ప్రతిపాదించిన వ్యవస్థా సిద్ధాంతము తీవ్రవిమర్శకు గురయింది. ఈస్టన్ రాజకీయ వ్యవస్థను నిర్వచించటంలో విఫలమయ్యాడని; రాజ్యం రాజకీయ నాయకుల (Political Actors) మధ్య తడబాటుకు గురయ్యి, ఈ రెండింటిని పర్యాయపదాలుగా వాడాడని మేహన్ విమర్శించాడు. వ్యక్తికి మొత్తం వ్యవస్థీకృత కార్యకలాపాలతో తగినస్థానం ఇవ్వడంలో విఫలం చెందాడని, హన్నా ఆరెన్ట్ విమర్శించాడు. ఫాల్. ఎఫ్‌క్రెస్ మరో అడుగుముందుకు వేసి "రాజకీయ వ్యవస్థపట్ల, దానిలోని సభ్యులపట్ల, వారి పాత్రపట్ల ఈస్టన్‌కు ఎటువంటి అవగాహనలేదని అతనిది కేవలం "రాజకీయాల పట్ల అవగాహన లేమి" అని విమర్శించాడు. ఈస్టన్ ప్రతిపాదించిన వ్యవస్థ నమూనా ఊహలలో తప్ప మరెక్కడా కనిపించదని యూజిని మేహన్ భావించాడు. అయితే ఈస్టన్ ప్రతిపాదనలను మెచ్చుకున్నవారు కూడ లేకపోలేదు. ఓరన్‌యంగ్ మాటలలో చెప్పాలంటే, "ఈస్టన్ ఉత్పాదక - ఉత్పాదిత విశ్లేషణ నిస్సందేహముగా వ్యవస్థా దృక్పథాలన్నింటిలోనూ ఉత్కృష్టమైన, సమగ్రమైన దృక్పథం".

## 7.13 సారాంశము :

సాధారణ వ్యవస్థా సిద్ధాంతాన్ని, రాజనీతి శాస్త్రంలోకి ప్రవేశపెట్టి 'రాజకీయ వ్యవస్థా సిద్ధాంతాన్ని" అభివృద్ధి చేసిన ఘనత డేవిడ్ ఈస్టన్‌కు దక్కుతుంది. రాజకీయ వ్యవస్థ ఒక విస్తృత సామాజిక వ్యవస్థలో ఒక అంతర్భాగమని (ఉపవ్యవస్థ అని) ఆ విస్తృత వ్యవస్థలో ఉన్న మిగిలిన ఉపవ్యవస్థలు రాజకీయ వ్యవస్థపై ప్రభావాన్ని చూపిస్తూ ఉంటాయని, రాజకీయ ఉపవ్యవస్థ కూడా వాటిపై తన ప్రభావాన్ని చూపిస్తూ ఉంటుందని, రాజకీయ ఉపవ్యవస్థ కూడా వాటిపై తన ప్రభావాన్ని చూపిస్తూ ఉంటుందని ప్రతిపాదించి, రాజకీయ ప్రవర్తనను అర్థం చేసుకోవటానికి ఒక కొత్త కోణాన్ని ఈస్టన్ ఆవిష్కరించాడు. రాజకీయ నిర్ణయీకరణ కాని, విధాన రూపకల్పన గాని ప్రక్రియ ఉత్పాదకం కన్వర్షన్ ఉత్పాదితం ఫలిత

స్పందిత సమాచారం ఆధారంగా జరుగుతుందని ఈస్టన్ ప్రతిపాదించాడు. వివిధ ఉపవ్యవస్థ మధ్య ఉండవలసిన సంబంధాలకు (సమతౌల్య భావనకు) నూతన అన్వయాన్ని ఇవ్వటం కూడా ఆయన ప్రత్యేకత. అయితే, రాజకీయ వ్యవస్థకు ఇతర ఉపవ్యవస్థలకు ఉండవలసిన సంబంధాన్ని వివరిస్తూ, ఘర్షణ క్రిటికల్ రేంజ్ అనే ఆ రెండు విరుద్ధ భావనలను ప్రవేశపెట్టటం, రాజకీయ వ్యవస్థను నిర్వచించే క్రమంలో స్పష్టత చూపించలేకపోవటం వంటివి ఆయన సిద్ధాంతంలోని లోపాలు.

## 7.14 నమూనా ప్రశ్నలు :

1. ఈస్టన్ ప్రతిపాదించిన వ్యవస్థా సిద్ధాంతాన్ని వివరించండి.
2. ఈస్టన్ సామాజిక వాతావరణంలోని ఇతర ఉపవ్యవస్థలకు, రాజకీయ ఉపవ్యవస్థకు ఎటువంటి సంబంధాలు ఉంటాయి.

3. సమతౌల్య భావనకు ఈస్టన్ ఇచ్చిన అర్థం, అన్వయాలను చర్చించి, క్రిటికల్ రేంజ్ భావనను గురించి విమర్శనాత్మక వ్యాసాన్ని వ్రాయండి.
4. ఉత్పాదకం - కన్వర్షన్ - ఉత్పాదితం - స్పందిత సమాచార భావనల ఆధారంగా ఈస్టన్ ప్రతిపాదించిన వ్యవస్థా సిద్ధాంతాన్ని వివరించండి.
5. ఆధునిక రాజనీతి శాస్త్రానికి డేవిడ్ ఈస్టన్ చేసిన సేవను విమర్శనాత్మకంగా చర్చించండి.
6. ఈస్టన్ ప్రతిపాదించిన రాజకీయ వ్యవస్థా సిద్ధాంతం మీద చెలరేగిన విమర్శలు సహేతుకమని భావిస్తున్నారా ? సవివరంగా చర్చించండి.

## 7.15 చదువదగిన గ్రంథాలు :


1. David Easton (1953) : The Potical System Scientific Book Agency, Calcutta.
2. David Easton (1980) : "Systems Analysis in Political Science Today" in Political Science Review, Vol. 19, No.1
3. S.P. Varma (1994) : Modern Political Theory, Vikas Publishing House, New Delhi.


- డా॥ ఎం.వి.యస్. కోటేశ్వరరావు

పాఠం - 8

# శిష్ట సిద్ధాంతము (Elite Theory)

## 8.0 లక్ష్యం :

శిష్ట సిద్ధాంతాన్ని చర్చించటం ఈ పాఠం యొక్క లక్ష్యం. ఈ పాఠం చదివిన తర్వాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

- ♦ రాజకీయ శిష్ట సిద్ధాంత ప్రధాన లక్షణాలు
- ♦ పారిటో యొక్క ప్రధాన భావనలు
- ♦ మోస్కా యొక్క ప్రధాన భావనలు
- ♦ మిచెల్స్ యొక్క ప్రధాన భావనలు
- ♦ శిష్ట సిద్ధాంతంపై విమర్శ

## విషయసూచిక


8.1 ఉపోద్ఘాతము

8.2 రాజకీయ శిష్ఠ సిద్ధాంతం

8.3 విల్‌ఫ్రెడ్ పారిటో

8.4 పారిటో యొక్క ప్రధాన భావములు

8.4.1 సమాజము బహుకొద్ది మందిచే పాలింపబడుతుంది

8.4.2 శిష్టులందరూ ఒకే వర్గానికి చెంది ఉంటారు

8.4.3 పాలక; పాలకేతర శిష్ట వర్గము

8.4.4 శిష్టుల పరిభ్రమణ

8.4.5 పరిభ్రమణలో పాలుపంచుకొనే వర్గములు

8.5 పరిభ్రమణకు కారణాలు

8.6 అవశేషాలు

8.7 తర్క, తర్కరహిత చర్యలు

8.8 గెటినో మోస్కా

8.9 మోస్కా ప్రతిపాదించిన ప్రధాన భావములు

8.9.1 సమాజం బహుకొద్ది మందిచే పరిపాలింపబడుతుంది

8.9.2 శిష్టుల లక్షణాలు

8.9.3 శిష్టుల పరిభ్రమణ

8.9.4 పరిభ్రమణకు కారణాలు

8.9.5 ఉపశిష్ట జనభావన
8.9.6 రాజకీయ సూత్రం
8.10 రాబర్ట్ మిఛెల్స్
8.11 వ్యవస్థ మరియు స్వల్పజన పాలకుల ఇనుప చట్టం
8.12 మానవ సహజ మనస్తత్వము
8.13 శిష్టుల విశిష్ట లక్షణాలు
8.14 శిష్ట సిద్ధాంతం పై విమర్శ
8.15 నమూనా ప్రశ్నలు
8.16 చదువదగిన గ్రంథాలు

## 8.1 ఉపోద్ఘాతము :

రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికాలో శిష్ట సిద్ధాంతం బహుళ ప్రాచుర్యం పొందింది. శిష్ట సిద్ధాంతం మొదటగా మధ్య, పశ్చిమ యూరప్ దేశాలలో ప్రజాస్వామ్య, సామ్యవాదాలకి వ్యతిరేకంగా మొదలైనప్పటికీ తరువాత కాలంలో అమెరికాలోని అనేకమంది రచయితలు తమ దేశ రాజకీయప్రక్రియను వివరించటానికి అనువుగా దానిని మలచుకొన్నారు. ఈ సిద్ధాంతం ప్రకారం సమాజంలో సామాన్య ప్రజలతోపాటు పాలించే సామర్థ్యం కలిగిన శిష్టులు వుంటారు. మరో మాటలో చెప్పాలంటే శిష్ట సిద్ధాంతం ప్రకారం ప్రతి సమాజంలోనూ రెండు వర్గాలుంటాయి. అవి : (1) అధికారం చెలాయించే అల్పసంఖ్యాక ప్రజలు (2) అత్యధికులైన పాలితులు. ఎప్పుడైతే పాలకులు పాలించే సామర్థ్యాన్ని కోల్పోతారో అప్పుడు పాలితులు పాలించే సామర్థ్యం కలిగిన మరో శిష్టవర్గానికి పట్టంకడతారు. పాలితులు పాలకులను ఎన్నుకొనేహక్కు కలిగివున్నప్పటికినీ, వారు ప్రతిసారి ఏదో ఒక అల్పసంఖ్యాక శిష్ట వర్గానికే పాలించే అధికారం ధారాదత్తం చేస్తారు. ఈ విధంగా పాలితులు శిష్టులపై నియంత్రణ కలిగి ఉన్నట్లు కనిపించినప్పటికీ, పాలితులపై తమ ప్రభావాన్ని చూపించలేరు.

## 8.2 రాజకీయ శిష్ట సిద్ధాంతం :

రాజకీయ శిష్టసిద్ధాంతానికి మూలాధారం ఐరోపా రచయితలైన పారిటో, మోస్కా, మిఛెల్స్, గాసెట్ వంటి వారి రచనలు. వీరు రాజనీతి శిష్టుల సిద్ధాంతాన్ని ప్రచారంలోకి తీసుకురావడంలోనూ, దానికి గౌరవప్రదమయిన స్థానాన్ని సంపాదించి పెట్టటంలోనూ ఎనలేని కృషి చేశారు. ఈ సిద్ధాంతం అమెరికాలో కూడా విరివిగా చర్చించబడి ప్రచారంలోకి వచ్చింది.

## 8.3 విల్‌ఫ్రెడ్ పారిటో ( 1843 - 1923) :

శిష్ట సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ఘనత ఇతనికి దక్కుతుంది. పారిటో ఇటాలియన్ శాస్త్రవేత్త. వృత్తిరీత్యా సామాజిక శాస్త్రవేత్త అయిన పారిటో సమాజంలో రాజకీయ లేదా నియంత్రణ ప్రక్రియను సామాజిక లక్షణాల దృక్పథం నుండి విశ్లేషించాడు.

## 8.4 పారిటో యొక్క ప్రధాన భావములు :

### 8.4.1 సమాజము బహుకొద్ది మందిచే పాలింపబడుతుంది :

పారిటో ప్రకారం ప్రతి సమాజం అల్పసంఖ్యాకులచే పాలింపబడుతుంది. ఈ అల్పసంఖ్యాకులకి సామాజిక, రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకోవటానికి అవసరమైన లక్షణాలు వుంటాయి. వీరినే శిష్టులు (Elites) అంటారు. ఒక వృత్తిని చేపట్టేవారు అనేకమంది ఉన్నప్పటికీ ఆ వృత్తిలో రాణించగల్గినవారు బహుకొద్దిమంది. ఈ విధంగా ప్రతిసమాజంలో అనేక వృత్తులు, ప్రతి వృత్తిలో రాణించే బృందము వుంటుంది. వీరిని "శిష్టులు" అంటారు. ఈ శిష్టులు లేదా శ్రేష్ఠులు తమ తమ వృత్తిలో కీలకస్థానాలను ఆక్రమిస్తారు. న్యాయవాదులలోనూ, వైద్యులలోనూ, ఇంజనీర్‌లలోనూ, ఉపాధ్యాయులలోనూ, ఆఖరికి దొంగలలోనూ శ్రేష్ఠులు వుంటారని పారిటో భావించాడు.

### 8.4.2. శిష్టులు అందరూ ఒకే వర్గానికి చెంది వుంటారు :

పారిటో అభిప్రాయములో శిష్టులందరూ ఒకే వర్గానికి చెందివుంటారు. చేపట్టిన వృత్తులు వేరు అయినప్పటికీ, వృత్తిరీత్యా సమాజమునకు వారు చేస్తున్న సేవలు వేరు అయినప్పటికీ, శిష్టులు అందరూ సమాజంలోని ఒకే వర్గం నుండి వస్తారని పారిటో భావించాడు. ఉదాహరణకు నిపుణులైన వైద్యులందరూ ఒకే వర్గమునకు చెందినవారై వుంటారు.

సమాజములోని మిగిలిన ప్రజలందరూ (నిపుణులు కాని వారందరూ) రెండవ వర్గమునకు చెందుతారు. వారిని పారిటో శిష్టేతరులు అని అంటాడు. కాబట్టి పారిటో ప్రకారం ప్రతి సమాజం రెండు వర్గాలుగా విభజింపబడుతుంది. మొదటి వర్గము శిష్టులు కాగా, రెండవ వర్గము శిష్టేతరులు..

### 8.4.3. పాలక, పాలకేతర శిష్టవర్గము (Governing and Non-Governing Elites) :

సమాజాన్ని పాలించేది, పాలించే శక్తి కలిగి వున్నది, శిష్టులే అని వాదించిన పారిటో, శిష్టులందరూ పాలక వర్గంగా వుంటారనే వాదనను మాత్రం ఒప్పుకోడు. అంటే ఒకే లక్షణం కలిగిన శిష్టవర్గం మొత్తం పాలకవర్గంగా మాత్రం మారదు. అతని అభిప్రాయంలో శిష్టులు రెండు సమూహాలుగా విభజింపబడి వుంటారు. మొదటి సమూహం పాలకులుగా సమాజాన్ని పాలిస్తూ వుంటే, రెండవ సమూహము శిష్టేతర సమూహంతోపాటు పాలితులుగా వుంటుంది. అయితే ఈ రెండవ సమూహము శిష్టులకు అవసరమైన లక్షణాలన్నీ కల్గి ఉన్నప్పటికీ పాలనలో భాగస్వామ్యంలేని శ్రేష్ఠులుగా వుంటారు. వీరినే పారిటో పాలకేతర శిష్టవర్గముగా పిలుస్తాడు.

### 8.4.4. శిష్టుల పరిభ్రమణ (Circulation of Elites) :

"చరిత్ర కులీనపాలనల శ్మశానం" (History is a graveyard of Arostocracies), ప్రతి సమాజాన్ని శిష్టవర్గమే పరిపాలిస్తుందని చెప్పిన పారిటో, ఏ శిష్టవర్గము కూడా సమాజాన్ని శాశ్వతంగా పరిపాలించలేదు అని పేర్కొన్నాడు. ప్రతి శిష్టవర్గము సమాజాన్ని కొంతకాలం పరిపాలించిన తర్వాత తన అధికారాన్ని పోగొట్టుకుంటుందని, దాని అధికారాన్ని మరొక శిష్టవర్గం భర్తీచేస్తుందని పారిటో చెప్పాడు. ఈ విధంగా అనేక శిష్టవర్గాల మధ్య అధికార మార్పిడి జరగటాన్ని పారిటో 'శిష్టుల పరిభ్రమణ' (Circulation of Elites) అని పేర్కొన్నాడు. శ్మశానంలో త్రవ్వకాలు జరిపితే ఏ విధంగా అయితే కళేబరం తర్వాత కళేబరం బయటపడుతుందో అదేవిధంగా చరిత్రపుటలను వెనుకకు తిప్పుకుంటూపోతే ప్రతిఒక్క శిష్టపాలనకు ముందు మరొక శిష్టపాలన,


ఆ శిష్టపాలనకు ముందు మరొక శిష్టపాలన మనకు దర్శనమిస్తాయేకానీ, శిష్టపాలన కానీ మరే పాలన దర్శనమివ్వదని పారిటో వాదించాడు.

### 8.4.5. పరిభ్రమణలో పాలుపంచుకునే వర్గములు :

శిష్టుల మధ్య జరిగే పరిభ్రమణ ప్రధానంగా రెండు రకాలుగా వుంటుంది. అవి :


1. పాలక, పాలకేతర శిష్టుల మధ్య జరిగే పరిభ్రమణ (Circulation between Governing Elites and Non-Governing Elites)
2. పాలక శ్రేష్ఠులు, పాలితుల మధ్య పరిభ్రమణ (Circulation among Governing Elites and the ruled)

1) మొదటిరకం పరిభ్రమణలో, పాలకేతర శిష్టులు, పాలక శిష్టవర్గం తన లక్షణాలను పోగొట్టుకొనగానే, నూతన శిష్టవర్గముగా రూపాంతరం చెంది పాలకశిష్ట వర్గంగా మారుతారు. ఈ పరిభ్రమణ ఈ క్రింది పటంలోలాగా వుంటుంది.





పై బొమ్మను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే పాలకశిష్టులు తమ లక్షణాలను పోగొట్టుకొని సాధారణ ప్రజలలాగా (పాలితులలాగా) మారిపోయారు. పాలకేతర శిష్టులు పాలకశిష్టులుగా మారిపోయారు.

2) రెండవరకం పరిభ్రమణలో, ప్రజలలో (పాలితులలో) శిష్టలక్షణాలను సంతరించుకున్న వ్యక్తులు శిష్టగణాలలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తారు. నూతన శిష్టగణాలు ఏర్పడటం వల్ల శిష్టుల పరిభ్రమణం సంభవిస్తూ వుంటుంది. ఈ పరిభ్రమణం ఈ క్రింది పటంలోలాగా వుంటుంది.




శిష్టవర్గంలోనే పాలకశిష్టవర్గం, పాలకుల స్థానాన్ని పొందలేకపోయిన పాలకేతర శిష్టవర్గం (Non - governing etites) ఉంటాయని తెలుసుకున్నాం. ఒకరు పాలకుల స్థానంలోనూ, మరొకరు పాలకేతర శిష్టవర్గం ఉండటం మినహాయిస్తే, ఈ రెండు శిష్టవర్గాలు లక్షణాలలోనూ, శక్తిలోనూ ఏమీ తేడా ఉండదు. అటువంటప్పుడు రెండు వర్గాలు మధ్య సంబంధం ఏ విధంగా ఉంటుంది అన్న ప్రశ్నసహజంగానే ఉదయిస్తుంది. ఆ ప్రశ్నకు సమాధానాన్ని ఫైనర్ తాను రచించిన "థియరీ అండ్ ప్రాక్టీస్ ఆఫ్ మోడరన్ గవర్నమెంట్" అన్న పుస్తకంలో ఈ క్రింది బొమ్మ సహాయంతో వివరించారు.



వివరణ :

పై పటంలో పాలక, పాలకేతర శిష్టులను నీటిలో తేలియాడుతున్న నారింజపండుతో పోల్చాడు ఫైనర్. నారింజ పండు సమాజంలోని శిష్టులకు ప్రతీక. నీటిపై భాగంలో కనపడుతున్న నారింజ పండు యొక్క భాగం పాలకశిష్టులు ( ఈ భాగం మొత్తం నారింజపండులో చిన్నది కాబట్టి పాలకశిష్టులు చాలా తక్కువమంది ఉంటారని అర్థం). నీటిలో మునిగివున్న భాగం పాలకేతర శిష్టులు. పాలకేతర శిష్టులు తాత్కాలికంగా అధికారానికి దూరంగా వుండి, పాలకశిష్టులకు తలఒగ్గి (Subordinate) ఉంటారు. వారి భావాలను, అభిప్రాయాలను కూడా తాత్కాలికంగా వాయిదా వేసుకుంటారు. కాని, అవకాశం కోసం, అంటే పాలకశిష్టుల స్థానాన్ని కైవసం చేసుకొనే అవకాశం కోసం ఎదురుచూస్తూ వుంటారు. ఎప్పుడైతే పాలకశిష్టులు తమ లక్షణాలను కోల్పోయారో అప్పుడు పాలకేతరశిష్టులు పాలకశిష్టులుగా మారి సమాజాన్ని పాలించటం మొదలుపెడతారు.

## 8.5. పరిభ్రమణకు కారణాలు :

శిష్టుల మధ్య ఈ విధమైన అధికార మార్పిడికి కారణాలు పారిటో ప్రతిపాదించిన అవశేషాల భావనలో లభిస్తాయి. వివిధ మార్గాలకు చెందిన శ్రేష్టుల మధ్యగల మానసిక లక్షణాలలో సంభవించే మార్పులు శ్రేష్టుల పరిభ్రమణకు, వ్యవస్థ అనిశ్చితికి దారితీస్తాయని పారిటో భావించాడు. సమాజ జీవితంలో వ్యక్తుల చర్యలను అతను రెండు రకాలుగా విభజించాడు. వీటిలో మొదటిది తర్కబద్ధమైనవి, రెండవ తరగతికి చెందినవి తర్కరహితమైన చర్యలు. ఈ రెండు చర్యల మధ్య వున్న వ్యత్యాసాలపై పారిటో అవశేషాల భావన ఆధారపడి వుంది.

## 8.6. అవశేషాలు (Residues) :

ప్రతి శిష్టవర్గము ఆరు లక్షణాలను లేదా గుణాల (Residues)ను కలిగి వుంటుంది. ఈ ఆరు లక్షణాలు లేదా గుణాల సహాయంతోనే అల్పసంఖ్యాకులైనప్పటికీ శిష్టవర్గము సమాజం మొత్తాన్ని పాలిస్తుంది. ఈ ఆరు అవశేషాలలో లౌక్యము (Residue of Combinations) మరియు బలప్రయోగం (Residue of Persistent Aggregates) అనే రెండు లక్షణాలు ముఖ్యమైనవి. ఈ రెండు లక్షణాలను లేదా గుణాల (Residues) ను శిష్టవర్గం ఎప్పుడైతే కోల్పోవడం మొదలుపెడుతుందో అప్పుడు అది తన అధికారాన్ని కోల్పోతుంది అని పారిటో పేర్కొన్నాడు.

పైన పేర్కొన్న రెండు లక్షణాలలో కాంబినేషన్ అంటే "జిత్తులమారితనం" అని పర్‌సిస్టెంట్ అగ్రిగేట్ అంటే "బలం" అని అర్థం. జిత్తులమారితనం, బలం అనే పై రెండు లక్షణాలు మాకియవెల్లి పేర్కొన్న నక్క, సింహపు లక్షణాలను పోలివుంటాయి. మాకియవెల్లి అభిప్రాయములో ప్రిన్స్ యొక్క సామర్థ్యం నక్కలాగా జిత్తులను, సింహంలాగా క్రౌర్యాన్ని అవసరాన్నిబట్టి ప్రయోగించటంపై ఆధారపడి వుంటుంది. కేవలము జిత్తులతోనూ లేదా కేవలము క్రౌర్యముతోనే ఏ రాజు సమాజాన్ని శాశ్వతంగా పరిపాలించలేడు. ఆ రెంటిని సమయానుకూలంగా ప్రయోగించటమే పాలనా రహస్యము. ఇదే విషయాన్ని పారిటో, 'రెసిడ్యూస్' అనే భావనలో వివరించాడు.

## 8.7 తర్క, తర్కరహిత చర్యలు (Logical and Illogical actions) :

లక్ష్యసాధనకు అనువయిన మార్గాలను ఎంచుకొనే శక్తి తర్కబద్ధచర్యలని, వాటికి భిన్నమయినది తర్కరహిత చర్య అని పారిటో పేర్కొన్నాడు. శిష్టవర్గము తర్కబద్ధమైన చర్యలను చేపట్టే శక్తి కలిగివున్నంతవరకు అధికారాన్ని కలిగి వుంటుంది. ఎప్పుడైతే తర్కబద్ధమైన చర్యలను చేపట్టే శక్తిని కోల్పోతుందో అది తన అధికారాన్ని కూడా కోల్పోతుందని పారిటో భావించాడు.

పారిటో సమాజంలో సమతౌల్యం సాధించటానికి అధికార పరిభ్రమణ లేదా శిష్టజన పరిభ్రమణ తప్పనిసరి అని అభిప్రాయబడ్డాడు. శిష్టవర్గం తన లక్షణాలను కోల్పోవటం ద్వారాగాని, అధికారాన్ని చెలాయించే శక్తిని కోల్పోవటం ద్వారాగాని, పాలితులు శిష్టలక్షణాలను సంతరించుకోవటం ద్వారాగాని అధికార పరిభ్రమణ జరగాలి. అదే జరగనినాడు విప్లవాలు మొదలౌతాయని చెప్పాడు. పారిటో శిష్టజనుల అధికారానికేకాక వారు పాలించడానికి అవసరమైన సామర్థ్యానికి, బలప్రయోగం ద్వారా పాలించాలనే కోరికకి ప్రాధాన్యతనిచ్చాడు.

తమ అధికారాన్ని సమర్థించుకోవడానికి శిష్టులు డిరైవేషన్స్ లేదా కల్పితాలపై ఆధారపడతారని, వారు ఈ కల్పనతో ప్రజలను మభ్యపెడతారు అని పారిటో పేర్కొన్నాడు. మరో మాటలో చెప్పాలంటే, శిష్టులు ప్రజలను భ్రమలో ముంచెత్తుతారని, ప్రజలు ఆ భ్రమలో ఉన్నంతకాలం, వారి అధికారానికి తిరుగువుండదని చెప్పాడు.

## 8.8 గెటినో మోస్కా (1858 - 1941) :

వృత్తిరీత్యా రాజనీతి శాస్త్రజ్ఞుడైన మోస్కా సాంప్రదాయకంగా వస్తున్నటువంటి ప్రభుత్వ వర్గీకరణను తిరస్కరించాడు. కొన్ని ప్రభుత్వాలను రాచరిక ప్రభుత్వాలని, మరికొన్ని ప్రభుత్వాలను ప్రజాస్వామ్య ప్రభుత్వాలని వర్గీకరించటం సత్యదూరమని, మానవ చరిత్రకు తెలిసినది ఒకే ఒక ప్రభుత్వమని, అది అల్పజనపాలన (Oligarchy) అని మోస్కా వాదించాడు. ప్రభుత్వాల భౌతిక స్వరూపాలు ఏమైనప్పటికీ లేదా ప్రభుత్వాలకు మనం పెట్టుకొనే పేర్లు ఏమైనప్పటికీ గుణంరీత్యా అల్పజనపాలనే సాగుతుందని అతని వాదన.

## 8.9 మోస్కా ప్రతిపాదించిన ప్రధాన భావములు :

### 8.9.1. సమాజం బహుకొద్దిమంది చేత పరిపాలించబడుతుంది :

మోస్కా అభిప్రాయంలో ప్రతి సమాజంలో రెండు వర్గాలు ఉంటాయి. అవి : 1) పాలకవర్గం, (2) పాలించబడే వర్గం. వీరినే ఆయన శిష్టజనులు (Elites), పాలితులు (Ruled) అని పిలిచాడు.

సమాజంలో అల్పసంఖ్యాకులు (మైనారిటి) పాలకులుగా లేదా శిష్టులుగా వుంటారు. అల్పసంఖ్యాకులైన పాలకులు సమాజం మొత్తాన్ని పాలిస్తూ వుంటారని మోస్కా భావించాడు. ఈ శిష్టవర్గం రాజకీయ విధులను నిర్వర్తించడం, గుత్తాధిపత్యాన్ని చలాయించటం అధికారం అందించే ప్రయోజనాలన్నింటిని అనుభవించటం వంటివి చేస్తుంది. అధిక సంఖ్యాకులైన ప్రజలుశిష్టులచే నిర్దేశింపబడుతూ, నియంత్రించబడుతూ వుంటారు: అధికారంలోగాని, రాజకీయ విధులలో గాని వీరికి భాగస్వామ్యం వుండదు. అనుకూలమైన చోట్ల న్యాయబద్ధమైన పద్ధతులలో, అనుకూలించని చోట ఏకపక్ష హింసాత్మక పద్ధతులలో శిష్టజనపాలన సాగుతూ వుంటుంది. సమాజం ఎంత పెద్దదయితే శ్రేష్టుల సంఖ్య అంత తక్కువ ఉంటుంది. అంతేకాకుండా, సమాజం పెద్దదయ్యేకొద్దీ శిష్టపాలనను అంతమొందించటం మెజారిటీ ప్రజలకు కష్టంగా మారుతుంది.

### 8.9.2. శిష్టుల లక్షణాలు :

ఆజ్ఞలను జారీచేయాలన్న కోరిక, రాజకీయ నియంత్రణను అనుభవించాలన్న కోరిక, అధికారాన్ని చెలాయించాలనే కోరిక శిష్టుల ప్రధాన లక్షణాలు. సమాజంలో ఏ వ్యక్తులకైతే ఈ కోరికలు ఉంటాయో, వారే శిష్టవర్గంగా మారతారని మిగిలినవారు పాలితులుగా మిగిలిపోతారని మోస్కా భావించాడు. శిష్టులు ఈ లక్షణాలను కోల్పోవటం, శిష్టేతరులు ఈ లక్షణాలను తమలో పె[illegible]చుకొని క్రమంగా శిష్టవర్గంగా మారటం తరచుగా ప్రతి సమాజంలోనూ జరుగుతూ వుంటుంది.

### 8.9.3. శిష్టుల పరిభ్రమణ (Circulation of Elites) :

అధికారం ఎప్పుడూ ఒకే శిష్టవర్గం చేతిలో వుండదని, అది ఒక వర్గం నుండి మరొక వర్గానికి చేరుతుందని మోస్కా భావించాడు. ఈ విధంగా అధికారం వర్గాల మధ్య మారుతూ ఉండడాన్ని మోస్కా శిష్టజన పరిభ్రమణ అని పేర్కొన్నాడు.

### 8.9.4. పరిభ్రమణకు కారణాలు :

పరిభ్రమణకు దారితీసే కారణాలు కేవలం మానసికమైనవని పారిటో భావించగా, మోస్కా సామాజిక కారణాలు కూడా పరిభ్రమణకు దారితీస్తాయని భావించాడు. మోస్కా అభిప్రాయంలో ఈ సామూహిక కారణాలు ఈ క్రింది విధంగా వుంటాయి.

1) ప్రజలకు అవసరమైన మౌలిక, అత్యవసర సేవలను శిష్టులు అందించలేకపోవటం.
2) శిష్టులు అందించే సేవలు ఉత్తమమైనవి కావని ప్రజలు భావించటం
3) నూతన విశ్వాసాలు సమాజంలో అభివృద్ధి చెందటం
4) సమాజంలో నూతన సమస్యలు తలెత్తడం, నూతన భావాలు ప్రచారంలోకి రావడం, నూతన అభిరుచుల పట్ల ప్రజలు మక్కువ చూపటం.

### 8.9.5. ఉపశిష్ట జనభావన (Sub - Elites) :

శిష్టసిద్ధాంతానికి మోస్కా చేసిన మరొక సేవ ఈ సబ్-ఎలైట్ భావనను ప్రతిపాదించటం. మోస్కా ప్రతిపాదించిన ఈ భావన ప్రకారం పాలకులైన శిష్టులకు, పాలితులకు మధ్య ప్రత్యేక వర్గం తయారవుతుంది. ప్రభుత్వ అధికారులు, శాస్త్రవేత్తలు, మేధావులు, పారిశ్రామికవేత్తలు ఈ నూతన వర్గంలో సభ్యులుగా వుంటారు. ప్రభుత్వ పాలనలో కీలకమైన పాత్రను ఈ వర్గం పోషిస్తుంది. ఈ వర్గము నైతిక విలువలను, మేధాసంపత్తిని కలిగివుంటే ప్రభుత్వం సమర్థవంతమైనదిగా భావింపబడుతుంది. ఏదైనా కారణాల వల్ల ఈ వర్గం నైతిక విలువలను కోల్పోయినట్లయితే ప్రభుత్వం అసమర్థ ప్రభుత్వంగా మారుతుంది. ఈ వర్గాన్ని మోస్కా "నూతన మధ్యతరగతి వర్గం"గా (New Middle Class) పిలిచాడు.

### 8.9.6. రాజకీయ సూత్రం (Political Formula) :

అల్పసంఖ్యాకులైన శిష్టులు సమాజమును ఏ విధంగా పాలిస్తారన్న ప్రశ్నకు పారిటో రెసిడ్యూస్ సహాయంతో భ్రమలను కల్పించటం ద్వారా అల్పజనపాలన జరుగుతుంది అని సమాధానం చెప్పాడు. తన సిద్ధాంతములో అదే ప్రశ్నకు అంటే అల్పసంఖ్యాకులైన శిష్టులు, మెజారిటీగా వున్న ప్రజలను ఏవిధంగా పాలిస్తారు అన్న ప్రశ్నకు "రాజకీయ సూత్రం" ద్వారా అని మోస్కా సమాధానం చెప్పాడు.

ప్రతి సమాజంలో పాలకశ్రేష్టులు తమ మనుగడకై నైతిక, చట్టసమ్మతమైన ప్రాతిపదికను ఒకదానిని రూపొందిస్తారు. అటువంటి ప్రాతిపదిక రాజకీయసూత్రం వలన వస్తుంది. పాలకశ్రేష్టులు ప్రచారం చేసే సిద్ధాంతాల, విశ్వాసాల సముదాయానికి రాజకీయ సూత్రమని మోస్కా పేరుపెట్టాడు. ఈ రాజకీయ సూత్రం చాలా సందర్భాల్లో వాస్తవముకానవసరం లేదు. అది కేవలం ఒక భ్రమ మాత్రమే కావచ్చునని మోస్కా అభిప్రాయబడ్డాడు. భ్రమా ? వాస్తవమా ? అన్న విషయంతో సంబంధం లేకుండా ప్రజలు ఈ సూత్రాన్ని గాఢంగా కోరుకునే అవసరం నైతిక సూత్ర రూపంలో వుంటుందని మోస్కా చెప్పాడు. అన్ని రాజకీయ సంస్థల్లో అనేక సమూహాలకు చెందిన ప్రజల, అనేక నాగరికతల మధ్య శాశ్వత ప్రాతిపదికపై ఐక్యత సాధించబడటానికి ఈ

రాజకీయ సూత్రం ఒక బలమైన సాధనంగా పనిచేస్తుందని మోస్కా భావించాడు. ఈ ఐక్యతే, శ్రేష్ఠులను పాలకులుగా వుంచగలుగుతుంది. ఈ రాజకీయ సూత్రం కేవలం భ్రమ మాత్రమే అన్నవిషయాన్ని పాలితులు గ్రహించినపుడు శిష్టపరిభ్రమణ మొదలవుతుంది.

## 8.10 రాబర్ట్ మిఛెల్స్ (1876 - 1936) :

"స్వల్పజన పాలన ఇనుప చట్టం" (Iron Law of Oligarchy), "జనసామాన్యపు బుద్ధి" (Mass mind) అనే రెండు అద్వితీయ భావనలను రాజనీతి శాస్త్రంలో ప్రవేశపెట్టిన ఘనత మిఛెల్స్‌దే. పారిటో, మోస్కా వలెనే మిఛెల్స్ కూడా మన సామాజిక జీవన స్రవంతిలో శిష్టపాలన ఒక భాగమని, సమాజంలో ఆ పాలన మాత్రమే సాధ్యపడుతుందని పునరుద్ఘాటించాడు.

## 8.11 వ్యవస్థ మరియు స్వల్పజన పాలకుల ఇనుప చట్టం :

సమాజంలో నివసించే సభ్యులు తమ తమ అవసరాలు తీర్చుకొనేందుకు, తమ భద్రత కొరకు ఏదో ఒక రూపంలో వ్యవస్థలను రూపొందించుకుంటారు. వ్యవస్థీకృతం కాని సమాజంలో అరాచకత్వమే మిగులుతుంది. ఏ ఉద్యమమైనా, పార్టీ అయినా వ్యవస్థీకృతం కానిదే మనుగడ సాధించలేదు. ప్రతి మానవ వ్యవస్థలోనూ కులీనపాలన ఛాయలు కనపడతాయి. అత్యధికులైన మానవులు ముందుగానే నిర్ణయింపబడిన, తప్పించుకొనలేని అత్యల్ప జనుల పాలనను అనుభవిస్తున్నారని మిఛెల్స్ వాదించాడు. అంతేకాక, నాయకత్వమనేది సామాజిక జీవితంలోని ప్రతి అంశములోనూ అవసరమని, అన్ని నాగరికతలు తప్పక కులీన పాలన లక్షణాలను కలిగివుంటాయని భావించాడు. 'వ్యవస్థ' అంటే 'స్వల్పజనపాలన' అని మిఛెల్స్ పేర్కొన్నాడు. అలాగే నాయకుడు అనే మాట అల్పజనపాలన తప్ప మరొకటి కాదని మిఛెల్స్ వాదించాడు. వ్యవస్థలోని సభ్యుల శక్తి తగ్గేకొద్దీ నాయకుని శక్తి పెరుగుతుంది. అప్పుడు ఆ నాయకుడు అధికారాన్ని హస్తగతం చేసుకొని దాన్ని అంటిపెట్టుకొని వుంటాడు. వారిని ఆ స్థానం నుండి తొలగించడం దాదాపు అసాధ్యం. ఈ విధమైన స్వల్పజన పాలకుల ఇనుపచట్టాన్ని తన "మాస్ మైండ్" భావన సహాయముతో మిఛెల్స్ సమర్థించాడు.

## 8.12 మానవ సహజ మనస్తత్వము (Mass Mind) :

మిఛెల్స్ ప్రకారం అత్యధికులైన మానవులు ఉదాసీనంగా, సోమరులుగా, మందకొడిగా, బానిస భావంతో వారిని వారు పరిపాలించుకొనలేనంత అసమర్థులుగా వుంటారు. వీరు పొగడ్తలకు లొంగిపోతారు. అధిక సంఖ్యాకులకున్న ఈ బలహీనతలను అల్పసంఖ్యాకులు లేదా రాజకీయశ్రేష్ఠులు తమ స్వప్రయోజనాలకు, తాము అధికారంలో కొనసాగటానికి ఉపయోగించుకుంటారు. వాక్చాతుర్యం, బుజ్జగింపు, ప్రజల నమ్మకాలను, బలహీనతలు వాడుకోవటం వంటి చర్యల ద్వారా నాయకులు ప్రజలను మోసగిస్తూ వుంటారు. ఒక్కసారి అల్పజనులు అధికారంలోకి వచ్చాక వారిని ఎవ్వరూ గద్దెదింపలేరు. ఒకవేళ నాయకుల అధికారాన్ని నియంత్రించటానికి చట్టాలు రూపొందినా క్రమేణా ఆ చట్టాలు బలహీనపడతాయి తప్ప నాయకులు బలహీనపడరు. కొన్ని సందర్భాలలో విప్లవాలు పుట్టుకొచ్చి నియంతలు అధికారం నుండి తొలగించబడినా కొత్త నియంతలు పుట్టుకొస్తారు. ప్రపంచం అంతకు పూర్వంలాగానే ఏ మార్పు లేకుండా నియంతల పాలనలోనే (లేదా అల్పజన పాలనలోనే) ఉంటుంది. (అత్యధిక ప్రజల మానసిక స్థితి నుండే శిష్టపాలన ఉద్భవిస్తుందని నిరూపించటమే ఈ "మాస్ మైండ్" భావన యొక్క ముఖ్య ఉద్దేశ్యము). కాబట్టి శిష్టజన పాలన శాశ్వతము, అనంతము.

## 8.13 శిష్టుల విశిష్ట లక్షణాలు :

1. ప్రతి సమాజంలోనూ శిష్టులు అల్పసంఖ్యాకులు. రాజకీయ నిర్ణయాలతో సహా అన్ని నిర్ణయాలు వారే తీసుకుంటారు.
2. శిష్టులు ప్రజలకు బాధ్యులు కారు.
3. శిష్టులకు అధికారం, వ్యవస్థ, శక్తిసామర్థ్యాలు వుండటం వల్ల వారిని ప్రత్యేక వర్గంగా గుర్తిస్తారు.
4. సమాజంలో సాంఘిక చైతన్యం గల కొద్ది మందే శిష్టులు కాగలరు. వారి అధికారానికి ప్రాతిపదిక సాంఘిక చైతన్యం.
5. తమ స్వప్రయోజనాల కోసం, తమ అవసరాలు తీరేంతవరకు ఇతరులను కూడా శిష్టులు తమ వర్గంలోకి అనుమతిస్తారు.

శిష్ట సిద్ధాంతం యొక్క ప్రధాన భావాలు 1920 నుండి 1937 లోపు అభివృద్ధి చేయబడినాయి. శిష్ట సిద్ధాంతవేత్తలలో ప్రముఖులయిన ముగ్గురు తత్త్వవేత్తలు, అంటే పారిటో,మోస్కా, మిచెల్స్‌లు 1930 వ దశకం ప్రథమార్థానికి శిష్ట సిద్ధాంతానికి పూర్తి రూపం ఇవ్వటంతో అది ఐరోపా ఖండంలో విపరీతంగా ప్రచారంలోకి వచ్చింది.

ఈ సిద్ధాంతం ప్రజాస్వామ్య భావనను ఒక "భ్రమ" గా తిరస్కరించింది, కాబట్టి సహజంగానే ఈ సిద్ధాంతానికి ప్రజాస్వామ్య వ్యతిరేక సిద్ధాంతమని పేరు వచ్చింది. అదే సమయంలో జర్మనీ, ఇటలీ దేశాలలో నాజీజం, ఫాసిజం సిద్ధాంతాలకు ఆదరణ లభించింది. దీనితో నాజీజం, ఫాసిజంలు తల ఎత్తడానికి, బలపడటానికి కారణం శిష్ట సిద్ధాంతమని, ఇది నియంతృత్వాన్ని సమర్థించి, కనీవినీ ఎరుగని మారణ హోమానికి సైద్ధాంతిక గౌరవాన్ని కల్పించిందని విమర్శలు చెలరేగాయి. 1940 తర్వాత ఈ సిద్ధాంతం, రాజనీతి చరిత్రలో ఒక అంటరాని సిద్ధాంతంగా మిగిలిపోయింది. ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించే సిద్ధాంతాలన్నింటివలె, దీనిపై కూడా దుష్ప్రచారం పెద్ద ఎత్తున జరిగింది.

### శిష్ట సిద్ధాంతం పై విమర్శ :

### 1. ప్రజాస్వామ్య వ్యతిరేక సిద్ధాంతము :

అల్పసంఖ్యాకులైన శిష్టులు మొత్తం సమాజాన్ని నియంత్రిస్తారు. వారి స్వార్థమే ప్రభుత్వ విధానం సాగుతుంది అని చెప్పటం ద్వారా శిష్ట సిద్ధాంతం ప్రజాస్వామ్య స్ఫూర్తిని త్రోసిపుచ్చింది. ప్రజాస్వామ్య యుగముగా వర్ణింపబడుతున్న ప్రస్తుత కాలంలో ఈ సిద్ధాంతం అసందర్భమైనది, నిరుపయోగమైనది.

### 2. ప్రజాశక్తి పట్ల చులకన భావం :

"అత్యధికులైన ప్రజలు అసమర్థులు, పిరికివారు, పొగడ్తలకు లొంగిపోయి మోసపోయేవారు" వంటి విశ్లేషణలు శ్రేష్టసిద్ధాంతంలో మనకు కనిపిస్తాయి. ఇటువంటి పదజాలము ప్రజల శక్తిసామర్థ్యముల పై శ్రేష్టసిద్ధాంతకారులకు వున్న చిన్నచూపును తెలియజేస్తుంది. ప్రజాభిప్రాయాన్ని చులకనగా చూడటం ఈ సిద్ధాంతంలోని లోపం.

### 3. ఆర్థికపరమైన అంశాల విస్మరణ :

సమాజంపై, ప్రజా సమీకరణపై అధిక ప్రభావాన్ని చూపే ఆర్థిక అంశాలను విస్మరించటం ఈ సిద్ధాంతంలోని అతి పెద్దలోపం. ఒక్క లాస్‌వెల్ మినహా ఎవ్వరూ ప్రజలపై ఆర్థిక అంశాల ప్రభావాన్ని చూపలేదు.

### 4. సామాజిక అంశాల విస్మరణ :

ఏ సమాజంలోనైనా ప్రజల రాజకీయ ప్రవర్తనపై కులము, మతము, సంస్కృతి, ఆచారాలు, జాతిభావన వంటి అనేక సామాజిక అంశాలు తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తూ వుంటాయి. వాస్తవానికి రాజకీయ ప్రవర్తన అనేది చాలావరకు సామాజిక

అంశాల ప్రభావ ఫలితమే. వ్యక్తికి, వ్యక్తి లక్షణాలకు అత్యంత ప్రాముఖ్యత నిచ్చిన శిష్టసిద్ధాంతం ఈ విషయాలను పూర్తిగా విస్మరించింది.

## 8.15 నమూనా ప్రశ్నలు :

1. శిష్ట సిద్ధాంత ప్రధాన భావనలను చర్చించండి.
2. శిష్ట సిద్ధాంతంపై పారిటో యొక్క భావనలను చర్చించి, దానిపై ఉన్న విమర్శలను చర్చించండి.
3. శిష్ట సిద్ధాంతంపై మోస్కా భావనలను వివరించి, ఆ సిద్ధాంతంపై ఉన్న విమర్శలను వ్రాయండి.
4. శిష్ట సిద్ధాంతంపై మిచెల్స్ భావనలను వివరించి, ఆ సిద్ధాంతంపై ఉన్న విమర్శలను వ్రాయండి.
5. శిష్ట పరిభ్రమణపై పారిటో, మోస్కా, మిచెల్స్ భావనలను వివరించండి.

## 8.16 చదువదగిన గ్రంథాలు :

1. S.P. Varma, Modern Political Theory, Vikas, Delhi, 1994.
2. J.C. Johari, Modern Political Theory

- డా॥ ఎం.వి.యస్. కోటేశ్వరరావు

పాఠం - 9

# హెరాల్డ్. డి. లాస్‌వెల్ పంపిణీ విశ్లేషణ

## (HERALD D. LASSWELL - DISTRIBUTIVE ANALYSIS)

**9.0 లక్ష్యం :**

హెరాల్డ్ లాస్‌వెల్ ప్రతిపాదించిన విలువల పంపిణీ పద్ధతిని, పంపిణీకి ఆధారమైన కారణాలను వివరించటమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయసూచిక**


9.1 హెరాల్డ్ డి. లాస్వెల్ జీవిత సంగ్రహం
9.2 లాస్వెల్ - శాస్త్రీయత
9.3 పంపిణీ విశ్లేషణ - అర్థం
9.4 లాస్వెల్ - పంపిణీ విశ్లేషణ
9.5 రాజనీతి శాస్త్రము - రాజనీతితత్వము
9.6 మూడు రకాల విలువలు
9.6.1 హోదా లేక అధికారం
9.6.2 రక్షణ
9.6.3 ఆదాయం
9.7 విలువలు కొద్దిమందికే లభించటానికి కారణాలు
9.7.1 కైశల్యం
9.7.2 వర్గం
9.7.3 వ్యక్తిత్వం
9.7.3.1 వ్యక్తిత్వం
9.7.3.1 ఆందోళనకారులు
9.7.3.2 దౌర్జన్యాన్ని కోరుకునేవారు
9.7.4 సమూహ లక్షణం
9.8 ప్రభావితం చేసేవారు ఉపయోగించే పద్ధతులు
9.8.1 ప్రతీకలు
9.8.2 హింస
9.8.3 వస్తువులు
9.8.4 పద్ధతులు
9.8.4.1 క్లిష్టమైన స్థితిని సజావుగా నిర్వహించటం

9.8.4.2 పునః సర్దుబాటు

9.8.4.3 సంక్షేమ కార్యక్రమాల కొరకు చట్టాలు

9.8.4.4 మత పునరుద్దరణ

9.9 సారాంశము

9.10 మాదిరి ప్రశ్నలు

9.11 చదవదగిన గ్రంథాలు

## 9.1 హెరాల్డ్ డి. లాస్వెల్ జీవిత సంగ్రహం (The Biographical Sketch of Herald D. Lasswell) :

ఇరవయ్యో శతాబ్దిలో జన్మించిన రాజనీతి శాస్త్రజ్ఞులలో అగ్రగణ్యుడు లాస్వెల్. ఆ శతాబ్దికి చెందిన ప్రఖ్యాత రాజనీతి శాస్త్రజ్ఞుడు అయిన ఛార్లెస్ మెరియమ్ వద్ద శిష్యరికం చేసి గురువును మించిన శిష్యునిగా, తన తర్వాతి తరపు రాజనీతి శాస్త్రజ్ఞులకు గురువుగా, ఒక ఆదర్శంగా నిలిచిన ఘనాపాటి లాస్వెల్. అనేక నూతన పద్ధతులను, ఇతర విజ్ఞాన శాస్త్రాలలోని సారాంశాన్ని రాజనీతి శాస్త్రంలోకి ప్రవేశపెట్టి, రాజనీతి శాస్త్రం పరిపుష్టం కావటానికి సాటిలేని కృషిచేసిన ఘనత లాస్వెల్‌దే. చాలా సున్నితమైన (Sophisticated), నిశితమైన అధ్యయన పద్ధతులను ఎన్నింటినో రాజనీతి శాస్త్రంలోకి ప్రవేశపెట్టిన లాస్వెల్ 1902 వ సంవత్సరంలో జన్మించాడు. చికాగో యూనివర్శిటీలో రాజనీతి శాస్త్రంలో ఉన్నత విద్యను పూర్తిచేసుకున్నాడు. 22 సం॥ల చిన్న వయస్సులో (1924వ సంవత్సరంలో) విలియర్డ్ ఇ. అట్కిన్స్ అనే రచయితతో కలసి "లేబర్ యాటిట్యూడ్ అండ్ ప్రాబ్లమ్స్" అనే పుస్తకాన్ని రచించాడు. ఆనాటి నుండి చనిపోయేవరకు నిర్విరామంగా పరిశోధనలు చేస్తూ, నిరంతరంగా పుస్తకాలను, వ్యాసాలను ప్రచురించాడు. బహుశా 20వ శతాబ్దంలో అంతకన్నా ఎక్కువ రచనలు చేసిన, భిన్నమైన రంగాలలో పరిశోధనలు చేసిన సామాజిక శాస్త్రవేత్తలు లేరేమో. తన జీవితకాలంలో స్వయంగా కాని, సహ రచయితగా కాని షుమారు 30 పుస్తకాలను రచించటమే కాకుండా, వందల సంఖ్యలో వ్యాసాలను ప్రచురించాడు. వాటిలో ప్రపంచ ప్రఖ్యాతమయినవి, భావితరాలకు మేథో దిశా నిర్దేశాన్ని చేసిన రచనలు :

1. ప్రాపగాండా టెక్నిక్ ఇన్ ది వరల్డ్ వార్
2. సైకో పాథాలజి అండ్ పాలిటిక్స్
3. హు గెట్స్ వాట్, వెన్ అండ్ హౌ
4. వరల్డ్ రెవల్యూషనరి ప్రాపగాండా
5. పవర్ అండ్ పర్సనాలిటి
6. ది ఎనాలిసిస్ ఆఫ్ పాలిటికల్ బిహేవియర్ : ఏన్ ఎంపిరికల్ అప్రోచ్
7. లాంగ్వేజ్ ఆఫ్ పాలిటిక్స్
8. పాలసి సైన్సెస్
9. ద కంపారటివ్ స్టడీ ఆఫ్ సింబల్స్
10. ద కంపారటివ్ స్టడీ ఆఫ్ ఎలైట్స్, మొదలయినవి.

### లాస్వెల్ విశిష్టత :

20వ శతాబ్దపు రాజనీతి శాస్త్రజ్ఞులలో లాస్వెల్‌కు ఒక విశిష్ట స్థానం ఉంది. మిగిలిన రాజనీతి శాస్త్రజ్ఞులందరు జీవశాస్త్రం నుండి, మానవ శాస్త్రం నుండి, సామాజిక శాస్త్రం నుండి అనేక సిద్ధాంతాలను, నమూనాలను రాజనీతి శాస్త్రంలోనికి ప్రవేశపెట్టారు.

అయితే, లాస్వెల్ మాత్రం ఎక్కువ భాగం పరిశోధనను రాజనీతి శాస్త్ర భావనల నుండే అభివృద్ధి చేయటానికి ప్రయత్నించాడు. అవసరమయిన చోట్ల మాత్రం చాలా ఎక్కువ భావనలను మానసిక శాస్త్రం నుండి గ్రహించాడు. ప్రపంచ ప్రఖ్యాత మానసిక శాస్త్రవేత్త అయిన సిగ్మండ్ ఫ్రాయిడ్ ప్రభావం అతనిపై చాలా ఎక్కువ ఉండటం దీనికి ప్రధాన కారణం.

## 9.2 లాస్వెల్ - శాస్త్రీయత :

ఆధునిక రాజనీతి శాస్త్రజ్ఞులలో శాస్త్రీయ దృక్పధానికి ప్రాధాన్యతనిచ్చిన వారిలో అగ్రగణ్యుడు లాస్వెల్. రాజనీతిని శాస్త్రంగా తీర్చిదిద్దే ఉద్దేశ్యంతో లాస్వెల్ కంటెంట్ ఎనాలసిస్, భాగస్వామ్య పరిశీలన, గణాంక పద్ధతులు, ఇంటర్వ్యూలు, ప్రయోగాత్మక పరిశోధనా ప్రణాళిక వంటి అనేక శిల్ప పద్ధతులను రాజనీతి శాస్త్ర అధ్యయనంలో ప్రవేశపెట్టాడు. అంతేకాకుండా మిగిలిన వారి కంటె చాలా ముందుగా (షుమారు 30 సం॥ల ముందుగా) వ్యవస్థా సిద్ధాంతాన్ని గురించి, విధుల దృక్పథం - విశ్లేషణ గురించి, పాత్రల స్వభావం - ప్రభావం గురించి, ప్రచారం యొక్క ప్రాముఖ్యత గురించి, విధాన శాస్త్ర ఆవస్యకత గురించి విస్తారంగా చర్చించాడు, రచనలు చేశాడు. యులావ్ అనే రాజనీతి శాస్త్రజ్ఞుని మాటలలో చెప్పాలంటే, "లాస్వెల్ యొక్క రచనలలో ప్రస్తావించబడని సమకాలీన భావాలు ఏమీ లేవు".

## 9.3 పంపిణీ విశ్లేషణ - అర్థం :

ప్రతి సమాజంలోనూ కొన్ని విలువలు ఉంటాయి. మరికొన్ని వనరులు కూడా ఉంటాయి. గౌరవం, రక్షణ, ఆనందం వంటివి మానసిక విలువలు. ఆస్తులు, భౌగోళిక సంపద వనరులు. ఇవి ఆ సమాజంలోని ప్రజలందరికి చెందిన ఉమ్మడి ఆస్తి. ఇవి ప్రజలందరకు పంచవలసిన బాధ్యత రాజ్యానిది లేదా ప్రభుత్వానిది. అధికారికయుతంగా వనరులను పంపిణీ చేయటమే రాజ్యము యొక్క విశిష్ట లక్షణం. ఈ వనరులు ప్రజలకు ఏవిధంగా పంపిణీ చేయబడుతున్నాయి అన్న విషయాన్ని వివరించటమే పంపిణీ విశ్లేషణ.

సాంప్రదాయక అర్థశాస్త్రం భౌతిక వనరుల పంపిణీ ఏవిధంగా జరుగుతున్నది అన్న విషయాన్ని వివరిస్తూ ఉండేది. సాంప్రదాయిక రాజనీతిశాస్త్రం ఇతర విలువలు - శక్తి, అధికారం, గౌరవం, స్వేచ్ఛ వంటివి - ఏవిధంగా పంపిణీ చేయబడుతున్నాయో వివరిస్తూ ఉండేది. అయితే, ఆధునిక రాజనీతి శాస్త్రంలో విలువలు, ఆ విలువల పంపిణీ అన్న భావన భౌతిక, మానవ, మానసిక వనరులన్నింటికి కలసి వాడబడటం మొదలయింది. కాబట్టి పంపిణీ విశ్లేషణ అంటే, భౌతిక, భౌతికేతర వనరుల పంపిణీ దాని విశ్లేషణ అని అర్థం.

## 9.4 లాస్వెల్ - పంపిణీ విశ్లేషణ :

విలువలు ఏవిధంగా పంచబడతాయి అన్న ప్రశ్న వేసుకొని దానికి సమాధానం చెప్పటానికి ప్రయత్నించిన రాజనీతి శాస్త్రవేత్తలు అతి కొద్దిమంది. వారిలో అగ్రగణ్యుడు లాస్వెల్. మార్క్స్ ఇదే ప్రశ్న వేసుకొని దానికి శాస్త్రీయమైన సమాధానం చెప్పాడు. వర్గాలను ప్రాతిపదికగా తీసుకొని, వనరుల పంపిణీకి, వర్గ పొందికకు ఉన్న అవినాభావ సంబంధాన్ని వివరించిన తొలి శాస్త్రజ్ఞుడు మార్క్స్, అయితే లాస్వెల్ దానికి భిన్నమయిన రీతిలో సమాధానం చెప్పటానికి ప్రయత్నించాడు. 1936లో "రాజనీతి : ఎవరు, ఏమి, ఎప్పుడు, ఎలా పొందుతారు" (Politics : Who Gets What When and How) అనే పుస్తకంలో వివరించాడు. 70 సం॥రాలు క్రితం ప్రచురించబడిన ఈ పుస్తకం రాజనీతి శాస్త్ర చరిత్రలోనే ఉత్తమ గ్రంథాలలో ఒకటిగా గౌరవించబడుతూ ఉంది.

### 9.5 రాజనీతి శాస్త్రము - రాజనీతితత్వము :

విలువల పంపిణీపై లాస్వెల్ అభిప్రాయాలు తెలుసుకునే ముందు, రాజనీతి శాస్త్ర అధ్యయనంపై ఆయన అభిప్రాయాలు తెలుసుకోవటం చాలా అవసరం. లాస్వెల్ విలువల పంపిణీపై రచించిన గ్రంథంలోని మొదటి పేరాలోనే ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పాడు. అతని అభిప్రాయంలో రాజనీతి అధ్యయనం అంటే ప్రభావం చూపేవారు, ప్రభావానికి లోనయేవారి గురించిన అధ్యయనం. ఈ రాజనీతి రెండు రకాలు. ఒకటి రాజనీతి శాస్త్రం. ఇది ఏ పరిస్థితిలో ఏది జరుగుతుందో వివరిస్తుంది. లేదా పరిస్థితి అధ్యయనానికి సంబంధించిన శాస్త్రం. రెండవది రాజనీతి తత్వవిచారం అంటే ఏది అభిలషణీయమో, ఏది అభిలషణీయం కాదో వివరిస్తుంది - అని చెప్పి తన విశ్లేషణ రాజనీతి శాస్త్రానికే కాని, విచారానికి సంబంధించింది కాదని ప్రకటించాడు. రాజనీతి శాస్త్ర విద్యార్థులు కొన్ని లక్షల సార్లు మననం చేసుకునే ఈ ప్రఖ్యాత కొటేషన్ యొక్క ఇంగ్లీషు మాతృక ఈ క్రింది విధంగా ఉంటుంది. "The study of Politics is the study of influence and the influential. The science of politics states conditions; The Philosophy of Politics justifies preferences".

### 9.6 మూడు రకాల విలువలు :

అందుబాటులో ఉన్న విలువలలో చాలా ఎక్కువ భాగం పొందగలిగేవారు "ప్రభావం చూపేవారు"(influential). సమాజంలో అందుబాటులో ఉండే విలువలు మూడు రకాలు. అవి 1. హోదా (deference) లేదా అధికారం, 2. ఆదాయం లేదా ఆస్తి (income), 3. రక్షణ (safety). ఈ మూడు విలువలలో చాలా ఎక్కువ వాటా పొందేవారు "శ్రేష్టులు"(Elites), మిగిలిన వారందరూ "సామాన్యులు" (Mass). ఈ మూడు ప్రధానమయిన విలువలు మాత్రమే. ఇవి కాకుండా కొన్ని ఇతర విలువలు కూడా ఉండవచ్చు. ఈ మూడు విలువలను, ఎవరు, ఎందుకు, ఎలా పొందగలుగుతున్నారు అన్న విషయాన్ని తెలియచేయటానికి లాస్వెల్ ప్రయత్నించాడు. ఈ ప్రయత్నమే లాస్వెల్ యొక్క పంపిణీ విశ్లేషణగా ప్రఖ్యాతి గాంచింది. అతను చేసిన విశ్లేషణను అతని మాటలలో వివరించే ప్రయత్నం జరిగింది.

#### 9.6.1 హోదా లేక అధికారం (Deference) :

లాంఛన ప్రాయమైన ఏ అధికార పరంపరలో నయినా హోదా లేక అధికారం చాలా కొద్దిమందికి మాత్రమే లభించటాన్ని గమనించవచ్చు. కొన్ని కోట్ల మంది అనుయాయులుగా ఉన్న రోమన్ కాథలిక్ చర్చిలో చాలా తక్కువ మంది మాత్రమే అధికారులుంటారు. హోదా, అధికారం, గౌరవం ఈ కొద్ది మంది మాత్రమే అనుభవిస్తూ ఉంటారు. వారు ఒక పోప్, యాభయి అయిదు మంది కార్డినల్స్, ఇరవై రెండు మంది అపోస్టలిక్ ప్రతినిధులు, 256 మంది వికార్ అపోస్టలిక్ ప్రతినిధులు, 245 మంది ఆర్చ్‌బిషప్‌లు, 1578 మంది బిషప్పులు ఉంటారు. అంటే కొన్ని కోట్ల మందిలో అధికారం అనుభవించేవారు ఈ రెండు వేల మంది. ఈ రెండు వేల మందిలో కూడా అధికారం, హోదా మొదటి నాల్గు తరగతుల వారికి చాలా ఎక్కువ. ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో 20 కోట్ల మంది ప్రజల వ్యవహారాలను తొమ్మిది లేదా పదిమందితో కూడిన పొలిట్ బ్యూరో నిర్వహిస్తూ ఉండేది. ప్రజాస్వామిక దేశంగాను, వికేంద్రీకరణ చాలా ఎక్కువగాను ఉంటుందని పేరు పొందిన అమెరికాలో కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. ఆ దేశంలో ఒక ప్రెసిడెంట్, తొమ్మిది మందితో కూడిన సుప్రీంకోర్ట్, కొన్ని వందల మంది సభ్యులు కలిగిన కాంగ్రెస్ (పార్లమెంట్) అధికారాన్ని, హోదాను అనుభవిస్తూ ఉంటారు. ప్రతి ఒక్కడికి అధికార పీఠాన్ని అధిరోహించడానికి సమాన అవకాశాలున్నాయని చెప్పుకుంటూ ఉన్నప్పటికి, ఒక తరంలో కొన్ని వందల మంది అమెరికన్లు మాత్రమే ఆ పీఠాన్ని అధిరోహించగలరు. ప్రతి దేశంలోనూ, ప్రతి సంస్థలోనూ, ఇదే జరుగుతూ ఉంటుంది. అధికార పిరమిడ్ చాలా నిటారుగా, అధిరోహించటానికి చాలా కష్టంగా ఉంటుందనేది, పిరమిడ్ శిఖరాన్ని చేరగలిగేవారు చాలా తక్కువ మంది ఉంటారనేది కఠినమైన సత్యం.

### 9.6.2 రక్షణ (Safety) :

అధికారంలో ఉన్నవారు తక్కువ రక్షణ పొందుతారేమో అని అనిపిస్తూ ఉంటుంది. సాధారణ పౌరులతో పోలిస్తే అధికారం, హోదా అనుభవించేవారికి ప్రాణాపాయం హెచ్చుగా ఉంటుంది. ఒక అధ్యయనం ప్రకారం వివిధ దేశాలకు సంబంధించిన 423 మంది చక్రవర్తులలో 32 శాతం మంది చంపబడ్డారు. రిపబ్లిక్ ఆఫ్ బొలీవియా అధ్యక్షులలో 40 శాతం మంది బలవన్మరణం పాలయ్యారు. 1921వ సంవత్సరంలో అమెరికా దేశంలో 7 శాతం మంది ప్రజలు బలవన్మరణం పాలయ్యారు. ఫ్రాన్స్ దేశంలో 17వ శతాబ్దిలో ప్రతి వెయ్యి మందిలో అయిదుగురు, 18వ శతాబ్దిలో ప్రతి వెయ్యికి 12 మంది, 19వ శతాబ్దంలో ప్రతి వెయ్యికి 13 మంది చంపబడ్డారు. అమెరికా దేశ అధ్యక్ష పదవిని అలంకరించిన వారిలో 12 శాతం మంది, పోప్‌లలో 9 శాతం మంది చంపబడ్డారు. ఈ పై విషయాలను పరికిస్తే రెండు విషయాలు మనకు అర్థం అవుతాయి. అవి 1. అధికారంలో, హోదాలో ఉన్నవారికి సాధారణ ప్రజానీకం కన్నా భద్రత చాలా ఎక్కువగా ఉంటుంది. 2. అయితే, అదే సమయంలో వారిలో ఎక్కువ మంది చంపబడతారు.

### 9.6.3 ఆదాయం (Income) :

ఆదాయపరమైన వ్యత్యాసాలు ప్రపంచంలో చాలా ఎక్కువ అని మనకు తెలుసు. ఈ వ్యత్యాసం పశ్చిమ యూరప్‌లోనూ, అమెరికాలోనూ మరీ ఎక్కువ. వ్యాపారం చాలా ఎక్కువగా జరిగిన 1928వ సంవత్సరంలో అమెరికా దేశ జాతీయ ఆదాయం తలసరి 541 డాలర్లు. మొత్తం ఫ్రాన్స్, జర్మనీలలోని ఆదాయం కన్నా ఇది రెండున్నర రెట్లు ఎక్కువ. అయితే అమెరికా ప్రజలలో దేశంలో ఈ ఆదాయ వ్యత్యాసం చాలా ఎక్కువ. 1918-1926 వ సం॥ల మధ్యలో కేవలం పది శాతం మంది అమెరికన్లు మొత్తం జాతీయాదాయంలో మూడవవంతు ఆదాయాన్ని స్వంతం చేసుకున్నారు. మిగిలిన 90 శాతం మందికి దక్కింది కేవలం 66 శాతం ఆదాయం మాత్రమే. (లాస్వెల్ చెప్పిన ఈ విషయాన్ని భారతదేశానికి అన్వయించుకుంటే ఇంకా వివరంగా అర్థం అవుతుంది. మొత్తం భారతదేశ జాతీయాదాయంలో 50 శాతం ఆదాయం కేవలం 100 కుటుంబాల వద్దకే చేరుతుంది. దారిద్ర్య రేఖకు దిగువన సుమారు 40 శాతం మంది బ్రతుకుతున్నారు. దేశంలోని సాగుకు అనుకూలమైన భూమిలో 50 శాతం మంది ప్రజలకు ఉన్న భూమి కేవలం 5 శాతం మాత్రమే. ప్రతి నగరంలోనూ స్వంత ఇల్లు లేక, అద్దెకు ఉండే స్తోమత లేక ప్లాట్‌ఫామ్‌ల మీద నివశించే వారి సంఖ్య వేలల్లో ఉంటుంది.

## 9.7 విలువలు కొద్దిమందికే లభించటానికి కారణాలు :

పైన లాస్వెల్ అందించిన వివరాల ప్రకారం సమాజంలో విలువలు అందరికి ఒకే విధంగా పంచబడవని, చాలా అసమానతలతో కూడిన విధంగా అవి పంచబడతాయని తెలుసుకున్నాం. దీనికి కారణం ఏమిటి? లాస్వెల్ అభిప్రాయంలో మానవులలో కొందరికి నాల్గు లక్షణాలు మిగిలిన వారి కన్నా అదనంగా ఉంటాయి. అవి 1. కౌశల్యం (Skill), 2. వర్గం (Class), 3. వ్యక్తిత్వం (Personality), 4. సమూహ లక్షణం (Attitude Groups). ఈ నాల్గు లక్షణాల వలన సమాజంలో కొంతమంది వ్యక్తులు ప్రభావితం చేసే (influential) వ్యక్తులుగా మారుతారు. విలువలలో చాలా భాగం పొందగలుగువారు. ఈ నాల్గు లక్షణాలు క్రింద వివరించబడినవి.

### 9.7.1 కౌశల్యం (Skill) :

పోరాడే గుణం " ప్రభావితం చేయగల" దశకు చేరటానికి ఉపకరించే మార్గాలలో ప్రధానమయినది. ఈ పోరాటం దేవుడి పేరు మీదనయినా చేయవచ్చు. జాతి పేరు మీదనయినా చేయవచ్చు. వర్గం పేరు మీదనయినా చేయవచ్చు. ముస్తఫా

కెమెల్ పాషా (ఆధునిక టర్కీ నిర్మాత) టర్కీ - ఇటలీ యుద్ధంలో, గాలియో పలి యుద్ధంలో టర్కీ తరుపున పోరాడి గొప్ప యోధుడిగా గౌరవాన్ని పొందాడు. ఆ పోరాట పటిమే, ఆ పేరు ప్రతిష్ఠలే అతన్ని టర్కీకి తిరుగులేని నాయకుడిగా చేసినవి. ముస్సోలిని, హిట్లర్ మొదటి ప్రపంచయుద్ధంలో పోరాడిన యోధులే. జోసెఫ్ స్టాలిన్ మొదలుకొని, మిగిలిన సోవియట్ నాయకులందరూ జార్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడినవారే. పోలెండ్ నాయకుడయిన జోసెఫ్ పిల్స్ డస్కి కూడా పోలిష్ జాతీయోద్యమంలో పాల్గొన్న యోధుడే. జర్మనీ నాయకులైన హెర్మన్ గోరింగ్, రుడాల్ఫ్ హెస్, గ్రెగర్ స్ట్రాసెర్, అమెరికా నాయకులైన థియోడార్ రూస్‌వెల్ట్, ఫ్రాంక్లిన్ డి. రూస్‌వెల్ట్ వంటివారు పోరాట యోధులే.

రెండవ రకమైన కౌశల్యం రాజకీయ వ్యవస్థలను నిర్వహించటంలో, తన చెప్పు చేతల్లో ఉంచుకోవటానికి సంబంధించినది (Skill in Poiitical Organisation). తమ శత్రువులను లేదా తమకు పోటీగా తయారయేవారిని సంస్థలో నుండి బయటకు పంపగలగటం, లేదా వారిని ఏకాకులను చేయటం వంటి విషయాలలో కుశలతను చూపించటం ద్వారా కొందరు తిరుగులేని నాయకులుగా ఎదుగుతారు. ఈ కౌశల్యంతో పాటు మరి మూడు అంశాలు కూడా "ప్రభావితం చేయటానికి" దోహదపడ్డాయి. అవి 1. వాగ్ధాటి, 2. పత్రికా రచనలో నైపుణ్యం, 3. మేధో సంపత్తి (Oratory, Journalism and scholarship). ప్రతీకల (Symbols) సహాయంతో ప్రజలను ఆకట్టుకోవాలంటే వాగ్ధాటి, రచనా పటిమ అవసరం.

వీటన్నింటితోపాటు సాంకేతిక నైపుణ్యం కూడా "ప్రభావితం చేయటానికి ఉపయోగపడుతుంది. బేరసారాలలో (bargaining) నైపుణ్యం కూడా ఒక అదనపు బలం.

### 9.7.2 వర్గం (Class) :

లాస్వెల్ అభిప్రాయంలో వర్గం అంటే "ఒకే విధి, హోదా, అభిప్రాయాలు కల పెద్ద సామాజిక సమూహం". (Lasswell: "A class is a major social group of similar function, status, and outlook"). ఇటీవలి చరిత్రలో కులీనులు, ధనికులు, మధ్య తరగతివారు, శారీరక శ్రమపై బతికేవారు ప్రధానమయిన వర్గాలు. 1925లో జర్మనీలోని కులీనులు 40 శాతం భూమిపై ఆధిపత్యం కల్గి ఉండేవారు. చిలి లోనయితే మరీ దారుణం. కేవలం 2500 మంది వ్యక్తుల చేతిలో 5 కోట్ల ఎకరాల భూమి ఉండేది. మిగిలిన ప్రజలందరి వద్ద కలిపి 5 కోట్ల ఎకరాల భూమి ఉండేది. రష్యాలో కూడా ఇటువంటి పరిస్థితే ఉండేది.

ధనిక వర్గాలు, లేదా ధన స్వామ్యాలు పెట్టుబడిదారీ వ్యవస్థలో నుండి పుట్టుకు వచ్చినవి. ఈ రెండవ తరగతికి చెందిన వారు ఆయా చుట్టూ ఉన్న ప్రజలను చాలా ఎక్కువగా ప్రభావితం చేస్తూ ఉంటారు. వారిలో కొంతమంది గురించి క్రింద వివరించబడింది. వేల కోట్ల ధనం కొందరి వ్యక్తుల వద్దే ఉండటం దీని లక్షణం. అమెరికాలో జాన్ జాకబ్ ఆస్టర్ అనే వ్యక్తి వద్ద రెండు కోట్ల డాలర్ల ధనముండేది. కార్నీలియస్ వాన్‌డర్ బిల్ట్ అనే అతను 10 కోట్ల డాలర్ల డబ్బు సంపాదించాడు. 1929లలో 504 మంది అమెరికన్ల వద్ద 35 వేల కోట్ల డాలర్ల ధనముండేది. చాలా కాలం ఈ కులీన, ధనిక వర్గాలే రాజ్యాధికారాన్ని చెలాయించినవి.

తమ వద్ద నుండే సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించి ధనార్జన చేసేవారు మధ్యతరగతి. చిన్న రైతులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు, చేతి పనివాళ్ళు ఈ తరగతికి చెందినవారు. వీరు ధనికులపై, కులీనులపై తిరుగబడి రాజ్యాధికారాన్ని సాధించిన ఉదాహరణలు కూడా ఉన్నాయి. జర్మనీలో నేషనల్ సోషలిజమ్ పేరుతో ఆ పార్టీ వారు కార్మికుల ప్రతినిధులమన్న పేరుతో, మధ్య తరగతికి నాయకత్వం సంపాదించిపెట్టారు.

### 9.7.3 వ్యక్తిత్వం (Personality) :

పై లక్షణాలతో పాటు వ్యక్తిత్వం లేదా వ్యక్తి లక్షణాలు కూడా కొందరిని "ప్రభావితం చేసే వ్యక్తులుగా" మారుస్తాయి. క్లినికల్ లేదా కల్చరల్ మానసిక శాస్త్రం ప్రకారం కొందరు వ్యక్తులు స్వభావ సిద్ధంగానే కొన్ని ప్రత్యేక లక్షణాలు కలిగి ఉంటారు. ఆ లక్షణాలలో కొన్ని వ్యక్తులను తిరస్కరించబడిన వ్యక్తులుగా మారుస్తాయి. ఉదా ॥ సాడిస్టులు. మరికొన్ని లక్షణాలు మనుషులను విలక్షణమయినవారుగా, నాయకులుగా మారుస్తాయి. ఈ రెండవ తరగతికి చెందినవారు తమ చుట్టు ఉన్న ప్రజలను చాలా ఎక్కువగా ప్రభావితం చేస్తూ ఉంటాయి. వారిలో కొంతమంది గురించి క్రింద వివరించబడింది.

#### 9.7.3.1 ఆందోళనకారులు (Agitators) :

వీరు చాలా ఎక్కువగా భావోద్వేగాలకు లోనవుతూ వుంటారు. వారికున్న వాగ్ధాటి, వివాదాస్పద రచనలతో మిగిలిన వారిని ఉద్రేకపరుస్తూ, వారిపై ప్రభావాన్ని చూపిస్తూ ఉంటారు. ఉపద్రవాలు (crisis) ఏర్పడినపుడు వీరు తమ శక్తిని చాటుతూ ఉంటారు. ప్రతి వారూ భయపడే స్థితిలో వీరు ధైర్యంగా నిలబడతారు. లాయడ్ జార్జ్, వాన్ హిండర్‌బర్గ్, హిట్లర్ వంటివారు ఉదాహరణలు. వీరికున్న ఈ విలక్షణమే వీరిని నాయకులుగా మారుస్తుంది.

#### 9.7.3.2 దౌర్జన్యాన్ని కోరుకునేవారు (Addiction to imperious violence) :

కేవలం మనోబలంతో కొందరు వ్యక్తులు ఎటువంటి విషయ స్థితినైనా ఎదుర్కొంటారు. ఎటువంటి అన్యాయాన్ని సహించరు. దోపిడిని సహించరు. పూర్వాపరాలు ఏమిటి అన్న విషయంతో సంబంధం లేకుండా తిరుగబడతారు. వారిలో ఉన్న బడబాగ్నిని, "సమాజం యొక్క మంచి" అనే రూపంలో వెలుపలికి తెస్తారు. నెపోలియన్ వంటివారు దీనికి ఉదాహరణ.

ఈ తరగతి చెందిన వ్యక్తులు అధికారం, హోదా కోసం తపన చెందుతూ ఉంటారు. పదిమందిలో ఒకడిగా ఉండటానికి ఇష్టపడరు. వారిలో నైపుణ్యం, కలసి వచ్చిన కాలం, పరిస్థితులను తమకు అనుకూలంగా త్రిప్పుకునే శక్తి - వెరసి ఇవన్నీ వారిని మహానాయకులుగా తయారుచేస్తాయి.

### 9.7.4 సమూహ లక్షణం :

దేశం కోసమో, ఒక విలువ కోసమో, ఒక మంచి పని కోసమో ఇది జరుగక తప్పదు అని భావించి, అందరిని దానికి సమ్మతింపచేసి నాయకత్వాన్ని చేపట్టేవారు ఈ లక్షణానికి చెంది ఉంటారు. అయితే, కౌశల్యం, వర్గం, వ్యక్తిత్వం - ఈ మూడు లక్షణాలు ఉన్న వ్యక్తులలో కూడా ఈ లక్షణం కన్పిస్తూ ఉంటుంది. ఇది చాలా సార్లు ఏక వ్యక్తి నాయకత్వంగా కాకుండా, ఉమ్మడి నాయకత్వంగా పరిణతి చెందుతూ ఉంటుంది.

## 9.8 ప్రభావితం చేసేవారు ఉపయోగించే పద్ధతులు (Methods used by Influential or Elite) :

ప్రజలను ప్రభావితం చేసేవారు, తద్వారా నాయకులు అయి ఎక్కువ విలువలను పొందేవారు ప్రధానంగా నాల్గు పద్ధతులను ఉపయోగిస్తూ ఉంటారు. అవి 1. ప్రతీకలు (Symbols), 2. హింస (Violence), 3. వస్తువులు (Goods), 4. ప్రాక్టీసెస్. వీటిని గురించి క్రింద వివరించబడింది.

### 9.8.1 ప్రతీకలు (Symbols) :

ప్రతి నాయకుడు కొన్ని ప్రతీకలను తయారుచేస్తాడు. ఇవి సిద్ధాంతం రూపంలో ఉండవచ్చు, బొమ్మల రూపంలో ఉండవచ్చు, వివాదాల రూపంలో ఉండవచ్చు. ఒక ప్రతీకను తయారుచేసుకున్న తర్వాత,అది జాతికి సంబంధించిన ప్రతీక అని ప్రచారం చేసి, అందరిని ఒప్పిస్తాడు. ఆ ప్రతీక కొరకే అందరూ శ్రమించాలని, కట్టుపడాలని ప్రచారం చేస్తాడు. జార్జి వాషింగ్టన్ ప్రచారంలోకి తీసుకువచ్చిన స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, బెంజిమన్ ఫ్రాంక్లిన్ వాడుకలోకి తీసుకువచ్చిన "మన గర్వించదగిన చరిత్ర" (Our glorious past) ఇందుకు ఉదాహరణలు. జపాన్ రాజరికం వాడుకలోకి తెచ్చిన "సూర్యుని వారసుడు రాజు" అన్నది మరో ఉదాహరణ. మార్క్సిజం తయారుచేసిన ప్రతీక అయిన "పెట్టుబడి నశించాలి" అన్న నినాదం ఎంతమందిని ఆకర్షించిందో అందరికి తెలిసిన విషయమే. నాజిజం, ఫాసిజం "దేశభక్తిని" "జాతివాదాన్ని" ప్రతీకలుగా నిలిపి ప్రజల అభిమానాన్ని పొందగలిగాయి. కాబట్టి ప్రతీకలను రూపొందించి, ప్రచారంలో పెట్టి, జనామోదం పొంది అధికారాన్ని, హోదాను పొందవచ్చు.

### 9.8.2 హింస :

పెద్ద ఎత్తున సుశిక్షితమయిన సైన్యాన్ని తయారుచేసి, దాని సహాయంతో ప్రజలను భయభ్రాంతులను చేసి అధికారాన్ని సుస్థిరం చేసుకోవటం మరొక పద్ధతి. ప్రాచీన రోమ్ చక్రవర్తులు పెంచి పోషించిన సైన్యం, నెపోలియన్ సైన్య విధానం, 1930వ దశకంలో యూరప్ రాజ్యాలు సైనిక రాజ్యాలుగా మారటం దీనికి ఉదాహరణ.

### 9.8.3 వస్తువులు :

ప్రజలకు అనవసరమయిన వస్తువులను లేదా పదార్థాలను నియంత్రించటం ద్వారా అధికారాన్ని నిలుపుకోవటం మరొక పద్ధతి. పై పద్ధతులతో పోలిస్తే ఇది చాలా సున్నితమయిన పద్ధతి. ఈ పద్ధతిని అనుసరించేవారు రేషనింగ్, ధరల నిర్ణయ పద్ధతి, బ్లాక్ మార్కెటింగ్, వాటి పద్ధతులను అనుసరిస్తారు. తమకు అనుకూలమయిన వారికి అన్ని వస్తువులు అందిస్తూ, వ్యతిరేకులకు ఏమీ అందకుండా చేస్తూ ఉంటారు. (మనందరకు తెలిసిన ఉదాహరణను చెప్పాలంటే ప్రభుత్వాలు తమకనుకూలమయిన కాంట్రాక్టర్లు, వ్యాపారాలు, సారా సిండికేట్లు, పారిశ్రామిక నేత్తలకు మాత్రమే అనుకూలమయిన నిర్ణయాలు చేసి, వైరి వర్గానికి చెందిన వారికి తీవ్రమయిన నష్టాన్ని కలుగచేయుటం). ఈ పద్ధతిని అనుసరించేవారు అమలులో ఉన్న నియమాలను అనుసరిస్తున్నట్లుగానే ప్రవర్తిస్తూ ఉంటారు. నియమాలన్నింటిని గౌరవిస్తున్నట్లు గానే కన్పడుతారు. అయితే, ఎవరికి అంతుపట్టని రీతిలో కొందరికే అన్ని సదుపాయాలు కలుగచేస్తూ, వారి అండతో అధికారాన్ని సుస్థిరం చేసుకుంటూ ఉంటారు.

### 9.8.4 పద్ధతులు (Practices) :

శిష్టులు లేదా "ప్రభావితం చేసేవారు" ఏ ఏ పద్ధతుల సహాయంతో అధికారంలోకి వస్తారో, ఏ పద్ధతులతో అధికారాన్ని నిలుపుకొంటారో ఆ పద్ధతుల అధ్యయనం చాలా అవసరం. వాటిని అర్థం చేసుకోవటం వలన అధికార సంపాదన, అధికార పదిలం వంటి కీలక అంశాలు మనకు తెలుస్తాయి. సాధారణంగా ఈ క్రింది పద్ధతులను "ప్రభావితం చేసేవారు" అమలుపరుస్తూ ఉంటారు.

### 9.8.4.1 క్లిష్టమైన స్థితిని సజావుగా నిర్వహించటం (Catharsis) :

దీనినే లాస్వెల్ "the harmless discharge of tension" అని అంటాడు. ఇబ్బందులలో ఉన్నవారికి, వైపరీత్యాల వలన నష్టపోయినవారికి సానుభూతి చూపటం, వారితో తాము ఉన్నామని పదే పదే గుర్తు చేయటం ఈ కోవకు చెందిన పద్ధతులు. ఇబ్బందులలో ఉన్న వారికి ఆర్థిక సహాయం ఎంత అవసరమో, మానసిక స్థైర్యం, సానుభూతి కూడా అంతే అవసరం. అవసరమైతే ఆర్థిక సహాయాన్ని అయినా తగ్గించవచ్చు గాని, సానుభూతిని, మానసిక మద్దతుని మాత్రం చాలా ఎక్కువగా ఇవ్వాలి.

### 9.8.4.2 పునః సర్దుబాటు (Readjustment) :

పరిస్థితులలో మార్పు వస్తున్నపుడు, ప్రజల ఆకాంక్షలలో మార్పు వస్తున్నపుడు విలువలు కూడా మారాలి. మారుతున్న పరిస్థితికి అనుగుణంగా సంస్థాగత, ఇతరమైన మార్పులకు కూడా సిద్ధపడాలి. ఉదాహరణకు 19, 20 శతాబ్దాలలో పెట్టుబడిదారీ దేశాలు కొన్ని సంస్థాగతమయిన మార్పలు చేసుకొని విప్లవాలు చెలరేగే ప్రమాదం నుండి తప్పించుకున్నాయి. ప్రజాస్వామ్యం, అందిరికి ఓటుహక్కు, అందరికి విద్య, ప్రాతినిధ్య హక్కు వంటి నినాదాలను ఆచరణలోకి తెచ్చి, ప్రజల దృష్టిని ఆర్థిక విషయాల నుండి మళ్ళించటంలో కొంతవరకు సఫలీకృతమయినాయి.

### 9.8.4.3 సంక్షేమ కార్యక్రమాల కొరకు చట్టాలు (Social Legislation) :

సమాజంలో ఆర్థిక వ్యత్యాసాలు ఎక్కువ అయి, ప్రజలలో అసంతృప్తి పెరిగిపోతున్నదని తెలుసుకున్న కులీనులు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల ఇబ్బందులను తొలగించటానికి, తద్వారా వారి అభిమానం సంపాదించుకోవటానికి ప్రయత్నిస్తారు. బాధపడేవారికి వెసులుబాటు లభిస్తుంది కాబట్టి వారు ప్రభుత్వాన్ని సమర్థించడం మొదలుపెడతారు.

### 9.8.4.4 మత పునరుద్ధరణ (Religious Revivalism) :

ప్రజలలో అసంతృప్తి పెరిగినపుడు, వారికి శ్రేష్టుల (Elites) పై విముఖత కలుగుతూ ఉన్నపుడు, ఆర్థికంగా జీవితం దుర్భరమై ప్రజలు తిరుగబడటానికి సిద్ధంగా ఉన్నపుడు మతపరమైన కార్యకలాపాలపై ప్రజల దృష్టిని మరలుస్తారు. మతానికి సంబంధించిన అంశాలను అత్యంత ప్రధానాంశాలుగా తెర మీదకు తెచ్చి, ప్రజల దృష్టిని మరలుస్తారు.

ఈ విధంగా "ప్రభావం చూపించేవారు" అధికారాన్ని హోదాను సంపాదించి, దాన్ని అనేక పద్ధతుల ద్వారా పదిలపరచుకొని, సమాజంలో అందుబాటులో ఉన్న విలువలలో చాలా ఎక్కువ భాగాన్ని స్వంతం చేసుకుంటారు.

## 9.9 సారాంశము :

ఇరవయ్యో శతాబ్దానికి చెందిన ప్రఖ్యాత రాజనీతి శాస్త్రజ్ఞుడు అయిన ఛార్లెస్ మెరియమ్ వద్ద శిష్యరికం చేసి గురువును మించిన శిష్యునిగా, తన తర్వాతి తరపు రాజనీతి శాస్త్రజ్ఞులకు గురువుగా, ఒక ఆదర్శంగా నిలచిన ఘనాపాఠి లాస్వెల్. లాస్వెల్ తన జీవితకాలంలో స్వయంగా గాని, సహ రచయితగా కాని సుమారు 30 పుస్తకాలను రచించటమే కాకుండా, వందల సంఖ్యలో వ్యాసాలను ప్రచురించాడు. రాజనీతి శాస్త్రజ్ఞులందరూ జీవశాస్త్రం నుండి, మానవశాస్త్రం నుండి, సామాజిక శాస్త్రం నుండి అనేక సిద్ధాంతాలను, నమూనాలను రాజనీతి శాస్త్రంలోనికి ప్రవేశపెట్టారు. లాస్వెల్ మాత్రం ఎక్కువ భాగం పరిశోధనను రాజనీతి శాస్త్ర భావనల నుండే అభివృద్ధి చేయటానికి ప్రయత్నించాడు. ఆధునిక రాజనీతి శాస్త్రజ్ఞులలో శాస్త్రీయ దృక్పథానికి ప్రాధాన్యతనిచ్చిన వారిలో అగ్రగణ్యుడు లాస్వెల్. విలువలు ఏవిధంగా పంచబడతాయి అన్న ప్రశ్న వేసుకొని దానికి సమాధానం చెప్పటానికి

ప్రయత్నించిన అతి కొద్ది మంది రాజనీతి శాస్త్రవేత్తలలో అగ్రగణ్యుడు లాస్వెల్. వర్గాలను ప్రాతిపదికగా తీసుకొని, వనరుల పంపిణీకి, వర్గ పొందికకు ఉన్న అవినాభావ సంబంధాన్ని వివరించిన తొలి శాస్త్రజ్ఞుడు మార్క్స్ అయితే, లాస్వెల్ దానికి భిన్నమైన రీతిలో సమాధానం చెప్పటానికి ప్రయత్నించాడు. అందుబాటులో ఉన్న విలువలలో చాలా ఎక్కువ భాగం పొందగలిగేవారు "ప్రభావం చూపేవారు". హోదా లేదా అధికారం, ఆదాయం లేదా ఆస్తి, రక్షణ అనే మూడు విలువలలో చాలా ఎక్కువ వాటా పొందేవారు "శ్రేష్టులు", మిగిలిన వారందరూ ప్రాముఖ్యులు. ఈ మూడు ప్రధానమైన విలువలు మాత్రమే. కొన్ని కోట్ల మంది అనుయాయులుగా వున్న రోమన్ కాథలిక్ చర్చిలో హోదా, అధికారం, గౌరవం ఈ కొద్ది మంది మాత్రమే అనుభవిస్తూ ఉంటారు. వారు ఒక పోప్, యాభయి అయిదు మంది కార్డినల్స్, ఇరవై రెండు మంది అపోస్టలిక్ ప్రతినిధులు, 256 మంది వికార్ అపోస్టలిక్ ప్రతినిధులు, 245 మంది ఆర్చ్ బిషప్‌లు, 1578 మంది బిషప్పులు ఉంటారు. సాధారణ పౌరులతో పోలిస్తే అధికారం, హోదా అనుభవించేవారికి ప్రాణాపాయం హెచ్చుగా ఉంటుంది. ఒక అధ్యయనం ప్రకారం వివిధ దేశాలకు సంబంధించిన 423 మంది చక్రవర్తులలో 32% మంది చంపబడ్డారు. ప్రభావం చూపించేవారు అధికారాన్ని, హోదాను సంపాదించి, దాన్ని అనేక పద్ధతుల ద్వారా పదిలపరచుకొని సమాజంలో అందుబాటులో ఉన్న విలువలలో చాలా ఎక్కువ భాగాన్ని స్వంతం చేసుకుంటారు.

## 9.10 మాదిరి ప్రశ్నలు :

1. హెరాల్ట్ లాస్వెల్ జీవిత సంగ్రహం గూర్చి వ్రాయుము.
2. లాస్వెల్ పంపిణీ విశ్లేషణ గూర్చి వివరింపుము.

## 9.11 చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | Charlesworth J.C. | : | Contemporary Political Analysis |
| 2. | Apter, D.E. | : | Introduction of Political Analysis |
| 3. | Meeham, E.J. | : | The Foundations of Political Analysis |
| 4. | Verma, S.P. | : | Modern Political Analysis |
| 5. | Dahl, Robert | : | Modern Political Analysis |
| 6. | Kolakuwski, L. | : | From Positivist Philosophy : From Hume to Vienna Circle |
| 7. | Miliband, R. | : | Maxism and Politics. |


డా॥ యమ్.వి.యస్. కోటేశ్వరరావు

పాఠం - 10

# సమూహం మరియు శక్తి సిద్ధాంతాలు

## (GROUP AND POWER AS CONCEPTUAL FRAMEWORK)

విషయసూచిక :

10.0 లక్ష్యం
10.1 సమూహ సిద్ధాంతం - పరిచయం
10.2 సమూహం - అర్థవివరణ
10.3 సమూహం - ముఖ్య లక్షణాలు, విధులు
10.4 సమూహ సిద్ధాంతం - సమీక్ష
    10.4.1 సమూహ సిద్ధాంతం - ప్రాముఖ్యత
    10.4.2 సమూహ సిద్ధాంతం - లోపాలు
10.5 శక్తి సిద్ధాంతం - పరిచయం
10.6 శక్తి - నిర్వచనం, స్వభావం
10.7 శక్తి - వివిధ రూపాలు
    10.7.1 రాజకీయ శక్తి
    10.7.2 ఆర్థిక శక్తి
    10.7.3 పరిపాలనా శక్తి
    10.7.4 సాంఘిక శక్తి
    10.7.5 మత శక్తి
10.8 ముగింపు
10.9 సారాంశం
10.10 నమూనా ప్రశ్నలు
10.11 చదువవలసిన గ్రంథాలు

## 10.0 లక్ష్యం :

ఆధునిక రాజనీతి విశ్లేషణలో 'సమూహం' 'శక్తి' అనే భావనలు చాలా ప్రముఖమైనవి. రాజకీయాల స్వరూప, స్వభావాలను అర్థం చేసుకోవటానికి, వ్యక్తికి, ప్రభుత్వానికి మధ్య అదేవిధంగా వ్యక్తుల మధ్య సంబంధాలను అధ్యయనం చేయటానికి ఈ భావనలు ఎంతో సహకరిస్తాయి. ఈ కారణంగానే ఆధునిక రాజనీతి సిద్ధాంతంలో సమూహాల స్వభావాన్ని, శక్తి స్వరూపాన్ని, ప్రాధాన్యతలను అధ్యయనం చేయటం చాలా ఆసక్తిదాయకమైన అంశంగా పరిణమించింది. 'సమూహం' మరియు 'శక్తి' అంటే ఏమిటి ? సమూహాల ముఖ్యలక్షణాలను, శక్తి స్వరూప, స్వభావాలను గురించి చర్చించటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 10.1 సమూహ సిద్ధాంతం - పరిచయం (Group Theory-An Introduction) :

మానవ జీవితం సామూహిక జీవితంతో ముడిపడి వుంటుంది. సామాజిక సమూహాలు లేకుండా మానవుడు జీవించజాలడు. అందువలననే అరిస్టాటిల్ 'మానవుడు సంఘ జీవి' అని పేర్కొన్నాడు. సమాజం అనేది ఈ సామాజిక సమూహాలతో కూడి ఉంటుంది. వ్యక్తి తన జీవితావసరాలను, లక్ష్యాలను, గమ్యాలను, ధ్యేయాలను ఏదో ఒక సమూహంలో సభ్యుడిగా ఉంటూ తీర్చుకోవటానికి ప్రయత్నిస్తాడు. ఈ ప్రక్రియలో అనేక మార్గాలను అన్వేషిస్తాడు. ఆ విధంగా సమూహం వ్యక్తి జీవితావసరాలు ముడిపడి ఉంటాయి. కనుక సమాజం, సమూహం, వ్యక్తి ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయని చెప్పవచ్చు.

సమాజంలోని వివిధ సమూహాల పరస్పర చర్యలే రాజకీయాలలో కీలకమైన అంశమని సమూహ సిద్ధాంతం చెబుతుంది. ప్రభుత్వాన్ని ప్రభావితం చేయటానికి గ్రూపుల మధ్య జరిగే పోరాటాలే రాజకీయాలు. ఒకేరకమైన ప్రయోజనాలు గల వ్యక్తులు లాంఛనంగా కాని, లాంఛనేతరంగా కాని సమైక్యం కావటం ద్వారా సమూహాలుగా ఏర్పడతారు. ఈ సమూహాలు తమ అభిప్రాయాలను, డిమాండ్లను వ్యక్తంచేస్తూ వాటి సాఫల్యతకు ప్రభుత్వంపై ఒత్తిడి కలుగజేస్తాయి. ఈ విధంగా సమూహాలు ప్రభుత్వసంస్థలపై తమ ప్రభావాన్ని చూపినప్పుడే వాటిని రాజకీయ సమూహాలుగా పరిగణిస్తారు. వ్యక్తులు సమూహంలో సభ్యులుగా ఉన్నపుడే రాజకీయాల్లో గుర్తింపును పొంది, చలామణి అవుతారు. సమూహం అనేది ప్రభుత్వానికి, వ్యక్తికి మధ్య సంధానకర్తగా వ్యవహరిస్తుంది.

శ్రేష్ఠ సిద్ధాంతంతో అసంతృప్తి చెందిన రాజనీతి శాస్త్రజ్ఞులు బహుత్వ నమూనా స్వరూపం గల సమూహాల వైపు తమ దృష్టిని సారించినారు. శక్తి ఒకే వర్గంలో కేంద్రీకరింపబడి యుండే బదులు శక్తిసాధనకు పరస్పరం పోటీపడే సమూహాల యందు ఉంటుందనేది సమూహ సిద్ధాంతం యొక్క మూలం. ఈ సిద్ధాంతం ఇరవయ్యో శతాబ్దం తొలిదశలో ప్రారంభమైనదని చెప్పవచ్చు. సమాజానికి సమూహ సిద్ధాంతం మూలస్తంభం వంటిదన్న వాదనను జాన్‌ఫిగ్గిస్ (John Figgis), మెయిట్ లాండ్ (Maitland), జి.డి.హెచ్.కోలే (G.D.H. Cole) వంటి బహుత్వ సిద్ధాంతవాదుల రచనల నుండి గ్రహించవచ్చు. ఒకవైపు లాకీ, బెంథామ్‌ల ఉదారవాదం, మరొకవైపు టి.హెచ్.గ్రీన్, బొసాంకెల ఆదర్శసామ్యవాదంలకు ప్రతిస్పందనగా బహుత్వ సిద్ధాంతవాదులు సమూహ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినారు. వీరు సమాజంలో వ్యక్తికి బదులు సమూహాన్ని ప్రాతిపదికగా ఎంచుకోవటం జరిగింది.

నేటి నమూనా సిద్ధాంతానికి మూలం ఆర్థర్ బెంట్లీ (Arthur Bentley) 1908లో రచించిన 'The Process of Government' అనే గ్రంథంలో కన్పడుతుంది. ఆ తరువాత 1950, 1960 దశకాలలో ట్రూమన్, రాబర్ట్ ఎ. డాల్, గ్రాంట్ (Grant), లోవి (Lowi) మొదలైన రచయితలు సమూహ సిద్ధాంతాన్ని రాజకీయాల అధ్యయనానికి ప్రాతిపదికగా సమర్థించినారు. అందువలన సమూహ సిద్ధాంతం బహుళ ప్రాచుర్యంలోనికి వచ్చింది.

## 10.2 సమూహం - అర్థవివరణ (Group-Meaning) :

సామాన్య పరిభాషలో 'సమూహం' అంటే కొంతమంది వ్యక్తుల సముదాయం. దానిని దృష్టిలో పెట్టుకొనే హెరాల్డ్ లాస్వెల్ మరియు అబ్రహాం కప్లాన్‌లు సమూహం అంటే "వ్యవస్థీకృతమైన వ్యక్తుల సమ్మేళనం" గా పేర్కొన్నారు. అయితే సమూహ సిద్ధాంతం ప్రకారం 'సమూహం' అనే మాటకు అర్థం చెప్పేటప్పుడు వ్యక్తుల కంటే క్రియకు ఎక్కువ ప్రాధాన్యం యిస్తున్నది. సమూహ సిద్ధాంతానికి ఆద్యుడైన ఆర్థర్ బెంట్లీ అభిప్రాయంలో సమూహాన్ని భౌతిక సముదాయం (Physical Mass) గా కాకుండా చర్యల సముదాయం (Mass of Activity) గా పరిగణించాలి. చర్యల సముదాయంగా వ్యవహరించే ప్రతి సమూహానికి కొన్ని ప్రయోజనాలుంటాయి. సాధారణంగా ఒకే రకమైన సామాన్య ప్రయోజనాలు గల వ్యక్తులు ఒక సమూహంగా

ఏర్పడి తమ ప్రయోజనాలను సాధించుకోవటానికి ప్రయత్నిస్తారు. ఒకే వ్యక్తి వివిధ సమూహాలలో సభ్యుడు కావచ్చు. సమాజం అనేది అనేక సమూహాలతో కూడి ఉంటుంది. వీటి మధ్య పరస్పర సంబంధాలు ఉంటాయి. సామాన్య ప్రయోజనాలు వ్యక్తులను ఒకటిగా చేసి సమూహ వ్యవస్థీకరణకు తోడ్పడతాయి. ప్రతి సమూహం సాధ్యమైనంత వరకు తన ప్రయోజనాలను ఎక్కువగా సాధించుకోవటానికి ప్రయత్నిస్తుంది. వివిధ సమూహాలు ఈ విధంగా కృషిచేయటంతో సమూహాల మధ్య సంఘర్షణ, చీలిక, సమీకరణం వంటివి సంభవిస్తాయి. సమూహాల ప్రాముఖ్యం, ప్రభుత్వాన్ని ప్రభావితం చేయగల సామర్థ్యం వాటిలో సభ్యత్వం కల సభ్యులు, వ్యవస్థీకరణ, ఆశయాలు, ఆచరణ పద్ధతులు, వనరులపై ఆధారపడి ఉంటాయి. సమూహాల కార్యక్రమాలు, చర్యలు రాజకీయపరమైనవి లేదా రాజకీయేతరమైనవి కావచ్చు. ప్రభుత్వ సంస్థల ద్వారా తమ కోర్కెల సాధనకు కృషిచేసినపుడు సమూహాల కార్యక్రమాలను రాజకీయ సంబంధమైన కార్యక్రమాలుగా, చర్యలుగా పరిగణించవచ్చు. ప్రభుత్వం సమూహాల ప్రయోజనాలను పరిరక్షించటానికి, పెంపొందించటానికే కాక, సమూహాల మధ్య సంఘర్షణను నివారించటానికి, వాటి పనితీరును క్రమబద్ధీకరించటానికి కృషి చేస్తుంది.

ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయటానికి వివిధ సమూహాల మధ్య జరిగే పోటీలే రాజకీయాలు. వివిధ సమూహాల మధ్య గల వివాదాలను, పోటీలను క్రమబద్ధం చేయటమే రాజకీయవ్యవస్థ ప్రధాన కార్యక్రమం. సమూహాల మధ్య వివాదాలకు క్రీడా నియమాలను ఏర్పరచటం ద్వారాను, వివిధ ప్రయోజనాల మధ్య రాజీ ఏర్పరచి సమతౌల్యాన్ని నెలకొల్పటం ద్వారాను రాజకీయ వ్యవస్థలు రాజకీయాలను సజావుగా నడిపిస్తుంటాయి. వివిధ సమూహాల మధ్య పోటీ ద్వారా ఏర్పడిన రాజీ ఫలితంగా ప్రభుత్వ విధానాల రూపకల్పన జరుగుతుంది. అలాంటి రాజీలను ప్రభుత్వ విధానాలుగా మార్చి అమలు చేయటం రాజకీయ వ్యవస్థ ప్రథమ కర్తవ్యం.

ప్రముఖ రాజనీతి శాస్త్రజ్ఞుడు ఎర్ల్ లాథామ్ (Earl Lathan) అభిప్రాయంలో రాజకీయాలకు శక్తి కేంద్రమైతే, శక్తిని నిర్వహించడానికి మాధ్యమం లేదా సాధనం (Medium) సమూహం. కాబట్టి సమూహాలను అధ్యయనం చేయటం ద్వారా ఒక రాజకీయ వ్యవస్థలో శక్తి యొక్క సమగ్రాకృతిని అధ్యయనం చేయటానికి వీలౌతుంది. ఆయన సమూహ సిద్ధాంతం దృక్కోణంతో ప్రభుత్వ విధాన రూపకల్పనను వివరించినాడు. ఆయన అభిప్రాయంలో "ఏ సమయంలోనైనా సమూహాల పోరాటంలో ఉద్భవించిన సమతౌల్యమే ప్రభుత్వ విధానం. పోరాటంలోని సమూహాలు, ముఠాలు తమకు అనుకూలమైన సమతౌల్యం కోసం సదా అభిలాషిస్తుంటాయి. ఈ సమూహాల పోరాటంలో జరిగిన లొంగుబాట్లు, రాజీలు, విజయాలను శాసనవర్గం శాసనాలుగా రూపొందిస్తుంది. వివిధ సమూహాల మధ్య జరిగిన రాజీలకు శాసనాలు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఏ సమస్య విషయంలోనైనా శాసనవర్గంలో జరిగిన ఓటింగ్ సరళి ఆయా సమూహాల శక్తిని నిర్ధారిస్తుంది. శాసనసభలలో సంప్రదింపుల ఫలితంగా ఆమోదాన్ని పొందిన తీర్మానాల అమలుకు పరిపాలనా సంస్థలను నిర్దేశించటం జరుగుతుంది. ఆమోదిత శాసనాల అమలు తీరులో జరిగే పొరపాట్లను సవరించటానికి న్యాయశాఖ పర్యవేక్షక విధులను నిర్వర్తిస్తుంది".

## 10.3 సమూహం - ముఖ్య లక్షణాలు, విధులు (Group-Features and Functions) :

ఆధునిక రాజనీతి విశ్లేషణలో 'సమూహం' అనే భావనకు ముఖ్య లక్షణాలను ఆపాదించటం జరిగినది. ఓరన్ ఆర్. యంగ్ (Oran R.Young) లక్షణాలను ఈ క్రింది విధంగా వివరించినాడు. అవి :

1. సమూహాన్ని సమాజంలోని కొంతమంది వ్యక్తుల కలయికగా కాక వ్యక్తుల చర్యల సముదాయంగా చూడవలెను. సమూహం స్థిరమైన నిశ్చల స్థితినిగాక ప్రక్రియను ప్రతిబింబిస్తుంది.
2. సమూహం అనేది వివిధ సమూహాల మధ్య జరిగే ప్రతిచర్యల (Interaction) మధ్య కొనసాగుతూనే ఉంటుంది. ఎప్పుడూ జరుగుతూ ఉండే కార్యక్రమాల దిశలో జరిగే వ్యక్తుల అంతర చర్యలనే సమూహం ప్రతిబింబిస్తుంది.

3 ప్రతి సమూహానికి ప్రత్యేకంగా ఒక ప్రయోజనం అనేది ఉంటుంది. ఆ ప్రయోజనమే ఆ సమూహం యొక్క కార్యకలాపాలను నిర్దేశిస్తుంది.

4. యధాలాపంగా గుమిగూడిన వ్యక్తుల సముదాయానికి, సమూహానికి మధ్య బేదాన్ని గుర్తించవలె. ఒక సమూహంలోని సభ్యులు ఇతర సమూహాలలో కూడ పాల్గొనవచ్చు.

5. అసంఖ్యాకమైన సమూహాల మధ్య జరిగే అంతర చర్యల పర్యవసానమే సామాజిక వ్యవస్థ. అంటే సమాజమనేది వివిధ సమూహాల సమ్మిశ్రితంగా ఉంటుంది.

6. ఒక నిర్దేశిత సమయంలో సమూహాల మధ్య చోటు చేసుకొనే ఒత్తిడుల సమతుల్యత ఆ సమాజం యొక్క పరిస్థితిని సూచిస్తుంది.

7. సమూహంలోని సభ్యుల సంఖ్య, సమర్థత, వ్యవస్థీకరణల ప్రాతిపదికగా వివిధ సమూహాల శక్తి సామర్థ్యాలు నిర్ధారింపబడతాయి.

8. సమూహాల కార్యక్రమాలు రాజకీయ, రాజకీయేతరమైనవి కావచ్చు. ప్రభుత్వ సంస్థల ద్వారా తమ కోర్కెల సాధనకు కృషి చేసేటప్పుడు ఆ కార్యక్రమాలను రాజకీయ సంబంధమైన కార్యక్రమాలుగా పరిగణించవచ్చు.

9. ప్రభుత్వం వివిధ సమూహాల మధ్య సంఘర్షణలను నివారించి, వాటి పనితీరును క్రమబద్ధీకరించి సర్దుబాటు చేయటానికి కృషిచేస్తుంది.

10. ప్రభుత్వం సమూహాల మధ్య సంఘర్షణను సర్దుబాటు చేయటమేగాక, విభిన్న సమూహాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

ఈ విధంగా సమూహ సిద్ధాంతం సమాజమనేది వివిధ సమూహాల సమ్మిశ్రమంగా వివరిస్తుంది. ఈ సమూహాల ప్రతినిధిగా ప్రభుత్వం విభిన్న గ్రూపుల మధ్య విభేదాలను, సంఘర్షణలను సర్దుబాటు చేస్తుంది. రాజకీయవ్యవస్థ నాలుగు రకాలైన కర్తవ్యాలను నిర్వర్తించటం ద్వారా సమూహాల మధ్య సంఘర్షణలను నివారిస్తుంది. అవి :

1) సమూహాల మధ్య సంఘర్షణలను సర్దుబాటు చేయటానికి అవసరమైన నియమ నిబంధనలను రూపొందించటం
2) రాజీలు, వాటి ప్రయోజనాల మధ్య సమతౌల్యాన్ని సాధించటం
3) ప్రభుత్వ విధానాల రూపంలో ఆ రాజీలను రూపొందించటం
4) ఆ రాజీలను అమలు చేయటం

సమూహం ప్రసరించే ప్రభావం దాని సభ్యుల సంఖ్య, వనరులు, వ్యవస్థీకరణ, విధాన నిర్ణేతల మధ్య సంబంధాలు, అంతర్గత ఐక్యత అనే అంశాలపై ఆధారపడి యుంటుంది. అన్ని రకాలైన రాజకీయ చర్యలు సమూహాల మధ్య సంఘర్షణ ఫలితమని సమూహ సిద్ధాంతం వివరిస్తుంది. విధాన నిర్ణేతలపై సమూహాలు నిరంతర ప్రభావాన్ని కలుగజేస్తుంటాయి. ఆయా సమూహాల మధ్య సంప్రదింపులు, బేరసారాలు, రాజీలు విధాన నిర్ణేతలను ప్రభావితం చేస్తుంటాయి. రాజకీయ నాయకులు వివిధ సమూహాల మధ్య సయోధ్యకు కృషిచేస్తూ ప్రభుత్వ విధానాలను రూపొందిస్తారు.

వివిధ సమూహాల సమ్మేళనమే రాజకీయ పార్టీలుగా భావించవచ్చు. ఉదాహరణకు కాంగ్రెస్ పార్టీలో విభిన్న ప్రయోజనాల సాధనకు ప్రయత్నించే వివిధ సమూహాలు ఉండటాన్ని గమనించవచ్చు. వివిధ రాజకీయ సమూహాల మధ్యగల సమతౌల్యమే రాజకీయ వ్యవస్థగా వ్యవహరించబడుతుంది. వ్యక్తులు వివిధ సమూహాలలో సభ్యత్వాన్ని స్వీకరించటం వలన, సమూహాల మధ్య సమతౌల్యం ఏర్పడటం చాలా సులభమవుతుంది. ప్రాథమిక విలువలలో మార్పులు సంభవించినపుడు ఆయా సమూహాలు

నూతన సమతౌల్యాన్ని ఏర్పరచుకుంటాయి. వివిధ సమూహాల మధ్య తీవ్రమైన పోటీలు ఉండటమే సమతుల్యం ఏర్పడటానికి దోహదమవుతుంది. ఏ ఒక్క సమూహానికి రాజకీయ వ్యవస్థలో మెజారిటీ యుండదు. ఒక సమూహం యొక్క ప్రభావాన్ని మరొక సమూహం ఎదిరించే ప్రయత్నం చేస్తుంటుంది.

## 10.4 సమూహ సిద్ధాంతం - సమీక్ష :

### 10.4.1 సమూహ సిద్ధాతం - ప్రాముఖ్యత (Group Theory - Importance) :

ఆధునిక రాజనీతి విశ్లేషణలో సమూహ సిద్ధాంతానికి చాలా ప్రాధాన్యత యున్నది. ప్రభుత్వ విధానాలను రూపొందించటంలో సమూహాల ప్రాధాన్యతను సిద్ధాంతం వివరిస్తుంది. సమూహాల యొక్క డిమాండ్లను, కోరికలను, అవసరాలను గుర్తించటం ద్వారా ప్రభుత్వాలు తమ విధానాలను రూపొందిస్తాయి. సమూహాలు రాజకీయ వ్యవస్థపై ఎటువంటి ఒత్తిడిని తీసుకొని వస్తాయో, ప్రభుత్వ విధానాలను ఏ విధంగా ప్రభావితం చేస్తాయో ఈ సిద్ధాంతం వివరించింది. ప్రభుత్వం వివిధ సమూహాల మధ్య మధ్యవర్తి వలె వ్యవహరిస్తూ వివాదాలను పరిష్కరించటానికి అవకాశం వుంటుందనే విషయాన్ని ఈ సిద్ధాంతం విశదీకరించింది. రాజకీయ విశ్లేషణతో సమూహం ఒక పరిశోధనా పరికరంగా ఉపయోగపడుతుంది. ఇది బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ రాజ్యాల రాజకీయ దృగ్విషయాల విశ్లేషణకు బాగా ఉపకరిస్తుంది. సమాజంలో వ్యక్తి ఏదో ఒక సమూహంలోనేగాక, వివిధ సమూహాలతో సభ్యుడిగా ఉంటాడు. తద్వారా తన ఆశయాలను, కోరికలను ఏ విధంగా తీర్చుకుంటాడో ఈ సిద్ధాంతం వివరిస్తుంది.

### 10.4.2 సమూహ సిద్ధాంతం - లోపాలు (Group Theory - Limitations) :

సమూహ సిద్ధాంతంలో ఈ క్రింది లోపాలను గుర్తించటం జరిగింది. అవి

1) సమూహ సిద్ధాంతాన్ని వివరించిన మేధావులు తమ సిద్ధాంతాన్ని వివరించడంలో 'సమూహం' 'ప్రవేశం' (Access) 'ప్రయోజనం' (Interest), 'సమతాస్థితి' (Equilibrium) వంటి పదాలను ఉపయోగించినారు. కాని పదాల అర్థం పట్ల వీరందరికీ ఏకాభిప్రాయం లేదు.

2) సమూహ సిద్ధాంతకారులు తాము వాడిన పదాలకు సంతృప్తికరమైన వివరణను యివ్వలేకపోయినారు. ఉదాహరణకు బెంట్లీ తన సిద్ధాంతంలో 'సమూహం', 'ప్రయోజనం' అనే పదాలను ఉపయోగించినాడు. ఏ ప్రయోజనం లేకుండా సమూహం ఉండదన్నాడు. అయితే ప్రయోజనం సమూహం ఏర్పడడానికి దోహదం చేస్తుందా ? లేక సమూహం ప్రయోజనాలను వ్యక్తీకరించటానికి ఉపకరిస్తుందా ? అనే విషయాన్ని బెంట్లీ సరిగా వివరించలేకపోయినాడు.

3) ప్రభుత్వ విధాన రూపకల్పనను సమూహ సిద్ధాంతం సమగ్రంగా వివరించలేకపోయింది. సమూహ సిద్ధాంతం ప్రకారం ప్రభుత్వ విధానాలు సమూహాల ఒత్తిడి ద్వారా రూపొందుతాయి. కాని ఆచరణలో ప్రభుత్వ విధానాలు అన్నివేళలా సమూహాల ప్రభావంతోనే రూపొందించక్షపోవచ్చు. ప్రజా సంక్షేమం, ప్రజల ఆలోచనలు, జాతి స్వభావం, మతం, కులం వంటి అనేక అంశాలు ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తుంటాయి. కాని ఈ విషయాలను సమూహ సిద్ధాంతంగా గుర్తించలేదు.

4) సమూహ సిద్ధాంతం అమెరికా సంస్కృతి నేపథ్యంలో అమెరికాలో చోటుచేసుకున్న రాజకీయ ప్రక్రియను ప్రాతిపదికగా చేసుకొని రూపొందించిన సిద్ధాంతమని విమర్శకుల భావన. యంగ్ అభిప్రాయంలో సమూహ సిద్ధాంతం అమెరికా వంటి ఆర్థికంగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ సామాజిక వ్యవస్థకు అనుగుణమైనది.

ఈ సమూహ సిద్ధాంతం ఎన్ని విమర్శలకు లోనైనప్పటికి, అభివృద్ధి చెందుతున్న బడుగుదేశాల రాజకీయ ప్రక్రియను విశ్లేషించటానికి ఉపకరిస్తున్నప్పటికి అమెరికా, బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన రాజ్యాల రాజకీయ దృగ్విషయాల అధ్యయనానికి చాలా ఉపయుక్తమైన సిద్ధాంతంగా దీనిని పేర్కొనవచ్చును. రాజకీయ ప్రక్రియలో సమూహం యొక్క ప్రాధాన్యతను చాటి చెప్పినదీ సిద్ధాంతం.

## 10.5 శక్తి సిద్ధాంతము - పరిచయం (Power - An Introduction) :

'శక్తి' అనేది రాజనీతి శాస్త్రంలో అత్యంత ప్రధానమైన భావన. రాజకీయాల అధ్యయనానికి, రాజకీయాల స్వరూప స్వభావాలను అర్థం చేసుకోవటానికి, సమాజానికి - రాజకీయాలకు మధ్యనున్న సంబంధాలను సక్రమంగా అవగాహన చేసుకోవటానికి శక్తి స్వరూప, స్వభావాలను తెలిసికోవటం ఎంతైనా అవసరం. శక్తిని గురించి, దాని వివిధ రూపాలను గురించి సరియైన అవగాహన లేనప్పుడు సమాజంలో రాజకీయాలను గురించి కూడా సక్రమంగా అధ్యయనం చేయలేము, అవగాహన చేసుకోజాలము. ఈ కారణంగానే రాజకీయాల అధ్యయనానికి శక్తి కీలకమైన అంశంగా గుర్తింపును పొందింది.

రాజ్యానికి సంబంధించిన శక్తిసిద్ధాంతం రాజ్యం యొక్క శక్తివంతమైన సైనికశక్తిని గూర్చి వివరిస్తుంది. ఈ సిద్ధాంతం 19వ శతాబ్దంలో జర్మన్‌లో ట్రీట్‌స్కీ (Treitscuke), ఫ్రెడరిక్ నిషే (Friedrich Nielzscue) వంటి తత్త్వవేత్తల రచనలలో సమర్థించబడి 20వ శతాబ్దంలో ప్రాచుర్యాన్ని పొందింది. 1911లో ఎరిక్ కాఫ్‌మాన్ (Erich Kauffmann) అనే రచయిత 'రాజ్యం యొక్క అంతిమ ధ్యేయం శక్తిని అభివృద్ధి చేసి, పెంపుదల చేసి, ప్రదర్శించటం ద్వారా తన అస్థిత్వాన్ని కాపాడుకొనుటయే" అని చెప్పినాడు. ఇతని దృష్టిలో రాజ్యం యొక్క లక్ష్యం జాతి మానసిక, నైతిక శక్తులను రూపొందించటం కాదు, అత్యున్నతమైన రాజ్యశక్తిని రూపొందించటం. కాఫ్‌మాన్ యుద్ధ సమయంలో రాజ్యం తన అత్యున్నత స్వరూపాన్ని చూపగలుగుతుందని, యుద్ధంలోనే రాజ్యం యొక్క సమర్థత బహిర్గతమవుతుందని భావించినాడు. చార్లెస్ మెర్రియమ్ శక్తి ఆవిర్భావాన్ని గురించి, శక్తి సాధనాలను గురించి, అధికార విచ్ఛిన్నాన్ని గురించి వివరించినాడు. కాని మెర్రియమ్ శక్తికి, అధికారానికి మధ్యగల భేదాన్ని గుర్తించలేకపోయాడని విమర్శకుల భావన. ఒక అధ్యాపకుని యొక్క లేక జర్నలిస్టు యొక్క లేక ప్రజాసేవకుని యొక్క అధికారం శక్తిపై ఆధారపడి యుండదు. కాని వీరి అధికారాన్ని ప్రజలు మన్నిస్తారు. కాని ఈ రెండు భావనలను మెర్రియమ్ ఒకే అర్థంలో ఉపయోగించినాడు.

బెర్ట్రాండ్ రస్సెల్ (Bertrand Russell) సమాజంలో శక్తి పాత్రను నిరసించినాడు. మానవ స్వేచ్ఛను పరిరక్షించాలంటే సమాజంలో శక్తి పంపిణీ సమానంగా జరగాలని ఆయన భావించినాడు. పెట్టుబడిదారీ విధానంలో కాని, సామ్యవాద విధానంలోకాని రాజకీయ శక్తి కేంద్రీకృతమైతే అది వ్యక్తులలో చొరవను రూపుమాపుతుంది. అధికారం ఏ రూపంలో యున్నప్పటికి అది స్వేచ్ఛకు వ్యతిరేకం. మత, రాజకీయ, ఆర్థిక రంగాలలో సంఘటిత జీవనాన్ని రస్సెల్ వ్యతిరేకించినాడు. అది వ్యక్తిలోని సృజనాత్మకమైన శక్తిని రూపుమాపుతుందని ఆయన అభిప్రాయపడినాడు. రస్సెల్ తన భావాలకు ప్రాతిపదికగా మానవ స్వభావాన్ని మనోవైజ్ఞానిక పరంగా విశ్లేషిస్తూ శక్తికి వ్యతిరేకంగా వాదించినాడు. రాజ్యశక్తి విస్తరించటం అంతరంగికంగాను, అంతర్జాతీయంగాను ప్రమాదకరమైనదని ప్రకటించినాడు. అధికారానికి అలవాటుపడిన వ్యక్తులు విదేశీ ప్రభుత్వాల స్నేహసంబంధాలను నెలకొల్పలేరు. అంతేగాక విస్తృతమైన రాజ్యవ్యవస్థ పౌరులలో నిస్సహాయతను, శక్తి హీనతను తెస్తుందని భావించినాడు. ఆధునిక రాజ్యాలు ప్రాచీన గ్రీకు నగర రాజ్యాలకు, మధ్యయుగం నాటి ఇటలీ వంటి రాజ్యాలకు భిన్నంగా వ్యక్తులలో తమ రాజకీయ భవితవ్యాన్ని నిర్ణయించుకునే సామర్థ్యాన్ని పెంపొందించటంలో విఫలమైనాయని విమర్శించినాడు. లార్డ్ ఏక్టన్ శక్తి వ్యక్తి యొక్క నైతిక పతనానికి దోహదం చేస్తుందని వాదించినాడు. ఆయన అభిప్రాయంలో "శక్తి ఒక వ్యక్తిని అవినీతిపరుణ్ణి చేస్తుంది. నిరపేక్షమైన శక్తి సంపూర్ణంగా అవినీతిపరుణ్ణి చేస్తుంది".

ఈ విధంగా "శక్తి" రాజకీయ విశ్లేషణలో చాలా ముఖ్యమైన పాత్రను వహిస్తుందని స్పష్టమవుతుంది. రాజకీయ వ్యవస్థ స్వరూప స్వభావాలను నిర్ధారించటంలో శక్తి నిర్వహణకు చాలా ప్రాధాన్యత ఉంది. శక్తి ప్రక్రియ వివిధ రూపాలలో బహిర్గతం కావచ్చు. బలప్రయోగం మొదలుకొని సహకారం, అనునయం దాకా శక్తి ఏ రూపంలోనైనా కనబడవచ్చు.

## 10.6 శక్తి - నిర్వచనం, స్వభావం (Power-Definition and Nature) :

శక్తి అధ్యయనం రాజనీతి శాస్త్ర పరిధికే పరిమితం కాని చాలా విస్తృతమైన విషయం. మాక్స్‌వెబర్ దృష్టిలో శక్తి సామాజిక సంబంధాలలో నిర్ణయాన్ని బలవంతంగా అమలుపరచగల సామర్థ్యం. ప్రతిఘటనలు ఎదురైనప్పటికి తమ యిష్టం వచ్చినట్లుగ సమాజంలోని మిగిలిన వారిపై తమ నిర్ణయాలను అమలుపరచగలగటాన్ని శక్తి అంటారు. వ్యక్తి కాని, వ్యక్తుల సమూహంకాని తమ ఇష్టప్రకారం సమాజంలోని ఇతర సభ్యుల నడవడికలను తీర్చదిద్దగల సామర్థ్యమే శక్తి. అలాంటివారు తమ నడవడికలో తమకు ఇష్టంలేని మార్పులు తెచ్చే ప్రయత్నాలను ప్రతిఘటిస్తారు. ఇతరులకు ఇష్టమున్నా, లేకున్నా వారి ప్రవర్తనను మార్చి వారి చేత పనులు చేయించగల సామర్థ్యమే శక్తి.

రాజనీతి శాస్త్రంలో 'శక్తి' యొక్క నిర్వచనాన్ని, అర్థాన్ని తెలుసుకోవటంలో ముఖ్యంగా మూడు సమస్యలు ఎదురవుతున్నాయి. అవి 1) ఏ రాజకీయ వ్యవస్థలోనైనా శక్తి ఎవరికి ఉంటుంది ? అతనికి లేదా వారికి ఎంత శక్తి ఉంది ? శక్తిని నిర్ధారించటమన్నది సమస్య. 2) అందరికి ఆమోదయోగ్యంగా 'శక్తి' అనే పదాన్ని నిర్వచించటంలో ఉన్న సంక్లిష్టత. విభిన్న రచయితలకు ఈ పదం పట్ల విభిన్న భావాలు ఉన్నాయి. 3) శక్తికి - రాజకీయాలకు మధ్య ఉండే సంబంధం పట్ల కూడా కొంత అస్పష్టత ఉంది. కొంతమంది రచయితల అభిప్రాయంలో రాజకీయశక్తి అధ్యయనమే రాజనీతిశాస్త్రం. ఈ కారణంగానే మనం తరచు 'శక్తి రాజకీయాలు' (Power Politics) అనే పదాన్ని వింటూ ఉంటాము. శక్తి ద్వారా 'రాజకీయాల'ను నిర్వచించగలిగితే రాజనీతి శాస్త్రానికి స్పష్టమైన సరిహద్దులను గుర్తించవచ్చునని కొంతమంది రాజనీతి శాస్త్రజ్ఞులు అభిప్రాయపడినారు. వీరి అభిప్రాయంలో శక్తిసిద్ధాంతాలే రాజనీతిశాస్త్రం యొక్క సాధారణ సిద్ధాంతాలుగా పరిగణించవచ్చు.

'శక్తి' అనే పదానికి ఒక సాధారణ లేదా అందరికి ఆమోద యోగ్యమైన నిర్వచనం యింతవరకు లభించలేదు. రాజనీతి విశ్లేషణకు 'శక్తి' అనే భావన ప్రాణం వంటిదని రాజనీతి శాస్త్రజ్ఞులు అందరూ అంగీకరించినప్పటికి, ఈ భావన పట్ల రాజనీతి శాస్త్రజ్ఞులందరికి ఏకాభిప్రాయం లేదు. అంతేగాక 'శక్తి'కి బదులుగా ఎన్నో పర్యాయపదాలు వాడుకలోనికి రావటం జరిగింది. ఉదాహరణకు శక్తి, ప్రభావం, అధికారం, నియంత్రణ, బలం, బుజ్జగింపు, బలవంతం, బలాత్కారం వంటి పదాలను విరివిగా వాడతారు. ఈ పదాలను 'ప్రభావ పదాలు' (Influence Terms) గా పరిగణించవచ్చు. ఇతరులవలె రాజనీతి శాస్త్రజ్ఞులు కూడా సాధారణంగా ఈ పదాలను నిర్వచించారు. ఒకవేళ నిర్వచించినా ఆ నిర్వచనంపై వారిలో ఏకాభిప్రాయం ఉండదు.

శక్తి, అధికారం ఒకటి కావు. శాసనబద్ధత కలిగిన శక్తి అధికారం. బలం, శక్తి వేరు వేరు. బలంలో భౌతికమైన బలం కనబడుతుంది. అది శక్తిలో ఉండవచ్చు లేదా లేకపోవచ్చు. శక్తి రాజకీయ, ఆర్థిక ప్రక్రియయేగాక అది ఒక సామాజిక ప్రక్రియ. శక్తి నిగూఢమైంది. బలం ప్రకటితమైంది. అధికారం వ్యవస్థీకృతకమైన శక్తి. శక్తి లాంచనప్రాయమైన వ్యవస్థలో, లాంఛనేతరమైన వ్యవస్థలలో, వ్యవస్థీకృతం కాని వర్గాలలో వివిధ రూపాలలో కనపడవచ్చు. శక్తి మూలాన్ని, దాని వివిధ అంగాలను సంఖ్యాబలం, సామాజిక వ్యవస్థలు, సామాజిక వనరుల సమ్మేళనంగా చూడవచ్చు.

సమాజంలో శక్తి నిర్వహించే పాత్రను అర్థం చేసుకొన్న మాకియవెల్లి శక్తిని వివిధ అర్థాలలో నిర్వచించటానికి ప్రయత్నించినాడు. వివిధ అర్థాలను సమన్వయం చేసి నిర్వచించటం కోసం గత కొన్ని దశాబ్దాలుగా తీవ్ర ప్రయత్నాలు సాగుతున్నాయి. బెయిర్‌స్టెడ్ (Biersted) తన సామాజిక శక్తి విశ్లేషణలో ఐదు సూత్రాలను అనుసరించి శక్తిని అర్థం చేసుకోవచ్చునన్నాడు. అవి :

1) శక్తి అనేది కేవలం రాజకీయ, ఆర్థిక విషయమేకాక అత్యున్నత సామాజిక లక్షణం.

2) గౌరవం, ప్రభావం, ఆధిక్యం, బలం, అధికారాల నుంచి శక్తిని వేరుగా గుర్తించాల్సి యుంటుంది.

3) శక్తి అంతర్గతమైన బలం. బలం ప్రకటితమైన శక్తి, అధికారం వ్యవస్థీకృతమైన శక్తి.

4) సభ్యుల నుంచి ప్రతిఘటన ఎదురైనపుడు శక్తి సమాజంలోని వివిధ వ్యవస్థలలో స్థానాన్ని ఏర్పరచుకుంటుంది.

5) శక్తికి ప్రాతిపదికలు దాన్ని ఆమోదించేవారి సంఖ్యాబలం, సామాజిక వ్యవస్థలు, వనరులు

'బి' అనే వ్యక్తి ఇతరత్రా చేయనిపనిని 'ఏ' చేయించగలగడాన్ని 'బి' పై 'ఏ'కున్న శక్తి అని ప్రఖ్యాత రాజనీతి శాస్త్రజ్ఞుడు రాబర్ట్ ఎ.డాల్ (Robert A. Dall) నిర్వచించినాడు. ఒక వ్యక్తికాని, సంస్థకాని తన అధికారాన్ని ఇతర వ్యక్తులు లేదా సంస్థలు ప్రతిఘటించే వాతావరణంలో కూడా వారి ప్రవర్తనను అదుపుచేయగల సామర్థ్యాన్ని శక్తి అనవచ్చు. ఫ్రెడరిక్ శక్తిని ఒకరకమైన మానవసంబంధంగా నిర్వచించాడు.

టానీ (Tawney) "ఇతర వ్యక్తుల యొక్క లేక సమూహాల యొక్క ప్రవర్తనను తమకు నచ్చిన విధంగా మార్చుటకు ఒక వ్యక్తికి లేక వ్యక్తుల సమూహానికి గల సామర్థ్యాన్నే" శక్తిగా నిర్వచించినాడు.

పై నిర్వచనాలను బట్టి శక్తి ఇద్దరు లేక కొద్దిమంది వ్యక్తుల మధ్య గల సంబంధాలలో నిక్షిప్తమై యుంటుందని చెప్పవచ్చు. శక్తిని వినియోగించినపుడే అది అర్థవంతమవుతుంది. ఒక వ్యక్తి తన అభీష్టం మేరకు ఇతరుల చేత పని చేయించుకోగలిగినట్లైతే అతడు శక్తిని ఉపయోగించుచున్నాడన్నమాట. ఇతరులతో సంబంధం లేకుండా ఒక వ్యక్తిగాని, సమూహం గాని శక్తిని వినియోగించలేడు. శక్తి అనేది శూన్యంలో ఉండజాలదు. ఒక వ్యక్తి ఇతర వ్యక్తులపై శక్తిని ఉపయోగించినాడన్న ఆ వ్యక్తులతో ఒకరకమైన సంబంధాన్ని ఏర్పరచుకొనుచున్నాడన్న మాట. ఆ విధంగా శక్తి వ్యక్తుల మధ్య ఇచ్చిపుచ్చుకొనే పద్ధతిని సూచిస్తుంది. విజ్ఞానం, వ్యవస్థ, సాంఘిక హోదా, రాజకీయ పదవి, మతహోదా, నైపుణ్యం, వ్యక్తిత్వం మొదలైనవి శక్తిని సముపార్జించటానికి ఆధారాలుగా పేర్కొనవచ్చు.

## 10.7 శక్తి - వివిధ రూపాలు (Power-Forms) :

శక్తి వివిధ రూపాలలో గోచరిస్తుంది. వాటిలో ముఖ్యమైనవి :

### 10.7.1 రాజకీయ శక్తి (Political Power) :

రాజ్యం లేక ప్రభుత్వ ఆజ్ఞలను ప్రజలు విధిగా పాటించేటట్లు చేసే శక్తి రాజకీయ శక్తి. రాజకీయ శక్తి మొత్తం సాంఘిక వ్యవస్థనే తన సంపూర్ణ నియంత్రణ క్రింద ఉంచగలిగినటువంటిది. రాజకీయ శక్తికి ఇతర శక్తులకు లేని అధికారం, కర్తవ్యం ఉన్నాయి. అవసరమైతే బలప్రయోగం చేసే హక్కు కేవలం రాజకీయ శక్తికి మాత్రమే ఉంది.

రాజకీయ శక్తిని చెలాయించే వ్యక్తుల సంఖ్యను బట్టి ప్రభుత్వరూపాలు మారతాయి. ఉదాహరణకు రాజకీయశక్తి ఒక వ్యక్తి చేతిలో ఆనావంశకంగా కేంద్రీకృతమైతే దానిని రాచరికమని, కొద్దిమంది వ్యక్తుల చేతిలో కేంద్రీకృతమైతే కులీనపాలన అని, ఎక్కువమంది చేతిలో ఉంటే దానిని ప్రజాస్వామ్యమని అనవచ్చు.

### 10.7.2 ఆర్థిక శక్తి (Economic Power) :

శక్తి స్వరూపాలలో ఆర్థిక శక్తి ఒకటి. ఆర్థికశక్తి రాజకీయశక్తికి ప్రాతిపదిక అని సామ్యవాదుల భావన. ముఖ్యంగా పెట్టుబడిదారీ వ్యవస్థ గల రాజ్యాలలో రాజకీయశక్తి ఆర్థికశక్తికి లొంగియుండి పెట్టుబడిదారీవర్గ ప్రయోజనాలకే శక్తిని

వినియోగించబడుతుందని మార్క్సిస్టుల వాదన. రాజకీయశక్తి, ఆర్థికశక్తి పరస్పరం ప్రభావితం చేసుకొంటాయి. రాజకీయశక్తి, ఆర్థికశక్తిని లొంగదీయ ప్రయత్నిస్తుంది. ఆర్థికశక్తి, రాజకీయశక్తిని ప్రభావితం చేస్తుంది. ఆర్థికశక్తి కూడ కొంతవరకు సాంఘిక శక్తుల వలన ప్రభావితం అవుతుంది.

### 10.7.3 పరిపాలనా శక్తి (Administrative Power) :

ప్రభుత్వ స్వరూపం ఏమైనప్పటికీ అన్ని కాలాల్లోనూ, అన్ని దేశాల్లోనూ ప్రభుత్వ విధానాలను అమలు పరచటంలోనేగాక, వాటిని రూపొందించంలో కూడా వ్యక్తం అయ్యేశక్తి పరిపాలనా శక్తి. ఈ పాలనాశక్తి ప్రభుత్వేతర సంస్థలలో కూడా వ్యక్తం కావచ్చు. దత్త శాసనాధికారం, నిపుణుల యొక్క సలహాల అవసరం, పాలనా న్యాయనిర్ణయం మొదలైనవి పరిపాలనా శక్తి యొక్క ప్రాముఖ్యతను తెలియజేయుచున్నవి. ఈ పాలనా శక్తి సివిల్ సర్వీసుల ద్వారా వ్యక్తం అవుతుంది.

### 10.7.4 సాంఘిక శక్తి (Social Power) :

సాంఘికశక్తి అంటే సమాజంలోని ఇతరుల ప్రవర్తనను ప్రత్యక్షంగా ఆజ్ఞల ద్వారా కాని, పరోక్షంగా అందుబాటులో వున్న సాధనాలను నేర్పుతో వినియోగించటం ద్వారా కాని అదుపులో పెట్టగలశక్తి. ఆస్తి, పదవి, హోదా మొదలైనవి సాంఘికశక్తికి మూలాధారాలు. కార్మిక నాయకులు, కులపెద్దలు, నాయకులు, మతాచార్యులు మొదలైనవారు వివిధ కాలాలలో సాంఘిక శక్తికి ప్రతీకలుగా యుండిరి.

### 10.7.5 మత శక్తి (Religious Power) :

గతంలో అత్యధిక ప్రాధాన్యంవున్న సాంప్రదాయక శక్తిస్వరూపాలు రెండు. అవి 1) మతాధికారం, 2) రాజుల అధికారం. ఈ రెండు యిపుడు క్షీణతలో ఉన్నాయి. మతాచార్యులు, రాజులు ప్రాచీన, మధ్య యుగాలలో ఎంతో ప్రాభవాన్ని అనుభవించారు. మతం రాజ్యాన్ని ఏలేది, కాని నేడు ఆధునిక యుగంలో మతం, రాజుల యొక్క ప్రాభవం తగ్గి పోయి ప్రజాస్వామిక విధానాల ఆచరణలో ప్రాధాన్యతను పొందుతున్నాయి.

### 10.8 ముగింపు (Conclusion) :

'శక్తి'కి విశాలమైన అంతరార్థాలు ఉండటంవలన సామాజిక శాస్త్రాలలో దాని స్వభావాన్ని, అర్థాన్ని ఇతిమిత్థంగా వివరించటం కొంత సంక్లిష్టతతో కూడుకొన్నది. రాజకీయ వ్యవస్థకు శక్తిమూలాధారమైనప్పటికి, ప్రభావం, అధికారం వంటి అనేక పర్యాయపదాలు వాడుకలోనికి రావటంతో దానిని నిర్వచించటం కొంత సందిగ్ధతకు అవకాశం యిచ్చింది. వాస్తవానికి అనేక శతాబ్దాలుగా అభివృద్ధి చెందిన రాజనీతి తత్త్వవిచారంలో ప్రభావ పదాలను కొంత విరివిగా వినియోగిస్తున్నప్పటికి వీటిని శాస్త్రీయంగా నిర్వచించి, విశదీకరించే ప్రయత్నం కొన్ని దశాబ్దాలుగానే ప్రారంభమైనదని చెప్పవచ్చు. తత్ఫలితంగా ఈ పదాల భావాలను వివరించి, విపులీకరించి, విశదీకరించటంలో గణనీయమైన అభివృద్ధి కన్పిస్తూ ఉన్నది. అయినప్పటికి ఈనాటికీ అనేక మంది రచయితలు ప్రభావ పదాలను నిర్దిష్టమైన పద్ధతిలో నిర్వచించటం కాని, వినియోగించటం కాని చేయటంలేదని చెప్పవచ్చు.

### 10.9 సారాంశం :

ఆధునిక రాజనీతి విశ్లేషణలో 'సమూహం' 'శక్తి' అనే భావనలు చాలా ముఖ్యమైనవి. రాజకీయాల స్వరూప, స్వభావాలను అర్థంచేసుకోవటానికి, వ్యక్తికి, ప్రభుత్వానికి మధ్య, అదేవిధంగా వ్యక్తుల మధ్య సంబంధాలను అధ్యయనం చేయటానికి ఈ భావనలు ఎంతో సహకరిస్తాయి. కారణంగానే ఆధునిక రాజనీతి సిద్ధాంతంలో సమూహాల స్వభావాన్ని, శక్తి స్వరూపాన్ని, ప్రాధాన్యతను అధ్యయనం చేయటం చాలా ఆసక్తిదాయకమైన అంశంగా పరిణమించింది.

మానవ జీవితం సామూహిక జీవితంతో ముడిపడి ఉంటుంది. సామాజిక సమూహాలు లేకుండా మానవుడు జీవించజాలడు. ప్రభుత్వాన్ని ప్రభావితం చేయటానికి ఈ సమూహాల మధ్య జరిగే పోరాటాలే రాజకీయాలు. మానవ సమూహాలు తమ అభిప్రాయాలను, డిమాండ్లను వ్యక్తంచేస్తూ వాటి సాఫల్యతకు ప్రభుత్వంపై ఒత్తిడి కలుగజేస్తాయి. ఈ విధంగా సమూహాలు ప్రభుత్వ సంస్థలపై తమ ప్రభావాన్ని చూపినప్పుడే వాటిని రాజకీయ సమూహాలుగా పరిగణిస్తారు. సమూహాల ప్రాముఖ్యం, ప్రభుత్వాన్ని ప్రభావితం చేయగల సామర్థ్యం, వాటిలో సభ్యత్వంగల సభ్యులు, వ్యవస్థీకరణ, ఆశయాలు, ఆచరణ పద్ధతులు, వనరులపై ఆధారపడి ఉంటాయి. వ్యక్తులు సమూహంలో సభ్యులుగా ఉన్నప్పుడే రాజకీయాలలో గుర్తింపును పొంది, చలామణి అవుతారు. సమూహం అనేది ప్రభుత్వానికి, వ్యక్తికి మధ్య సంధానకర్తగా వ్యవహరిస్తుంది.

రాజ్యానికి సంబంధించిన శక్తి సిద్ధాంతం 19వ శతాబ్దంలో జర్మనీలో ట్రీట్స్కే, నిషె వంటి తత్త్వవేత్తల రచనలలో సమర్థింపబడి 20వ శతాబ్దంలో ప్రాచుర్యాన్ని పొందింది. ఈ సిద్ధాంతం రాజనీతి శాస్త్రంలో ఎంతో కీలకమైన అంశంగా గుర్తింపును పొందినప్పటికి, 'శక్తి' అనే భావనకు ఒక సాధారణ లేక అందరికి ఆమోదయోగ్యమైన నిర్వచనం మాత్రం ఇంతవరకు లభించలేదు. దానికి ఒక ముఖ్యమైన కారణం 'శక్తి'కి బదులుగా ఎన్నో పర్యాయపదాలు - ప్రభావం, అధికారం, నియంత్రణ, బలం, బలాత్కారం వంటివి - వాడుకలోనికి రావటం. ఈ పదాలను 'ప్రభావ పదాలు'గా పరిగణించవచ్చు. ఇతరులవలె రాజనీతి శాస్త్రజ్ఞులు కూడా సాధారణంగా ఈ పదాలను నిర్వచించరు. ఒకవేళ నిర్వచించినా ఆ నిర్వచనంపై వారిలో ఒక ఏకాభిప్రాయం వుండదు.

ప్రతిఘటనలు ఎదురైనప్పటికీ తమ యిష్టం వచ్చినట్లుగా సమాజంలోని మిగిలిన వారిపై తమ నిర్ణయాలను అమలుపరచగలగటాన్ని శక్తి అంటారు. వ్యక్తికాని, వ్యక్తుల సమూహం కాని తన ఇష్టప్రకారం సమాజంలోని ఇతర సభ్యుల నడవడికలను తీర్చిదిద్దగల సామర్థ్యమే శక్తి. శక్తిని వినియోగించినపుడే అది అర్థవంతమవుతుంది. శక్తి అనేది శూన్యంలో ఉండజాలదు. అది వ్యక్తుల మధ్య గల సంబంధాలలో నిక్షిప్తమై యుంటుందని చెప్పవచ్చు. ఇది సమాజంలో వివిధ రూపాలలో-రాజకీయ శక్తి, ఆర్థికశక్తి, పరిపాలనాశక్తి, మతశక్తి మొదలైనవి- గోచరిస్తుంది.

## 10.10 నమూనా ప్రశ్నలు :

1. సమూహ సిద్ధాంతాన్ని గురించి విమర్శనాత్మంగా వివరించుము.
2. ఆధునిక రాజనీతి శాస్త్ర అధ్యయనంలో శక్తి పాత్రను విశ్లేషించుము.

## లఘు వ్యాసరూప ప్రశ్నలు :

1. సమూహాల ముఖ్య లక్షణాలను వివరించుము.
2. శక్తికి సంబంధించిన వివిధ రూపాలను వివరించుము.

## 10.11 చదువదగిన గ్రంథాలు :


1. Charlesworth (Ed) : Contemporary Political Analysis
2. Roberl A. Dahl : Modern Political Analysis
3. S.P. Varma : Modern Political Theory
4. J.C. Johari : Comparative Politics
5. M. Satyanarayana Rao et.al. : రాజనీతి శాస్త్రం - ఆధునిక విశ్లేషణ


- డా॥ ఐ. దోసగిరిరావు

పాఠం - 11

# ప్రసార సిద్ధాంతం
# Communications Theory

## 11..0. లక్ష్యం :

ఆధునిక రాజనీతి విశ్లేషణలో, ప్రసార సిద్ధాంతానికి, ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. రాజకీయ వ్యవస్థ పనితీరును, సమర్ధతను ప్రభావితం చేయటంలో సమాచార ప్రసరణ ప్రాధాన్యతను ఈ సిద్ధాంతం వివరిస్తుంది. అంతేకాక శాస్త్ర సాంకేతిక రంగాలలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా ప్రకృతి శాస్త్రాలలో, ప్రసార ఇంజనీరింగ్‌లో చోటు చేసుకున్న పరిణామాలను, భావనలను రాజకీయ దృగ్విషయాల అధ్యయనానికి అన్వయించటానికి ఈ సిద్ధాంతం ఉపకరించింది. 'ప్రసారం అంటే ఏమిటి? రాజనీతి శాస్త్రంలో ప్రసార సిద్ధాంతం ఏవిధంగా అభివృద్ధి చెందింది. రాజకీయ వ్యవస్థలో సమాచార ప్రసరణకు సంబంధించిన వివిధ భావనలను, రాజకీయ వ్యవస్థ సమర్ధతను ప్రభావితం చేయటంలో సమాచార ప్రసరణకున్న ప్రాధాన్యతను వివరించటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయ సూచిక :


11.1 ప్రసార సిద్ధాంతం-పరిచయం

11.2 ప్రసారం- అర్ధవివరణ

11.3 ప్రసారసిద్ధాంతం-ప్రాతిపదిక

11.4 ప్రసారసిద్ధాంతం-ప్రాథమిక భావనలు

11.5 సమాచార ప్రసారం-దాని పరిణామాలు

11.6 నిర్ణయకల్పన ప్రక్రియ

11.6.1 విరామం

11.6.2 చొరవ

11.6.3 లాభం

11.6.4 స్పందిత సమాచారం

11.7 రాజకీయ విశ్లేషణలో ప్రసార సిద్ధాంతం

11.8 ప్రసార సిద్ధాంతం- సమీక్ష

11.8.1 ప్రసారసిద్ధాంతం-ప్రాధాన్యత

11.8.2 ప్రసార దృక్పథం- లోపాలు

11.9 సారాంశం

11.10 నమూనా ప్రశ్నలు

11.11 చదువదగిన గ్రంథాలు


## 11.1 ప్రసార సిద్ధాంతం - పరిచయం:

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ఫలితంగా ప్రకృతి శాస్త్రాలలో చోటు చేసికున్న పరిమాణాలను, సిద్ధాంతాలను, అనుభవాలను రాజనీతి శాస్త్రజ్ఞులు రాజకీయ దృగ్విషయాల అధ్యయనానికి అన్వయించటం ప్రారంభించినారు. మానవ జీవనానికి సంబంధించిన సమస్యలను ప్రకృతి శాస్త్రాల విజ్ఞానం సహాయంతో పరిష్కరించటానికి కృషి చేసినారు. ప్రసార ఇంజనీరింగ్‌లో

సాధించబడిన ప్రగతిని కొంత మంది సామాజిక శాస్త్రవేత్తలు సామాజిక దృగ్విషయాల అధ్యయనానికి అనువర్తించటానికి ప్రయత్నించినారు. రాస్ అష్బీ (Ross Asuby), నార్బర్ట్ వీనర్ (Norbert Weiner), జార్జ్‌మిల్లర్ (George A.Miller), కారల్‌డూయిష్ (Karl Deutscu) వంటి సామాజిక శాస్త్రవేత్తలు రాజకీయ దృగ్విషయాలను ప్రసారం (Communication), అంతర్గత సమాచార ప్రసరణం (Cybernetics) లతో అనుసంధానం చేయప్రయత్నించినారు. ప్రముఖ గణిత శాస్త్రవేత్త నార్బర్ట్ వీనర్ మొదటిసారిగా స్వయంచరిత యంత్రాలను (automatic machines), మానవులను,రాజకీయవ్యవస్థలను నిర్దేశించే సాధారణ సంభావ్యతల (general probabilities) ను అధ్యయనం చేయటానికి సంకల్పించినాడు. ఆయన అభిప్రాయంలో ఈ మూడు వ్యవస్థలు ప్రసారం, నియంత్రణ సూత్రాలపైనే ఆధారపడి పనిచేస్తుంటాయని అభిప్రాయపడినాడు. వీనర్ ఈ ప్రక్రియను అంతర్గత సమాచార ప్రసరణ (cybernetics) గా పేర్కొన్నాడు. ఈ అంతర్గత సమాచార ప్రసరణ ప్రక్రియ స్పందిత సమాచార ప్రక్రియ (feedback)కు ఎక్కువ ప్రాధాన్యతనిస్తుందని అభిప్రాయ పడినాడు. ఇదే సమయంలో రాసే అష్బీ అంతర్గత సమాచార ప్రసరణ సూత్రాన్ని అన్ని రకాలైన యంత్రాలకు, మానవులకు, నిర్జీవ వ్యవస్థలకు (inanimate) అన్వయించినాడు. అదే పంథాలో కెన్నెత్ బౌల్డింగ్ స్పందిత సమాచార ప్రసరణ, అంతర్గత సమాచార ప్రసరణ సూత్రాల ప్రాతిపదికనే వ్యక్తులు వ్యవహరిస్తారని వివరించినాడు. కాని వీరి అధ్యయనాలు ఒక క్రమ పద్ధతిలో జరగలేదు. వీటికి భిన్నంగా కారలే డూయిష్ మొట్టమొదటి సారిగా ప్రసారం, అంతర్గత సమాచార ప్రసరణలను ఒక క్రమ పద్ధతిలో వివరించినాడు. ఆయన తాను రచించిన 'The Nerves of Government' అనే గ్రంథంలో స్వయం చరిత యంత్రాలకు, మానవ వ్యవస్థలకు, సామాజిక మరియు ముఖ్యంగా రాజకీయ వ్యవస్థలకు మధ్య గల సారూప్యతలను పేర్కొన్నాడు.

## 11.2. ప్రసారం- అర్ధవివరణ:

ప్రసారమనగా ఒకరి ఆలోచనలు మరియొకరి ఆలోచనలను ప్రభావపరచటమని చెప్పవచ్చు. ఒకరి ఆలోచనలను మరొకరి ఆలోచనలు వివిధ ప్రక్రియాల ద్వారా ప్రభావపరిచే అవకాశాలున్నాయి. వ్యక్తిగతంగా మాట్లాడి మరొకరి ఆలోచనలను ప్రభావితం చేయవచ్చు. వ్యక్తులతో సంబంధం కల్పించుకోకుండా కూడా వారి ఆలోచనలను ప్రభావితం చేయవచ్చు. వ్రాత పూర్వకమైన సందేశాల ద్వారా కాని, టెలిఫోన్, వైర్‌లెస్ లేదా వార్తాహరుని ద్వారా కాని మన భావాలను తెలియజేయవచ్చు. కొన్ని సమయాలలో A అనే వానితో మాట్లాడటం ద్వారా B అనే వ్యక్తి ఆలోచనలను ప్రభావపరచవచ్చు. ఆ విధంగా ఒకరితో మరియొకరు సంబంధాలు ఏర్పరచుకోవడానికి అనేకమైన మార్గాలు ఉన్నాయి. ఈ మార్గాలు, మాధ్యమాలు, ప్రసార సాధనాలనే ప్రసారంగా పేర్కొనటం జరుగుతున్నది. తోటివారల ప్రవర్తనలను, పరిసరాలను ప్రభావపరిచే మానవ ప్రవర్తనల విషయలే ప్రసారంలో అంతర్భాగాలుగా ఉంటాయి.

తొలుత ప్రసార సిద్ధాంతానికి అంతర్గత సమాచార ప్రసరణ ప్రాతిపదికగా యుండేది. అంతర్గత సమాచార ప్రసరణను ఇంగ్లీషు భాషలో ' cyber netics ' అని అంటారు. దీనికి ' kubernetes ' అనే గ్రీకు పదం మూలం. గ్రీకు భాషలో బరేనెట్స్ అంటే చోదకుడు (steerman or driver) అని అర్థం. స్వయంచరిత యంత్రాలు పనిచేసే ప్రక్రియపై అంతర్గత సమాచార ప్రసరణ సిద్ధాంతం ఆధారపడి యున్నది. స్వయంచరిత యంత్రాలు బయటి వారి ప్రసక్తి లేకుండా అంతర్గతంగా సమాచారాన్ని పొంది విధుల నిర్వహణలో స్వయం నియంత్రణతో ప్రతిస్పందిస్తూ ఉంటాయి. ఉదా:ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లు మొ.వి. ఈ యంత్రాలు తమకు తాముగా సమాచారాన్ని పొంది, స్పందించి స్వయంగా తమ పనులను తాము నిర్వర్తిస్తుంటాయి. ఈ విధమైన ఉదాహరణల ప్రాతిపదికగా ప్రసార సిద్ధాంతకర్తలు వ్యక్తులు, సంఘాలు, రాజకీయ వ్యవస్థలు పరిసరాల నుండి స్వీకరించే ప్రభావాలకు స్పందించి స్వయంచరిత సూత్రం ఆధారంగా కార్యకలాపాలను నిర్వర్తిస్తుంటాయని అభిప్రాయపడినారు.

## 11.3 ప్రసార సిద్ధాంతం- ప్రాతిపదిక:

వ్యక్తులు, సంఘాలు, రాజకీయ వ్యవస్థలు ఆయా వ్యక్తుల మధ్య చోటు చేసికొనే ప్రసారాలు,అనుభూతులు, ఊహాలు ఆధారంగానే రూపొందించబడి మనగలుగుతాయని ఈ సిద్ధాంతకర్తల భావన. ఈ భావనే ప్రసార సిద్ధాంత కర్తలను రాజకీయ దృగ్విషయాలను ప్రసార దృక్పథం నుండి అధ్యయనం చేయటానికి ప్రోత్సహించింది వారు 'ప్రసారాన్ని' రాజకీయ వ్యవస్థకు కీలక క్షేత్రంగా భావించినారు. ప్రసారాలు రాజకీయ వ్యవస్థను సమీకృతం చేయటమేగాక దాని అభివృద్ధికి కూడా దోహదం చేస్తాయి. ప్రసారం ప్రజా సమూహాలు కలిసికట్టుగా ఆలోచించటానికి, పరిశీలించటానికి, చర్యన్ముఖులను చేయటానికి తోడ్పడుతుందని వీనరే వివరించినాడు. కాలానుగుణంగా ప్రభుత్వం తీసికొనే నిర్ణయాలు సరియైన సమయంలో ప్రజలకు చేరటం ద్వారానే ప్రజలు శాసనబద్ధులుగా వ్యవహరించగలుగుతారు. ప్రజల స్పందనను ప్రభుత్వానికి తెలియజేసే ప్రసార సాధనాలు కూడా ఉండటం వలననే ప్రభుత్వ నిర్ణయాలకు ప్రజలు ఏవిధంగా స్పందిస్తున్నారో ప్రభుత్వాలు తెలిసికోవటానికి సాధ్యమవుతున్నది. తమలో తాము పరస్పరం సమాచారాన్ని పొందటానికి వీలైన సాధనాలు కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలి. కారలేడూయిష్ దృష్టిలో "ప్రసార సాధనాల సమ్మేళనమే రాజకీయ వ్యవస్థ". ఒక నిర్ణీత కాలపరిమితిలో సమాచార సేకరణ, ఎంపిక, ప్రసరణ, నిల్వల కొరకు అభివృద్ధి చేయబడిన ప్రసార వ్యవస్థే రాజకీయ వ్యవస్థ.

ఆ విధంగా కారలే డూయిష్ అభిప్రాయంలో ప్రసార సిద్ధాంతం రాజకీయ వ్యవస్థ అనేది ఒక దేశం యొక్క అంతరంగిక, బహిర్గత విషయాలకు సంబంధించిన నిర్ణయకల్పన వ్యవస్థ అనే భావనపై ఆధారపడి యున్నది. ప్రసార ప్రక్రియలన్నీ నిర్ణయ కల్పన యంత్రాంగం ద్వారానే నిర్వహించబడతాయి. ఫలితాల కన్నా నిర్ణయకల్పన ప్రక్రియకే కారలేడూయిష్ ప్రాధాన్యత యిచ్చినాడు. ప్రసారాన్ని నిర్ణయ కల్పన ప్రక్రియలో ఒక ప్రాథమిక అంశంగా భావించినాడు. ఆయన రాజకీయ వ్యవస్థను ప్రసార సమ్మేళనంగా వివరించినాడు.

## 11.4 ప్రసార సిద్ధాంతం-ప్రాథమిక భావనలు:

ప్రసార సిద్ధాంతం ప్రభుత్వాన్ని విభిన్నమైన సమాచార సరఫరాలపై ఆధారపడిన నిర్ణయకల్పనా వ్యవస్థగా భావిస్తుంది. ఈ సిద్ధాంతాన్ని సరిగా అవగాహన చేసికోవాలంటే దీనికి సంబంధించిన కొన్ని ప్రాథమిక భావనలను అర్థంచేసికోవాలి. ఇవి ముఖ్యంగా రెండు రకాలు: 1)నిర్వహణాత్మక నిర్మితులు (operating stuctures) కు సంబంధించిన భావనలు 2)సమాచార ప్రసరణకు, ప్రసార ప్రక్రియలకు సంబంధించిన భావనలు.

మొదటి రకానికి సంబంధించిన భావనల విషయంలో నిర్వహణాత్మక నిర్మితులు పనిచేసే తీరుకు సంబందించిన నమూనాను రూపొందించటానికి డూయిష్ ప్రయత్నించినాడు. దేశం అంతర్గత, విదేశీ పరిసరాల నుండి సమాచారాన్ని స్వీకరించే వ్యవస్థ గురించి ఆయన చర్చించినాడు. సమాచార స్వీకరణలో అవలోకన (scanning), సమాచార ఎంపిక, సమాచార విశ్లేషణ వంటి అనేక విషయాలు మిళితమై ఉంటాయి. పాత అనుభవాలు, విలువలు, జ్ఞాపకాల ప్రాతిపదికన సమాచారం స్వీకరించబడుతుంది. ఆ సమాచారం ఆధారంగా వ్యవస్థ నిర్ణయాలు చేసే దశను చేరుకుంటుంది.కాని నిర్వహణ వ్యవస్థ ఇంతటితో పూర్తికాదు. ఇంకా చాలా నిర్మితులు నిర్ణయకల్పనా స్థాయిలో తీసికున్న నిర్ణయాలను అమలు పరిచే బాధ్యతను, సమాచారాన్ని అందించే బాధ్యతను కలిగి ఉంటాయి. వ్యవస్థ పనితీరుకు సంబంధించిన సమాచారాన్ని తిరిగి నిర్వహణ యంత్రాంగానికి చేరవేయటం ద్వారా మరల క్రొత్తగా నిర్ణయ కల్పనా ప్రక్రియకు దోహదం చేస్తాయి.

ఇక సమాచార ప్రసరణకు, ప్రసార ప్రక్రియలకు సంబంధించిన భావనలు కూడా చాలా ముఖ్యమైనవి.ప్రసారం అనేది సాధనాలు (Channels), భారం (Load), భారసామర్థ్యత (Load Capacity) ల మీద ఆధారపడి యుంటుంది. వివిధ ప్రక్రియలు,మాధ్యమాల ద్వారా సమాచారాన్ని రాజకీయ వ్యవస్థకు చేరవేసే వాటిని 'సాధనాలు' అని పిలుస్తారు. ఏదైనా ఒక నిర్ణీత

సమయంలో సమాచారాన్ని స్వీకరించగల సమర్ధతను 'భారం' అని పేర్కొంటారు. ఏదైనా ఒక సాధనం ద్వారా ప్రసారమయ్యే సమాచారం యొక్క పరిమాణం భారానికి సంబంధించినదై యుంటుంది. సమాచారం యొక్క పరిమాణం సమయం, స్వభావాలను బట్టి మారుతూ ఉంటుంది. ఉదాహరణకు ఏదైనా ఒక దేశంపై దండయాత్ర జరిగినపుడు శతృదేశం యొక్క సైన్యాల స్వభావాన్ని గురించి, కదలికలను గురించిన సమాచార సేకరణ భారాన్ని అధికం చేస్తుంది. రాజకీయ వ్యవస్థకు సమాచారాన్ని చేరవేయగల సాధనాల సమర్ధతే 'భార సామర్ధ్యత'. సమాచార సేకరణకు లభ్యమయ్యే సాధనాల సమర్ధత భార సామర్ధ్యతను ప్రభావితం చేస్తుంది. భార సామర్ధ్యత అనేక ఇతర విషయాల మీద ఆధారపడి యుంటుంది.

## 11.5 సమాచార ప్రసారం - దాని పరిణామాలు:

యంత్రాలు ఏ విధంగా అయితే శక్తి (energy) ఆధారంగా పనిచేస్తాయో అదేవిధంగా రాజకీయ వ్యవస్థ సమాచార ప్రసరణ ప్రాతిపదికగా తన విధులను నిర్వహిస్తుంది. ఇంధనం, సమాచారం రెండూ చర్యలను ప్రారంభింప జేస్తాయి. కాని ఈ రెంటి ప్రభావం ఆయా వ్యవస్థలలో ఒకే రకంగా యుండదు. విద్యుత్ ఇంజనీరింగ్‌లో యంత్రం యొక్క పనితీరు దానికి సరఫరా చేయబడిన శక్తికి అనుగుణంగా యుంటుంది. కాని రాజకీయ వ్యవస్థలో సమాచార ప్రసరణ ప్రభావం సమాచార నిష్పత్తికి అనుగుణంగా యుండదు. సమాచార ప్రసరణ ప్రభావం వివిధ వ్యక్తులపై వివిధ రకాలుగా యుంటుంది. వ్యక్తి యొక్క ప్రతిస్పందన అతని మనఃస్థితిపైన, అతని అంతఃకరణ (sub-conscious mind) లో నిక్షిప్తమైన గతకాలపు సమాచారంపైన ఆధారపడి యుంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొనే కారలే డూయిష్ సమాచారం (Information) అంటే 'వివిధ విభాగాల మధ్య చోటు చేసికొన్న క్రమబద్ధమైన సంబంధం'గా నిర్వచించాడు.

సమాచారం యొక్క ప్రభావం ఆ సమాచారాన్ని స్వీకరించిన వ్యక్తి యొక్క సమతాస్థితి (equilibrium) మీద, సమాచారాన్ని సరిగా ఎంపిక చేయటం (selectivity) మీద ఆధారపడి యుంటుంది. సమతాస్థితి స్థిరత్వానికి సూచిక. ఉదాహరణకు నాలుగు కాళ్ళు సమంగా యున్న బల్ల స్థిరత్వాన్ని కలిగి యుంటుంది. అట్లా గాక అసమానంగా యున్నప్పుడు సమతుల్యాన్ని కోల్పోయి, అస్థిరత్వంగా యుంటుంది. అదేవిధంగా వ్యక్తులు, రాజకీయవ్యవస్థ కూడా సమతుల్యం, అసమతుల్యాలను ఎదుర్కొంటూ ఉంటాయి. మానసిక ఆరోగ్యం సరిగ్గా యున్న సాధారణ పరిస్థితులలో వ్యక్తులు సంతులనం కలిగి ఉంటారు. అట్లా కాక మానసికస్థితి ఉద్వేగం, ఉద్రేకాలకు లోనై ఆందోళనతో కూడి యున్నపుడు అతని స్థితి అస్థిరంగాను, అసమతుల్యంగాను యుంటుంది.

సమాచారాన్ని స్వీకరిస్తున్న వ్యక్తి సంతులన స్థితిలో లేనపుడు సమాచారం అతనిలో తీవ్రమైన ప్రతిస్పందనలను కలుగజేస్తుంది. కొన్ని సమయాలలో ఈ ప్రతిస్పందన హింసాత్మకంగా కూడా యుండవచ్చు. కాని అదే సాధారణ పరిస్థితులలోనైతే వ్యక్తి వ్యతిరేకాత్మకమైన, మనస్థాపాన్ని కలిగించే సమాచారాన్ని కూడా చాలా హుందాగా స్వీకరించగలుగుతాడు. సరియైన ఎంపిక ద్వారా తగిన నిర్ణయాలను చేయగలుగుతారు. ఈ ప్రవర్తనా సరళిపైనే రాజకీయ వ్యవస్థ పనితీరు కూడ ఆధారపడి ఉంది. రాజకీయ వ్యవస్థలో విదేశీ దురాక్రమణల వలన గాని, అంతర్గత అలజడుల వలన కాని సంతులన పరిస్థితి లేనపుడు స్వీకరించబడే సమాచారం అత్యధిక ప్రభావాన్ని కలుగజేస్తుంది. అందువలన మంచి రాజకీయ వ్యవస్థ సరియైన సంతులన స్థితిని కలిగి ఉండాలి. అటువంటప్పుడే రాజకీయ వ్యవస్థ పరిసరాల నుండి- అంతర్గతంగా కాని, ఇతర దేశాల నుండి కాని- స్వీకరింపబడే సమాచారానికి సరియైన పద్ధతిలో స్పందించగలుగుతుంది. సరియైన నిర్ణయాలు చేయటం ద్వారా సమర్ధంగా వ్యవహరించగలుగుతుంది.అటువంటి స్థిరమైన సంతులన పరిస్థితి లేనపుడు చిన్న చిన్న విషయాలకు కూడా దాని ప్రతిస్పందన అసాధారణంగా,అనూహ్యంగా యుంటుంది.

సమాచారాన్ని స్వీకరించే సందర్భంలో అవసరమైన సమాచారాన్ని ఏరుకోవటాన్ని 'ఎంపిక' (Selectivity) అని అంటారు. వస్తున్న సమాచారంలో కొంత కాని, పూర్తిగా కాని రాజకీయ వ్యవస్థ స్వీకరించవచ్చు. కొన్ని సందర్భాలలో ఆ వచ్చిన సమాచారాన్ని తిరస్కరించవచ్చు. ఈ సందర్భంలోనే కారలే డూయిష్ తాళం,తాళం చెవి ఉదాహరణను ఇచ్చినాడు. సాధారణమైన తాళాన్ని అన్ని తాళంచెవులతో తీయవచ్చు.కాని సంక్లిష్టమైన తాళాన్ని దానికి సరిపడే తాళంచెవితో మాత్రమే తెరువగలం. వ్యక్తులు,రాజకీయ

వ్యవస్థల స్థితి కూడా ఈవిధంగానే యుంటుంది. వస్తున్న సమాచారం నుండి కొంత సమాచారాన్ని మాత్రమే స్వీకరిస్తారు. అందువల్ల సమాచారం ప్రభావం స్వీకరించే వారి ఎంపిక ప్రాతిపదికపై ఆధారపడి యుంటుంది.

## 11.6 నిర్ణయకల్పన ప్రక్రియ:

సమాచారాన్ని స్వీకరించిన తరువాత అవసరమైన లక్ష్యాలను సాధించటానికి కృషి చేయాలి. లక్ష్యాలను సాధించవలెనన్న తగిన నిర్ణయాలను రూపొందించవలె. ఈ నిర్ణయాకరణ ప్రక్రియ అనేది విరామం (Lag), చొరవ (Lead) మరియు లాభం (Gain) అనే భావనలతో కూడుకొని యుంటుంది.

### 11.6.1 విరామం:

సమాచారం చేరినప్పటి నుండి నిర్ణయాలు, చర్యలు తీసుకోవటానికి మధ్య గల సమయాన్ని 'విరామం' (Lag) అంటారు. రాజకీయ వ్యవస్థలోని ఒక స్థాయికి సమాచారం అందటానికి, నిర్ణయ కర్తలు నిర్ణయాలు చేసి అమలు ప్రారంభించడానికి పట్టే సమయమే విరామం. లక్ష్యానికి సంబందించిన సమాచారం అందటానికి, దానికి ప్రతిస్పందనగా వ్యవస్థ చేపట్టే చర్యల ప్రారంభానికి మధ్యగల సమయాన్ని విరామమని కారలే డూయిష్ పేర్కొన్నారు.

### 11.6.2 చొరవ:

అందిన సమాచారానికి ప్రతి స్పందనగా ఎంత త్వరగా,సమయోచితంగా రాజకీయ వ్యవస్థ చర్యోన్ముఖమవుతుందన్న విషయాన్ని 'చొరవ' అని అంటారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఎంత త్వరగా కార్యక్రమాలను ప్రారంభిస్తున్న విషయమే చొరవ (Lead), ఎదురు కాబోయే సవాళ్లను ముందుగా ఊహించి రాజకీయ వ్యవస్థ ఎంత త్వరగా చర్యలు తీసుకుంటుందన్న విషయాన్ని చొరవ ద్వారా తెలుసుకోవచ్చు.

### 11.6.3 లాభం:

ముందుగా చర్యలు ప్రారంభించటం వల్ల రాజకీయ వ్యవస్థ పొందే ప్రయోజనాలే "లాభం" (Gain). రాజకీయ ప్రవర్తనలో వాస్తవంగా చోటు చేసికున్న మార్పులే లాభం. చొరవ, లాభం రెండూ ఒకే విషయాన్ని సూచిస్తుంటాయి. రాజకీయ వ్యవస్థ ముందుచూపుతో వ్యవహరించగల సమర్థతనే చొరవగా చెప్పవచ్చు. మంచి సామర్థ్యంగల రాజకీయ వ్యవస్థ సమాచారాన్ని స్వీకరించే ప్రక్రియను పటిష్ఠపరచుకొని, విరామాన్ని తగ్గించుకొన, త్వరితగతిని చర్యలకు ఉపక్రమించటం ద్వారా మంచి ఫలితాలను సాధించగలుగుతుంది. అందిన సమాచారానికి, ప్రారంభించిన చర్యలకు విరామం అధికంగా ఉన్నట్లైతే రాజకీయ వ్యవస్థ సరిగా విధులను నిర్వర్తించ లేక పోతున్నదని చెప్పవచ్చు.

### 11.6.4 స్పందిత సమాచారం:

రాజకీయ వ్యవస్థ నిర్ణయాల పట్ల ప్రజలు,పరిసరాల ప్రతిస్పందనను తెలియజేసే ప్రక్రియను 'స్పందిత సమాచారం' (Feed back) అంటారు. రాజకీయ వ్యవస్థ మనుగడకు,లక్ష్యాన్ని సాధించటానికి స్పందిత సమాచారం అత్యవసరం అని కారలే డూయిష్ అభిప్రాయం. స్పందిత సమాచారం ద్వారా రాజకీయ వ్యవస్థ తాను ఆశించిన లక్ష్యానికి ఎంత దూరంలో యున్నది తెలిసికొంటుంది. తాను తీసికొన్న నిర్ణయాల పట్ల ప్రజల, పరిసరాల ప్రతిస్పందనను బట్టి తన నిర్ణయాలలో తగిన మార్పులు, చేర్పులు చేయటానికి అవకాశం కలుగుతుంది. జాతీయ అంతర్జాతీయ రాజకీయాలలో లక్ష్య నిర్దేశనకు కూడా స్పందిత సమాచారం సహాయకారిగా యుంటుంది.

స్పందిత సమాచార ప్రక్రియలో వ్యతిరేకాత్మక (Negative) మరియు విపులీకరణ (Amplifying) అను రెండు రకాలున్నాయి.ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధించి పరిసరాల నుండి వ్యతిరేకమైన సమాచారాన్ని పంపినపుడు అది వ్యతిరేకాత్మక

స్పందిత సమాచారం (Negative Feedback) అవుతుంది. ప్రభుత్వ విధానాలకు సంబంధించి ప్రజలనుండి వ్యతిరేకత వ్యక్తమైనపుడు వాటికి తగిన విధంగా మార్పులు, చేర్పులు చేయబడతాయి. అలాంటి విధానాలు భవిష్యత్తులో రూపొందకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసికుంటుంది. రెండు శత్రురాజ్యాలు పరస్పర వ్యతిరేకంగా ఆయుధీకరణ విధానాన్ని అనుసరిస్తున్నపుడు వెలువడే సమాచారాన్ని విపులీకరణ స్పందిత సమాచారం (Amplifying Feedback) అంటారు. ప్రతిరాజ్యం తన శత్రురాజ్యం కంటె మిన్నగా ఆయుధీకరణ విధానాన్ని అనుసరించాలని భావిస్తుంది. శత్రురాజ్యం సముపార్జించుకున్న ఆయుధాలకు సంబంధించి సమాచారం అందగానే తన ఆయుధీకరణను పెంపొందించుకుంటుంది. తద్వారా రెండు రాజ్యలమధ్య పెడతెగని ఆయుధాల పోటీ చోటు చేసుకుంటుంది. ఇటువంటి సందర్భాలలో అందే సమాచారాన్ని 'విపులీకరణ స్పందిత సమాచారం' అని అన్నారు. ఈ రెండు రకాలైన స్పందిత సమాచార పద్ధతుల ద్వారా రాజకీయవ్యవస్థ తన నిర్ణయ రూపకల్పనలో అవసరమైన మార్పులు, చేర్పులు చూస్తూ కొనసాగుతుంది.

## 11.7 రాజకీయ విశ్లేషణలో ప్రసార సిద్ధాంతం:

మానవ శరీరానికి రక్తప్రసరణ ఎంత అవసరమో రాజకీయ వ్యవస్థకు సమాచార ప్రసరణ కూడ అంతే అవసరం. రక్తప్రసరణ ద్వారా శరీరానికి పటిష్టత చేకూరుతుంది. అలాగే సమాచారప్రసరణ ద్వారా రాజకీయ వ్యవస్థ సమర్ధవంతమైన మనుగడను కొనసాగిస్తూ యుంటుంది. అందువలననే ప్రసార సిద్ధాంతం ప్రభుత్వనిర్ణయ కల్పన వ్యవస్థ, సమాచార ప్రసారం ప్రాతిపదికపై ఆధారపడి యుంటుందని వివరిస్తున్నది. రాజకీయ వ్యవస్థ నెరవేర్చవలసిన విధులన్నీ సమాచార ప్రసారం ప్రాతిపదికగానే నిర్వర్తించబడుతుంటాయి. కుటుంబ యజమాని, పాఠశాల ఉపాధ్యాయులు, మతనాయకులు ప్రజలకు విలువలను బోధిస్తుంటారు. ప్రభావవర్గాలు, రాజకీయ పార్టీలు ప్రజల డిమాండ్లను, విధాన సిఫారసులను రాజకీయ వ్యవస్థకు ప్రసారం చేస్తుంటాయి. ప్రభుత్వానికి చెందిన మంత్రులు, పార్లమెంటు సభ్యులు అందించిన సమాచారం ఆధారంగా శాసనవర్గాలు శాసనాలను రూపొందిస్తుంటాయి. సమాజంద్వారా, ప్రభుత్వానికి సంబంధించిన వివిధ అంగాల ద్వారా లభ్యమయ్యే సమాచారం ప్రాతిపదికగా పాలకులు తమ విధులను నిర్వర్తిస్తుంటారు. అదే విధంగా వివాదాలలోని కక్షిదారులు, ఉన్నత న్యాయస్థానాలు అందజేసే సమాచారాన్ని ఆధారం చేసికొని న్యాయవ్యవస్థ తీర్పులు చెబుతుంది. ఇవన్నీ ప్రసార విధుల ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి.

## 11.8 ప్రసార సిద్ధాంతం - సమీక్ష:

### 11.8.1 ప్రసార సిద్ధాంతం – ప్రాధాన్యత:

ఆధునిక రాజనీతి విశ్లేషణలో ప్రసార సిద్ధాంతానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. వివిధ రాజకీయ వ్యవస్థలను తులనాత్మకంగా అంచనా వేయటానికి ఈ సిద్ధాంతం ఎంతగానో ఉపకరిస్తుంది.

1) ప్రసార సిద్ధాంతం సహాయంతో ప్రజాస్వామిక, సంపూర్ణాధికార (Totalitarian) రాజ్యాల మధ్యభేదాన్ని గుర్తించవచ్చు. ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థలలో వివిధ మార్గాల ద్వారా సమాచార ప్రసరణకు స్వేచ్ఛ యుంటుంది. కాని సంపూర్ణాధికార రాజ్యాలలో ఇటువంటి స్వేచ్ఛ యుండదు.

2) ప్రసారదృక్పథం ద్వారా సాంప్రదాయక, ఆధునిక రాజకీయ వ్యవస్థల మధ్యగల భేదాలను వివరించవచ్చు. ఆధునిక రాజకీయ వ్యవస్థలో ప్రసారనిర్మితులు విస్తృతమైనవిగా అభివృద్ధి చెంది ఉంటాయి. సాంప్రదాయక రాజకీయ వ్యవస్థలో రాజకీయ ప్రసార విధులను కుటుంబం, రక్తసంబంధీకులు, గ్రామీణ వర్గాలు నిర్వహిస్తు ఉంటాయి.

3) ప్రసారదృక్పథం సమాజం యొక్క సమైక్యత, అభివృద్ధిని సూచిస్తుంది. ప్రసార సంబంధాలు, సమాచార ప్రసరణ సమాజంలోని సమైక్యతకు దోహదం చేస్తాయి. ప్రసార సాధనాలు ఎక్కువైన కొలది రాజకీయ వ్యవస్థకు ఎక్కువ సమాచారం లభిస్తుంది. వివిధ మూలాల నుండి సరఫరా అయ్యే సమాచారం ప్రజల మధ్య అవగాహనకు, సమైక్యతాభివృద్ధికి దోహదం చేస్తుంది.

4) ప్రసారదృక్పథం రాజకీయ వ్యవస్థ ప్రగతిశీల స్వభావాన్ని అధ్యయనం చేయటానికి బాగా ఉపకరిస్తుంది. సాధారణ వ్యవస్థల సిద్ధాంతం వలె గాక ప్రసార దృక్పథం ద్వారా రాజకీయ వ్యవస్థ గతిశీలతను (dynamics) బాగా అధ్యయనం చేయవచ్చు. వ్యవస్థాసిద్ధాంతం రాజకీయ వ్యవస్థ రూపొందించే నిర్ణయాల ప్రభావం ప్రజల మీద, వివిధ ప్రభుత్వాంగాల మీద ఏవిధంగా ఉందో తెలిసికోవటానికి అవసరమైన నిర్మితులను గురించి ఆలోచించలేదు. కాని ప్రసారదృక్పథపు నమూనాలో నిర్ణయాల ప్రభావాన్ని గ్రహించుటకు రాజకీయ వ్యవస్థలోనే నిర్మితులుంటాయి. గనుక ముందు జాగ్రత్త చర్యలు తీసికొనే అవకాశాలున్నాయి.

5) ప్రసారదృక్పథం వ్యవస్థ వృద్ధికి చెందిన దృగ్విషయాన్ని అధ్యయనం చేయటంలో సహాయపడుతుంది. డూయిష్ దృష్టిలో వృద్ధి అనగా వస్తువుల ఉత్పత్తి, జనాభ పెరుగుదల, తద్వారా పరిస్థితులను తట్టుకోవటానికి ప్రభుత్వం సన్నద్ధం కావటం. ఈ విధమైన ప్రగతిని ప్రభుత్వ నిర్ణయాలతో మాత్రమే సాధించవచ్చు. అందువలననే ప్రసారనమూనాలో నిర్ణయ కల్పన ప్రధానమైన విషయం. వ్యవస్థ పరిమాణాత్మక వృద్ధిని అధ్యయనం చేయటమేగాక తరువాత జరిగే మార్పుల అధ్యయనాలకు కూడ ప్రసారదృక్పథం సహాయకారిగా యుంటుంది.

## 11.8.2 ప్రసారదృక్పథం - లోపాలు:

ప్రసారదృక్పథానికి ఎంతటి ప్రాధాన్యత యున్నప్పటికి ఈ సిద్ధాంతం కొన్ని విమర్శలకు గురైంది. అవి:

1) ప్రసారదృక్పథం మానవ ప్రవర్తనను యాంత్రిక స్వభావమైనదిగా భావిస్తుంది. మానవ ప్రవర్తన స్థిరమైన స్వభావాన్ని కలిగి యుండదు. కాబట్టి ప్రకృతిశాస్త్రాలు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌కు సంబంధించిన సూత్రాల ద్వారా మానవ ప్రవర్తనను అవగాహన చేసికోజాలము.

2) ప్రసార సిద్ధాంతం ఎక్కువగా నిర్ణయీకరణ ప్రక్రియకే ఎక్కువ ప్రాధాన్యత యిచ్చింది. కాని నిర్ణయీకరణ ఫలితాలను గురించి పెద్దగా పట్టించుకోలేదని విమర్శకుల భావన.

3) సామాజిక, ప్రకృతి వ్యవస్థల మధ్య సారూప్యతలను వెతకటం సాధ్యపడే విషయంకాదు. ప్రకృతి శాస్త్రాల భావనలను సామాజిక శాస్త్రాలకు అన్వయించటంలో మాటలు, భావాలు మొదలైన విషయాలలో కష్టాలు ఎదురయ్యాయి. అందువలననే కారలే డూయిష్ నమూనా సంక్లిష్టతను సంతరించుకున్నదని విమర్శకులు విమర్శించినారు.

## 11.9 సారాంశం

ఆధునిక రాజనీతి విశ్లేషణలో ప్రసార సిద్ధాంతానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. రాజకీయ వ్యవస్థ పనితీరును, సమర్థతను ప్రభావితం చేయటంలో సమాచార ప్రసరణ ప్రాధాన్యతను ఈ సిద్ధాంతం వివరిస్తుంది. అంతేగాక శాస్త్రసాంకేతిక రంగాలలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా ప్రకృతి శాస్త్రాలలో, ప్రసార ఇంజనీరింగ్‌లో చోటు చేసికున్న పరిణామాలను, భావనలను రాజకీయ దృగ్విషయాల అధ్యయనానికి అన్వయించటానికి ఈ సిద్ధాంతం ఉపకరించింది.

ప్రసారమనగా ఒకరి ఆలోచనలు మరియొకరి ఆలోచనలను ప్రభావపరచటమని చెప్పవచ్చు. వ్యక్తులు, సంఘాలు, రాజకీయ వ్యవస్థలు ఆయావ్యక్తుల మధ్య చోటు చేసికొనే ప్రసారాలు, అనుభూతులు, ఊహలు ఆధారంగానే రూపొందించబడి మనగలుగుతాయని ఆ సిద్ధాంత కర్తల భావన. వారు ప్రసారాన్ని రాజకీయ వ్యవస్థకు కీలక క్షేత్రంగా భావించినారు. ప్రసారాలు రాజకీయ వ్యవస్థను సమీకృతం చేయటమేగాక దాని అభివృద్ధికి కూడ దోహదం చేస్తాయి. కారలే డూయిష్ అభిప్రాయంలో "ప్రసార సాధనాల సమ్మేళనమే రాజకీయ వ్యవస్థ" ప్రసార ప్రక్రియలన్నీ రాజకీయ వ్యవస్థకు సంబంధించిన నిర్ణయ కల్పన యంత్రాంగం ద్వారానే నిర్వహించ బడతాయి.

యంత్రాలు ఏ విధంగా అయితే శక్తి ఆధారంగా పనిచేస్తాయో అదే విధంగా రాజకీయ వ్యవస్థ సమాచార ప్రసరణ ప్రాతిపదికగా తన విధులను నిర్వహిస్తుంది. సమాచారం యొక్క ప్రభావం ఆ సమాచారాన్ని స్వీకరిస్తున్న రాజకీయ వ్యవస్థ సమతాస్థితి

మీద ఆధారపడి యుంటుంది. రాజకీయ వ్యవస్థ సంతులన పరిస్థితిలో లేనపుడు స్వీకరించబడిన సమాచారం అత్యధిక ప్రభావాన్ని కన్పరుస్తుంది. సమాచారాన్ని స్వీకరించిన తరువాత, అవసరమైన లక్ష్యాలను సాధించటానికి తగిన నిర్ణయాలను రూపొందించలె. ఈ నిర్ణయీకరణ ప్రక్రియ అనేది విరామం, చొరవ, లాభం మరియు స్పందిత సమాచారం అనే భావనలతో కూడి యుంటుంది.

## 11.10 నమూనా ప్రశ్నలు:

1) ఆధునిక రాజనీతి విశ్లేషణలో ప్రసార సిద్ధాంతం ప్రాధాన్యతను వివరించుము.
2) ప్రసారం అనగా నేమి? ప్రసార సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా సమీక్షించుము.

### లఘు వ్యాసరూప ప్రశ్నలు

1) ఆధునిక రాజనీతి విశ్లేషణలో ప్రసార సిద్ధాంతం ఏవిధంగా అభివృద్ధి చెందింది?
2) ప్రసార సిద్ధాంతానికి సంబంధించిన ప్రాథమిక భావనలను వివరించుము?
3) రాజకీయ వ్యవస్థ పని తీరును సమాచార ప్రసారం ఏవిధంగా ప్రభావితం చేస్తుంది?
4) ప్రసార సిద్ధాంతంలో స్పందిత సమాచారం ప్రాధాన్యతను గూర్చి వ్రాయుము.

## 11.11 చదువదగిన గ్రంథాలు


1) Charlesworth (Ed) : Contemporary Political Analysis
2) S.P. Varma : Modern Political Theory
3) Karl W. Deutscu : The Nerves of Government
4) M.Satyanarayana Rao etal : రాజనీతి శాస్త్రం : ఆధునిక విశ్లేషణ.


డా॥ ఐ.దోశగిరిరావు

పాఠం - 12

# నిర్ణయకల్పన సిద్ధాంతం
## (DESIGN MAKING THEORY)

విషయసూచిక


12.0 లక్ష్యం

12.1 నిర్ణయకల్పన సిద్ధాంతం - పరిచయం

12.2. నిర్ణయకల్పన సిద్ధాంతం - అభివృద్ధి

12.3 నిర్ణయకల్పన సిద్ధాంతం - స్నైడర్ నమూనా

12.4 హెరాల్డ్ లాస్వెల్ - నిర్ణయకల్పన సిద్ధాంతం

12.5 నిర్ణయకల్పన సిద్ధాంతం - సమీక్ష

12.5.1 నిర్ణయకల్పన సిద్ధాంతం - ప్రాధాన్యత

12.5.2 నిర్ణయకల్పన సిద్ధాంతం - విమర్శ

12.6 ముగింపు

12.7 సారాంశం

12.8 నమూనా ప్రశ్నలు

12.9 చదువదగిన గ్రంథాలు


## 12.0 లక్ష్యం :

ఆధునిక రాజనీతి విశ్లేషణలో నిర్ణయకల్పన సిద్ధాంతానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. రాజకీయ దృగ్విషయాలను అవగాహన చేసికొనటానికి రూపొందించబడిన అనేక నమూనాలు, సిద్ధాంతాలలో ఇది ఒక ముఖ్యమైన నమూనాగా గుర్తింపును పొందింది. నిర్ణయకల్పన సిద్ధాంతం స్వభావాన్ని, అభివృద్ధిని, నిర్ణయకల్పన సిద్ధాంతాన్ని వివరించిన వివిధ రచయితల అభిప్రాయాలను, ఈ సిద్ధాంతం ప్రాముఖ్యాన్ని, లోపాలను గురించి చర్చించటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 12.1 నిర్ణయకల్పన సిద్ధాంతం - పరిచయం :

సాధారణంగా 'నిర్ణయకల్పన' అనేది ఒక సరళమైన (simple) ప్రక్రియగా, ఒక వ్యవస్థలో ముఖ్య కార్యనిర్వాహణాధికారి నిర్వర్తించే విధిగా భావించటం జరుగుతుంది. కాని వాస్తవానికి ఇది ఒక జటిలమైన, సంక్లిష్టతతో కూడుకొన్న ప్రక్రియ (complex and complicated process). వివిధ వ్యక్తులు, విభాగాలు ఈ ప్రక్రియలో పాలుపంచుకుంటాయి. నిర్ణయ ప్రకటన ఒక వ్యవస్థకు చెందిన ముఖ్యకార్యనిర్వహణాధికారి ద్వారా వెలువడినప్పటికి ఆ నిర్ణయాన్ని ఆయన తనకు తానుగా రూపొందించలేడు. దానిని దృష్టిలో పెట్టుకొనే నిర్ణయకల్పన సిద్ధాంతం నిర్ణయాలను రూపొందించటంలో వివిధ దశలుంటాయని, నిర్ణయకల్పన అనేది ఎంతో సంక్లిష్టమైన ప్రక్రియ అని వివరిస్తుంది. ప్రక్రియ విశ్లేషణ ప్రాతిపదిక మీద నిర్ణయకల్పన సిద్ధాంతం ఆధారపడియున్నదని చెప్పవచ్చు.

వ్యవస్థల దృక్పథం, నిర్మితులు - విధుల దృక్పథం విశ్లేషించజాలని గతిశీల సందర్భాలను విశ్లేషించగల సామర్థ్యం నిర్ణయకల్పన దృక్పథానికి ఉందని రిచర్డ్ సి. స్నైడర్ (Richard C. Snyder) అభిప్రాయపడినాడు. ఈ సిద్ధాంతం ద్వారా ఒక దేశం యొక్క జాతీయ, అంతర్జాతీయ విధానాలను గుర్తించి, విశ్లేషించటం ద్వారా రాజకీయ పురోభివృద్ధికి సంబంధించి సూచనలు చేయవచ్చు. రాజనీతి శాస్త్రంలో ప్రత్యేకంగా అంతర్జాతీయ రాజకీయాల అవగాహనకు నిర్ణయకల్పనా దృక్పథాన్ని అన్వయించవచ్చు. ప్రఖ్యాత రాజనీతి శాస్త్రవేత్త మాకియావెల్లి కూడా తన రాజనీతిశాస్త్ర సిద్ధాంతాలను వివరించటంలో ఈ దృక్పథాన్నే అన్వయించినాడు.

## 12.2. నిర్ణయకల్పన సిద్ధాంతం - అభివృద్ధి :

నిర్ణయకల్పన దృక్పథం రెండు విభిన్న క్షేత్రాలలో విభిన్న మేధావులచే వివరింపబడింది. 18వ శతాబ్దంలో గణిత అర్థశాస్త్ర క్షేత్రంలో బెర్నోలి (Bernouli) నిర్ణయకల్పనను అధ్యయనం చేయటానికి సమకట్టినాడు. ఆర్థిక సిద్ధాంతాల పరంగా డొనెన్సు (Donens) నిర్ణయకల్పన భావనను అధ్యయనం చేసినాడు. ఆ తరువాత అనేకమంది మేధావులు ఆర్థికశాస్త్రంలో నిర్ణయకల్పన దృక్పథాన్ని అధ్యయనం చేసినారు. ప్రభుత్వ పాలనా శాస్త్రంలో నిర్ణయకల్పన సిద్ధాంతం ఆవిర్భవించిందని కొంతమంది మేధావులు అభిప్రాయపడినారు. అమెరికాలో ఉడ్రోవిల్సన్, జర్మన్‌లో మాక్స్‌వెబర్ ఈ దృక్పథాన్ని అభివృద్ధి చేయటానికి చాలా కృషిచేసినారు. 1938లో చెస్టర్ బెర్నార్డ్ (Chester Bernard) 1947లో హెర్బర్ట్ సైమన్ (Herbert Simon) నిర్ణయ కల్పనకు శాస్త్రీయ వివరణ ఇవ్వటానికి గణనీయమైన కృషిచేసినారు. ప్రభుత్వపాలనా శాస్త్రంలో నిర్ణయకల్పనను అధ్యయనం చేసిన వారిలో వీరిని ప్రధములుగా పేర్కొనవచ్చు. వీరు నిర్ణయకల్పనా ప్రక్రియను సక్రమంగా అవగాహన చేసికోవటానికి వ్యవస్థల మనోవైజ్ఞానిక సామాజిక దృక్కోణాలను అధ్యయనం చేయాలన్నారు.

హెర్బర్ట్ సైమన్ అభిప్రాయంలో "నిర్ణయకల్పన అనగా విధాన (నిర్ణయ) నిర్ణేతకు అందుబాటులోవున్న అనేక ప్రత్యామ్నాయాలలో నుంచి మంచి వాటిని ఎన్నుకోవటమే". ఈ నిర్వచనం ప్రకారం విధాన నిర్ణేత ముందు అనేక ప్రత్యామ్నాయాలు ఉన్నప్పటికి వాటిలో ముఖ్యమైన దానిని, అవసరమైన దానిని మాత్రమే ఎంపిక చేసికొనవలెను. నిర్ణయాలు తీసికొనేందుకు సమస్యను సమగ్రంగా అవగాహన చేసికోవటానికి ప్రయత్నం చేయవలెను. సైమన్ అభిప్రాయంలో నిర్ణయకర్తలు ఎంచుకున్న ప్రత్యామ్నాయమే విధాననిర్ణయం అవుతుంది. దీనినే సైమన్ 'సంతృప్తి నిచ్చే నమూనా' (Satisfying model) అని పేర్కొన్నాడు. సైమన్ దృష్టిలో నిర్ణయాలు అనేవి వ్యవస్థలోని అన్ని స్థాయిలలో చేయబడతాయి. కొన్ని నిర్ణయాలు వ్యవస్థలోని అనేక మంది సభ్యులను ప్రభావితం చేస్తాయి. మరికొన్ని నిర్ణయాలు కేవలం వివరాలను తెలిపేటటువంటివిగా మాత్రమే వుండి కొంచెం తక్కువ ప్రాముఖ్యతను కలిగి ఉంటాయి. నిర్ణయం చేయు విధానకర్త యొక్క ఇష్టాఇష్టాలపై, సామాజిక పరిస్థితులపై, వ్యవస్థలోని ప్రసారాలపై నిర్ణయీకరణ ఆధారపడి యుంటుందని సైమన్ పేర్కొన్నాడు.

నిర్ణయకల్పన హేతుబద్ధమైనదా లేక హేతురహితమైనదా అన్న సందేహం ఒకటి ఉంది. నిర్వచనం ప్రకారం నిర్ణయకల్పనలో ప్రత్యామ్నాయాల నుండి ఎంపిక ప్రధానమైన విషయం. అనగా నిర్ణయకర్తలు వివిధ ప్రత్యామ్నాయాలను హేతుబద్ధంగా పరిశీలించి, వ్యయం - లాభాల విశ్లేషణ (Cost-benefit analysis) ను ప్రాతిపదికగా చేసికొని ఒక మంచి ప్రత్యామ్నాయాన్ని ఎన్నుకుంటారు. కాని కొంతమంది నిర్ణయకల్పనను హేతురహితమైన విషయంగా భావిస్తున్నారు. ఉద్రేకాలు, ఆందోళనలు, వర్గ ప్రయోజనాల వంటి హేతురహిత ప్రభావాల మీద నిర్ణయకల్పన ఆధారపడి యుంటుందని వీరి భావన. ఆ విధంగా నిర్ణయకల్పనలో హేతువు చాలా పరిమితమైన పాత్రను నిర్వహిస్తుంది.

రాజకీయ దృక్కోణంతో పరిశీలించినపుడు నిర్ణయ కల్పనలోని హేతుబద్ధ లేక హేతురహిత ప్రభావాల నిర్దిష్ట పాత్రను అంచనా వేయటం కష్టం. అందువలన నిర్ణయకల్పన కేవలం హేతుబద్ధంగా ఉంటుందని కాని లేక హేతురహితంగా యుంటుందని కాని చెప్పజాలము. నిర్ణయకల్పనా ప్రక్రియలో పాల్గొనే వ్యక్తుల సమగ్ర వ్యక్తిత్వం నిర్ణయ కల్పనా ప్రక్రియలో ప్రతిబింబిస్తుంది.

## 12.3 నిర్ణయకల్పనా సిద్ధాంతం - స్నైడర్ నమూనా :

నిర్ణయకల్పనా దృక్పథాన్ని రెండవ ప్రపంచ యుద్ధం తరువాత రాజనీతి శాస్త్రంలో ప్రవేశపెట్టిన ఘనత రిచర్డ్ సి. స్నైడర్ (Richard C. Snyder) కు దక్కుతుంది. ఆయన అంతర్జాతీయ రాజకీయాలలో విదేశాంగ విధాన రూపకల్పనకు ఈ దృక్పథాన్ని ఉపయోగించినాడు. ఆ విధంగా అంతర్జాతీయ రాజకీయాల క్షేత్రం ద్వారా నిర్ణయకల్పనా దృక్పథం రాజనీతి శాస్త్రంలో ప్రవేశించింది. అంతర్జాతీయ రాజకీయాలలో ఒక దేశపు విదేశాంగ విధానాన్ని రూపొందించే విషయాలను, సందర్భాలను స్నైడర్ అధ్యయనం చేయటం జరిగింది. ఈ పరిశోధనా ఫలితాలను స్నైడర్ 1954లో తన సహచరులతో కలిసి 'Decision Making as an Approach to the Study of International Politics' అనే గ్రంథంగా ప్రచురించినారు. పరిశోధనా వ్యాసంగంలో స్నైడర్ సామాజిక శాస్త్రభావాలను అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి ఉపయోగించుకున్నాడు.

స్నైడర్ అభిప్రాయంలో అంతర్జాతీయ రాజకీయాలలో విదేశీ వ్యవహారాలకు సంబంధించి రాజ్యాలు నిర్ణయాలు చేస్తాయనడం సరికాదు. ప్రభుత్వ నిర్ణయమంటే వ్యక్తులు చేసిన నిర్ణయాలుగా భావించాలి. విదేశీ వ్యవహారాల విషయంలో వ్యక్తులే నిర్ణయాలు తీసికుంటూ ఉంటారు. నిర్ణయకల్పనలో వ్యక్తులే ఎక్కువ ప్రధాన పాత్రను నిర్వహిస్తూ ఉంటారు. చారిత్రక, భౌగోళిక పరిస్థితుల వంటివి నిర్ణయాలను ప్రభావితం చేస్తాయనటం సరియైన విషయం కాదు. ఆయాకారకాల ప్రభావాల స్థానాన్ని నిర్ణయకల్పన చేసే వ్యక్తులు నిర్ధారిస్తూ ఉంటారు. అందువలన నిర్ణయకల్పనలో అంతిమ నిర్ణయాన్ని వ్యక్తులే చేస్తారని భావించాలి. రాజకీయ చర్యలను వ్యక్తులు ప్రారంభిస్తారు. ఈ చర్యల గతిశీలతను పరిశీలించటానికి నిర్ణయాలు చేసిన వ్యక్తుల దృష్టితో చూడాలని స్నైడర్ అన్నాడు. వివిధ రాజకీయ పాత్రలు, సందర్భాలు, నిర్ణయకల్పనా ప్రక్రియలను అవగాహన చేసుకోవటం ద్వారానే నిర్ణయాలను విశ్లేషించి అర్థం చేసుకోవటం సాధ్యమవుతుంది.

అంతర్జాతీయ రంగంలో విదేశీ వ్యవహారాలకు సంబంధించి నిర్ణయాలు అంతరంగిక స్థితి (Internal setting), దేశం వెలుపలి స్థితి (External Setting) మరియు నిర్ణయకల్పన ప్రక్రియ (decision making process) అను మూడు విషయాలపై ఆధారపడి ఉంటాయని స్నైడర్ వివరించినాడు. నిర్ణయాలు తీసుకునే దేశంలోని పరిస్థితిని అంతరంగిక పరిస్థితి అని స్నైడర్ పేర్కొన్నాడు. ఇందులో ప్రజాభిప్రాయం, ప్రజల విలువలు, సామాజిక వ్యవస్థ ముఖ్య లక్షణాలు, సమూహ నిర్మితులు, విధులు, ముఖ్యమైన సంస్థల నమూనాలు, సామాజికీకరణ మరియు అభిప్రాయ రూపకల్పన వంటి ప్రాథమిక సామాజిక ప్రక్రియలు, సామాజిక భిన్నత్వం మొదలైనవి చేరి ఉన్నాయి. ఒక దేశం వెలుపల యున్న రాజ్యాల చర్యలు, ప్రతిచర్యలు దేశం వెలుపల స్థితిలో అంతర్భాగాలుగా పరిగణింపబడతాయి. ఇక నిర్ణయకల్పనా ప్రక్రియలో భాగంగా వ్యవస్థ సామర్థ్యం, ప్రసారం మరియు సమాచార సేకరణ, ప్రేరణ గుర్తింపబడినాయి. స్నైడర్ నమూనా విదేశాంగ విధాన రూపకల్పనకు సంబంధించి సామాజిక, రాజకీయ, మనోవైజ్ఞానిక ప్రక్రియలన్నింటితోను సంబంధాలు కలిగి ఉన్నది. విదేశాంగ విధాన రూపకల్పనను ఈ కారకాలన్నీ ప్రభావితం చేస్తాయని స్నైడర్ భావించినాడు.

రాజ్యాన్ని నిర్ణయకల్పన యూనిట్లుగా నిర్ణయకర్తల అధ్యయనానికే నిర్ణయకల్పనా దృక్పథం ఉద్దేశిస్తున్నది. నిర్ణయకల్పనా సిద్ధాంతానికి జాతీయ రాజ్యమే మంచి నమూనాగా భావించబడింది. నిర్ణయకల్పనా దృక్పథం ప్రకారం రాజ్యంలోని నిర్ణయాలన్నీ నిర్ణయకర్తలే చేస్తారని భావించబడుతున్నది.

## 12.4 హెరాల్డ్ లాస్వెల్ - నిర్ణయకల్పన సిద్ధాంతం :

ఆధునిక రాజనీతిశాస్త్ర అభివృద్ధికి దోహదం చేసిన రాజనీతి శాస్త్రజ్ఞులలో హెరాల్డ్ లాస్వెల్ ఒకరు. ఆయన నిర్ణయీకరణలో విధాయక ప్రక్రియ (Functional process) ను గుర్తించటం ద్వారా నిర్ణయ కల్పనా సిద్ధాంతానికి ఒక నిర్దిష్టమైన రూపాన్ని యిచ్చినారు. ఈతని అభిప్రాయంలో నిర్ణయీకరణ ప్రక్రియలో ఏడు విధాయక దశలు (Functional stages) ఉంటాయి. అవి :

### 12.4.1 విషయ సేకరణ (Intelligence) :

విధాన రూపకల్పనలో మొదటిదశ విషయసేకరణ. నిర్ణయకర్త ఒక సమస్యకు సంబంధించి నిర్ణయాన్ని చేయాలంటే, ఆ సమస్యకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని - భౌతిక వనరుల లభ్యత, మానవవనరుల అందుబాటు, అధికార యంత్రాంగం సన్నద్ధత మొ॥వి - వివిధ ఏజెన్సీల ద్వారా సేకరించవలె. సేకరించిన సమాచారం నమ్మకమైనదిగా, ఆధారపడేది (dependable) గా, సంపూర్ణంగా ఉండవలె. సమాచారం సమగ్రంగా యున్నపుడే దానిని ప్రాతిపదికగా చేసికొని విధాన నిర్ణేతలు సరియైన నిర్ణయాన్ని రూపొందించటానికి అవకాశం ఉంటుంది.

### 12.4.2 సిఫారసుచేయు (Recommendation) :

ఈ దశలో మొదటి దశలో సేకరించిన సమాచారం అంతా అధికార యంత్రాంగానికి అందజేయబడుతుంది. ప్రజాస్వామిక దేశాలలో వివిధ సంస్థల నుండి, ప్రజల నుండి సేకరించిన సమాచారం అధికార యంత్రాంగంలోని ఉన్నత వర్గానికి చేరుతుంది. ఈ సమాచారాన్ని పరిశీలించి, దాని ఆధారంగా ఉన్నత వర్గం సమస్యా పరిష్కారానికి వివిధ ప్రత్యామ్నాయ మార్గాల (alternatives) ను రూపొందిస్తుంది. ఆ విధంగా ఈ దశలో సమస్యా పరిష్కారానికి వివిధ ప్రత్యామ్నాయాలు విధానకర్తలకు సూచించబడతాయి.

### 12.4.3 నిర్ణయించు (Prescription) :

ఈ దశలో తనకు సూచించబడిన వివిధ ప్రత్యామ్నాయ మార్గాలలో ఒక దానిని లేక కొన్నింటిని ముఖ్య కార్యనిర్వహణాధికారి (Chief-Executive) ఎన్నుకొంటాడు. దానిని ప్రాతిపదికగా చేసికొని ఒక నిర్ణయాన్ని ప్రకటిస్తాడు. వివిధ ప్రత్యామ్నాయ మార్గాలలో ఏదో ఒక దానిని ఎన్నుకొనే విశేషాధికారం (Privilege) ఒక్క ముఖ్య కార్యనిర్వహణాధికారికి మాత్రమే ఉంటుందని చెప్పవచ్చు.

### 12.4.4 ఆవాహన చేయు (Invocation) :

విధాన నిర్ణయం జరిగిన తరువాత, ఆ విధానాన్ని అమలుచేయటంలో చోటు చేసుకున్న మొదటి దశగా దీనిని పేర్కొనవచ్చు. ఈ దశను 'నిబంధనల అమలు' (Provisional enforcement) దశగా పేర్కొనవచ్చు. ఈ దశలో విధానం అమలుకు అవసరమైన వనరుల కేటాయింపు మరియు పరిపాలనాపరమైన అధికారాల బదిలీ చోటుచేసుకుంటాయి. ఆ విధంగా విధానాన్ని అమలుచేయటానికి అవసరమైన రంగం సిద్ధం అవుతుంది.

### 12.4.5 అమలుచేయు (Application) :

ఈ దశలో విధానం అమలుకు కేటాయించబడిన వనరులను, కేటాయించబడిన పద్ధతిలో వినియోగించటం జరుగుతుంది. ఇది విధానం అమలులో వాస్తవమైన దశ. పరిపాలనలో విధానం అమలు అనేది వాస్తవ ప్రక్రియ. ఒక విధానం సమాజానికి సంబంధించిన సమస్యను పరిష్కరించటానికి సరియైనదా, కాదా లేక సమర్థమైనదా, కాదా అనేది ఆ విధానం అమలు చేయబడే తీరుపై కూడా ఆధారపడి ఉంటుంది. ఈ దశలో కొన్ని క్లిష్టమయిన సమస్యలను కూడా ఎదుర్కోవలసి ఉంటుంది.

### 12.4.6 సమీక్ష లేక మదింపు (Appraisal) :

విధానాన్ని అమలు చేసిన తరువాత ఫలితాలను మదింపు చేయటమే సమీక్ష. అమలుచేయబడిన విధానాలు ఎంతవరకు లక్ష్యాన్ని సాధించాయో, ఫలితాలకు బాధ్యులు ఎవరో, ఆశించిన ఫలితం లక్షించిన సమూహాలకు (target groups) ఎంతవరకు చేరింది మొదలైన విషయాలను ఈ దశలో మూల్యాంకనం చేయటం జరుగుతుంది. ఈ మూల్యాంకన వలన విధానాలను మరింత సమర్థవంతంగా రూపొందించటానికి, అమలు చేయటానికి నిర్ణయకర్తలకు అవకాశం కలుగుతుంది.

### 12.4.7 ఉపసంహారం (Termination) :

ఇది విధాన నిర్ణయీకరణలో చివరిదశ. సమీక్షను ప్రాతిపదికగా చేసుకొని విధానంలో అవసరమైన మార్పులు, చేర్పులు చేయటానికి ఈ దశ అవకాశం కల్పిస్తుంది. ఈ దశలో విధానకర్తలు అవసరమైతే తమకు లభించిన నూతన సమాచారాన్ని కూడా పాత నిర్ణయానికి జోడించి విధానం స్వరూప స్వభావాలను మార్చవచ్చు. విధానం మరీ లోపాలతో కూడుకొని ఉంటే ఆ విధానాన్ని ఉపసంహరించి, దాని స్థానంలో మరో క్రొత్త విధానానికి రూపకల్పన చేయవచ్చు.

ఈ విధంగా హెరాల్డ్ లాస్వెల్ నిర్ణయీకరణ ప్రక్రియలో ఏడురకాలైన విధాయక దశలుంటాయని వివరించినాడు.

## 12.5 నిర్ణయకల్పన సిద్ధాంతం - సమీక్ష :

### 12.5.1 నిర్ణయకల్పన సిద్ధాంతం - ప్రాధాన్యత :

నిర్ణయకల్పన సిద్ధాంతంలో ఉన్న ముఖ్యమైన సుగుణం విధానకర్తలు లక్ష్యాన్ని సాధించటానికి లభించగల వివిధ ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించటం. ఆ విధంగా లభ్యమైన వివిధ ప్రత్యామ్నాయాలలో ఒక దానిని నిర్ణయకర్తలు హేతువాదాన్ని ఆధారంగా తమ విధానంగా రూపొందిస్తారని ఈ సిద్ధాంతం వివరిస్తుంది. విదేశాంగ విధానాల తులనాత్మక అధ్యయనాన్ని నిర్ణయకల్పన దృక్పథం సులభం చేసింది. నిర్ణయకర్తల వ్యక్తిత్వాలను ప్రభావపరచే మనోవైజ్ఞానిక, పరిసరాల ప్రభావాలను అధ్యయనం చేయటంలో కూడా సహాయపడుతుంది. జాతీయ ప్రయోజనాలను నిర్దిష్టంగా నిర్వచించటంలో కూడా తోడ్పడుతుంది. వ్యక్తుల ప్రవర్తనను రాజ్యానికి సంబంధించిన విషయాలుగా అధ్యయనం చేయటానికి వీలు కల్పించింది. మనోవైజ్ఞానిక, సమాజ శాస్త్రాల నుండి భావనలను ఎరువు తెచ్చుకొనటంలో సహాయపడింది. ఇది అంతర్జాతీయ అధ్యయన దృక్పథంతో రాజకీయ దృగ్విషయాలను పరిశీలించటానికి దోహదం చేసింది.

ఇక హెరాల్డ్ లాస్వెల్ నిర్ణయకల్పన సిద్ధాంతానికి సంబంధించి, ఆయన తన సిద్ధాంతాన్ని ఒక హేతుబద్ధమైన సిద్ధాంతంగా రూపొందించినాడని చెప్పవచ్చు. ఈయన సిద్ధాంతంలో వనరులను హేతుబద్ధంగా వినియోగించటం, మరియు అధిక స్థాయిలో ఫలితాలను పొందటమనేది ప్రధాన పాత్ర వహిస్తాయి. అంతేగాక ఈయన సిద్ధాంతంలోని దశలన్నీ ఒకదానితో మరియొకటి సంబంధాన్ని కలిగి ఉంటాయి. లాస్వెల్ సిద్ధాంతంలో విధాన నిర్ణయం అనేది ఒక 'సమీకృత యూనిట్' గా భావించబడింది. ఈ పద్ధతి విధాన నిర్ణయీకరణలో పరిపూర్ణ సామర్థ్యాన్ని పెంచటానికి దోహదపడుతుంది. ఈ సిద్ధాంతంలోని ప్రతి దశలోను ఏర్పడిన సమస్యలను ఆ తరువాత దశలో సరిదిద్దే అవకాశం ఉంది. ఇది హెరాల్డ్ లాస్వెల్ సిద్ధాంతంలోని గొప్పతనంగా పేర్కొనవచ్చు.

### 12.5.2 నిర్ణయకల్పన సిద్ధాంతం - విమర్శ :

నిర్ణయకల్పనా దృక్పథం యాంత్రికమైనదిగాను, అమూర్త రూపంలోను యున్నదని విమర్శకుల భావన. అనుభవవాద వాస్తవాలకు నిర్ణయకల్పనా దృక్పథం చాలా దూరంగా యున్నది. వ్యక్తుల వ్యక్తిత్వ స్వభావాలను మనోవైజ్ఞానిక శాస్త్రం సహాయంతో విశ్లేషించటానికి ప్రయత్నించింది. ఆంతరంగిక పరిస్థితులకు, దేశం వెలుపల గల పరిస్థితులకు అవసరానికి మించి ప్రాధాన్యత యివ్వబడింది.

రాజనీతి శాస్త్రంలో విశ్వసనీయమైన సిద్ధాంత రూపకల్పనలో నిర్ణయకల్పనా దృక్పథం సఫలం కాలేకపోయింది. ఈ సిద్ధాంతం ప్రక్రియల విశ్లేషణకే ఎక్కువ ప్రాధాన్యతను యిచ్చింది కాని ఫలితాలను గురించి విచారించలేదు. కొందరు ఈ దృక్పథాన్ని హేతుబద్ధమైనదిగా పరిగణించగా, మరికొందరు హేతురహితమైనదిగా భావించినారు. ఇది సమంజసంగా లేదు. నిర్ణయకల్పనా ప్రక్రియకు సరియైన అధ్యయన పద్ధతులు కూడా రూపొందించబడలేదు.

ఇక ప్రత్యేకించి లాస్వెల్ నిర్ణయకల్పన సిద్ధాంతానికి సంబంధించి, ఈయన సిద్ధాంతం హేతుబద్ధమైనదిగా పరిగణించబడినప్పటికి సమాజంలోని 'శక్తి నిర్మితుల' (Power Structures) ప్రభావాన్ని అంచనా వేయటంలో ఇది విఫలమైంది. ఉద్యోగి బృందం యొక్క స్వరూప స్వభావాలను, విధాన రూపకల్పనలో దాని పాత్రను, విధానాలను అమలుచేయటంలో అది నిర్వహించే బాధ్యతను ఈ సిద్ధాంతం పరిగణనలోనికి తీసికొనలేదని విమర్శకుల భావన. అదే విధంగా నిర్ణయకల్పన ప్రక్రియలోని ప్రతీ దశలో కూడా సమాజంలోని కొన్ని ప్రభావవర్గాలు లేక ప్రయోజనవర్గాలు నిర్ణయీకరణను ప్రభావితం చేయటానికి ప్రయత్నిస్తూ ఉంటాయి. ఉదాహరణకు వ్యవసాయరంగానికి సంబంధించిన నిర్ణయాలను భూస్వాములు, రైతుసంఘాలు, వ్యవసాయ కూలీసంఘాలు ప్రభావితం చేయటానికి ప్రయత్నిస్తూ ఉంటాయి. పారిశ్రామిక వర్గాలు, వాణిజ్య వర్గాలు కూడా ఆయా వర్గాలకు సంబంధించిన విధానాలను తమకు అనుకూలంగా మార్చుకోవటానికి నిర్ణయకర్తలపై ఒత్తిడి తీసికొని వస్తాయి. కాని ఈ వర్గాల యొక్క ప్రభావాన్ని లాస్వెల్ తన సిద్ధాంతంలో గుర్తించలేకపోవటం ఒక ముఖ్యమైన లోపమని విమర్శకులు అభిప్రాయపడినారు.

## 12.6 ముగింపు :

నిర్ణయకల్పన సిద్ధాంతం కొన్ని లోపాలను కలిగియున్నప్పటికి, రాజకీయ దృగ్విషయాల అధ్యయనానికి ఇది ఒక క్రొత్త నమూనాను రాజనీతి శాస్త్రానికి కల్పించింది. విదేశాంగ విధాన అధ్యయనాల్లో ఈ దృక్పథం అపారమైన సేవలను అందించింది. విదేశాంగ విధాన రూపకల్పనలో అమూర్తమైన రాజకీయాల కన్నా, రాజ్యంలోని రాజకీయ పాత్రల ప్రాధాన్యతను ఈ సిద్ధాంతం వివరించింది.

## 12.7 సారాంశం :

ఆధునిక రాజనీతి విశ్లేషణలో నిర్ణయకల్పన సిద్ధాంతానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. సాధారణంగా నిర్ణయాల రూపకల్పన అనేది ఒక సరళమైన ప్రక్రియగా, ఒక వ్యవస్థలోని ముఖ్య కార్యనిర్వహణాధికారి నిర్వహించే విధిగా భావించటం జరుగుతుంది. కాని వాస్తవానికి ఇది ఒక జటిలమైన, సంక్లిష్టతతో కూడుకున్న ప్రక్రియ. వివిధ వ్యక్తులు, విభాగాలు ఈ ప్రక్రియలో పాలుపంచుకుంటాయి. దానిని దృష్టిలో పెట్టుకొనే నిర్ణయకల్పన సిద్ధాంతం నిర్ణయాలను రూపొందించటంలో వివిధ దశలుంటాయని, నిర్ణయకల్పన అనేది ఎంతో సంక్లిష్టమైన ప్రక్రియ అని వివరిస్తుంది. ప్రక్రియ విశ్లేషణ ప్రాతిపదిక మీద నిర్ణయకల్పన సిద్ధాంతం ఆధారపడియున్నదని చెప్పవచ్చు.

నిర్ణయకల్పన దృక్పథాన్ని రెండవ ప్రపంచ యుద్ధం తరువాత రాజనీతి శాస్త్రంలో ప్రవేశపెట్టిన ఘనత రిచర్డ్ సి. స్నైడర్‌కు దక్కుతుంది. ఆయన అంతర్జాతీయ రాజకీయాలలో విదేశాంగ విధాన రూపకల్పనకు ఈ దృక్పథాన్ని ఉపయోగించినాడు. ఆ విధంగా అంతర్జాతీయ రాజకీయాల ద్వారా నిర్ణయకల్పన దృక్పథం రాజనీతి శాస్త్రంలో ప్రవేశించింది. స్నైడర్ అభిప్రాయంలో అంతర్జాతీయ రాజకీయాలలో విదేశీ వ్యవహారాలకు సంబంధించి రాజ్యాలు నిర్ణయాలు చేస్తాయనడం సరికాదు. ప్రభుత్వ నిర్ణయమంటే వ్యక్తులు చేసిన నిర్ణయాలుగా భావించాలి. విదేశీ వ్యవహారాల విషయంలో వ్యక్తులే నిర్ణయాలు తీసికొంటూ ఉంటారు. నిర్ణయకల్పనలో వ్యక్తులే ఎక్కువ ప్రధానపాత్రను నిర్వహిస్తూ ఉంటారు. అంతర్జాతీయ రంగంలో విదేశీ వ్యవహారాలకు సంబంధించి నిర్ణయాలు ఆంతరంగిక స్థితి, దేశం వెలుపలి స్థితి, నిర్ణయకల్పన ప్రక్రియ అను మూడు విషయాలపై ఆధారపడి ఉంటాయని స్నైడర్ వివరించినాడు. నిర్ణయాలు తీసికొనే దేశంలోని పరిస్థితిని ఆంతరంగిక పరిస్థితి అని స్నైడర్ పేర్కొన్నాడు. ఒక దేశం వెలుపలయున్న రాజ్యాల చర్యలు, ప్రతిచర్యలు దేశం వెలుపలి స్థితిలో అంతర్భాగాలుగా పరిగణింపబడతాయి. ఇక నిర్ణయకల్పన ప్రక్రియలో భాగంగా వ్యవస్థ సామర్థ్యం, ప్రసారం మరియు సమాచార సేకరణ, ప్రేరణ గుర్తింపబడినాయి. స్నైడర్ నమూనా విదేశాంగ విధాన రూపకల్పనకు సంబంధించి సామాజిక, రాజకీయ, మనోవైజ్ఞానిక ప్రక్రియలన్నింటితోను సంబంధాలు కలిగి యున్నది. విదేశాంగ విధాన రూపకల్పనను కారకాలన్నీ ప్రభావితం చేస్తాయని స్నైడర్ భావించినాడు.

హెరాల్డ్ లాస్వెల్ నిర్ణయీకరణలో విధాయక ప్రక్రియను గుర్తించటం ద్వారా నిర్ణయ కల్పన సిద్ధాంతానికి ఒక నిర్దిష్టమైన రూపాన్ని యిచ్చినాడు. ఈతని అభిప్రాయంలో నిర్ణయీకరణ ప్రక్రియలో ఏడు విధాయక దశలుంటాయి. అవి 1) విషయసేకరణ 2) సిఫారసుచేయు 3) నిర్ణయించు 4) ఆవాహన చేయు 5) అమలుచేయు 6) సమీక్ష లేక మదింపు 7) ఉపసంహారం. ఈ ఏడు విధాయక దశల ద్వారా నిర్ణయాలు రూపొందించబడి అమలుచేయబడతాయని హెరాల్డ్ లాస్వెల్ వివరించినాడు.

నిర్ణయకల్పనా సిద్ధాంతంలో ఉన్న ముఖ్యమైన సుగుణం విధానకర్తలు విధాన రూపకల్పనలో వివిధ ప్రత్యామ్నాయాలను గురించి ఆలోచించటం. ఆ విధంగా లభ్యమైన వివిధ ప్రత్యామ్నాయాలలో ఒకదానిని నిర్ణయకర్తలు హేతువాదాన్ని ఆధారంగా తమ విధానంగా రూపొందిస్తారు. విదేశాంగ విధానాల తులనాత్మక అధ్యయనాన్ని నిర్ణయకల్పన దృక్పథం సులభం చేసింది. ఇక హెరాల్డ్ లాస్వెల్ నిర్ణయ కల్పన సిద్ధాంతానికి సంబంధించి, ఆయన తన సిద్ధాంతాన్ని ఒక హేతుబద్ధమైన సిద్ధాంతంగా రూపొందించినాడని చెప్పవచ్చు. ఈయన సిద్ధాంతంలోని దశలన్నీ ఒకదానితో మరియొకటి సంబంధాన్ని కలిగి యుండి, విధాన నిర్ణయం అనేది 'ఒక సమీకృత యూనిట్' గా భావించబడింది. ఈ పద్ధతి విధాన నిర్ణయీకరణలో పరిపూర్ణ సామర్థ్యాన్ని పెంచటానికి దోహదపడుతుంది.

నిర్ణయకల్పన దృక్పథం యాంత్రికమైనదిగాను, అమూర్తరూపంలోను వున్నదని విమర్శకుల భావన. ఈ సిద్ధాంతం ప్రక్రియల విశ్లేషణకే ఎక్కువ ప్రాధాన్యతను యిచ్చింది కాని ఫలితాలను గురించి వివరించలేదు. కొందరు ఈ దృక్పథాన్ని హేతుబద్ధమైనదిగా పరిగణించగా, మరికొందరు హేతురహితమైనదిగా భావించినారు. ఇది సమంజసంగా లేదు. ఇక లాస్వెల్ సిద్ధాంతానికి సంబంధించి, ఆయన నిర్ణయీకరణలో సమాజంలోని 'శక్తి నిర్మితుల' ప్రభావాన్ని, ప్రభావ వర్గాలు లేక ప్రయోజన వర్గాల పాత్రను అంచనావేయటంలో విఫలమైనాడని చెప్పవచ్చు. ఈ విధంగా నిర్ణయకల్పన సిద్ధాంతం కొన్ని లోపాలను కలిగియున్నప్పటికి, రాజకీయ దృగ్విషయాల అధ్యయనానికి ఇది ఒక క్రొత్త నమూనాను రాజనీతిశాస్త్రానికి కల్పించినదని చెప్పవచ్చు.

## 12.8 నమూనా ప్రశ్నలు :

1. ఆధునిక రాజనీతి శాస్త్రంలో నిర్ణయకల్పన సిద్ధాంతాన్ని గురించి విమర్శనాత్మకంగా వివరింపుము.
2. హెరాల్డ్ లాస్వెల్ నిర్ణయకల్పన సిద్ధాంతాన్ని సమీక్షించుము.

### లఘువ్యాసరూప ప్రశ్నలు :

1. ఆధునిక రాజనీతి శాస్త్రంలో నిర్ణయకల్పన సిద్ధాంతం అభివృద్ధిని గురించి క్లుప్తంగా వివరింపుము.
2. నిర్ణయకల్పన సిద్ధాంతానికి సంబంధించి స్నైడర్ నమూనాను వివరింపుము.
3. నిర్ణయరూపకల్పనకు సంబంధించి హెరాల్డ్ లాస్వెల్ గుర్తించిన 'విధాయకదశ' లను విశదీకరించండి.

## 12.9 చదువదగిన గ్రంథాలు :


1. James C. Charlesworth (Ed.) : Contemporary Political Analysis
2. S.P. Varma : Modern Political Theory
3. Richard C. Snyder et.al : Decision - Making as an Approach to the Study of International Politics.
4. M. Satyanarayana Rao el : al : రాజనీతిశాస్త్రం - ఆధునిక విశ్లేషణ


- డా॥ బి. దోనగిరిరావు

పాఠం - 12

# క్రీడా సిద్ధాంతము (Game Theory)

## 12.0 లక్ష్యం :

క్రీడా సిద్ధాంతం యొక్క లక్షణాలను వివరించటం ఈ పాఠం యొక్క ఉద్దేశ్యము. ఈ పాఠం చదివిన తర్వాత మీరు ఈ క్రింది విషయాలను తెలుసుకోగల్గుతారు.

- క్రీడా సిద్ధాంతము అంటే ఏమిటి
- క్రీడా సిద్ధాంత పుట్టుపూర్వోత్తరాలు
- క్రీడా సిద్ధాంత నిర్వచనం
- క్రీడా సిద్ధాంత సారాంశము.
- క్రీడా సిద్ధాంతంలో ఉపయోగించే సాంకేతిక పదాలు
- క్రీడా సిద్ధాంతంపై విమర్శ

## విషయసూచిక


12.1 పరిచయం

12.2 క్రీడా సిద్ధాంత పుట్టు పూర్వోత్తరాలు

12.3 క్రీడా సిద్ధాంతం - నిర్వచనం

12.4 క్రీడా సిద్ధాంత సారాంశం

12.5 సాంకేతిక పదాలు

12.6 క్రీడ

- 12.6.1 ఒకరికి పూర్తి లాభం ఇచ్చే ఇద్దరు వ్యక్తుల క్రీడలు
- 12.6.2 లాబాన్ని పంచుకునే ఇద్దరు వ్యక్తుల క్రీడలు
- 12.6.3 ఒకరికి లాభం ఇచ్చే ఎక్కువ మంది వ్యక్తులు పాల్గొనే క్రీడలు
- 12.6.4 లాభాన్ని పంచుకునే ఎక్కువ ంది వ్యక్తులు పాల్గొనే క్రీడలు
- 12.6.5 బేరసారాల క్రీడలు

12.7 క్రీడాకారులు

12.8 క్రీడా నియమము లేదా నియమాలు

12.9 క్రీడా ఫలితాలు

12.10 లాభం

12.11 వ్యూహం

- 12.11.1 మినిమాక్స్ స్ట్రాటజి (లేదా) తక్కువ ప్రమాదం ఎక్కువ లాభం వ్యూహం
- 12.11.2 Saddle Point

12.12 సంకీర్ణాలు
12.12.1 మినిమమ్ విన్నింగ్ సంకీర్ణాలు
12.12.2 విన్నింగ్ సంకీర్ణాలు
12.13 ఎత్తు
12.14 వ్యూహం సూత్రము
12.15 అసమతౌల్యము
12.16 క్రీడా సిద్ధాంత పరిభాషలో రాజకీయాలు
12.17 క్రీడా సిద్ధాంతంపై విమర్శ
12.17.1 వివేచనా సూత్రం లోపభూయిష్టమయినది
12.17.2 నైతిక విషయాలలో ఆసక్తి లేని సిద్ధాంతము
12.17.3 గౌరవప్రదమయిన భాషను వాడలేదు
12.18 సారాంశము
12.19 నమూనా ప్రశ్నలు

## 12.1 పరిచయం :

శాస్త్రీయ శిల్ప పద్ధతులను (Techniques) ఉపయోగించే ఆసక్తి ఉన్న రాజనీతి శాస్త్రవేత్తలను ఆకర్షించే సిద్ధాంతాలలో ఒకటి క్రీడా సిద్ధాంతము. ఆటగాళ్ళు గెలవాలన్న దీక్షతో, వివేచనాత్మకంగా (rationalist) గా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు, రాజకీయాలలో కూడా వ్యక్తులు వివేచనాత్మకంగా ప్రవర్తిస్తూ ఉంటారని, సాధ్యమయినంత వరకు గెలుపుకోసం కృషిచేస్తూ ఉంటారని, ఇతరులతో సంకీర్ణాలను ఏర్పాటు చేసుకోవటం, లాభం గరిష్ఠ స్థాయిలో ఉండే విధంగా ప్రవర్తించటం దీనిలో భాగమేనని ఈ సిద్ధాంతం వాదిస్తుంది.

## 12.2 సిద్ధాంతం పుట్టు పూర్వోత్తరాలు :

ఈ సిద్ధాంతం మొదటిసారి 1920 లలో ఎమిలి బోరెల్ అనే మాథమెటీషియన్ చేత ప్రతిపాదించబడింది. అయితే చాలా కాలంవరకు "మేధోపర నమూనాగా" తప్ప ఒక సమగ్ర సిద్ధాంతంగా దీనికి గుర్తింపు రాలేదు. ఆ తరువాత 1930లో జాన్ వాన్ న్యూమన్ అనే మరో గణిత శాస్త్రజ్ఞుడు ఈ సిద్ధాంతాన్ని ఆర్థికశాస్త్రంలో అనువర్తింపచేశాడు. మనిషి మౌలికంగా ఆర్థిక జీవి అని, అతని ప్రవర్తన ఎప్పుడూ వివేచనాత్మకంగా ఉంటుందని (అంటే తనకు ఆర్థికంగా లాభం కలిగించేదిగా ఉంటుందని) వాదిస్తూ, తన వాదనను సమర్థించుకోవటానికి ఈ సిద్ధాంతాన్ని అనువర్తింపచేశాడు. 1944లో న్యూమన్, మోర్గన్‌స్టెర్న్ అనే ఆర్థిక శాస్త్రవేత్త తో కలసి "థియరి ఆఫ్ గేమ్స్ అండ్ ఎకనామిక్ బిహేవియర్" అనే గ్రంథాన్ని వెలువరించాడు. ఈ పుస్తకానికి విశేషమయిన ఆదరణ లభించటంతో ఈ సిద్ధాంతాన్ని కూడా అనేక మంది ఆదరించటం మొదలుపెట్టారు. అయితే ఈ సిద్ధాంత పలుకుబడి 1960 వరకు కేవలం ఆర్థికశాస్త్రానికే పరిమితం అయింది. 1957లో మొట్టమొదటిసారి డంకన్ లూసి, రైఫా; షుబిక్, రాపోపోర్ట్ అనే జంట రచయితలు ఈ సిద్ధాంతాన్ని రాజకీయ శాస్త్రంలోకి ప్రవేశపెట్టారు. 1960-1966 మధ్యలో వెంట వెంటనే ఈ సిద్ధాంతంపై రాజనీతి శాస్త్రజ్ఞులు పుస్తకాలను వెలువరించేటప్పటికి, ఈ సిద్ధాంతం ఒక ప్రధానమైన సిద్ధాంతంగా స్థిరపడి పోయింది. ముఖ్యంగా సంకీర్ణాలను ఏర్పాటు చేసుకున్నపుడు (Coalitions) రాజకీయపార్టీల ప్రవర్తనను విశ్లేషించటానికి

ఈ సిద్ధాంతాన్ని వినియోగించుకోవటం మొదలుపెట్టారు. మోర్టాన్ కప్లాన్, విలియమ్ రైకర్, థామస్ షెల్లింగ్ వంటివారు అంతర్జాతీయ రాజకీయాల అధ్యయనంలో కూడా దానిని అనువర్తింపచేయటం మొదలుపెట్టారు. ఈ విధంగా ఈ సిద్ధాంతం రాజనీతి శాస్త్రంలో గౌరవ ప్రదమయిన స్థానాన్ని పొందింది.

## 12.3 క్రీడా సిద్ధాంతం నిర్వచనం (Definition of Game Theory) :

### ప్లానో, రిగ్స్ :

"వైరుధ్యం, పోటీ ఉద్భవించిన సందర్భాలలో ప్రతి క్రీడాకారుడు నష్టాలను కనిష్ట స్థాయిలో ఉంచుతూ, లాభాలను గరిష్ట స్థాయిలో ఉంచుకోవటానికి ప్రయత్నిస్తాడు. దాని కొరకు ఎటువంటి వివేచనాత్మక వ్యూహాలను అనుసరిస్తాడో తెలియచెప్పే ఆలోచనా విధానమే క్రీడా సిద్ధాంతము".

**Plano and Riggs** : "A body of thought dealing with rational decision strategies in situations of conflict and competition, when each participant or player seeks to maximise gains and minimise losses".

### షెల్లింగ్ :

"క్రీడలో పాల్గొనే క్రీడాకారులు ఇతర క్రీడాకారుల ప్రత్యామ్నాయాల గురించి వివేచనాత్మకంగా, స్థిరంగా తెలుసుకుంటానికి ఉపయోగపడే సిద్ధాంతము".

**Schelling** : "...... formal study of the rational, consistent expectations that participants can have about each others choices".

### షుబిక్ :

"వైరుధ్యం, పోటీ నెలకొని ఉన్న పరిస్థితులలో నిర్ణయాలు ఏవిధంగా తీసుకోబడతాయో వివరించె మాథమెటికల్ నమూనాయె" క్రీడా సిద్ధాంతము.

**Shubik** : "A mathematical model for the study of some aspects of concious decision-making in situations involving the possibilities of conflicts and / or co-operation".

## 12.4 సిద్ధాంత సారాంశము :

చెస్, బ్రిడ్జ్ వంటి ఆటలు ఆడే పద్ధతిని నమూనాగా తీసుకొని ఈ సిద్ధాంతం అభివృద్ధి చేయబడింది. ఇద్దరు లేక అంతకు మించిన క్రీడాకారులు పోటీ పడ్డప్పుడు ఒకరినొకరు అధిగమించటానికి ఏవిధంగా ఎత్తులు, పైఎత్తులు వేసుకుంటారో, అదే విధంగా రాజకీయాలలో కూడా వ్యక్తులు ప్రతిపక్షాన్ని అధిగమించటానికి ఎత్తులు, పై ఎత్తులు వేసుకుంటూ ఉంటారని ఈ సిద్ధాంతం వాదిస్తుంది. క్రీడాకారులందరూ, వైరి పక్షం యొక్క ఎత్తుగడలు పూర్తిగా తెలుసుకుని ఉంటారని, కాబట్టి వారి ఎత్తుగడలకు దీటైన ఎత్తుగడలను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ వెళ్తారని ఈ సిద్ధాంతం వాదిస్తుంది. అవతలి వారు ఏ వ్యూహాలను అమలు చేస్తున్నారో, పూర్తిగా తెలుసుకొని ప్రవర్తిస్తారు కాబట్టి క్రీడాకారులందరూ వివేచనాత్మకంగా వ్యవహరిస్తారని వాదిస్తుంది. అంతేకాకుండా ప్రతి క్రీడాకారుడు నష్టాలను కనిష్ట స్థాయిలో ఉంచుకుంటూ, లాభాలను గరిష్ట స్థాయిలో ఉంచుకునే విధంగా వ్యవహరిస్తాడని, లాభాపేక్షతో ఆడు ఆటలు కాబట్టి ప్రతి క్రీడాకారుడు దానికి తగిన విధంగానే తన ప్రవర్తనను మలచుకుంటాడని కూడా ఈ సిదాంతం భావిస్తుంది.

ఎన్నికలలో పోటీ చేయటం, గెలుపు ఓటములు మొదలైనవన్నీ లాభాపేక్ష కొరకే నన్నది ఈ సిద్ధాంత సారాంశం. లాభాన్ని గరిష్టపరచుకోవటానికి మంచి ఉదాహరణ సంకీర్ణాలు (coalitions). తమంతట తాము క్రీడలో లాభాన్ని పొందలేమని తెలుసుకున్న క్రీడాకారులు, మిగిలిన పోటీదారులలో కొంతమందిని కలుపుకుని సంకీర్ణంగా ఏర్పడతారు. సంఘటన ముఖ్య ఉద్దేశ్యం గెలవటం. గెలుపు ద్వారా లాభాన్ని ఆశించటం కాబట్టి, సంఘటనలో సభ్యులెంతమంది ఉండాలి? అన్న ప్రశ్నకు ఎప్పుడూ "గెలుపుకు అవసరమయినంతవరకే" అన్న సమాధానం చెప్పుకుంటారు. సంఘటనలో సభ్యుల సంఖ్య పెరిగే కొద్దీ, లాభంలో సభ్యుల వాటా తగ్గుతుంది. ఎందుకంటే క్రీడలో గెలవటం వలన వచ్చే లాభం ఎంత అనే విషయం నిర్దిష్టంగా ఉంటుంది. దానిలో మార్పులు, చేర్పులు ఏమీ ఉండవు. కాబట్టి సంఘటనలో సభ్యుల సంఖ్య ఎంత తక్కువ ఉంటే, లాభం అంత ఎక్కువ ఉంటుంది. అలా కాకుండా సంఘటనలో సభ్యుల సంఖ్య పెరిగే కొద్దీ, సభ్యుల లాభం కూడా తగ్గుతూ పోతుంది. ఈ విషయాన్ని ఈ క్రింది పటం ద్వారా తెలుసుకోవచ్చు.

సంఘటనలోని సభ్యుల సంఖ్యకు వారి లాభానికి ఉన్న సంబంధము

మొత్తం లాభం = 1,00,000 రూపాయలు అనుకోండి.

| సంఘటన సంఖ్య | లాభములో వాటా | సంఘటన సంఖ్య | లాభములో వాటా | సంఘటన సంఖ్య | లాభములో వాటా |
|---|---|---|---|---|---|
| సంఘటనలో సభ్యులు = 100 | 1,00,000 ÷ 100 = 1000 రూ.లు | సంఘటనలో సభ్యులు = 50 | 1,00,000 ÷ 50 = 2000 రూ.లు | సంఘటనలో సభ్యులు = 20 | 1,00,000 ÷ 20 = 5000 రూ.లు |

లాభాపేక్ష సంఘటనలు ఏర్పడడానికి కారణం కాబట్టి సంఘటనలో సభ్యుల సంఖ్యను రెండు అంశాలు నిర్ణయిస్తాయి. అవి 1) సంఘటన సంఖ్య గెలుపును అందించగలిగినదిగా ఉండాలి (must be winning coalition), 2) సంఘటనలో సభ్యుల సంఖ్య వీలయినంత తక్కువ ఉండాలి (**strength of the coalition must be as minimum or possible**) .

క్రీడలో భాగంగా మరో ఉపక్రీడ కూడా ఉంటుందని ఈ సిద్ధాంతం వాదిస్తుంది. దానిని ఈ సిద్ధాంత కర్తలు Game within a game అని పిలుస్తారు. ఒక క్రీడాకారుడు తనంతట తానుగా గెలువలేనని భావించినపుడు, మరొక వ్యక్తి సహాయాన్ని తీసుకుంటాడు. తనకున్న బలం అతనికి, అతనికున్న బలం తనకు ఉపయోగపడేటట్లుగా అవగాహన కుదుర్చుకుంటాడు. రెండు భిన్నమైన పదవులకు పోటీ జరుగుతున్నపుడు ఈ విధమైన "క్రీడలో ఉపక్రీడ" సాధ్యపడుతుంది. అమెరికా అధ్యక్ష పదవికి జరిగే ఎన్నికలను ఇందుకు ఉదాహరణంగా చెప్తారు. అమెరికా అధ్యక్ష పదవికి పోటీపడే వ్యక్తి, స్వంతబలం కలిగి, తనకు సహాయపడగలడని భావించిన వ్యక్తిని, ఉపాధ్యక్ష పదవికి అభ్యర్థిని ఎంపిక చేసుకుంటాడు. ఆ వ్యక్తి తనకున్న వోట్లతో, అధ్యక్ష పదవికి పోటీ చేసే వ్యక్తిని గెలిపించటానికి ప్రయత్నిస్తే; అధ్యక్ష పదవికి పోటీ చేసే వ్యక్తి తనకున్న బలంతో ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసే వ్యక్తిని గెలిపించటానికి ప్రయత్నం చేస్తాడు. ఈవిధంగా ఇద్దరు వ్యక్తులు, ఎవరి కోరిక వారు తీర్చుకుంటూనే, ఇద్దరికి లాభం కలిగే విధంగా ప్రవర్తిస్తారు.

## 12.5 క్రీడా సిద్ధాంతం - సాంకేతిక పదాలు (Technical Terminology of Game Theory) :

ఆధునిక సిద్ధాంతాలలో పూర్తిగా స్వంత భాషను, స్వంత సాంకేతిక పదాలను కల్గి ఉన్న సిద్ధాంతం క్రీడా సిద్ధాంతం. ఈ సిద్ధాంతకారులు వాడిన భాష, సాంకేతిక పదాలు ఇంతవరకు రాజనీతి శాస్త్రంలో ఎవరూ వాడలేదు. కాబట్టి ఈ సిద్ధాంతం అర్థం కావాలంటే ముందు వారు వాడిన సాంకేతిక పదాలు - వాటి అర్థం తెలియాలి. వారు వాడిన సాంకేతిక పదాలు ప్రజలందరకు సుపరిచితమయిన "క్రీడారంగం" (Field of Popular Games) నుండి ఎంపిక చేసుకోబడినాయి కాబట్టి, గందర గోళం ఎక్కువగా ఉంటుంది. ప్రజలందరకు తెలిసిన, వారొక ప్రత్యేక అర్థంలో వాడుతూ వస్తున్న పదాలను, ఈ సిద్ధాంతకారులు పూర్తిగా వేరే అర్థంలో వాడారు. దానితో వారు ఖచ్చితంగా ఏ అర్థం వచ్చేవిధంగా ఏ పదాన్ని వాడారు? అన్న విషయాన్ని తెలుసుకోలేకపోతే, ఈ సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవటం కష్టం. కాబట్టి క్రీడా సిద్ధాంతకారులు తమ సిద్ధాంతాన్ని , రాజకీయానికి అనువర్తింపచేసినప్పుడు వాడిన సాంకేతిక పదాలను, వాటి అర్థాలను క్రింద వివరించటం జరిగింది.

## 12.6 క్రీడ (Game) :

రాజకీయాలు లేదా రాజకీయ ప్రక్రియ లబ్దికి (Profit) చేపట్టే ప్రక్రియ. అది ఎన్నిక కావచ్చు, సంకీర్ణాల ఏర్పాటు కావచ్చు, బలప్రదర్శన కావచ్చు, మరేదైనా కావచ్చు. రాజకీయ ప్రక్రియతో సంబంధమున్న కార్యకలాపం దీని లక్షణాలు.

1. కొందరు లేదా చాలామంది వ్యక్తులు దీనిలో పాల్గొంటారు.
2. అందుబాటులో ఉన్న లాభాన్ని పొందటానికి మిగిలిన ప్రత్యర్థుల ఆలోచనలను తెలుసుకొని వాటికి ధీటుగా ఎత్తుగడలు వేస్తారు.
3. అవసరమైతే సంఘటనలు ఏర్పాటు చేసుకుని లాభాన్ని పొందుతారు.

ఈ క్రీడలలో వివిధ రకాలయిన క్రీడలు ఉన్నాయి. లాభం యొక్క స్వభావాన్ని పట్టి, క్రీడలో పాల్గొనే వ్యక్తుల సంఖ్యను బట్టి ఈ క్రీడలను వివిధ రకాలుగా వర్గీకరించారు. అవి.

### 12.6.1 ఒకరికి పూర్తి లాభం ఇచ్చే ఇద్దరు వ్యక్తుల క్రీడలు (Zero-sum two person Games) :

ఈ క్రీడలో ఇద్దరు రాజకీయ నాయకులు, లేదా రెండు రాజకీయ సమూహాలు లేదా రెండు రాజకీయ పార్టీలు పాల్గొంటాయి. ఒకరు పూర్తిగా పరాజయాన్ని పొందితే, మరొకరు పూర్తి విజయాన్ని సాధిస్తారు. అంటే ఒకరి లాభం రెండవ వారి నష్టానికి సమానంగా ఉంటుంది. (The gains of one are equal to the loss of the other).

### 12.6.2 లాభాన్ని పంచుకునే ఇద్దరు వ్యక్తుల క్రీడలు (Non-Zero sum two person games) :

ఈ క్రీడలో ఇద్దరు రాజకీయ నాయకులు, లేదా రెండు రాజకీయ సమూహాలు లేదా రెండు రాజకీయ పార్టీలు పాల్గొంటాయి. ఈ క్రీడలో ఎవరూ పూర్తిగా పరాజయాన్ని మరొకరు పూర్తి విజయాన్ని పొందరు. లాభాన్ని ఏదో ఒక నిష్పత్తిలో ఇద్దరూ పంచుకుంటారు. లాభంలో ఎవరి వాటా ఎంత అనేది ఆయా పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది.

### 12.6.3 ఒకరికి పూర్తి లాభం ఇచ్చే ఎక్కువ మంది వ్యక్తులు పాల్గొనే క్రీడలు (Zero-sum n-person games):

ఈ క్రీడలో ఇద్దరకు మించి, ఎంతమందైనా క్రీడాకారులుంటారు. రాజనీతిశాస్త్ర పరిభాషలో చెప్పాలంటే ఇద్దరికి మించిన రాజకీయ నాయకులు లేదా రెండుకు మించిన రాజకీయ సమూహాలు లేదా రెండుకు మించిన రాజకీయ పార్టీలు పోటీపడతాయి. ఈ పోటీలో ఒక పక్షం పూర్తి విజయాన్ని చేజిక్కించుకుంటుంది. ఫలితంగా లాభం అంతా దాని వద్దకే చేరుతుంది. మిగిలిన పక్షాలు పూర్తిగా ఓడిపోయి, పూర్తి నష్టాన్ని చవిచూస్తాయి.

### 12.6.4 లాభాన్ని పంచుకునే, ఎక్కువ మంది వ్యక్తులు పాల్గొనే క్రీడలు (Non-zero sum n-person games):

ఈ క్రీడలో ఇద్దరకు మించి, ఎంతమందైనా క్రీడాకారులుంటారు. రాజనీతిశాస్త్ర పరిభాషలో ఇద్దరికి మించిన రాజకీయ నాయకులు, లేదా రెండుకు మించిన రాజకీయ సమూహాలు లేదా రెండుకు మించిన రాజకీయ పార్టీలు పోటీపడతాయి. రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకోవటానికి ప్రయత్నిస్తాయి. ఈ పోటీలో పూర్తి విజయం ఏ ఒక్కరూ పొందలేరు. పోటీలోకి దిగిన ప్రతి ఒక్కరూ విజయంలో ఎంతో కొంత మేరకు పాలుపంచుకుంటారు. ఫలితంగా లాభాన్ని ఏదో ఒక నిష్పత్తిలో అందరూ పంచుకుంటారు. ఎవరి లాభం శాతం ఎంత అనే విషయం ఆయా పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

### 12.6.5 బేరసారాల క్రీడలు (Bargaining games or mixed motive games) :

క్రీడలు ద్వేషం, పోటీ వాతావరణంలో జరుగుతాయన్న సూత్రీకరణను షెల్లింగ్ అనే క్రీడా సిద్ధాంతవేత్త ఆమోదించడు. అతని అభిప్రాయంలో క్రీడలు (ముఖ్యంగా అంతర్జాతీయ రాజకీయాలలో) ఘర్షణ, ద్వేషం, పోటీ కొంత; పరస్పర ఆధారం, సహకార ఆవశ్యకత మరి కొంత ఒకే కాలంలో కలసి ఉంటాయని షెల్లింగ్ వాదన. కాబట్టి ప్రతి క్రీడలోనూ ద్వేషం, అవసరం కలిసే ఉంటాయి. కాబట్టి క్రీడలకు కలగలపిన లక్ష్యం ఉంటుంది (Mixed motive) అని వాదిస్తాడు.

## 12.7 క్రీడాకారులు (Players) :

వారినే నిర్ణయీకరణ చేసేవారు (decision makers) అని కూడా పిలుస్తారు. వీరు వ్యక్తులైనా కావచ్చు, సమూహాలైనా కావచ్చు, రాజకీయ పార్టీలైనా కావచ్చు, లేదా సంస్థలైనా కావచ్చు. వారి లక్షణాలు ఈ కింది విధంగా ఉంటాయి.

1. ఖచ్చితంగా నిర్ధారించుకున్న లక్ష్యమున్న వివేచనాత్మక వ్యక్తి లేదా సంస్థ.
2. అతని లేదా దాని వద్ద కొన్ని వనరులు అందుబాటులో ఉంటాయి (అవి ధనం కావచ్చు, ప్రజాభిమానం కావచ్చు, తెలివితేటలు కావచ్చు).
3. ఈ వనరులను ఎలా, ఏ పద్ధతిలో, ఏ నిబంధనలకు లోబడి వినియోగించాలి అన్న విషయాన్ని "క్రీడా నియమాలు" (Rules of the games) నిర్ణయిస్తాయి. ఆ నియమాలకు లోబడే క్రీడ సాగుతూ ఉంటుంది. రాజకీయ పరిభాషలో చెప్పాలంటే, రాజకీయ పార్టీలు ఏవిధంగా ప్రవర్తించాలి ? ఏ పనులు చేయకూడదు ? ప్రత్యర్థుల విషయంలో ఎలా నడచుకోవాలి ? ఎటువంటివారిని ఎన్నికలలో నిలపాలి ? ఎంత డబ్బు ఖర్చు పెట్టాలి ? మొదలయినవి.

## 12.8 క్రీడా నియమము లేదా నియమాలు (Rule or Rules of the Game) :

నియమము అంటే "రాజకీయ నాయకులకు అందుబాటులో ఉన్న వనరులను, వ్యూహాత్మక అవకాశాలను ఏవిధంగా వినియోగించాలి" అన్న విషయాన్ని నిర్ధారించే అంశం. రాజకీయ (క్రీడలో) ప్రక్రియలో పాల్గొనే వారి వద్ద ఏ ఏ వనరులు ఉన్నవి అన్న విషయం మీద ఆధారపడి ఈ నియమాల స్వరూపం ఉంటుంది. ఈ నియమాలన్నీ కూడా రాజకీయాలను శాసించే శక్తి ఉన్న వారి చేత సవివరంగా గ్రంథస్తం (Record) చేయబడతాయి. (ఉదా॥ రాజ్యాంగం, ఎలక్షన్ చట్టాలు, ఎలక్షన్ కమీషన్ మొ"వి). ఉల్లంఘన జరుగకూడదన్న కఠిన నియమమేమీ లేనప్పటికి, సాధారణ పరిస్థితులలో ఈ నియమాలు ఉల్లంఘించబడవు.

## 12.9 క్రీడా ఫలితాలు (Outcomes of the Game) :

రాజకీయ ప్రక్రియలో పాల్గొనటం వలన ఒనగూడబోయె లాభాన్ని ఫలితం అని అంటారు. ఈ క్రీడలో పాల్గొనే వారందరికి ఈ ఫలితం గురించి అవగాహన ఉంటుంది. కాబట్టి ఆ ఫలితాన్ని దక్కించుకోవటానికి వారు పరస్పరం తలపడతారు. సాధారణ క్రీడలలో ఫలితం గురించి అవగాహన ఉంటుంది. సాధారణ క్రీడలలో ఫలితం కేవలం మూడేవిధాలుగా ఉంటుంది.

అవి 1) గెలుపు, 2) ఓటమి, 3) డ్రా. కాని రాజకీయ క్రీడలో మాత్రం ఫలితాలు మరెన్నో విధాలుగా ఉంటాయి. గెలుపును పంచుకోవటం, గెలవటానికి సహాయపడి లాభాన్ని పంచుకోవటం, సంకీర్ణాల ద్వారా లాభాలలో వాటాలు పొందటం, లాభాలలో కోత విధించుకొని గెలుపును సాధించటం, అధికారాన్ని నిలుపుకోవటం వంటివి దీనికి ఉదాహరణలు. లాభాలన్నింటిని కలిపి Prospects అనే పేరుతో కూడా పిలుస్తారు.

### 12.10 లాభం (Reward or pay-off) :

రాజకీయ పోటీలో పాల్గొనటం ద్వారా పొందే లాభాన్ని పే-ఆఫ్ లేదా రివార్డ్ అని పిలుస్తారు. గెలవటం మొదటి శ్రేణి లాభం. డ్రా చేసుకోవటం రెండవశ్రేణి లాభం. ఏదో ఒక విధంగా లాభంలో కొంత భాగస్వామ్యాన్ని పొందటం చివరి శ్రేణి లాభం.

### 12.11 వ్యూహం (Strategy) :

మొత్తం క్రీడా సిద్ధాంతంలో అత్యంత కీలకమయిన భావన ఇది. రాల్ఫ్ గోల్డ్‌మన్ మాటలలో చెప్పాలంటే, "ప్రతికూల లేదా ఘర్షణ ఉన్న పరిస్థితులలో తను కోరుకున్న ఫలితాన్ని లేదా అనేక ఫలితాలను పొందటం కోసం ఒక క్రీడాకారుడు అనుసరించే కార్యకలాపాల ప్రోగ్రామ్" వ్యూహం ("An overall programme of actions which a player adopts in order to achieve a desired outcome or series of outcomes under adverse or conflict conditions - Ralph Goldman). ఈ వ్యూహంలో తరువాత ఏం చేయాలి అన్న ప్రశ్నకు క్రీడాకారుడి వద్ద సమాధానాలు సిద్ధంగా ఉంటాయి. వ్యూహంలో ఈ క్రింది అంశాలు ఇమిడి ఉంటాయి.

1. క్రీడాకారులలో వివేచన (Rationality) ఉంటుంది.
2. తాను ఏమి కోరుకుంటున్నాడో అతనికి క్షుణ్ణంగా తెలుసు.
3. లాభాన్ని సంపాదించిపెట్టగల వ్యూహాలు ఏమిటో కూడా అతనికి క్షుణ్ణంగా తెలుసు.
4. తన లాభాన్ని గరిష్ట స్థాయిలో పొందటానికి అవసరమయిన ఎత్తులతో అతను సిద్ధంగా ఉంటాడు.
5. పోటీ, ఘర్షణ పరిస్థితులలో, అవతలి క్రీడాకారులు ఎటువంటి వ్యూహాలు పన్నుతారు అన్న విషయం కూడా అతనికి తెలుసు.

క్రీడా సిద్ధాంతం ప్రకారం వ్యూహాలు రెండు రకాలు 1) మిని - మాక్స్ వ్యూహం 2) సాడిల్ పాయింట్.

#### 12.11.1 మినిమాక్స్ స్ట్రాటజి (లేదా) తక్కువ ప్రమాదం ఎక్కువ లాభం వ్యూహం :

దీని ప్రకారం క్రీడాకారుడు లేదా రాజకీయాలలో పాల్గొనే వ్యక్తి లేదా సమూహం, లేదా పార్టి అతి తక్కువ ప్రమాదాన్ని (Minimum risk) కోరుకుంటాడు. అదే సమయంలో గరిష్ట లాభాన్ని ఆశిస్తాడు (Maximum profit). దానికి తగినట్లుగానే తన వ్యూహాన్ని నిర్ధారించుకుంటాడు.

#### 12.11.2 Saddle Point :

ఏవిధమయిన ప్రమాదానికి (risk) అవకాశం ఇవ్వని వ్యూహం ఇది. దీనినే మరోమాటలో "PLay safe" అని అంటారు. అంటే "ముందు ఓడిపోకుండా జాగ్రత్తపడు" అని అర్థం. ఈ వ్యూహంలో క్రీడాకారుడు లేదా రాజకీయ పార్టీ, లేదా సమూహం ఎటువంటి ప్రమాదానికి (risk) సిద్ధపడదు. ప్రమాదభరితమైన విజయం కన్నా, ఏ ప్రమాదానికి ఆస్కారం లేని సమస్థితికి అది ప్రాధాన్యత ఇస్తుంది. తత్ ఫలితంగా ఈ వ్యూహాన్ని అమలు చేసేవారికి గరిష్ట లాభం కూడా లభించదు. ఈ విధమైన వ్యూహంతో పోటీలో పాల్గొన్న వారందరికి సమానమైన లాభం లభిస్తుంది.

### 12.12 సంకీర్ణాలు (Coalitions) :

వీటినే ప్రోటో- సంకీర్ణాలు (Proto-coalitions) అని గాంగింగ్ అప్ (ganging up) అని కూడా అంటారు. ఘర్షణ లేదా పోటీ స్థితిలో పోటీకి సిద్ధపడినవారు, తమ గెలుపును నిర్ధారించుకోవటం కోసం, అదే పోటీలో ఉన్న మరి కొంతమందితో కలిసి సంకీర్ణంగా ఏర్పడతారు. ఈ విధంగా చేయుటం వలన ఒక బలమైన వర్గం ఏర్పడి, దానికి గెలుపు సునాయాసంగా దక్కుతుంది. అయితే దీనిలో కొంత నష్టం కూడా ఉంటుంది. సంకీర్ణంలో భాగస్వాములందరికి లాభం పంచకతప్పదు కాబట్టి, అందరికి కొంత లాభం తగ్గుతుంది. అదే ఒకే వ్యక్తి విజయాన్ని సాధించగలిగితే, Zero-sum n-person game తరహాలో, లాభం అంతా అతనికే దక్కుతుంది. అయితే, ఒక్కడిగా గెలుపు ఖచ్చితంగా లభిస్తుందో, లేదో తెలియని పరిస్థితులలో రాజకీయాలలో పాల్గొనేవారు సంకీర్ణాల పట్ల మొగ్గుచూపుతారు. ఈ సంకీర్ణాలు రెండు రకాలు. అవి ప్రోటో సంకీర్ణాలు, విన్నింగ్ సంకీర్ణాలు.

#### 12.12.1 మినిమమ్ విన్నింగ్ సంకీర్ణాలు :

గెలుపును నిర్ధారించుకొనటం కొరకు సంకీర్ణాలు ఏర్పడతాయని మనం పైన తెలుసుకున్నాం. సంకీర్ణాలను తప్పనిసరిగా గెలిచే సంకీర్ణాలుగా మార్చుకునేదెలా ? దానికి సమాధానము ఈ సంకీర్ణ పద్ధతి. పోటీలో పాల్గొనే సమూహాల లేదా వ్యక్తుల లేదా పార్టీల బలాబలాలు, వ్యూహాలు తెలుసు కాబట్టి, గెలుపును తప్పనిసరిగా పొందగోరినవారు, గెలవటానికి అవసరమైన వారితో సంకీర్ణాన్ని ఏర్పాటుచేసుకుంటారు. అయితే సంకీర్ణం యొక్క సైజ్ పెరిగే కొద్ది సంకీర్ణంలోని సభ్యుల లాభం కూడా తగ్గుతుంది. కాబట్టి సాధ్యమయినంత తక్కువ మందితో సంకీర్ణాన్ని ఏర్పాటు చేయటం ఒక పద్ధతి. "గెలుపుకు ఖచ్చితంగా ఎంతమంది అవసరమో, అంతవరకూ మాత్రమే సంకీర్ణము" అనేది దీని వెనుక ఉన్న సూత్రం. దీనిలో ఒక లాభం, ఒక నష్టం ఉన్నాయి. లాభం ఏమిటంటే, సంకీర్ణంలోని సభ్యుల సంఖ్య చాలా తక్కువ ఉంటుంది కాబట్టి, గెలుపు ఫలితంగా వచ్చే లాభం అందరికి చాలా ఎక్కువ లభిస్తుంది. దీనిలో నష్టం ఏమిటంటే, సంకీర్ణంలో ఏ కొద్ది మంది, ఆ సంకీర్ణాన్ని విడచి బయటకు వెళ్ళినా, అది అధికారాన్ని కోల్పోతుంది. కాబట్టి ఇది సభ్యులకు చాలా ఎక్కువ లాభాన్ని ఇచ్చే అస్థిర సంకీర్ణం.

#### 12.12.2 విన్నింగ్ సంకీర్ణాలు :

ఈ సంకీర్ణాలలో సభ్యుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. గెలుపుకు ఖచ్చితంగా అవసరమయిన సభ్యుల కంటె కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. అందుకే దీనిని విన్నింగ్ సంకీర్ణం (తప్పనిసరిగా విజయం సాధించే సంకీర్ణం) అని అంటారు. పై సంకీర్ణ పద్ధతిలో లాగానే దీనిలో కూడా ఒక లాభం, ఒక నష్టం ఉన్నాయి. లాభమేమిటంటే, దీనిలో కూడా అస్థిరత్వ అంశం అసలుండదు. కొద్ది మంది సభ్యులు సంకీర్ణాన్ని విడచివెళ్ళినా దీనికి ఏమీ నష్టం జరుగదు. నష్టం ఏమిటంటే, సంకీర్ణంలో భాగస్వాములు చాలా ఎక్కువ మంది ఉండటం వలన, లాభం అందరికి పంచవలసి రావటం వలన, సంకీర్ణంలోని సభ్యులకు లాభం శాతం బాగా తగ్గిపోతుంది.

### 12.13 ఎత్తు (Move) :

క్రీడాకారుడి చర్య లేదా రాజకీయ నాయకుడు వేసే ఎత్తుగడను Move అని అంటారు. ఇటువంటి ఎత్తుల మధ్య పరస్పరం సంబంధం ఉన్నట్లయితే, అవి వ్యూహంలో భాగమౌతాయి. సాధారణంగా ముందుగా వ్యూహాన్ని నిర్ధారించుకొని, దానికనుగుణంగా ఎత్తుగడలు వేస్తూ ఉంటారు. వ్యూహం ఎంత గొప్పదయినా, అది విజయాన్ని సాధించిపెట్టాలంటే, దానికనుకూలమయిన ఎత్తులను అనుసరించక తప్పదు.

## 12.14 వ్యూహం సూత్రము (Strategic Principle) :

అంతర్జాతీయ రాజకీయాలకు క్రీడాసిద్ధాంతాన్ని అనువర్తింపచేసిన రైకర్ ఈ సూత్రాన్ని ప్రవేశపెట్టాడు. రైకర్ అభిప్రాయంలో ప్రోటో-సంకీర్ణాన్ని, విజయవంతమైన సంకీర్ణంగా (winning coalition) మార్చాలంటే ఈ సూత్రం ఉపయోగపడుతుంది. ఈ సూత్రం ప్రకారం ఏ సంకీర్ణం అయితే తన సభ్యులకు ఎక్కువ లాభాన్ని పంచగల స్థితిలో ఉంటుందో, ఆ సంకీర్ణం విజయవంతమైన సంకీర్ణంగా మారగలుగుతుంది.

## 12.15 అసమతౌల్యము (Disequilibrium) :

వ్యవస్థా సిద్ధాంతంలో కూడా ఈ భావన ఉంది. అయితే ఆ సిద్ధాంతంలో చెప్పుకున్న అర్థానికి, ఈ సిద్ధాంతం పేరు మీద దీనికి చెప్పుకోబోయే అర్థానికి ఎక్కడా పొంతన ఉండదు. ఈ సిద్ధాంతకర్తలలో ఒకడయిన రైకర్ అభిప్రాయంలో సమతౌల్యము అంటే సంకీర్ణము స్థిరంగా అధికారంలో ఉండగలగటం. ఇది సాధ్యం కాదు అనేది రైకర్ వాదన. రాజకీయాలు వివేచనాత్మకమయినవి అంగీకరించినప్పటికి కూడా ఒక సంకీర్ణం స్థిరంగా అధికారంలో ఉండటం సాధ్యం కాదు అని రైకర్ వాదిస్తాడు. ప్రతి సంకీర్ణము తాత్కాలికమనని, అసమతౌల్యస్థితి ఎప్పుడూ ఉంటుందని అతను భావించాడు. దానికి కారణాన్ని ఈ క్రింది మాటల్లో వ్యక్తపరచాడు. "నాయకులు, వ్యక్తులు, రాజ్యాలు ఏవి పతనమైనా దానికి ఒకే కారణం కనిపిస్తూ ఉంటుంది. అది నాయకుల తప్పుడు అవగాహన, దుబారా, అంతేలేని అధికార దాహం. వీటన్నిటివలన వారు అధికారాన్ని కోల్పోతూ ఉంటారు. ఎప్పుడైతే అధికారంలో ఉన్న వాళ్ళు కూలిపోతూ ఉంటారో, అప్పుడు సహజంగానే నిర్ణయీకరణ అనేది అసమతౌల్య స్థితిలో ఉంటుంది".

## 12.16 క్రీడా సిద్ధాంత పరిభాషలో రాజకీయాలు (Politics in the Terminology of Game Theory) :

రాజకీయాలు కూడా ఆటే. రాజకీయాలలో పాల్గొనే వారందరూ క్రీడాకారులే. క్రీడలలో క్రీడాకారులెందుకు పాల్గొంటారో, అదే కారణం వలన వ్యక్తులు రాజకీయాలలో పాల్గొంటారు. అదే లాభాపేక్ష. లాభాన్ని సంపాదించటం కొరకు వారు వివేచనాత్మకంగా వ్యవహరిస్తారు. అంటే అవతలి వారి ఎత్తులను, వ్యూహాలను పూర్తిగా తెలుసుకొని ప్రతి వ్యూహం పన్నుతూ ఉంటారు. అధికారాన్ని సంపాదించటం కోసం దాని ద్వారా లాభాన్ని సంపాదించటం కోసం వారు సంకీర్ణాలన ఏర్పాటు చేసుకుంటారు. అధికారం చేపట్టిన తర్వాత లభించే లాభాన్ని మొత్తాన్ని సంకీర్ణంలోని సభ్యులు పంచుకుంటారు. ఎక్కువ లాభాన్ని పొందటం కోసం, అధికారం పొందటానికి ఖచ్చితంగా ఎంత మంది సభ్యులు అవసరమో, అంతమంది సభ్యులతోనే సంకీర్ణం ఏర్పాటు చేసుకుంటారు. చాలా క్లుప్తంగా చెప్పాలంటే, క్రీడలలో, క్రీడాకారుల ప్రవర్తనకు, రాజకీయాలలో పాల్గొనే వారి ప్రవర్తనకు ఏమీ తేడా ఉండదు.

## 12.17 క్రీడా సిద్ధాంతంపై విమర్శ :

అతి తీవ్రమైన విమర్శలకు గురయిన సిద్ధాంతాలలో ఇదీ ఒకటి. దీనిలోని సుగుణాల కన్నా లోపాలె ఎక్కువన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తపరచబడింది. 1960లలో పలువురి దృష్టిని ఆకర్షించిన ఈ సిద్ధాంతం 1980 వ దశకానికి పూర్తిగా తన పలుకుబడిని కోల్పోయింది. జాతీయ రాజకీయ విశ్లేషణలో ఇది ప్రధాన సిద్ధాంతంగా నిరూపించుకోలేకపోయింది. జాతీయ రాజకీయాలను విశ్లేషించే విషయంలో కనీసం దీన్ని నమూనాగా తీసుకొని విశ్లేషణకు పూనుకోవటానికి ఎవరూ ఆసక్తి చూపించటం లేదు. అంతర్జాతీయ రాజకీయాలను విశ్లేషించటానికి ఇదొక నమూనాగా కొంతకాలం ఉపయోగపడినప్పటికి, ఆ రంగంలో కూడా ఇది క్రమంగా అంతరించిపోయింది. దానికి ప్రధాన కారణం ఇది ప్రతిపాదించిన భావనలను అనేకులు తీవ్రంగా విమర్శించి తిరస్కరించటమే. దీనిపై చెలరేగిన విమర్శలలో ముఖ్యమయిన వాటిని క్రింద ప్రస్తావించటం జరిగింది.

### 12.17.1 వివేచనా సూత్రం లోపభూయిష్టమయినది (The Principle of Rationality is not acceptable) :

క్రీడా సిద్ధాంత భావనలలో అతి ప్రధానమయినది వివేచనా సూత్రం. దీని ప్రకారం నిర్ణయీకరణకు బాధ్యులయిన వ్యక్తులు పూర్తిగా వివేచనాపరులు, నైతిక అంశాలను పరిగణనలోకి తీసుకోరు. ప్రతి రాజకీయ క్రీడాకారుడు అవతలి పక్షం

ఎత్తుగడలను పూర్తిగా తెలుసుకుని ప్రస్తావిస్తాడు. ఇది అసాధ్యమని అందరూ విమర్శించారు. ఎన్నికలలోనో, సెనెట్‌లో జరుగబోయే ఓటింగ్‌నో ఉదాహరణగా తీసుకుంటే, ఎవరి వ్యూహం ఏమిటి? ఎవరు ఏవిధంగా ప్రవర్తించబోతున్నారు ? వంటి విషయాలను ముందుగానే పూర్తిగా అవగాహన చేసుకోవటం సాధ్యం కాదు. చెస్, బ్రిడ్జ్, ఫుట్‌బాల్ వంటి ఆటలలో ఇది సాధ్యం కావచ్చు కాని, రాజకీయాలలో ఇది సాధ్యం కాదు. చాలా తెలివి, అనుభవం కల రాజకీయ క్రీడాకారుడు కూడా వైరిపక్షం ఎత్తుగడలను గురించి ఊహించగలడేమో కాని తెలుసుకోవటం మాత్రం సాధ్యం కాదు.

ఎన్నికలనే ఉదాహరణగా తీసుకుంటే కొన్ని వందల చిన్న, పెద్ద సమూహాలు, వివిధ రకాల ఆసక్తిగలవి, ఎన్నికలలో తమ ప్రభావాన్ని చూపిస్తూ ఉంటాయి. వీటి కోర్కెలు, ఇష్టా యిష్టాలు, ప్రవర్తనా తీరు కూడా చాలా విభిన్నంగా ఉంటుంది. ఇన్ని సమూహాల ప్రవర్తనను, ఎత్తుగడలను ముందుగా తెలుసుకోవటం అసాధ్యం. కాబట్టి, రాజకీయ క్రీడలో "వివేచన" అసాధ్యమైన విషయం. "వివేచన" ను ప్రధాన ప్రాతిపదికగా తీసుకుని అభివృద్ధిపరచిన ఈ క్రీడా సిద్ధాంతం లోప భూయిష్టమైనది.

### 12.17.2 నైతిక విషయాలలో ఆసక్తి లేని సిద్ధాంతము (Not interested in Elites) :

ఈ సిద్ధాంతం రాజకీయాలలో ఎంతో ఆవస్యకమైన నైతికతకు ఏమీ ప్రాధాన్యత ఇవ్వలేదు. రాజకీయ క్రీడలో పాల్గొనేవారు ఏం చేస్తున్నారు అన్న విషయం వారికి సమాజం మీద ఉన్న అభిప్రాయాల మీద కాని, మంచి, చెడు విచక్షణ మీద కాని ఆధారపడి ఉండదు. ఆ సమయానికి అవతలివారు (వైరిపక్షం) ఏం చేస్తున్నారు అన్న విషయం మీదనే ఆధారపడి ఉంటుంది. ఈ సిద్ధాంతం ప్రకారం, రాజకీయ ప్రవర్తనకు ఆధారం లాభాపేక్ష. ఎక్కువ లాభం లభించటానికి ఏమార్గం అనుకూలంగా ఉంటే ఆ మార్గాన్ని అవలంబించటం. ఇది ఈ సిద్ధాంతంలోని ప్రధాన లోపం.

### 12.17.3 గౌరవప్రదమయిన భాషను వాడలేదు :

ఈ సిద్ధాంత కర్తలు వాడిన పదజాలం గౌరవప్రదమయినది కాదు. రాజకీయాలకు అనువయింది కాదు. రాజనీతిని షుమారు 3000 సం॥ల చరిత్ర ఉంది. ఈ మూడు వేల సంవత్సరాలలోనూ ప్రతి రాజనీతి శాస్త్రవేత్త రాజనీతి ప్రక్రియను సామాజిక ప్రక్రియగా భావించాడు. సమాజాన్ని ఒక ఉన్నత స్థానానికి తీసుకు వెళ్ళటానికి, ప్రజలకు మంచి భవిష్యత్‌ను ఇవ్వటానికి అదొక మార్గంగా భావించారు. ఆదర్శ సమాజాలు, ఆదర్శ వ్యవస్థలు, ప్రజల సంక్షేమం వంటి భావాలకు రాజనీతిశాస్త్రం ప్రధమ స్థానాన్ని ఇచ్చింది. అయితే మొట్టమొదటి సారి ఈ సిద్ధాంతం వ్యక్తి లాభాపేక్షే రాజకీయ ప్రక్రియగా భావించింది. ఇది వాడిన పదజాలం - క్రీడాకారుల, క్రీడ, లాభం, చెల్లింపులు (Pay-offs), అధికారం కోసం ఎత్తుగడలు, లాభం ఉన్న, లాభం లేని క్రీడలు - రాజనీతిశాస్త్రంలో భాగంగా ఉన్న గంభీరతను దెబ్బకొట్టాయి. దానితో దీనికి ఆదరణ పూర్తిగా తగ్గిపోయింది. అమెరికాలోనిచాలాకొద్దిమంది రాజనీతి శాస్త్రజ్ఞులు తప్పితే ఈ భాషను ప్రపంచంలో ప్రస్తుతం ఎవ్వరూ వాడటం లేదు.

### 12.17.4 భావజాలాన్ని, నిష్టను విస్మరించిన సిద్ధాంతం (This Theory ignored the role of ideology and commitment):

రాజకీయాలు భావజాలానికి, నిష్టకు సంబంధించిన విషయాలు. రాజకీయాలలో ప్రవేశించే ప్రతి వ్యక్తి, ప్రతి సమూహము, ప్రతి పార్టీ ఏదో ఒక భావజాలానికి నిబద్ధతను ప్రకటించి, ఆ భావజాలానికి ప్రతిరూపమైన సమాజాన్ని నిర్మించటానికి ప్రయత్నిస్తుంది. తాత్కాలిక ప్రయోజనాల కొర్కు, లేదా తాత్కాలిక వ్యక్తిగత ప్రయోజనాల కొరకు అవి స్వార్థంతో వ్యవహరించవచ్చు. కాని తాత్కాలిక ప్రవర్తన ఆధారంగా, అంతర్లీనంగా ఉన్న శాశ్వత భావజాల ప్రభావాన్ని విస్మరించటం వలన ప్రయోజనం ఉండదు. ఈ సిద్ధాంతం తాత్కాలిక లేదా దైనందిక రాజకీయ ప్రవర్తనను విశ్లేషించే క్రమంలో, అత్యంత ప్రాధాన్యత కలిగిన భావజాల ప్రభావాన్ని విస్మరించింది. L.T.T.E., P.L.O. వంటి విమోచన ఉద్యమాలను నడిపె రాజకీయ సంస్థలలో పనిచేసే వారి ప్రవర్తన భావజాలం చేత, నిష్ట చేత ప్రేరేపితమై ఉంటుంది కాని లాభ, నష్టాలతో ప్రేరేపితం కాదు.

ప్రపంచ వ్యాప్తంగా విమోచ‌న ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థలు, పార్టీలు, వాటితో పనిచేసే వ్యక్తులు లక్ష్యాన్ని తమ జీవిత కాలంలో సాధించలేమని తెలిసి కూడా ప్రయత్నాన్ని విరమించరు. తమ ప్రాణాలను కూడా పణంగా పెట్టి పనిచేస్తూ ఉంటారు. అమెరికా వంటి అగ్రరాజ్యం కూడా తను ఏ సామాజిక, ఆర్థిక భావజాలానికి కట్టుబడి ఉందో ఆ భావజాలాన్ని బ్రతికించుకోవటం కోసమే రాజకీయాలను నడుపుతూ ఉంటుంది. పైన వివరించిన అంశాలలో ఏ ఒక్కదానిని [illegible] (commercialised) రాజకీయాలను, కేవలం గెలుపే లక్ష్యంగా సాగే బేరసారాలను కొంతసేపటకు ఈ సిద్ధాంతం విశ్లేషించగలదేమో కాని, భావజాలం ప్రాతిపదికగా సాగే ఏ రాజకీయ ప్రక్రియను ఈ సిద్ధాంతం వివరించలేదు.

## 12.18 సారాంశము :

పరిశోధనలో శాస్త్రీయ శిల్ప పద్ధతులను వినియోగించే వారిని ఆకర్షించే సిద్ధాంతాలలో క్రీడా సిద్ధాంతము ఒకటి. 1920 లో ఎమిలి బోరెల్ చేత ప్రతిపాదించబడి, 1957లో ఇది రాజనీతి శాస్త్రంలోకి ప్రవేశపెట్టబడింది. 1960లో విశేష ఆదర పొందింది. చెస్, బ్రిడ్జ్ వంటి ఆటల వలెనే రాజకీయ ప్రక్రియ కూడా ఒక ఆట అని, పాల్గొనే క్రీడాకారులెందరూ, వారిలో ఎంత మందికి లాభం వస్తుంది అన్న విషయం మీద ఆధారపడి రకరకాల రాజకీయ క్రీడలుంటాయని ఈ సిద్ధాంతం భావిస్తుంది. ప్రతి క్రీడాకారుడి లాగానే, రాజకీయ క్రీడాకారుడు కూడా వివేచన కలవాడని, అతనికి ప్రతిపక్షపు ఎత్తులు పూర్తిగా తెలిసి ఉంటాయని, వాటికి అనుగుణంగా ప్రతిఎత్తులు వేస్తూ ఉంటాడని ఈ సిద్ధాంతం వాదిస్తుంది. తాను ఒక్కడిగా విజయం పొందలేనని, లాభాన్ని సంపాదించలేనని భావించినప్పుడు, రాజకీయ క్రీడాకారుడు, ఇతర క్రీడాకారులతో కలసి సంకీర్ణాలు ఏర్పాటు చేసుకుంటాడు. సంకీర్ణంలో సంఖ్య ఎంత ఉండాలి ? లాభాల శాతం ఎంత ఉండాలి? అన్న విషయం మీద ఆధారపడి సంకీర్ణాలు రెండు విధాలుగా ఉంటాయని ఈ సిద్ధాంతం భావిస్తుంది. ఇది ప్రతిపాదించిన సూత్రాలలో ప్రధానమయినదిగా భావించబడిన వివేచనా సూత్రం లోప భూయిష్టంగా ఉందని ఎక్కువ మంది అభిప్రాయపడటం వలన, దీనికి నైతిక విషయాలలో ఆసక్తి లేకపోవటం వలన, రాజకీయాల పై భావజాల ప్రభావాన్ని పూర్తిగా విస్మరించినందు వలన ఈ సిద్ధాంతం చాలా తక్కువ కాలంలోనే తన ప్రాబల్యాన్ని కోల్పోయింది. రైకర్ వంటివారు దీనిని అంతర్జాతీయ రాజకీయాలలో అనువర్తించటానికి ప్రయత్నించినా, ఇది గౌరవప్రదమయిన సిద్ధాంతంగా నిలదొక్కుకోలేకపోయింది. ఇది వాడుకలోకి తెచ్చిన భాష గౌరవప్రదమయినది కాకపోవటం వలన కూడా ఇది విస్మరించదగిన సిద్ధాంతంగా మారిపోయింది.

## 12.19 మాదిరి ప్రశ్నలు :

1) క్రీడా సిద్ధాంతం ఏవిధంగా ఆవిర్భవించిందో తెలిపి, అది ప్రతిపాదించిన ప్రధాన భావనలను వివరించండి.
2) క్రీడా సిద్ధాంతంతో సంబంధం ఉన్న సాంకేతిక పదాలను, వాటి అర్థాలను వివరించి, క్రీడా సిద్ధాంతంపై ఉన్న విమర్శలను వ్రాయండి.
3) క్రీడా సిద్ధాంత నిర్వచనాన్ని, సారాంశాన్ని వివరించి, దానిపై వచ్చిన విమర్శలను వ్రాయండి.
4) క్రీడా సిద్ధాంతం రాజకీయ ప్రక్రియను వివరించగలదని అనుకుంటున్నారా ? చర్చించండి.

## చదువదగిన గ్రంథాలు :


1. David Easton (1953) : The Potical System Scientific Book Agency, Calcutta.
2. David Easton (1980) : "Systems Analysis in Political Science Today" in Political Science Review, Vol. 19, No.1
3. S.P. Varma (1994) : Modern Political Theory, Vikas Publishing House, New Delhi.


డా॥ ఎమ్.వి.ఎస్. కోటేశ్వరరావు

**(DPS 25)**

M.A. DEGREE EXAMINATION, MAY 2011.

Second Year

Political Science

Paper IV — MODERN POLITICAL THEORY AND ANALYSIS

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE questions.

All questions carry equal marks.

1. Discuss the importance of Scientific approach to the study of political science.

   రాజనీతి శాస్త్ర అధ్యాయనానికి వైజ్ఞానికి దృక్పథము యొక్క ప్రాధాన్యతను వివరింపుము.

2. Explain the origin, development and relevance of Behaviour Approach.

   ప్రవర్తన – దృక్పథము యొక్క ఆవిర్భావం, వృద్ధి మరియు అవశ్యకతను వివరింపుము.

3. Examine the importance of structural - functional approach in Political Analysis.

రాజకీయ విశ్లేషణలో వ్యవస్థా - విధుల దృక్పథము యొక్క ప్రాధాన్యతను పరిశీలింపుము.

4. Elucidate Decision-making Theory.

నిర్ణయీాకరణ సిద్ధాంతమును విపులీకరింపుము.

5. Discuss the relevance communications theory.

ప్రసారముల సిద్ధాంతము యొక్క ఆవశ్యకతను చర్చింపుము.

6. What is meant by Game Theory? Explain its significance.

క్రీడా-సిద్ధాంతము అనగా నేమి? దాని ప్రాధాన్యతను వివరింపుము.

7. What is Power? Discuss its role in Politics.

"అధికారము" అనగా నేమి? రాజకీయాలలో దాని పాత్రను చర్చింపుము.

8. Explain the salient features of Positive Approach.

'అనుకూల - దృక్పథము" యొక్క ప్రధాన లక్షణాలను వివరింపుము.

9. **Explain the nature and scope of Modern Political Analysis.**

ఆధునిక రాజకీయ విశ్లేషణ యొక్క స్వభావాన్ని మరియు పరిధిని వివరింపుము.

10. Discuss the General Systems Theory.

సాధారణ – వ్యవస్థా సిద్ధాంతమును చర్చింపుము.

---

(DPS 25)

M.A. (Final) DEGREE EXAMINATION,
DECEMBER 2010.

Political Science

Paper V — MODERN POLITICAL THEORY AND ANALYSIS

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE questions.

All questions carry equal marks.

1. Define "modern political analysis" and discuss scientific approaches in the study of modern political analysis.

   'ఆధునిక రాజనీతి విశ్లేషణ' ను నిర్వచించి మరియు దాని అధ్యయనంలో శాస్త్రీయ పద్ధతులను చర్చించుము.

2. Write an essay on 'post-behaviouralism'.

   'ప్రవర్తనావాదనాంతరము' పై ఒక వ్యాసము వ్రాయుము.

3. Define communication and discuss its significance.

   ప్రసారమును నిర్వచించి మరియు దాని ప్రాముఖ్యతను చర్చించుము.

4. Define distributive analysis and discuss its significance.

పంపిణీ విశ్లేషణను నిర్వచించి మరియు దాని ప్రాముఖ్యతను చర్చించుము.

5. Analyse the place of Marxist approach in the study of modern political analysis.

ఆధునిక రాజనీతి విశ్లేషణలో మార్క్సిస్ట్ పద్ధతి యొక్క స్థానమును విశ్లేషించుము.

6. Define "Game Theory" and discuss its relevance in international relations.

"క్రీడల సిద్ధాంతము" ను నిర్వచించి మరియు అంతర్జాతీయ సంబంధాల్లో దాని యొక్క ఔచిత్యమును చర్చించుము.

7. Explain Almond's structural-functional analysis.

ఆల్మండ్ యొక్క నిర్మాణ–విధుల విశ్లేషణను వివరించుము.

8. Discuss "Decision Making Theory".

"నిర్ణయీకరణ సిద్ధాంతమును" చర్చించుము.

9. Write an essay on "General Systems Theory".

"సాధారణ వ్యవస్థల సిద్ధాంతము" పై ఒక వ్యాసము వ్రాయుము.

10. Define "Elite" and discuss Elite theory.

'శిష్టుల' ను నిర్వచించి మరియు శిష్టుల సిద్ధాంతమును చర్చించుము.

---

M.A. (Final) DEGREE EXAMINATION, JUNE 2010.

Second Year

Political Science

Paper IV — MODERN POLITICAL THEORY AND ANALYSIS

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE questions.

All questions carry equal marks.

1. Examine the use of different approaches in the study of political Science.

   రాజనీతి శాస్త్ర అధ్యయనంలో వివిధ పద్ధతుల ఉపయోగమును పరిశీలించుము.

2. Define "Marxism" and diseases its characteristics.

   "మార్క్సిజమ్" ను నిర్వచించి, దాని లక్షణాలను చర్చించుము.

3. Estimate Almond's contribution to political analysis.

   రాజనీతి విశ్లేషణకు ఆల్మండ్ యొక్క కృషిని అంచనా వేయుము.

4. Analyse Lasswell's contribution to political analysis.

   రాజనీతి విశ్లేషణకు లాస్‌వెల్ చేసిన కృషిని విశ్లేషించుము.

5. Write an essay on communications theory.

   ప్రసారాల సిద్ధాంటము పై ఒక వ్యాసము వ్రాయుము.

6. Discuss "Decision making theory".

   "నిర్ణయీాకరణ సిద్ధాంతమును చర్చించుము.

7. Explain "General systems theory".

   "సాధారణ వ్యవస్థల సిద్ధాంతము" ను వివరించుము.

8. Explain "Game Theory".

   "క్రీడల సిద్ధాంతము" ను వివరించుము.

9. Define power and explain various kinds of power.

   "శక్తి" ని నిర్వచించి, వివిధ రకాల శక్తులను వివరించుము.

10. Define positivism and discuss its characteristics.

   "పాజిటివిజమ్"ను నిర్వచించి, దాని లక్షణాలను చర్చించుము.

---

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకులు, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : **డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.**

| Course | Year | Paper No. & Title |
|---|---|---|
| M.A. Political Science | IInd year | Paper - VI : Modern Political Theory and Analysis |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)